అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

గురువారం 13-06-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 164 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు | వెల : 6.50



లింగ సమానత్వంలో పూర్

దిగజారిన భారత్ ర్యాంక్

- దక్షిణాసియాలోనూ ఐదో స్థానమే : ప్రపంచ ఆర్థిక ఫోరం వెల్లడి

న్యూఢిల్లీ : ప్రపంచ ఆర్థిక ఫోరం బుధవారం విడుదల చేసిన లింగ వ్యత్యాస సూచికలో భారత్ స్థానం మరింత దిగజారింది. గతంలో 127వ స్థానంలో ఉన్న మన దేశం తాజాగా 129వ స్థానానికి పడిపోయింది. ప్రథమ స్థానంలో నిలిచిన ఐస్‌లాండ్ తన ర్యాంకును నిలబెట్టుకుంది. దక్షిణాసియాలో బంగ్లాదేశ్, నేపాల్, శ్రీలంక, ...13లో

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

27 వరకు నిర్వహణ : షెడ్యూల్ ప్రకటించిన టీజీపీఎస్సీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు అక్టోబర్ 21 నుంచి ప్రారంభమవుతాయి. ఈ మేరకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) కార్యదర్శి నవీన్ నికోలస్ బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. అక్టోబర్ 21 నుంచి 27 వరకు గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలను హెచ్‌ఎండీఏ పరిధిలోనే నిర్వహిస్తామని తెలిపారు. జనరల్ ఇంగ్లీష్ మినహా ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రశ్నాపత్రాలుంటాయని వివరించారు. అభ్యర్థులు ఎంచుకున్న భాషలో రాసేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. ఎంచుకున్న భాషలోనే అభ్యర్థులు సమాధానాలు రాయాల్సి ఉంటుందని స్పష్టం ...6లో



కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

50 మంది సజీవ దహనం..

- వారిలో 40 మంది భారతీయులే
- అందులో కేరళ వాసులు 25 మంది

కువైట్ : వారంతా పొట్టకూటి కోసం కన్నవారిని, సొంత ఊరిని, దేశాన్ని వదిలొచ్చారు. ఓ కంపెనీలో పని చేస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. కానీ దురదష్టవశాత్తూ జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన కువైట్‌లో బుధవారం ఉదయం చోటు చేసుకుంది. ఓ భవనంలో మంటలు చెలరేగడంతో 50 మంది కాలి బూడిదయ్యారు. వారిలో 40 మంది భారతీయులు కాగా 25 మంది కేరళ వాసులే కావడం గమనార్హం.

స్థానిక మీడియా తెలిపిన వివరాల ప్రకారం.. దక్షిణ మంగాఫ్ నగరంలోని ఓ ఆరు అంతస్తుల భవనంలో బుధవారం ఉదయం 6 గంటల ప్రాంతంలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. తొలుత ...13లో

రుణమాఫీపై కసరత్తు

వారంలో క్యాబినెట్.. ఆ తర్వాతే మార్గదర్శకాలు.. పీఎం కిసాన్ సమ్మాన్ నిధిపై రాష్ట్ర సర్కార్ అధ్యయనం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రైతు రుణమాఫీపై మార్గదర్శకాలు రూపొందించేందుకు వీలుగా వారం రోజుల్లో క్యాబినెట్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఎన్నికల ముందిచ్చిన హామీ మేరకు ఆగస్ట్ 15 లోగా రైతులను రుణ విముక్తులను చేసేందుకు సర్కార్ పట్టుదలగా ఉంది. తదనుగుణంగా నిధుల సమీకరణ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల వ్యవసాయ, ఆర్థిక శాఖ అధికారులను ఆదేశించిన సంగతి విదితమే. రుణమాఫీ అమలు కోసం నిధుల సమీకరణకు ఉన్న ప్రత్యామ్నాయ మార్గాలు, అందుబాటులో ఉన్న వనరులన్నింటినీ ప్రభుత్వం పరిశీలిస్తోంది.. ఈ క్రమంలో అధికారులు తదుపరి చర్యలు మొదలు పెట్టారు.

ఎన్ని అవాంతరాలెదురైనా రైతులకిచ్చిన రుణమాఫీ హామీని తూ:చా తప్పకుండా అమలు చేయాలనే పట్టుదలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తదుపరి చర్యలకు శ్రీకారం చుట్టారు. అందులో భాగంగా ఇప్పటికే అధికారులు బ్యాంకులతో ఓ దఫా చర్చలు జరిపారు. ఏ తేదీని కటాఫ్‌గా తీసుకోవాలి? ఎంత మంది రైతులు రూ.2లక్షల రుణానికి అర్హులౌతారు?. అర్హులైన రైతులందరికీ లబ్ధి చేకూరేలా విధివిధానాలు ఎలా ఉండాలనే అంశంపై వారు కసరత్తు మొదలు పెట్టారు. గతంలో జరిగిన రుణమాఫీ అమలు తీరును పరిశీలించటంతో పాటు అవసరమైతే ఇతర రాష్ట్రాల్లో ...13లో



టెట్ ఫలితాలను విడుదల చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి...

టెట్‌లో పెరిగిన ఉత్తీర్ణత

- పేపర్-1లో 67.13 శాతం, పేపర్-2లో 34.18 శాతం అర్హత
- గతేడాది కంటే పేపర్-1లో 30.24 శాతం, పేపర్-2లో 18.88 శాతం అధికంగా పాస్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) ఫలితాలను బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లో విడుదల చేశారు. గతేడాది కంటే టెట్ ఉత్తీర్ణత పెరిగింది. గతనెల 20 నుంచి ఈనెల రెండో తేదీ వరకు టెట్ రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించిన విషయం తెలిసిందే. పేపర్-1ను ...5లో



ఏపీ సీఎంగా ప్రమాణం చేస్తున్న నారా చంద్రబాబునాయుడు

చంద్రబాబు అనే నేను..

ఏపీ ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం

- 24 మంది మంత్రులతో క్యాబినెట్..17 మంది కొత్తవారు
- ప్రధాని మోడీ, కేంద్ర మంత్రుల రాక
- భారీగా హాజరైన జనం

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్‌లో కొత్తగా ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరింది. టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయనతోపాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్, టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ మరో 24 మంది చేత గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రమాణం చేయించారు. దేశ ప్రధాని మోడీ, కేంద్ర మంత్రులు అమిత్‌షా, జేపీ నడ్డా, నితిన్‌గడ్కరీ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, సుప్రీంకోర్టు మాజీ ప్రధానన్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ, సినీ ప్రముఖులు చిరంజీవి, రజనికాంత్ దంపతులు, రాంచరణ్ తదితరులు హాజరయ్యారు. ప్రధాని మోడీకి చంద్రబాబు స్వాగతం పలికారు. విజయవాడ ...6లో

రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

జీవో 317పై తుది గడువు ఈ నెల 30 : మంత్రివర్గ ఉపసంఘం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 317 జీవో బాధిత ఉద్యోగులు, ఉపాధ్యాయులు శుక్రవారం నుంచి దరఖాస్తు చేసుకోవాలని 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం తెలిపింది. వాటి సమర్పణకు ఈనెల 30 వరకు అవకాశముందని పేర్కొంది. బుధవారం హైదరాబాద్‌లో 317 జీవోపై ఏర్పాటైన మంత్రివర్గ ఉపసంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఉపసంఘం చైర్మెన్ దామోదర రాజనర్సింహ, సభ్యులు మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలను మంత్రివర్గ ఉపసంఘం ప్రకటించింది. వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులకు స్థానికత ఆధారంగా ఆప్షన్ ఇచ్చామని తెలిపింది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులైన భార్య/భర్తలకు కూడా ఆప్షన్ ఇచ్చినట్టు పేర్కొంది. మల్టిపుల్ దరఖాస్తులకు అవకాశం కల్పించినట్టు వివరించింది. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న ఉద్యోగులకు రశీదు ఇవ్వనున్నట్టు తెలిపింది. ఇప్పటి వరకు 12,011 దరఖాస్తులను వెబ్‌సైట్ ద్వారా స్వీకరించామని పేర్కొంది. ఆ దరఖాస్తుల రీవెరిఫికేషన్‌కు అవకాశం కల్పించినట్టు తెలిపింది. ఉద్యోగులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకున్న తర్వాత వాటి స్టేటస్ సమాచారానిఉన వారి సెల్‌ఫోన్‌కు ఇవ్వడం జరుగుతుందని వివరించింది. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు శివశంకర్, రఘునందన్‌రావు, జీఏడీ అధికారులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు

డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

- రాష్ట్రవ్యాప్తంగా ఆట్టహాసంగా ప్రారంభమైన ప్రభుత్వ బడులు
- విద్యార్థులకు దుస్తులు, పుస్తకాలు అందజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు
- 'ఫిట్'నెస్‌లేని బస్సులపై కొరడా..



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి తుమ్మల


నవతెలంగాణ-విలేకరులు

తెలంగాణ రాష్ట్ర చరిత్రలో మొట్ట మొదటి సారిగా ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభమైన మొదటి రోజే పిల్లలకు దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేసిన ఘనత తమ ప్రజా ప్రభుత్వానికి దక్కుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు బుధవారం పున: ప్రారంభమయ్యాయి. అమ్మ ఆదర్శ పాఠశాలల పేరుతో రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల్లో మరమ్మత్తులు నిర్వహించారు. వాటిని దాదాపు పూర్తిచేసి పాఠశాలలకు కొత్త రంగులతో, తోరణాలతో ఉపాధ్యాయులు విద్యార్థులను ఆహ్వానించారు. ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం కాన్పమేడిగూడ రోడ్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత, మండల పరిషత్ పాఠశాలలో విద్యార్థులపై పూల వర్షం కురిపిస్తూ ఘన స్వాగతం పలికారు. కరీంనగర్ జిల్లాలోని గంగాధర మండలం ఒద్యారం జెడ్పీహెచ్ పాఠశాల ఆవరణను మామిడి, అరటి, కొబ్బరి తోరణాలతో అలంకరించి విద్యార్థులను ఆహ్వానించారు. రాష్ట్రవ్యాప్తంగా ...6లో

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?

పాఠ్యపుస్తకాల్లో ఇంకా కేసీఆర్ పేరే

- తప్పుడు సమాచారం ముద్రించిన విద్యాశాఖ
- తెలుగు వాచకం ముందుమాటను సవరించని అధికారులు
- అయోమయంలో విద్యార్థులు
- ఎస్‌సీఈఆర్టీ తీరుపై సర్వత్రా విమర్శలు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?, విద్యాశాఖ మంత్రి ఎవరు?, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి ఎవరు?, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు ఎవరు?. వీటికి సమాధానం అందరికీ తెలుసు. కానీ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ (ఎస్‌సీఈఆర్టీ) ప్రచురించిన పాఠ్యపుస్తకాల్లో మాత్రం ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్), విద్యాశాఖ పూర్వపు మంత్రులు జి జగదీశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, ప్రస్తుత విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి రంజీవ్ ఆర్ ఆచార్య, పాఠశాల విద్యాశాఖ పూర్వపు సంచాలకులు ఎం జగదీశ్వర్, ప్రస్తుత సంచాలకులు టి చిరంజీవులు, ప్రభుత్వ



సలహాదారు కెవి రమణాచారి అని ఉన్నది. 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి ముద్రించిన పాఠ్యపుస్తకాల్లో ఈ తప్పుడు సమాచారాన్ని ఎస్‌సీఈఆర్టీ ప్రచురించడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గతేడాది డిసెంబర్ ఏడో తేదీన ముఖ్యమంత్రిగా ...13లో

వాయనాడా? రాయ్‌బరేలా?

- ఏ సీటును వదులుకోవాలన్నదానిపై రాహుల్ సతమతం

వివరాలు 3లో

జూరాలను తాకిన కృష్ణమ్మ

ఎగువ కృష్ణ నుంచి రిజర్వాయర్‌లోకి ప్రవాహం

- ప్రతిరోజూ 7735 క్యూసెక్కుల నీరు
- వరద పెరిగితే ఆయకట్టుకు నీరు వదిలే అవకాశం



వివరాలు 13లో

ఎవరినీ వదలం

ఆధారాల కోసమే అఫిడవిట్



- ఏజెన్సీలకు డెడ్‌లైన్ పెట్టారు
- అందుకే వేగంగా పనులు చేశారు
- అలాంటి ఆదేశాలు ఇచ్చిన వాళ్లనూ పిలుస్తాం : కాళేశ్వరం జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్


కాళేశ్వరం బ్యారేజీల వైఫల్యానికి కారణమైన బాధ్యులెవరినీ వదలబోమని జ్యుడీషియల్ కమిషన్ చైర్మెన్ జస్టిస్ పీసీ ఘోష్ ...13లో

రాజ్యాంగంలో లేని డిప్యూటీ సీఎంలు

14 రాష్ట్రాల్లో పీఠమెక్కిన 23 మంది

- ప్రభుత్వంలో నేతలు నంబర్-2 ఎలా ? : రాజకీయ విశ్లేషకులు

డిప్యూటీ సీఎం... రాజ్యాంగంలో ఈ పదవి గురించిన ప్రస్తావనే లేదు. రాజ్యాంగంలోని 163, 164 అధికరణలు ముఖ్యమంత్రి, మంత్రివర్గానికి సంబంధించిన నిబంధనలను మాత్రమే కలిగి ఉన్నాయి. అయినా పాలకపార్టీలు ఆయా రాష్ట్రాల్లో డిప్యూటీ సీఎంల నియామకానికి తహతహలాడుతున్నాయి. రాజకీయాల్లో వ్యక్తులను, వివిధ సామాజిక శక్తులను సంతృప్తి పర్చటానికి ఇలాంటి నియామకాలు చేపడుతున్నాయి. కులాలు, వర్గాల వారీగా ఓట్లు అధికారపార్టీకి దూరం కాకుండా వ్యూహరచన చేస్తున్నాయి. అందుకే ఒకరు లేదా ఇద్దరు అవసరమనుకుంటే ఐదుగురు డిప్యూటీలను నింపేయటానికి కూడా పాలకులు వెనుకాడటంలేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్... ఇప్పుడు ఒడిశా ప్రభుత్వ ఏర్పాటు ఫార్ములాను బీజేపీ పునరావృతం చేసింది. ఈ మూడు రాష్ట్రాల తర్వాత ఒడిశాకూ ముఖ్యమంత్రితో పాటు ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉంటారు. ఒడిశా ముఖ్యమంత్రిగా మోహన్ మాఝీ బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. కేవీ సింగ్ దేవ్, ప్రవతి పరిదా ఉప ముఖ్యమంత్రులయ్యారు.

గతేడాది మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లో ప్రభుత్వాలు ఏర్పాటయ్యాక బీజేపీ రాష్ట్రానికి ఇద్దరు చొప్పున డిప్యూటీ సీఎంలను నియమించింది. నితీశ్ కుమార్‌తో కలిసి బీహార్‌లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, ఇద్దరు డిప్యూటీ సీఎంలు బీజేపీకి చెందినవారు నియమితులైనారు. మహారాష్ట్రలో కూడా అలాగే ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లోనూ చంద్రబాబు ప్రభుత్వంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయ్యారు. గతంలో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ఏకంగా ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఉన్నారు.

ఏయే రాష్ట్రాల్లో డిప్యూటీ సీఎంలు?

ప్రస్తుతం దేశంలోని 14 రాష్ట్రాల్లో 23 మంది డిప్యూటీ సీఎంలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, హిమాచల్ ప్రదేశ్, కర్నాటక, ...3లో

పాఠశాల అభివృద్ధిపై సీఎం కృషి అభినందనీయం

శుభాకాంక్షలు తెలిపిన చనగాని దయాకర్

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పదేండ్లుగా బీఆర్ఎస్ సర్కారులో పాఠశాలల రేషనలైజేషన్ పేరిట నాలుగు వేల పాఠశాలలను దెబ్బతీసిందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే పాఠశాలల అభివృద్ధి కోసం రూ.2వేల కోట్లు కేటాయించడాన్ని ఆయన స్వాగతించారు.



సీఎం రేవంత్‌ను కలిసి మానవతారాయ్

ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి టీపీసీసీ రాష్ట్ర నాయకుల కోటూరి మానవతారాయ్ శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నాయకులు తాళ్లపల్లి నరేష్‌గౌడ్, నాగరాజు, హేమంత్‌చౌదరి, సుదగాని మధుగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

విద్యార్థులకు ధ్రువపత్రాలివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే

బుర్రా వెంకటేశం, లింబాద్రికి మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి వినతి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్



రాష్ట్రంలో ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. సంబంధిత నిధులను విడుదల చేయకపోవడంతో చదువు పూర్తయినా విద్యార్థులకు కాలేజీ యాజమాన్యాలు ధ్రువపత్రాలు ఇవ్వడం లేదని తెలిపారు. ఫీజులు విడుదల చేసి విద్యార్థులకు ధ్రువపత్రాలను ఇప్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని కోరారు. ఈ మేరకు విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, ఉన్నత విద్యామండలి చైర్మెన్ ఆర్ లింబాద్రిని బుధవారం హైదరాబాద్‌లో ఆయన కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రభుత్వం సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకపోవడం వల్ల చదువు పూర్తయిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఫీజు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటూ కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులకు చెబుతున్నాయని తెలిపారు. విద్యాశాఖ అధికారుల దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లినా యాజమాన్యాలు పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. విద్యార్థులకు ధ్రువపత్రాలు ఇచ్చే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాలేజీలకూ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉంచకుండా సకాలంలో విడుదల చేయాలని కోరారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆ 300 మందికి మాత్రమే జాప్యం

స్టాఫ్ నర్సులకు జీతాల చెల్లింపు పై మంత్రి దామోదర రాజనర్సింహ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో నూతనంగా నియమితులైన స్టాఫ్ నర్సుల్లో 300 మందికి సాంకేతిక సమస్య కారణంగా జీతాల చెల్లింపులో జాప్యం చోటు చేసుకుందని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఆయన ట్వీట్ చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే 6,956 స్టాఫ్ నర్సుల పోస్టులను భర్తీ చేసినట్టు తెలిపారు. వీరంతా వైద్యారోగ్యశాఖతో పాటు మరో ఆరు శాఖల్లో తమ సేవలను అందిస్తున్నట్టు చెప్పారు. ఆస్పత్రులతో పాటు షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనకబడిన తరగతులు, మైనార్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, వికలాంగుల వసతి గృహాలతో పాటు ప్రజలకు అత్యవసర సేవలందిస్తున్నారని వివరించారు. వీరందరికి సకాలంలో జీతాలు చెల్లిస్తున్నట్టు స్పష్టం చేశారు. 300 మందికి సంబంధించిన పర్మినెంట్ రిటైర్ మెంట్ అకౌంట్ నెంబర్ (పీఆర్ఏఎన్) జనరేట్ చేయడంలో సాంకేతిక సమస్య తలెత్తడంతో వారు బ్యాంకు నుంచి జీతం పొందలేకపోయారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉంటుందని భరోసానిచ్చారు. అదే సమయంలో రాష్ట్ర ప్రజల ఆరోగ్య సంరక్షణకు భరోసా ఇస్తున్నట్టు మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు.

సివిల్ సప్లైస్ కుంభకోణంలో సీఎం హస్తం : మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్ర పౌరసరఫరాలశాఖలో జరిగిన కుంభకోణంలో సీఎం రేవంత్ రెడ్డి హస్తం ఉందని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి ఆరోపించారు. బుధవారం హైదరాబాద్ లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. రైస్ టెండర్లు, ప్యాడీ టెండర్లు రద్దయ్యాయా? లేదా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి పౌర సరఫరాలశాఖపై ఎందుకు సమీక్షించడం లేదో చెప్పాలన్నారు.

తెలంగాణపై చంద్రబాబు, రేవంత్ రెడ్డి కుట్ర

చూస్తూ ఊరుకునేది లేదు: మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ముఖ్యమంత్రులు చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డిలు కలిసి తెలంగాణపై కుట్ర చేస్తే ఊరుకునేది లేదని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ హెచ్చరించారు. చంద్రబాబు కనుసైగలతో రేవంత్ రెడ్డి పని చేస్తున్నారని ఆయన ఆరోపించారు. బుధవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఏడు మండలాలను ఆంధ్రలో కలపడంపై బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో పోరాడారని గుర్తుచేశారు. అదే విధంగా కాంగ్రెస్ ఎంపీలు పోరాడాలని డిమాండ్ చేశారు. ఏపీలో పని చేసిన ఆదిత్యనాథ్ దాస్‌ను తెలంగాణ ఇరిగేషన్ సలహాదారుగా నియమించడం సరికాదని ఆయన తప్పుపట్టారు. ఆ నియామకాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. భద్రాచలం రూరల్ మండలంలో వున్న యటపాక, కన్నాయిగూడెం, పురుషోత్తపట్నం, గుండాల, పిచ్చుకలపాడు పంచాయతీలను తెలంగాణలో కలిపే విధంగా కృషి చేయాలని రేవంత్ రెడ్డిని కోరారు. సింగరేణి బొగ్గు గనులను సింగరేణి సంస్థకు కేటాయించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని డిమాండ్ చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
ఓ/ఓ : ద ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆర్&బి), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు

ఎన్ఐటి షార్ట్ టెండర్ నోటీసు నెం. ఇఇ/ఆర్&బి/ఎంఎస్‌సిఎల్/2024-25/ తేది : 11.06.2024
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో సిఆర రహదారులు వేయుటకు ఆరు(06) పనులు మరియు ఒకటి (01) భవనం పని కొరకు, మొత్తం రూ. 63.14 లక్షల అంచనా వ్యయంతో, క్రింద సంతకం చేసినవారిచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫామ్ ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించనైనది. బిడ్ అప్‌లోడింగ్ ప్రారంభించు తేది: 12/06/2024, మ.గం.3-30ని. నుండి ముగింపు తేది: 26/06/2024, మ.గం.3-30ని. వరకు. తదుపరి వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్రదేశం అనగా, www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ (ఆర్&బి), మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా.

DIPR R.O.No.50-DP/CL/ADVT/1/2024-25, Dt. 12-06-2024

బహిరంగ ప్రకటన

ఇన్‌సాల్వెన్సీ అండ్ బ్యాంక్‌రప్టసీ కోడ్(ఐబిసి)లోని సెక్షన్ 130 యొక్క సబ్-సెక్షన్ (1) యొక్క క్లాజ్ (బి) క్రింద బ్యాంక్‌రప్టసీ ప్రారంభించుట మరియు క్లెయిమ్‌లను ఆహ్వానించుట కొరకు

ఇందుమూలముగా ప్రకటన ఇవ్వడం ఏమనగా, ఇన్‌సాల్వెన్సీ మరియు బ్యాంక్‌రప్టసీ కోడ్, 2016(ఐబిసి)లోని సెక్షన్ 126 యొక్క నిబంధనల క్రింద గౌరవనీయ ఎన్‌సిఎల్‌టి, CP-IB`389/121/(Hyd)/2022 లో 28-05-2024న జారీచేసిన బ్యాంక్‌రప్టసీ ఆదేశం ద్వారా శ్రీ మహేంద్ర అగర్వాల్, వయసు 70 ఏళ్లు, తండ్రి కీ.శే. ప్రభుదయాల్ అగర్వాల్ కొరకు బ్యాంక్‌రప్టసీ ప్రక్రియ ప్రారంభించబడినది,

సంబంధిత వివరాలు :

1	బ్యాంక్‌రప్ట్ యొక్క పేరు :	మహేంద్రకుమార్ అగర్వాల్
2	బ్యాంక్‌రప్ట్ యొక్క పుట్టిన తేది :	13.03.1954
3	బ్యాంక్‌రప్ట్ యొక్క పాన్ నెంబర్ :	ABLPA4518K
4	బ్యాంక్‌రప్ట్ యొక్క ఆధార్ నెంబర్ :	4555 3578 8145
5	బ్యాంక్‌రప్ట్ యొక్క చిరునామా :	ఫ్లాట్ నెం.2ఏ, 8-2-415/1, రోడ్ నెం.4, బంజారాహిల్స్, హైదరాబాద్-500034
6	బ్యాంక్‌రప్టసీ ప్రారంభించిన తేది	28-05-2024
7	బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ యొక్క పేరు మరియు చిరునామా	దేవ్వర్త్ రానా, అపార్ట్‌మెంట్ 684, సెక్టార్-ఎ, బ్లాక్-బి & సి, వసంత్‌కుంజ్, న్యూఢిల్లీ-110070
8	బ్యాంక్‌రప్టసీ ట్రస్టీ యొక్క సంప్రదించు వివరాలు :	Email: bankruptcytrusteemkagarwal@gmail.com and devvartrana@gmail.com Phone: 9891813021
9	క్లెయిమ్‌ల సమర్పణకు చివరి తేది :	27-06-2024

క్లెయిమ్‌ల సమర్పణ కొరకు సూచనలు :
బ్యాంక్‌రప్ట్ యొక్క క్రెడిటర్లు అందరూ వారి యొక్క క్లెయిమ్‌లను రుజువుతోపాటు 27-06-2024న లేదా ముందుగా బ్యాంక్‌రప్టసీ ట్రస్టీకి పైన పేర్కొన్న చిరునామాకు సమర్పించాలని కోరనైనది.
క్లెయిమ్‌ల యొక్క సాక్ష్యం యొక్క సమర్పణ :
ఐబిబిఐ(బ్యాంక్‌రప్టసీ ప్రోసెస్ ఫర్ పర్సనల్ గ్యారంటార్స్ టు కార్పొరేట్ డెటర్స్) రెగ్యులేషన్స్, 2019 ప్రకారం క్లెయిమ్‌ల యొక్క రుజువును ప్రత్యేక ఫారమ్‌లలో సమర్పించవలెను.
ఫారమ్‌లను www.ibbi.gov.in వెబ్‌సైట్ నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును.
ఏవేని తదుపరి వివరాలు లేదా స్పష్టతల కొరకు, మీరు క్రింద సంతకం చేసినవారిని సంప్రదించగలరు.
తేది : 13-06-2024
ప్రదేశం : హైదరాబాద్

దేవ్వర్త్ రానా,
IBBI Reg No: IBBI/IPA-002/IP-N00680/2018-19/12025
AFA No: AA2/12025/02/221124/203026 వరకు చెల్లుబాటు : 22-11-2024
పార్ట్‌నర్ : ఆర్ఆర్ఆర్ ఇన్‌సాల్వెన్సీ సర్వీస్ ఎక్స్‌పర్ట్స్ ఎల్ఎల్‌పి
ఐబిబిఐలో చిరునామా : అపార్ట్‌మెంట్ 684, సెక్టార్-ఎ, బ్లాక్-బి & సి, వసంత్‌కుంజ్, న్యూఢిల్లీ-110070.

MOSCHIP

MOSCHIP TECHNOLOGIES LIMITED
Regd. Office: 7th Floor, My Home Twitza, TSIIC Hyderabad Knowledge City, Hyderabad, Telangana 500081,India. CIN: L31909TG1999PLC032184
Email: investorrelations@moschip.com; www.moschip.com
Phone:+91-040-66229292, Fax:+91-040-66229393

అసాధారణ వార్షిక సర్వసభ్య సమావేశం & ఇ-ఓటింగ్ సమాచారం ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా మోస్‌చిప్ టెక్నాలజీస్ లిమిటెడ్ ("ద కంపెనీ") యొక్క అసాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం, 5, జులై,2024 తేదీన సా.గం.4-00కు (ఐఎస్‌టి) వీడియో కాన్ఫరెన్సింగ్ ("విసి")/ఇతర దృశ్య శ్రవణ మాధ్యమాలు ("ఓఏవిఎం") ద్వారా 6,మే,2024 తేదీ నాటి నోటీసులో ("ద నోటీసు") పేర్కొన్న నిబంధనలకు అనుగుణంగా వాణిజ్య నిర్వహణలో భాగంగా నిర్వహించబడును. నోటీసులో పేర్కొన్న ప్రత్యేక వాణిజ్యానికి సంబంధించిన నిబంధనలను ఎలక్ట్రానిక్ మాధ్యమం ద్వారా తెలియజేయబడును.

కంపెనీల చట్టం,2013 ("ద యాక్ట్")తో పాటుగా చదవదగిన సర్క్యులర్ తేది:8,ఏప్రిల్,2020 మరియు కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ద్వారా (ఎంసిఏ) తేది:25,సెప్టెంబర్,2023న జారీ చేయబడిన సర్క్యులర్ ప్రకారం మరియు సెబి(లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్,2015 ("లిస్టింగ్ రెగ్యులేషన్స్")తో పాటుగా చదవదగిన సెబి సర్క్యులర్ తేది:12,మే,2020 మరియు 7,అక్టోబర్,2023 తేదీన జారీ చేసిన సర్క్యులర్‌తో పాటుగా అనుబంధ సర్క్యులర్స్‌కు అనుగుణంగా ఉమ్మడి వేదిక వద్ద సభ్యుల యొక్క భౌతిక హాజరు లేకుండా వర్తింపదగిన నిబంధనలకు అనుగుణంగా ఇజిఎం నిర్వహించబడును.

ఇజిఎం నోటీసును వాటాదారులందరికీ ఇ-మెయిల్ ద్వారా పంపించే వెసులుబాటును లిస్టెడ్ కంపెనీలకు ఎంసిఏ మరియు సెబి అనుమతిస్తున్నది.

ఇజిఎం కొనసాగుతున్న సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ మరియు ఇ-ఓటింగ్ :

సమయానుసారంగా సవరించిన కంపెనీస్ (మేనేజ్‌మెంట్ మరియు అడ్మినిస్ట్రేషన్) రూల్స్, 2014లోని రూల్ 20తో చదవగల కంపెనీల చట్టం, 2013 ('ది చట్టం')లోని సెక్షన్ 108 మరియు సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 44 మరియు జనరల్ మీటింగ్‌పై ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా ద్వారా జారీచేసిన సెక్రటరియల్ స్టాండర్డ్స్-2ను అనుసరించి ఇజిఎం వద్ద నిర్వహించబడు వ్యాపారాలకు సంబంధించి ఇజిఎం సమయంలో మరియు ఏజిఎంకు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్ వసతిని కంపెనీ దీని సభ్యులకు కల్పిస్తున్నది, ఇందుకోసం ఎలక్ట్రానిక్ విధానం ద్వారా ఓటింగ్ వసతికి కెఫిన్ టెక్నాలజీస్ లిమిటెడ్ ("కెఫిన్‌టెక్") వారిని కంపెనీ నియమించింది.

ఇజిఎం నోటీసులో పేర్కొన్న గమనికలు మరియు ప్రత్యేకంగా, వీసి/ఓఏవిఎం ద్వారా ఇజిఎంకు హాజరవుతున్న మరియు ఇజిఎం కొనసాగుతున్న సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ ద్వారా ఓటును వినియోగించుకొనే విధానం, ఇజిఎంలో పాల్గొనుటకు సూచనలను అనుసరించాల్సిందిగా సభ్యులను కోరుతున్నారు మరియు దీనికి సంబంధించిన ముఖ్యాంశాలు దిగువ చూపబడినవి. సదరు యాక్ట్‌లోని సెక్షన్ 103 ప్రకారం విసి/ఓఏవిఎం ద్వారా హాజరయ్యే సభ్యుల యొక్క సౌకర్యం కోరమ్ రెకనింగ్ కోసం లెక్కించబడును.

ఏ) రిమోట్ ఇ-ఓటింగ్ వసతి దిగువ కాలవ్యవధిలో అందుబాటులో ఉండును.

రిమోట్ ఇ-ఓటింగ్ ప్రారంభం	02,జులై, 2024 మంగళవారం ఉ.09.00గం.లు (ఐఎస్‌టి)
రిమోట్ ఇ-ఓటింగ్ ముగింపు	04,జులై,2024 గురువారం సా.5.00గం.లు (ఐఎస్‌టి)

రిమోట్ ఇ-ఓటింగ్ మాడ్యుల్‌ను ఆ తరువాత ఓటింగ్ కొరకు నిలిపివేయబడును మరియు సదరు తేది& సమయం తరువాత ఎలక్ట్రానిక్ విధానం ద్వారా ఓటింగ్‌కు సభ్యులకు అనుమతి ఇవ్వబడును.

బి) శుక్రవారం, 21,జూన్,2024 (కటాఫ్ తేది) నాటికి భౌతిక విధానంలో లేదా డిమేటీరియలైజ్డ్ రూపంలో కంపెనీ యొక్క చెల్లించిన ఈక్విటీ వాటామూలధనం వారి వాటా నిష్పత్తిలో సభ్యుల ఓటింగ్ హక్కులు ఉంటాయి. మీటింగ్ సమయంలో రిమోట్ ఇ-ఓటింగ్ సిస్టమ్ యొక్క వసతి కూడా అందుబాటులో ఉండును మరియు మీటింగ్ ముగిసిన 15 నిమిషాల తరువాత నిలిపివేయబడును. మీటింగ్‌కు హాజరు అవుతున్న, మీటింగ్‌కు ముందుగు రిమోట్ ఇ-ఓటింగ్‌చే వారిఓటును వేయని సభ్యులు, మీటింగ్ సమయంలోవారి హక్కును వినియోగించుకోవచ్చును. సభ్యులు ఒక్కసారి తీర్మానంపై ఓటును వినియోగిస్తే, దానిని తరువాత మార్చుటకు వీలుండదు. కటాఫ్ తేది సభ్యుల రిజిస్టర్/ లబ్ధిదారులైన యజమానుల జాబితాలో రిజిస్టర్‌లో పేరు రికార్డుకాబడిన వ్యక్తి మాత్రమే ఏజిఎం సమయంలో ఇ-ఓటింగ్/ ఇజిఎంకు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్ వసతిని పొందుటకు అర్హులు. మీటింగ్‌కు ముందుగా రిమోట్ ఇ-ఓటింగ్ ముందు రిమోట్ ఇ-ఓటింగ్‌చే వారిఓటును వినియోగించిన సభ్యులు ఎలక్ట్రానిక్ విధానం ద్వారా హాజరు కావచ్చును, కానీ మళ్ళీ సదరు తీర్మానాలపై ఓటును వినియోగించుటకు అనుమతి ఉండును.

సి. కటాఫ్ తేది అనగా 21,జూన్,2024 తేదీ నాటికి వాటాలను కలిగియున్న మరియు ఇమెయిల్ ద్వారా ఇజిఎం నోటీసు పంపించిన తరువాత కంపెనీ సభ్యుడిగా మారినా ఎవరైనా వ్యక్తి, evoting@kfintech.com లేదా investorsrelations@moschip.com వద్ద అభ్యర్థను పంపించుట ద్వారా యూజర్ ఐడి మరియు పాస్‌వర్డ్‌ను పొందవచ్చును. అయితే, రిమోట్ ఇ-ఓటింగ్‌కు కెఫిన్‌టెక్‌తో ఇదివరకే రిజిస్టర్ చేసుకున్న వ్యక్తి, ఓటును వినియోగించుటకు ప్రస్తుతమున్న యూజర్ ఐడి అండ్ పాస్‌వర్డ్‌ను ఉపయోగించవచ్చు.

డి. కటాఫ్ తేది నాటికి సభ్యుడిగాలేని ఎవరైనా వ్యక్తికి సమాచారం నిమిత్తంగా మాత్రమేగా ఈ యొక్క ఇజిఎం నోటీసును భావించాల్సిందిగా కోరడమైనది.

న్యాయమైన & పారదర్శక విధానంలో ఓటింగ్ ప్రక్రియను నిర్వహించుటకు స్క్రూటినైజర్‌గా మెసర్స్ బిఎస్ఎస్ & అసోసియేట్స్, ప్రాక్టీసింగ్ కంపెనీ సెక్రటరీస్ వారిని కంపెనీ నియమించింది.

సభ్యులు వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయని వారిని సంబంధిత డిపాజిటరీ పార్టిసిపెంట్స్‌తో వారి ఇమెయిల్ అడ్రస్‌లను నమోదుచేయాల్సిందిగా కోరుతున్నాం మరియు భౌతిక రూపంలో వాటాలను కలిగియున్న సభ్యులు వార్షిక రిపోర్టు, ఇజిఎం నోటీసు మరియుఇ-ఓటింగ్ సూచనలను పొందుటకు వారి ఇమెయిల్ అడ్రస్ రిజిస్టరింగ్ కొరకు షేర్ సర్టిఫికేట్ కాపీ మరియు ఇమెయిల్ అడ్రస్, మొబైల్ నెంబరు, సెల్ఫ్అటెస్టెడ్ పాన్ కాపీ కల్పించుట ద్వారా అభ్యర్థన లేఖ యొక్క సంతకంచేసిన స్కాన్‌కాపీతోసహా కంపెనీకి investorrelations@moschip.com వద్ద లేదా కంపెనీస్ రిజిస్ట్రార్, కెఫిన్‌టెక్నాలజీస్ లిమిటెడ్‌కి einward.ris@kfintech.com వద్ద వారి మెయిల్ అడ్రస్‌లు మరియు మొబైల్ నెంబర్లను నమోదుచేసుకోవాలి.

ఎలక్ట్రానిక్ విధానంచే ఓటింగ్‌కు సంబంధించి ఏవేని ప్రశ్నలు మరియు/ లేదా సాధకబాధకల విషయంలో, హెల్ప్ & తరచుగా అడిగిన ప్రశ్నలు (ఎఫ్ఏక్యూస్) మరియు https://evoting.kfintech.com (కెఫిన్‌టెక్ వెబ్‌సైట్) యొక్క డౌన్‌లోడ్ సెక్షన్ వద్ద లభించు ఇ-ఓటింగ్ యూజర్ మ్యానువల్స్ రిఫర్ చేసుకోవచ్చు లేదా ఏవేని తదుపరి వివరాలకు సంప్రదించండి: శ్రీ వి.రఘునాథ్, మేనేజర్-ఆర్ఐఎస్, evoting@ kfintech. com వద్ద లేదా కాల్ చేయండి కెఫిన్‌టెక్ టోల్‌ఫ్రీ నెం.1-800-309-4001.

బోర్డు ఆఫ్ డైరెక్టర్ల ఉత్తర్వుల మేరకు
సం/-
సిఎస్ సురేష్ బచ్చలకూర
కంపెనీ సెక్రటరీ

ప్రదేశం: హైదరాబాద్
తేది:12,జూన్, 2024

Chola Enter a better life

చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్
కార్పొరేట్ కార్యాలయం: 'చోళ క్రెస్ట్' సి 54& 55, సూపర్ బి-4, తిరు వి కా ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండీ, చెన్నై-600032.
బ్రాంచ్ కార్యాలయం: జి2. 1-8-384/385, గౌర గ్రాండ్, మూడో అంతస్తు, ఎస్.పి. రోడ్డు, రసూల్‌పూరా, సికింద్రాబాద్-500003.

స్వాధీనతా ప్రకటన (రూల్ 8(1) ప్రకారం) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలంగా తెలియజేయునది ఏమనగా మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్& అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 ఇప్పటి నుంచి ద యాక్ట్‌గా పిలుస్తారు మరియు పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్ 13(12) ద్వారా సంక్రమించిన అధికారాల మరియు దీనితో పాటు చదవదగిన సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్,2002లోని రూల్ 3 ప్రకారం రుణగ్రహీతలకు బకాయిలు చెల్లించమని కోరుతూ డిమాండ్ నోటీసులు పంపడం జరిగింది. సదరు నోటీసులో రుణగ్రహీతల పేర్లు కాలమ్(బి)లో డిమాండ్ నోటీసు తేదీ కాలమ్ (సి)లో బకాయి ఉన్న మొత్తాన్ని కాలమ్(డి)లో పొందుపర్చబడినవి. డిమాండ్ నోటీసు ముట్టిన తేదీ నుంచి బకాయిని 60రోజుల్లోపు చెల్లించాలని కోరడమైనది. రుణగ్రహీతలు బకాయిలను తిరిగి చెల్లించడంలో విఫలమయ్యారు, ఇందుమూలంగా రుణగ్రహీతలకు ప్రత్యేకించి మరియు సాధారణ ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా పైన పేర్కొన్న చట్టంలోని సెక్షన్13(4) తో పాటు చదవదగిన నిబంధన 8 ప్రకారం సంక్రమించిన అధికారాలను వినియోగించుకొని దిగువ పేర్కొన్న అధీకృత అధికారి దిగువ పేర్కొన్న తనఖాపెట్టిన ఆస్తిని కాలమ్(ఇ)లో పొందుపర్చిన తేదీలో స్వాధీనం చేసుకున్నారు. ఇందుమూలంగా రుణగ్రహీతలకు మరియు సాధారణ ప్రజానీకానికి హెచ్చరించడమేమనగా దిగువ పేర్కొన్న ఆస్తులకు సంబంధించి ఎలాంటి లావాదేవీలు నిర్వహించొద్దు మరియు సదరు ఆస్తి మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్& అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క ఛార్జ్‌కు లోబడి ఉంటుందని తెలియజేయనైనది. కాలమ్(డి)లో పొందుపర్చిన బకాయిల చెల్లింపు వరకు వడ్డీ మరియు ఇతర ఛార్జీలకు లోబడి ఉంటుందని తెలియజేయనైనది. సెక్యూరిటైజేషన్ యాక్ట్‌లోని సెక్షన్13(8)ప్రకారం, తనఖాపెట్టిన ఆస్తులను విడిపించుకునేందుకు లభ్యమయ్యే కాలపరిమితి, పూర్తి బకాయి చెల్లింపులు అనగా కాస్ట్, ఛార్జీలు, వ్యయాలను విక్రయ ప్రకటన చెల్లింపు లోబడి ఉంటుంది.

క్ర. సం. [A]	రుణగ్రహీత పేరు మరియు చిరునామా & లోన్ అకౌంట్ నెంబర్ [B]	డిమాండ్ నోటీసు తేది [C]	బకాయి ఉన్న మొత్తం [D]	స్వాధీనం చేసుకున్న తేది [E]
1	లోన్ అకౌంట్ నెంబర్ : HE01CNN00000031114 1) చాంద్ పాషా (దరఖాస్తుదారు), ఇంటి నెం.4-6-30/1/7/2, బాబా నగర్, నాచారం, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ -500076. 2) అమీన్ (సహ-దరఖాస్తు దారురాలు), ఇంటి నెం.4-6-30/1/7/2, బాబా నగర్, నాచారం, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500076. 3)కెఎం బేకరీ, దీన్ని రిప్రెజెంట్ చేస్తున్న యజమాని: చాంద్ పాషా (సహ-దరఖాస్తుదారు), ఇంటి నెం.4-6-30/1/7/2, బాబా నగర్, నాచారం, ఉప్పల్, హైదరాబాద్, తెలంగాణ-500076.	11/03/2024	రూ.29,99,778/- తేది:11-03-2024 నాటికి వడ్డీతో కలుపుకొని	11, జూన్, 2024

స్థిరాస్తికి సంబంధించిన వివరాలు :
ఆస్తికి సంబంధించి ఇంటి నెం.4-6-30/1/7/2 దక్షిణభాగం (పిటిఐఎన్: 1010406454), గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తులు, ప్లాట్ నెం.15 యొక్క దక్షిణ భాగంపై నిర్మితమైన నిర్మాణం, సర్వే నెంబర్లు 22/1 మరియు 22/4, విస్తీర్ణం 100 చ.గ. లేదా 83.6చ.మీ. వార్డు నెం.4, బ్లాక్ నెం.6, బాబా నగర్, నాచారం, జిహెచ్ఎంసి పరిధి, కాప్రా సర్కిల్, ఉప్పల్ మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, మరియు హద్దులు: ఉత్తరం: ప్లాట్ నెం.15 ఉత్తర భాగంలోని ఇంటి నెం.4-6-30/1/7/2 యొక్క ఉత్తర భాగం, దక్షిణం: ప్లాట్ నెం.16, తూర్పు: 20 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.19.

తేది: 13-06-2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం: హైదరాబాద్ మెసర్స్ చోళమండలం ఇన్వెస్ట్‌మెంట్ అండ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

ఫారం నెం.సిఏఏ-2

విభజన ప్రక్రియ సంస్థ యొక్క భద్రత లేని రుణదాతల సమావేశ ప్రకటన
(సెక్షన్ 230(3) మరియు రూల్ 6 మరియు 7ను అనుసరించి)

గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్, హైదరాబాద్ బెంచ్, హైదరాబాద్ సమక్షంలో సిఏ(సిఎఏ) నెం.12/230/హెచ్‌డిబి/2024

కంపెనీల చట్టం, 2013 విషయంలో
మరియు
కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 230 నుండి 232 మరియు ఇతర వర్తించు నియమాలు మరియు దాని క్రింద రూపొందించిన రూల్స్ విషయంలో
మరియు
కంపెనీస్ (కాంప్రమైస్, అరేంజ్‌మెంట్ మరియు అమల్గామేషన్) రూల్స్, 2016 విషయంలో
మరియు
మెసర్స్ థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, CIN: U24110TG1992PTC013781 ("ది విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ") మరియు మెసర్స్ థర్మో క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్, CIN: U64990TS2023PTC172323 ("ది రిజల్టింగ్ కంపెనీ") మరియు వారి సంబంధిత వాటాదారులు ("స్కీమ్") విషయంలో
మెసర్స్ థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, కంపెనీల చట్టం, 1956లోని నియమాల క్రింద ఇన్‌కార్పొరేట్ అయిన కంపెనీ దీని రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నెం.28, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్, తెలంగాణ, పిన్-500082, ఇండియా వద్ద కలిగియుంది

.....దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ

విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క అన్‌సెక్యూర్డు క్రెడిటార్ల సమావేశం నోటీసు యొక్క ప్రకటన

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, గౌరవ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌టి) హైదరాబాద్ బెంచ్‌వారు తేది.7 మే, 2024నాటి("ఆర్డర్") సవరణ ఉత్తర్వుతో చదవగల తేది.9 మే, 2024నాటి ఉత్తర్వును అనుసరించి మెసర్స్ థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ("ది విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ") మరియు మెసర్స్ థర్మో క్యాపిటల్ ప్రైవేట్ లిమిటెడ్ ("ది రిజల్టింగ్ కంపెనీ") మరియు వారి సంబంధిత వాటాదారులు ("స్కీమ్") మధ్య స్కీమ్ ఆఫ్ అరేంజ్‌మెంట్‌ను ఒకవేళ ఆలోచన సరిపోతే మార్పులు లేదా మార్పులు లేకుండా పరిగణించు నిమిత్తం మెసర్స్ థర్మోప్యాడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ ("దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ") యొక్క అన్‌సెక్యూర్డు క్రెడిటార్ల సమావేశం నిర్వహించుటకు ఆదేశించింది.

సదరు ఉత్తర్వును అనుసరించి మరియు అందులోని ఆదేశం ప్రకారం, ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా దరఖాస్తుదారు డిమర్జ్‌డ్ కంపెనీ యొక్క అన్‌సెక్యూర్డ్ క్రెడిటార్ల సమావేశం గురువారం 18 జులై, 2024న ఉ.11.00గం.లు (ఐఎస్‌టి) ఎఫ్10బి, ఫేజ్-1, ఐడిఏ, జీడిమెట్ల, హైదరాబాద్-500055, తెలంగాణ, ఇండియాలో నిర్వహించబడును, సమావేశానికి ప్రదేశం మరియు సమయానికి దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క అన్‌సెక్యూర్డు క్రెడిటార్లు హాజరు కావల్సిందిగా అభ్యర్థిస్తున్నారు. 29 ఫిబ్రవరి, 2024 ("కటాఫ్ తేది") నాటికి అన్‌సెక్యూర్డు క్రెడిటార్ల రిజిస్టర్‌లో పేర్లు కనిపిస్తున్న దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క అన్‌సెక్యూర్డు క్రెడిటార్లను ఓటింగ్ నిమిత్తం పరిగణలోకి తీసుకోబడును.

కంపెనీస్ (కాంప్రమైజెస్, అరేంజ్‌మెంట్స్ మరియు అమాల్గమేషన్స్) రూల్స్, 2016లోని రూల్ 6 మరియు కంపెనీల చట్టం, 2013లోని సెక్షన్ 232తో చదవగల సెక్షన్ 230 క్రింద స్టేట్‌మెంట్ మరియు సదరు స్కీమ్ యొక్క కాపీని దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నెం.28, నాగార్జున హిల్స్, పంజగుట్ట, హైదరాబాద్-500082, తెలంగాణ, ఇండియా ("రిజిస్టర్డు ఆఫీసు") (లేదా) ప్రత్యామ్నాయంగా, విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క ఫ్యాక్టరీ: ఎఫ్10బి, ఫేజ్-1, ఐడిఏ, జీడిమెట్ల, హైదరాబాద్-500055, తెలంగాణ, ఇండియా ("ఫ్యాక్టరీ") లేదా దీని కౌన్సిల్ వారి ఆఫీసు: శ్రీ.ప్రశాంత్ కుమార్ జైన్, అడ్వకేట్, సంప్రదించు నెం: +91 95536 88330, ఇమెయిల్ అడ్రస్: prashant@samistilegal.in నుండి అన్నిపనిరోజుల్లో (శనివారం మరియు ఆదివారం మినహా) ఉ.10.00గం.ల నుండి సా.5.00గం.ల మధ్య ఉచితంగా పొందవచ్చును.

సదరు సమావేశానికి హాజరై మరియు ఓటువేయదలచిన ఎవరైనా వ్యక్తి, స్వయంగా లేదా ప్రాక్సీ ద్వారా నైనా వేయవచ్చును, ప్రాక్సీలందరూ నిర్దీత ఫారంలో సంతకంచేసి సమావేశానికి 48 గంటలు ముందుగా దరఖాస్తుదారు విభజన (డిమర్జ్‌డ్) కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు లేదా ఫ్యాక్టరీలో డిపాజిట్ చేయవలెను.

సదరు సమావేశానికి మరియుఅందులోని ఏవేని వాయిదాకి సంబంధించి చైర్‌పర్సన్‌గా దిగువ సంతకందారు (సిఎస్ డా.అహ్లాద రావు వుమ్మెంతల, పిసిఎస్) వారిని గౌరవ ట్రిబ్యునల్ నియమించింది. పై పేర్కొన్న స్కీమ్, ఒకవేళ సమావేశంలో ఆమోదించబడితే, తదుపరిగా ట్రిబ్యునల్ యొక్క ఆమోదానికి లోబడి ఉంటుంది.

సం/-
సిఎస్ డా.అహ్లాద రావు వుమ్మెంతల
సమావేశానికి నియమించబడిన చైర్‌పర్సన్
ఫ్లాట్ నెం.113, బి-బ్లాక్, శ్రీ దత్తాసాయి కమర్షియల్ కాంప్లెక్స్, సప్తగిరి థియేటర్ ఎదురుగా, ఆర్‌టిసి 'X' రోడ్స్, హైదరాబాద్-500020, తెలంగాణ.

తేది: 13 జూన్, 2024
ప్రదేశం: హైదరాబాద్

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్
బ్రాంచ్ చిరునామా: 3-11-114, ఫ్లాట్ నెం.2, మొదటి అంతస్తు,శ్రీ నిలయం, ఆర్టీసీ కాలనీ, ఎల్‌బి నగర్, హైదరాబాద్-500074.
Ph.No.040-49501072, Mob: 7625079163. e-mail: lbnagar@canfinhomes.com, CIN: L85110KA1987PLC008699

డిమాండు నోటీసు

ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ చట్టం, 2002లోని సెక్షన్ 13(2) క్రింద

ఏదైతే, దిగువ సంతకందారులు కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారిగా, SARFAESI చట్టం ప్రకారం మరియు రూల్ 3తో చదవగల సెక్షన్ 13(12) కింద సంక్రమించిన అధికారాలను అమలు చేస్తూ, క్రింద ఇవ్వబడిన వివరాల ప్రకారం, నోటీసు స్వీకరణ తేదీ నుండి 60 రోజులలోపు, నోటీసులో పేర్కొన్న మొత్తాలను తిరిగిచెల్లించమని దిగువ జాబితా చేయబడిన రుణగ్రహీతలు/హామీదారులు (ఇకపై "సదరు రుణగ్రహీతలు" గా పేర్కొనబడును) వారిని కోరుతూ సదరు చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద **డిమాండ్ నోటీసులు** జారీచేశారు.
పేర్కొన్న నోటీసులు పోస్టల్ అధికారులు బట్వాడా చేయకుండా తిరిగి వచ్చాయి/ రుణగ్రహీతలచే సక్రమంగా గుర్తించబడలేదు. అందువల్ల కంపెనీ చాలా జాగ్రత్తగా డిమాండ్ నోటీసు (రూల్ 3 (1)లోని నిబంధనల ప్రకారం) యొక్క ఈ ప్రచురణను ప్రభావితం చేస్తోంది. దిగువ సంతకందారు చట్టం ప్రకారం, పేర్కొన్న రుణగ్రహీతల చివరిగా తెలిసిన చిరునామాల చిరునామాలో ఈ నోటీసులను అతికించారు. రుణం యొక్క బకాయి తిరిగిచెల్లింపు కోసం సెక్యూరిటీగా, దిగువ వివరించిన విధంగా సంబంధిత పార్టీల ద్వారా కింది ఆస్తులు కంపెనీకి తనఖా పెట్టబడ్డాయి.

క్ర. సం.	రుణగ్రహీతలు/ హామీదారుల పేరు చిరునామాతో	డిమాండ్ నోటీసు ప్రకారం క్లెయిం చేసిన మొత్తం	సెక్యూర్డు అసెట్ వివరణ తాకట్టుపెట్టిన ఆస్తి యొక్క షెడ్యూలు:	ఎన్‌పిఏ తేది
1	1) రుణగ్రహీత: శ్రీమతి సింగంపల్లి సావిత్రి, భర్త: శ్రీ సింగంపల్లి సత్యనారాయణ, ఇంటి నెం.13-8-51, ఫ్లాట్ నెం.301,శ్రీ సాయి దుర్గ నివాస్, గౌతమ్ నగర్,దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్,హైదరాబాద్-500060. 2) సహ-రుణగ్రహీత: శ్రీ సింగంపల్లి సత్యనారాయణ, తండ్రి: ఎస్.కృష్ణ మూర్తి, ఇంటి నెం.13-8-51, ఫ్లాట్ నెం.301,శ్రీ సాయి దుర్గ నివాస్, గౌతమ్ నగర్,దిల్‌సుఖ్‌నగర్, సరూర్‌నగర్,హైదరాబాద్-500060.	బకాయి మొత్తం: రూ.30,92,476/- డిమాండ్ నోటీసు తేది: 31-05-2024	ఆస్తికి సంబంధించి పాక్షికంగా నిర్మాణం పూర్తయిన ఫ్లాట్ నెం.504, మొదటి అంతస్తు, కెపిహెచ్‌బి-టెనెన్సీ ఆర్కేడ్, ప్లాట్ నెంబర్లు 226,227, దీని యొక్క నిర్మిత విస్తీర్ణం 800.00 చ.అ. కామన్ ఏరియాస్ మరియు 50.00 చ.అ. టూవీలర్ పార్కింగ్‌తో పాటుగా అవిభాజ్యమైన స్థలం యొక్క విస్తీర్ణంలో వాటా 26.00చ.గ. లేదా 21.73చ.మీ.(మొత్తం విస్తీర్ణం 584.00చ.గ.) సర్వే నెం.141(పి),142(పి),144(పి),145(పి),146,147, 148(పి),149(పి),156(పి),157 మరియు 158(పి),"కెపిహెచ్‌బి టౌన్‌షిప్" కుంటనేపల్లి గ్రామం, దమ్మాయిగూడ మున్సిపాలిటీ, కీసర మండలం, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా, ఎస్‌ఆర్ఓ కీసర పరిధి మరియు హద్దులు: స్థలం యొక్క హద్దులు: తూర్పు: ప్లాట్ నెం.225, పడమర: ప్లాట్ నెం.228, ఉత్తరం: ప్లాట్ నెంబర్లు 233 మరియు 234, దక్షిణం: 40 అడుగుల వెడల్పు రోడ్డు. ఫ్లాట్ యొక్క హద్దులు: తూర్పు: ఓపెన్ టు స్కై, పడమర: 6 అడుగుల ఉమ్మడి దారి/ ప్రవేశం, ఉత్తరం: ఫ్లాట్ నెం.503, దక్షిణం: ఓపెన్ టు స్కై.	29-05-2024

* పైన పేర్కొన్న తేదీ నుండి చెల్లింపు తేదీ వరకు అంగీకరించిన విధంగా ఒప్పంద రేట్లలో తదుపరి వడ్డీతో చెల్లించాలి.
ఈ నోటీసును ప్రచురించిన తేదీ నుండి 60 రోజులలోపు కాంట్రాక్ట్ వడ్డీ రేటుతో పైన పేర్కొన్న మొత్తాన్ని చెల్లించాలని మీరు ఇందుమూలంగా కోరుతున్నారు. లేని పక్షంలో దిగువ సంతకందారులు పైన పేర్కొన్న సెక్యూరిటీని అమలు చేయడానికి SARFAESI చట్టం ప్రకారం చర్య తీసుకోవడానికి ముందుకుసాగుతారు. తదుపరిగా, సెక్యూర్డు అసెట్స్‌ను విడిపించుటకు వారికి అందుబాటులో ఉన్న సమయానికి సంబంధించి చట్టంలోని సెక్షన్ 13 (8)లోని నిబంధనలపై రుణగ్రహీతలు/హామీదారుల దృష్టిని ఆహ్వానించారు.

తేది: 13-06-2024, ప్రదేశం: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి, కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

---

pnb Housing Finance Limited Ghar Ki Baat

అనుబంధం-IV-A- స్థిరాస్తు/ల యొక్క ఇ-వేలం బహిరంగ అమ్మకపు ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్(ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నియమంతో చదవదగిన ది సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు ఇ-వేలం అమ్మకపు ప్రకటన.
రిజిస్టర్డు ఆఫీసు: 9వ అంతస్తు, అంతరిక్ష భవన్, 22, కస్తూర్బా గాంధీ మార్గ్, న్యూ ఢిల్లీ-110001. ఫోన్: 011-23357171, 23357172, 23705414, వెబ్: www.pnbhousing.com
బ్రాంచ్ చిరునామా: 4వ అంతస్తు, హౌస్ డేవిడ్‌సన్ షోరూమ్ పైన, రోడ్ నెం.2, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.

ఇందుమూలంగా సర్వజనులకు మరియు ప్రత్యేకించి కాలమ్ (ఎ)లో పేర్కొన్న రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ప్రకటన ఇవ్వడమేమనగా, కాలం(డి)లో వివరించిన దిగువ వివరించిన స్థిరాస్తులు సెక్యూర్డ్ క్రెడిటర్‌కు తాకట్టు పెట్టబడినవి/ ఛార్జ్‌చేయబడినవి, వాటిని మెసర్స్ పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/ సెక్యూర్డు క్రెడిటర్ యొక్క అధీకృత అధికారిచే కాలం (సి)లో వివరించినట్లు నిర్మాణాత్మకంగా/భౌతికంగా స్వాధీనం చేసుకోబడినవి, వాటిని దిగువ పేర్కొన్న వివరాల ప్రకారం "ఎక్కడ ఎలా ఉన్నది" మరియు "అది అక్కడ అలాగే ప్రాతిపదికన" విక్రయించబడుతుంది.
ఇందుమూలంగా రుణగ్రహీత/ తాకట్టుదారు(లు)/చట్టబద్ధ వారసులు, చట్టబద్ధ ప్రతినిధులు (తెలిసిన లేదా తెలియని), ఎగ్జిక్యూటర్(లు), అడ్మినిస్ట్రేటర్(లు), వారసు(లు) మరియు సదరు రుణగ్రహీతలు/తాకట్టుదారులు (మరణించిన) వారి అసైనీలకు ప్రకటన ఇవ్వడమేమనగా, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002లోని రూల్ 8(6) & 9 క్రింద కాలం (ఎ)లో సూచించినట్లు, అమ్మకపు వివరణాత్మక నియమ నిబంధనల కొరకు దయచేసి, మెసర్స్ పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్/ సెక్యూర్డ్ క్రెడిటర్ యొక్క వెబ్‌సైట్ అనగా www.pnbhousing.com లో ఇవ్వబడిన లింకును చూడగలరు.

రుణం నెం.,రుణగ్రహీత/ సహ-రుణగ్రహీత/ హామీదారు (ల)/ చట్టబద్ధమైన వారసుల పేరు (A)	డిమాండ్ చేసిన మొత్తం&తేది (B)	స్వాధీనతా స్వభావం (C)	తాకట్టుపెట్టిన ఆస్తుల వివరణ (D)	రిజర్వు ధర (ఆర్‌పి) (E)	ధరావత్తు (ఆర్‌పిలో10%) (F)	బిడ్‌లను చేయు చివరి తేది (G)	బిడ్ పెంపుదల రేటు (H)	తనిఖీ తేది & సమయం (I)	వేలంతేది & సమయం (J)	తెలిసిన రుణభారాలు/ కోర్టు కేసులు ఏవేని ఉన్నచో (K)
HOU/HYDL/0518/537466 ఎం.భరత్ కుమార్/ కామన్నం విమల బి.ఓ.: గచ్చిబౌలి	Rs. 24,64,995.54 as on date 15-07-2023	(భౌతికంగా)	ఫ్లాట్ నెం.185 ఎస్‌పి, గ్రౌండ్ ఫ్లోర్, సర్వే నెం.650, గోపాల్ రెడ్డినగర్, మంపుగూడ, కాప్రా, మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, తెలంగాణ-500062, హైదరాబాద్, ఇండియా	Rs. 43,69,000/-	Rs. 4,36,900/-	12.07.2024	Rs. 10,000/-	26.06.2024 between 11:00 AM to 05:00 PM	13.07.2024 between 01:00 PM to 02:00 PM	నిల్/ తెలియదు

* చెల్లింపు తేది నాటికి మరియు/ లేదా సంపూర్ణ తేదినాటికి చెల్లించిన వర్తించు విధంగా వార్షికంగా 18% తదుపరి వడ్డీ, ఇన్సిడెంటల్ వ్యయాలు, ఖర్చులు, ఛార్జీలు మొదలైన వాటితోసహా. పిఎన్‌బి హౌసింగ్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారికి ఉన్నంత సమాచారం మేరకు, కాలమ్ నెం.కె లో వివరించినవి మినహా పై పేర్కొన్న స్థిరాస్తులు/ సెక్యూర్డు ఆస్తులకు సంబంధించిన ఇతర రుణభారాలు/ క్లెయింలు లేవు. తదుపరిగా, సదరు రుణభారాలున్నచో సఫలీకృత కొనుగోలుదారు/ బిడ్డరుదారుచే చెల్లించబడును. పేర్కొన్న రుణభారాలకు వాస్తవికతకు సంబంధించి నిర్దిష్ట కొనుగోలుదారు/ బిడ్డరుదారులను స్వతంత్రంగా విచారణ చేసుకోవాల్సిందిగా కోరుతున్నాం.

1) తేది నాటికి, కామ్ నెం.కెలో పేర్కొన్న స్థిరాస్తులు/ సెక్యూర్డు ఆస్తులను విక్రయించుట, అలినేటింగ్ మరియు/లేదా డిస్పోసింగ్ నుండి PNBHFL యొక్క అధీకృత అధికారి/ PNBHFL కోర్టు ఇంజక్షన్ లేదా మరియు/ ఇతర నిషేధిస్తున్న ఆదేశాలు లేవు. 2) కాలమ్ నెం.కెలో సూచించిన ఏవేని ఉన్నచో ప్రోసీడింగ్స్/ జారీచేసిన ఉత్తర్వులలో స్టేటింగ్ యొక్క తనిఖీ చేయుటకు నిర్దిష్ట కొనుగోలుదారు/ బిడ్డరుదారు మరియు ఆసక్తిగల పార్టీలు స్వతంత్రంగా విచారణ జరుపుకోవాలి. అందుకు సంబంధిత టైటిల్ యొక్క పత్రాల యొక్క టైటిల్‌కు పరిమితంకాకుండా PNBHFL వద్ద అందుబాటులో కలవు మరియు టెండరుదారులు చేయుట/బిడ్ దరఖాస్తుఫారం లేదా ఆఫర్లు చేయుటకు ముందుగా అన్ని అంశాలన పరిమాసి సంతృప్తి చెందవలెను. బిడ్ ఫారంతోసహా ఈ వేలం యొక్క నియమనిబంధనలకు బిడ్డరుదారులు సంతకంచేయాలి. 3) సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9(3) నియమాలను దయచేసి గమనించాలి. అదేరోజున లేదా మరుసటి పనిరోజున (ధరావత్తుతోసహా) అమ్మకపు ధరలో 25%ను బిడ్డరుదారు/ కొనుగోలుదారు చట్టబద్ధంగా డిపాజిట్ చేయాలి. సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 9(2)ను అనుసరించి సెక్యూర్డు క్రెడిటర్‌చే అమ్మకం ధరలో 25% స్వీకరణ తరువాత మాత్రమే బిడ్డరుదారు/ కొనుగోలుదారు పేరున అమ్మకం నిర్ధారించబడును. అమ్మకం నిర్ధారణ మొత్తంలో మిగిలిన 75%ను అమ్మకం నిర్ధారణ లేఖ అక్నాలెడ్జ్‌మెంట్ తేది నుండి 15 రోజుల్లోపు కొనుగోలుదారు డిపాజిట్ చేయాలి. సదరు డిపాజిట్ విఫలం చెందితే, ఆస్తి/సెక్యూర్డు అసెట్ తిరిగివిక్రయించబడును. 4) ఇ-వేలం అమ్మకం ద్వారా అమ్మకం నిర్వహించుటకు అధీకృత అధికారికి సి1 ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ దీని కార్పొరేట్ ఆఫీసు: ఫ్లాట్ నెం.68, 3వ అంతస్తు, సెక్టార్ 33, గుర్గామ్, హర్యానా-122003, వెబ్‌సైట్: www.bankeauctions.com సహాయం అందిస్తుంది. ఆస్తి తనిఖీకి సంబంధించి ఏవేని సహాయం లేదా బిడ్ పత్రాలను పొందుటకు మరియు ఏవేని ఇతర ప్రశ్నలు లేదా రిజిస్ట్రేషన్ కొరకు, మీరు పిఎన్‌బిహెచ్ఎఫ్ఎల్ యొక్క అధీకృత వ్యక్తులైన, శ్రీ.మాధవ్/ విజయ్ సుంద్రియల్/ వల్లూరు ఉదయ్ భాస్కర్, మొబైల్ నెం.9948562888/ 7428193765/ 9703801419 వారితో కోఆర్డినేట్ చేసుకోండి, ఇమెయిల్ ఐడి:auction@pnbhousing.com లేదా www.pnbhousing.com ను రిఫర్ చేయండి.

ప్రదేశం: గచ్చిబౌలి, తేది: 12-06-2024 సం/- అధీకృత అధికారి, పిఎన్‌బి హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్

Arcil Premier ARC

అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్
వివిధ ఆర్సిల్ ట్రస్టుల యొక్క ట్రస్టీగా దాని హోదాలో వ్యవహరిస్తోంది.
ఆర్సిల్ ఆఫీసు: రూబీ, 10వ అంతస్తు, 29, సేనాపతి బాపట్ మార్గ్, దాదర్ (వెస్ట్) ముంబయి-400028.
బ్రాంచ్ ఆఫీసు: 207, 4వ అంతస్తు, భువన్ టవర్స్, ఎస్.డి.రోడ్, సికింద్రాబాద్-03.
Website: https://auction.arcil.co.in, CIN-U65999MH2002PLC134884

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6, 8& 9తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 (SARFAESI చట్టం) క్రింద సంక్రమించిన అధికారాలతో ఆన్‌లైన్ ఇ-వేలంద ద్వారా అమ్మకం కొరకు బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా సాధారణంగా ప్రజలకు మరియు ప్రత్యేకించి రుణగ్రహీతలు/హామీదారు/ తాకట్టుదారు(ల) ప్రకటన ఇవ్వడమేమనగా, దిగువ వివరించిన అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్, వివిధ ఆర్సిల్ ట్రస్టుల (ఆర్సిల్) యొక్క ట్రస్టీగా దీని సామర్థ్యంలో వ్యవహరిస్తున్నది, (రిజిస్టర్డు అసైన్‌మెంట్ అగ్రిమెంట్స్ ఆధారంగా ఫైనాన్షియల్ అసెట్ యొక్క అసైన్‌మెంట్‌ను అనుసరించి) ఆర్సిల్‌కు తాకట్టుపెట్టిన/ ఛార్జ్‌చేసిన వాటిని, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002లోని రూల్ 6, 8& 9తో చదువబడే సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002లోని నియమాలను అనుసరించి దిగువ తెలిసిన తదుపరి వడ్డీ, ఛార్జీలు మరియు ఖర్చులు వగైరాతోసహా బాకీపడిన బకాయిల రికవరీ కొరకు ఆన్‌లైన్ ఇ-వేలం ద్వారా "ఎక్కడ ఉన్నది మరియు అక్కడ అలాగే" మరియు "రికోర్స్ లేకుండా ప్రతిపాదికన" విక్రయించబడును.

రుణగ్రహీత / సహ-రుణగ్రహీతలు/ హామీదారులు/ తాకట్టుదారుల పేరు	లోన్ నెం.& సెల్లింగ్ బ్యాంక్	ట్రస్ట్ పేరు	SARFAESI నోటీసు తేది: 18-11-2021 ప్రకారం బాకీపడిన మొత్తం	స్వాధీనతా రకం మరియు తేది	తనిఖీచేయు తేది	ఆస్తి రకం మరియు ఏరియా	ధరావత్తు (ఈఎండి) & బిడ్ సమర్పణకు చివరి తేది	రిజర్వు ధర	ఇ-వేలం తేది& సమయం
శ్రీ గోగుల వీర వెంకట క్రిష్ణ	H400HHL0227745 & H400HLT0237166	ఆర్సిల్-రిటైల్ లోన్ పోర్ట్‌ఫోలియో 042-ఇ-ట్రస్ట్ ("ఆర్సిల్")	18 నవంబర్, 2021నాటికి రూ.33,34,817.68 పైసలు (రూపాయలు ముప్పైమూడు లక్షల ముప్పైనాలుగు వేల ఎనిమిది వందల పదిహేడు మరియు అరవై ఎనిమిది పైసలు మాత్రమే) + 19 11-2021 నుండి దానిపై తదుపరి వడ్డీ + లీగల్ వ్యయాలు	26-12-2023న లాంఛన ప్రాయ స్వాధీనత	అభ్యర్థనపై ఏర్పాటు చేయ బడును	ఫ్రీ హోల్డ్ 1110 చ.అ.లు	రూ.3,48,700/- (రూపాయలు మూడు లక్షల నలభై ఎనిమిది వేల ఏడు వందలు మాత్రమే) అదే రోజు 2 గంటల ముందు వేలం 03-07-2024 ఉ॥ 10.00 గం॥లకు, బిడ్ ఇంక్రిమెంట్ బిడ్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ప్రకారం.	రూ. 34,87,000/- (రూపాయలు ముప్పై నాలుగు లక్షల ఎనభై ఏడు వేలు మాత్రమే)	03-07-2024 సమయం: 12.00 మధ్యాహ్నం

వేలంవేయబడు సెక్యూర్డు అసెట్ వివరణ– ఆస్తి యజమాని:ఫ్లాట్ నెం. 102 మొత్తం, 1వ అంతస్తు, బిల్టప్ ఏరియా 1110 చ.అ.లతో పాటు (కామన్ ఏరియాతో కలిపి) మరియు 80 చ.అ.ల కార్ పార్కింగ్ ఏరియా, 24.0 చ.గ.ల అవిభాజ్య భూమిలో వాటా, "కాంఫోర్ట్ ప్లాటినమ్" గా తెలిసిన బిల్డింగ్ కాంప్లెక్స్‌లోని మొత్తం 557.0 చ.గ.లలో, ప్లాట్ నెం. 1 & 2 పై నిర్మించబడినది, సర్వే నెం: 184(పి), 185(పి), 186, 188 & 189. నిజాంపేట గ్రామం మరియు గ్రామ పంచాయతీ వద్ద ఉన్నది, కుత్బుల్లాపూర్ మండలం, రంగారెడ్డి జిల్లా మరియు సరిహద్దులు: ఉత్తరం: ఓపెన్ టు స్కై, దక్షిణం: లిఫ్ట్ & ఓపెన్ టు స్కై, తూర్పు: కారిడార్, పడమర: ఓపెన్ టు స్కై.

ఆర్సిల్‌కు తెలిసిన పెండింగ్ లిటిగేషన్స్: నిల్	ఆర్‌టిజిఎస్ వివరాలు: "ఆర్సిల్-రిటైల్ లోన్ పోర్ట్‌ఫోలియో 042-ఇ ట్రస్ట్", ట్రస్ట్ అకౌంట్: హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్, బ్రాంచ్: కమలా మిల్స్ కాంపౌండ్, సేనాపతి బాపట్ మార్గ్, ముంబై, ఐఎఫ్ఎస్‌సి కోడ్: HDFC0000542, కరెంట్ అకౌంట్ నెం. 57500000729860.
ఆర్సిల్‌కు తెలిసిన భారాలు/బకాయిలు: నిల్	
బిడ్ సమర్పణకు చివరి తేది: అదే రోజు 2 గంటల ముందు వేలం	
బిడ్ ఇంక్రిమెంట్ మొత్తం: బిడ్ డాక్యుమెంట్‌లో పేర్కొన్న ప్రకారం	సంప్రదించు వ్యక్తి పేరు & నెంబర్: వి. ఉపేందర్-9642495111, నాయుడు ప్రభాకర్-9989911388, మైకేల్ గైక్వాడ్-9867929121, మహేష్ బంగేరా-9004173256
డిమాండ్ డ్రాఫ్ట్: ఆర్సిల్-రిటైల్ లోన్ పోర్ట్‌ఫోలియో 042-ఇ- ట్రస్ట్ ("ఆర్సిల్") వద్ద చెల్లించుట: హైదరాబాద్	

నిబంధనలు మరియు షరతులు :

1) బిడ్ డాక్యుమెంట్‌లోని నిబంధనలు మరియు షరతులు మరియు ప్రొసీజర్ ప్రకారం ఇ-వేలం వెబ్‌సైట్: https://auction.arcil.co.in ద్వారా వేలం అమ్మకం నిర్వహించబడును.
2) ఇంటర్నెట్ కనెక్టివిటీకి నెట్‌వర్క్ సమస్యలు, సిస్టమ్ క్రాష్ డౌన్, పవర్ ఫెయిల్యూర్ మొ॥వాటికి అధీకృత అధికారి("ఏఓ")/ ఆర్సిల్ బాధ్యత వహించరు.
3) వేలం యొక్క ఏ దశలోనైనా, కారణం మరియు ఎటువంటి ముందస్తు నోటీసు లేకుండా ఏఓ. బిడ్/ఆఫర్‌ను అంగీకరించవచ్చు/తిరస్కరిస్తారు/సవరించవచ్చు/రద్దు చేయవచ్చు లేదా వేలం వాయిదా చేయవచ్చు.
4) సఫలీకృత కొనుగోలుదారు/బిడ్డర్ ఏవైనా చట్టబద్ధమైన బకాయిలు, పన్నులు, చెల్లించాల్సిన రుసుములు, కొనుగోలు పరిశీలనపై వర్తించే జిఎస్టీ, స్టాంప్ డ్యూటీ, వర్తించే చట్టం ప్రకారం సెక్యూరు& ఆస్తిని అతని/ ఆమె/దాని పేరున కన్వేయన్స్/బట్వాడా చేయడానికి చెల్లించాల్సిన రిజిస్ట్రేషన్ ఫీజు మొదలైనవి.
5) బిడ్‌ను సమర్పించే ముందు సెక్యూర్డు అసెట్స్‌ను ప్రభావితం చేసే టైటిల్ ఆఫ్ సెక్యూర్డ్ అసెట్ మరియు క్లెయిమ్‌లు/హక్కులు/బకాయిలు, చట్టబద్ధమైన బకాయిలు, వగైరాతోసహా.. తమ సొంత స్వతంత్ర విచారణలు/భారాలతో ఆసక్తిగల బిడ్డర్లు తగిన శ్రద్ధ వహించాలి. వేలం ప్రకటనకు ఆర్సిల్ ఏ విధమైన నిబద్ధత లేదా ప్రాతినిధ్యాన్ని ఏర్పరచదు మరియు ఏర్పరచదు. ఏదైనా థర్డ్ పార్టీ క్లెయిమ్‌లు/హక్కులు/ బకాయిల కోసం ఆర్సిల్ యొక్క అధీకృత అధికారి ఏవిధమైన బాధ్యత వహించరు.
6) వార్తాపత్రికలలో ప్రచురించబడిన వేలం నోటీసులో పేర్కొన్న వివరాలు దిగువ సంతకందారునికి వారికి ఉన్న సమాచారం మేరకు పేర్కొనబడినవి. ఏదేమైనప్పటికీ, ఏదైనా పొరపాటు, తప్పు ప్రకటన లేదా లోపానికి దిగువ సంతకందారు బాధ్యత వహించరు.
7) సదరు బకాయిలకు బాధ్యత వహించే రుణగ్రహీత/ హామీదారులు/ తనఖాదారులు, పైన పేర్కొన్న వేలం అమ్మకం గురించి సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్)రూల్స్‌లోని రూల్స్ 8 మరియు 9 కింద ఈ అమ్మకపు ప్రకటనను నోటీసుగా పరిగణించాలి.
8) ఇక్కడ షెడ్యూల్ చేయబడిన వేలం ఏ కారణం చేతనైనా విఫలమైతే, రూల్స్ మరియు చట్టంలోని రూల్ 8(5)లోని నిబంధనల ప్రకారం ఏదైనా ఇతర పద్ధతుల ద్వారా సెక్యూర్డు అసెట్స్‌ను విక్రయించే హక్కును ఆర్సిల్ కలిగి ఉంటుంది.

తేది: హైదరాబాద్ సం/- అధీకృత అధికారి
తేది: 13-06-2024 అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఇండియా) లిమిటెడ్

రాజకీయాల్లో లైంగిక వేధింపులు

ప్రజ్వల్ రేవణ్ణ ఉదంతం ఓ ఉదాహరణ మాత్రమే

- వెలుగు చూడని అకృత్యాలు ఎన్నో
- కింది స్థాయి మహిళల పరిస్థితి మరింత దారుణం

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికలు జరుగుతున్న సమయంలో వెలుగులోకి వచ్చిన ప్రజ్వల్ రేవణ్ణ రాసలీలల బాగోతం దేశ రాజకీయాలను ఓ కుదుపు కుదిపింది. ప్రజ్వల్ తమపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడంటూ పలువురు బాధిత మహిళలు గళం విప్పి తమ ఆవేదనను, ఆక్రోశాన్ని వ్యక్తం చేశారు. రాజకీయాల్లో రాణించాలనుకునే మహిళలు లైంగిక వేధింపులకు గురవడం సర్వసాధారణమేనని, వారి గోడును పట్టించుకునే నాథుడే ఉండడని మైసూరుకు చెందిన కాంగ్రెస్ నాయకురాలు నజ్మా నజీర్ వాపోయారు. చట్టసభల్లో మహిళల ప్రాతినిధ్యం చాలా తక్కువగా ఉండడం కూడా ఈ పరిస్థితికి కారణమవుతోంది.


కొత్తగా ఎన్నికైన 18వ లోక్‌సభలో కేవలం 74 మంది మహిళలు మాత్రమే ఉన్నారు. మొత్తం సభ్యుల్లో వీరి భాగస్వామ్యం 14శాతం కంటే తక్కువే. 2019లో జరిగిన ఎన్నికల్లో 78 మంది మహిళలు విజయం సాధించారు. అంటే ఇప్పుడు దిగువసభలో మహిళా ప్రాతినిధ్యం గతంలో కంటే మరింత తగ్గిందన్న మాట.

అక్కడ వారిదే రాజ్యం

హసన్‌లో పలువురు మహిళలు ప్రజ్వల్ చేతిలో లైంగిక వేధింపులకు గురవడానికి ప్రధాన కారణం హెచ్‌డీ దేవెగౌడ కుటుంబానికి ఉన్న ప్రాబల్యమే. ఆ కుటుంబం కర్నాటకలో గట్టి పట్టున్న, శక్తివంతమైన ఒక్కళిగ సమాజానికి చెందినది. హసన్ నుండి దేవెగౌడ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఆయన కుమారుడైన హెచ్‌డీ కుమారస్వామి రాష్ట్రానికి రెండుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. దేవెగౌడ మరో కుమారుడైన రేవణ్ణ ఆరుసార్లు శాసనసభకు ఎన్నికయ్యారు. రేవణ్ణ కుమారుడైన ప్రజ్వల్ 2019లో రాజకీయాల్లో ప్రవేశించి, హసన్ లోక్‌సభ స్థానం నుండి విజయం సాధించారు. దేవెగౌడను ఆ ప్రాంతంలో అందరూ ఎంతగానో గౌరవిస్తారు. అయితే ఆయన కుమారులు, మనవళ్లపై స్థానికుల్లో భిన్నాభిప్రాయలు ఉన్నాయి. కుమారుల కారణంగా దేవెగౌడ సైతం అప్రదిష్టను మూటకట్టుకోవాల్సి వచ్చింది. ముఖ్యంగా రేవణ్ణ చాలా దుందుడుకు స్వభావం కలిగిన నాయకుడని అంటారు. హసన్ జిల్లాను స్థానికులు 'రిపబ్లిక్ ఆఫ్ రేవణ్ణ' అని పిలుస్తుంటారు. ఎందుకంటే ఆయన అనుమతి లేకుంటే అక్కడ ఏమీ జరగదని నజ్మా నజీర్ చెప్పారు. ఆమె గతంలో జనతాదళ్ (ఎస్) మహిళా విభాగం అధ్యక్షురాలిగా పనిచేశారు. రెండు నెలల క్రితమే కాంగ్రెస్‌లో చేరారు. రేవణ్ణ కుటుంబంలో ఎవరు ఎన్ని తప్పులు చేసినా నోరు మెదిపే ధైర్యం ప్రజలకు లేదు. అదే ప్రజ్వల్ రేవణ్ణను కామాంధుడిగా మార్చింది. పైగా రేవణ్ణకు కులాభిమానం ఎక్కువ. ఈ రోజుకు కూడా దళితులతో మాట్లాడిన తర్వాత ఆయన స్నానం చేస్తారట.

ఇప్పుడిప్పుడే భయం తగ్గుతోంది : సీపీఐ (ఎం)

'రాజకీయాల్లో దేవెగౌడ లౌకికవాది, సోషలిస్టు కావచ్చు. కానీ వ్యక్తిగత జీవితంలో ఆయన ప్రవర్తన వేరేలా ఉంటుంది' అని సీపీఐ (ఎం) జిల్లా కార్యదర్శి ధర్మేష్ వ్యాఖ్యానించారు. ఆ కుటుంబానికి మతతత్వం, కులాభిమానం ఎక్కువగా ఉన్నాయని ఆయన తెలిపారు. అయితే ఎన్ని ప్రతికూలతలు ఉన్నప్పటికీ ఒక్కళిగుల ప్రాబల్యం కారణంగా దేవెగౌడ కుటుంబం దశాబ్దాల తరబడి అధికారాన్ని అనుభవిస్తోంది. వారికి పెద్ద ఎత్తున ఆస్తులు, భూములు ఉన్నాయని, వారు చాలా శక్తివంతులన్న విషయం స్థానికులకు తెలుసునని, అందుకే ఆ కుటుంబానికి భయపడుతుంటారని ధర్మేష్ చెప్పారు. అయితే గత రెండేండ్లలో ఆ భయం కొంతవరకూ తగ్గిందని అన్నారు.



దిగువ స్థాయి ఉద్యోగినులే లక్ష్యంగా...

ప్రభుత్వంలో కింది స్థాయిలో పనిచేస్తున్న మహిళల పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ప్రజ్వల్ రేవణ్ణ జిల్లా పరిషత్, తాలూకా, గ్రామ పంచాయతీ స్థాయిల్లో పనిచేసే దిగువ శ్రేణి మహిళా ఉద్యోగినులనే లక్ష్యంగా చేసుకొని లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. ఉద్యోగాలు, బదిలీలు, తమ భర్తల కోసం పనుల కోసం తనను కలిసే మహిళలను ప్రజ్వల్ వేధించేవాడు. ఉన్నతోద్యోగాలు చేసే మహిళల జోలికి మాత్రం రాజకీయ నాయకులు అంత సులభంగా వెళ్లరు.

అన్ని పార్టీల్లోనూ లైంగిక వేధింపులు

హసన్‌లో కింది స్థాయి రాజకీయాల్లో ఉన్న మహిళలు శక్తివంతమైన నేతల చేతిలో దారుణమైన అవమానాలు చవిచూశారు. కర్నాటకలో 'మహిళలు-రాజకీయాలు' అనే అంశంపై మాస్టర్ డిగ్రీ కోసం సుష్మా మహాబాల గత ఐదు సంవత్సరాలుగా పరిశోధన చేస్తున్నారు. వివిధ పార్టీల్లో ఉన్న మహిళలను ఆమె సంప్రదిస్తూ వారు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. లైంగిక వేధింపులు అన్ని పార్టీల్లోనూ జరుగుతూనే ఉన్నాయని ఆమె గ్రహించారు. అయితే తమను వేధించిన రాజకీయ నాయకుల పేర్లను కర్నాటక మహిళలు బయటపెట్టడం లేదు. మహిళలు రాజకీయ ప్రచారానికో లేదా ఇతర కార్యక్రమానికో రాత్రి ఏడు గంటలు దాటిన తర్వాత వెళితే వారిని గౌరవంగా చూడరని మహాబాల చెప్పారు.

న్యాయస్థానం కూడా...

పని ప్రదేశంలో మహిళలను లైంగికంగా వేధించడం చట్టప్రకారం నేరం. 'పని ప్రదేశం' అనే మాటకు చట్టం విస్తృతమైన నిర్వచనం ఇచ్చింది. అయితే రాజకీయ పార్టీలు దీని పరిధిలోకి రావు. దీనిని సవాలు చేస్తూ 2018లో కోజికోడ్‌కు చెందిన న్యాయవాది సంధ్యా రాజు కేరళ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పిటిషనర్‌కు అనుకూలంగా 2022లో కోర్టు తీర్పు ఇచ్చినప్పటికీ అది పాక్షికంగానే ఉంది. రాజకీయ పార్టీల సభ్యుల మధ్య యజమాని-ఉద్యోగి సంబంధాలు ఉండవని, కాబట్టి అది పని ప్రదేశం పరిధిలోకి రాదని కోర్టు అభిప్రాయపడింది.

పక్కన నిలబడితేనే వ్యక్తిత్వ హననం

రాజకీయాల్లో లైంగిక వేధింపులు మితిమీరిపోతున్నాయని కాంగ్రెస్ పార్టీకి చెందిన కవితా రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శక్తివంతులైన పురుషులతో కలిసి మహిళలు పనిచేయాల్సి ఉంటుందని, ఈ క్రమంలో వారు లైంగిక వేధింపులకు గురవుతుంటారని ఆమె చెప్పారు. 'ఒక ఫోన్ కాల్‌తో మీ జీవితమంతా నాశనమవుతుంది' అని అన్నారు. మహిళలు పురుషుల పక్కన నిలబడగానే వ్యక్తిత్వ హననం మొదలవుతుందని చెప్పారు. 'పురుషులు మహిళలను గౌరవించరు. యువతరం కొంత నయం. కానీ ప్రజ్వల్ రేవణ్ణ వంటి వారిని కూడా మనం చూస్తుంటాం' అని తెలిపారు. రాజకీయ కుటుంబాల నుండి వచ్చిన మహిళలకు కొంత రక్షణ ఉంటుందని మహాబాల అన్నారు. మిగిలిన వారిలో ఎవరినైనా లైంగిక వేధింపులకు గురిచేయవచ్చునని, అవివాహితులు, వితంతువులకు ఈ బెడద మరింత అధికంగా ఉంటుందని ఆమె చెప్పారు.

వాయనాడా? రాయ్‌బరేలా?


- ఏ సీటు వదులుకోవాలన్నదానిపై రాహుల్ సతమతం
- ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి కేరళలో పర్యటన
- తాను ఏ నిర్ణయం తీసుకున్నా ఇరు నియోజకవర్గాలూ సంతోషిస్తాయి : కాంగ్రెస్ అగ్రనేత



న్యూఢిల్లీ : 2019 సార్వత్రిక ఎన్నికల ఓటమిలో ఓదార్పునిచ్చిన కేరళలోని వాయనాడ్ ఎంపీ స్థానం ఒకవైపు.. తనయుడి కోసం తల్లి త్యాగం చేసిన యూపీలోని కాంగ్రెస్ కంచుకోట రాయ్‌బరేలీ లోక్‌సభ స్థానం ఇంకోవైపు.. ఇలా 2024 లోక్‌సభ ఎన్నికల్లో రెండు నియోజకవర్గాల నుంచి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మంచి మెజారిటీతో విజయం సాధించాడు. అయితే, నిబంధనల ప్రకారం.. రెండు స్థానాల్లో గెలిచినవారెవరైనా ఏదో ఒక స్థానాన్ని వదులుకోవాల్సి ఉంటుంది. కాబట్టి, ఈ రెండు స్థానాలలో ఏ నియోజకవర్గానికి పరిమితం కావాలో? ఏ సీటును వదులుకోవాలో తెలియక రాహుల్ సతమతమవుతున్నట్టు తెలిసింది. అయితే, తాను ఏ నిర్ణయం తీసుకున్నా.. రెండు నియోజకవర్గాలు ఆ నిర్ణయంతో సంతోషంగా ఉంటాయని రాహుల్ చెప్పాడు. తనను రెండోసారి లోక్‌సభకు ఎన్నుకున్నందుకు వాయనాడ్ ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన ఆయన.. నియోజకవవర్గ ప్రజలను త్వరలో కలవటానికి ఎదురుచూస్తున్నానని తెలిపాడు. తాను వాయనాడ్ ఎంపీగా ఉండాలా లేక రాయ్‌బరేలీ ఎంపీగా ఉండాలా అనే సందిగ్ధత తన ముందు ఉన్నదన్నాడు.

వాయనాడ్ లోక్‌సభ నియోజకవర్గంలో వరుసగా రెండోసారి ఘనవిజయం సాధించిన తర్వాత రాష్ట్రంలో ఆయన తొలిసారి పర్యటించారు. రోడ్ షో, బహిరంగ సభలలో పాల్గొన్న ఆయన పైవిధంగా అన్నాడు. తాను నిర్ణయం తీసుకోవటంలో దైవిక మార్గనిర్దేశాన్ని పొందుతానని చెప్పుకోనని మోడీపై పరోక్ష విమర్శలు చేశాడు. దేశంలోని ప్రధాన విమానాశ్రయాలు, పవర్ ప్లాంట్లను అదానీకి అప్పగించాలని దేవుడు ప్రధానిని నిర్దేశిస్తాడని రాహుల్ వ్యంగ్యాస్త్రాలు సంధించాడు. "కానీ, నేను మనిషిని. నా దేవుళ్లు దేశంలోని పేద ప్రజలు. కాబట్టి, నాకు ఇది చాలా సులభం. నేను ప్రజలతో మాట్లాడతాను. వారు ఏమి చేయాలో వారు నాకు చెబుతారు" అని రాహుల్ గాంధీ అన్నాడు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో భారత రాజ్యాంగాన్ని పరిరక్షించటం కోసమే పోరాటం చేశామనీ, ఆ పోరాటంలో ద్వేషాన్ని ప్రేమ, ఆప్యాయతతో అహంకారాన్ని వినయంతో ఓడించామని చెప్పాడు. భారత ప్రజలు తనకు స్పష్టమైన సందేశం పంపటంతో మోడీ ఇప్పుడు తన వైఖరిని మార్చుకోవాల్సి ఉంటుందని రాహుల్ అన్నారు.

ఇటు కేరళలో, అటు యూపీలో కాంగ్రెస్ నేతృత్వంలోని కూటములు గణనీయమైన స్థానాలను గెలుపొందాయనీ, ఇప్పుడిదే రాహుల్ అనిశ్చితికి కారణమని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. అలాగే, ఉత్తర, దక్షిణ భారతదేశ అంశమూ ఇక్కడి ముడిపడి ఉండే అవకాశమున్నదని అంటున్నారు. కేరళలోని 20 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ 18 స్థానాలు సాధించగా, యూపీలోని 80 సీట్లకు గానూ 43 స్థానాలు పొందిన ఇండియా బ్లాక్ అక్కడ ఎన్డీఏ కంటే ఎక్కువ సీట్లను సంపాదించగలిగింది. దీంతో బీజేపీ అనుకున్న లక్ష్యానికి గండి పడటంలో యూపీ ఫలితాలే కీలకమయ్యాయని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు.



ఆగని విష ప్రచారం

ఓటమికి ముస్లింలే కారణమంటూ బీజేపీ నిందలు

- భయాందోళనలకు గురి చేసిన హిందూత్వ ఎజెండా
- హిందువుల్లోనూ దూరమైన సమాజాలు
- ప్రతిపక్షానికే జై కొట్టిన మరాఠాలు, దళితులు

న్యూఢిల్లీ : లోక్‌సభ ఎన్నికల్లో తమ బలం పడిపోవడానికి మైనారిటీలే కారణమని పలువురు బీజేపీ నేతలు నిందిస్తున్నారు. హిందువుల్లో కొన్ని వర్గాలు తమకు మద్దతు ఇవ్వలేదన్న వాస్తవాన్ని అంగీకరించేందుకు వారు నిరాకరిస్తున్నారు. ఎందుకంటే మైనారిటీలను నిందించడం చాలా తేలిక. పైగా అది వ్యూహాత్మకం కూడా.

పరాజయాల తర్వాత బీజేపీలో మొట్టమొదటిసారిగా స్పందించింది అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ. ఏ మతాన్నీ నేరుగా పేరు పెట్టి విమర్శించకపోయినా 'ఓ సమాజం' అంటూ ఆయన వ్యాఖ్యానించారు. ఈశాన్య ప్రాంతంలోని మణిపూర్, నాగాలాండ్, మేఘాలయలో బీజేపీ ఓటమికి ఓ మతం వారే కారణమని ఆయన నిందలు వేశారు. ఆయా రాష్ట్రాల్లో క్రైస్తవుల సంఖ్య గణనీయంగా ఉండడంతో ఆయన వారిని ఉద్దేశించే ఈ మాటలు అన్నారని అర్థమవుతోంది. ఆ తర్వాతి వంతు మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్‌ది. రాష్ట్రంలో బీజేపీ బలం 23 నుండి 9కి పడిపోవడానికి ముస్లింలే కారణమని ఆయన ఆరోపించారు.

అర్ధ సత్యమే

వీరిద్దరి ప్రకటనలు చూసిన తర్వాత బీజేపీ మద్దతుదారులు వాట్సప్‌లో పోస్టులు ప్రారంభించారు. పోలింగ్ కేంద్రాల వెలుపల ముస్లింలు బారులుతీరి నిలబడిన దృశ్యాలను ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఎన్సీపీ నేత అజిత్ పవార్, మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే కుమారుడు, 18వ లోక్‌సభకు ఎన్నికైన శిశిర్ షిండే కూడా ముస్లింలపై నిందలు వేశారు. ముస్లింలు ప్రతిపక్ష కూటమి వైపు నిలిచారని, మహారాష్ట్రలో బీజేపీ ఓటమికి వారే కారణమని మండిపడ్డారు. అయితే ఈ నాయకులు చెప్పిన దానిలో అబద్ధమేమీ లేదు. కానీ అది అర్ధ సత్యమే. ఎందుకంటే అదే ప్రధాన కారణం కాదు. మెజారిటీ సమాజంలోని అనేక వర్గాలు బీజేపీకి వ్యతిరేకంగా నిలబడడం వల్లనే ఆ పార్టీ భారీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది.

వీరు కూడా...

బీజేపీ నేతలు తమ పరాజయాలకు ముస్లిం నేతలనే బాధ్యులను చేస్తున్నారు తప్పించి వాస్తవాలు గ్రహించడం లేదు. ఉదాహరణకు మరాఠీ మాట్లాడే హిందువులు కూడా ఆ పార్టీకి ఓటేయలేదు. శివసేన జన్మస్థలమైన ముంబయి నగరంలోని ఆరు పార్లమెంట్ స్థానాల్లో నాలుగింటిని ఇండియా కూటమి గెలుచుకుంది. బీజేపీకి భారీ మెజారిటీ ఇస్తే రాజ్యాంగాన్ని మారుస్తుందేమోనని భయపడిన షెడ్యూల్డ్ కులాల వారు కూడా ఆ పార్టీకి దూరం జరిగారు. మరాఠాలు బీజేపీపై ఆగ్రహంతో ఇండియా కూటమి వైపు మొగ్గారు.

చీలని ముస్లిం ఓట్లు

మహారాష్ట్రలోని ముస్లింలు సంప్రదాయపరంగా ఎన్సీపీని బలపరుస్తూ ఉంటారు. శరద్ పవార్ నుండి విడిపోయిన తర్వాత కూడా ముస్లిం ఓట్లను ఆకర్షించేందుకు అజిత్ పవార్ విశ్వప్రయత్నం చేశారు. కానీ ఆ ప్రయత్నం ఫలించలేదు. ముస్లిం నేతలు ఫత్వాలు జారీ చేయడం వల్లనే తాము ఓడిపోయామని షిండే వర్గానికి చెందిన శివసేన నేత, రాష్ట్ర మంత్రి దీపక్ కేసర్కార్ నిందించారు. 2019లో మాదిరిగా ఈసారి ముస్లిం ఓట్లు చీలలేదు. అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ తరఫున బరిలో దిగిన సిట్టింగ్ ఎంపీ ఇంతియాజ్ జలీల్ ఓటమి పాలయ్యారు. ఆ పార్టీ అభ్యర్థులుగా పోటీ చేసిన మరో నలుగురు ధరావతులు సైతం కోల్పోయారు.

2019 నుండే హిందూత్వ ఎజెండా అమలు

2019 ఎన్నికల సమయంలో ముస్లిం ఓట్లు ఎందుకు ఈ తరహాలో సంఘటితం కాలేదు? ముస్లింలపై దాడులు, వేధింపులు ఆ కాలంలోనే అధికంగా జరిగాయి. 2019 ఎన్నికల్లో విజయం సాధించిన వెంటనే బీజేపీ తన హిందూత్వ ఎజెండాను అమలు చేయడం మొదలు పెట్టింది. 2019 ఆగస్టులో ఆర్టికల్ 370ని పార్లమెంట్ రద్దు చేసింది. సంవత్సరం తర్వాత అయోధ్యలో రామమందిర నిర్మాణానికి ప్రధాని మోడీ శంకుస్థాపన చేశారు. సార్వత్రిక సమరం మొదలు కావడానికి ముందు ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ)ని అమలు చేయాలన్న ఉద్దేశాన్ని పాలక పక్షం బయట పెట్టింది. లోక్‌సభ ఎన్నికలు ప్రారంభం కావడానికి రెండు నెలల ముందు ఫిబ్రవరిలో బీజేపీ పాలిత ఉత్తరాంచల్ ప్రభుత్వం యూసీసీని అమలు చేసింది. ఇక చివరిగా ఎన్నికలకు నెల రోజుల ముందు దేశ ప్రజలు ఎంతగా వ్యతిరేకించినప్పటికీ పౌరసత్వ సవరణ చట్టాన్ని (సీఏఏ) నోటిఫై చేసింది.

ఆశాకిరణంగా 'ఇండియా'

యూసీసీ అమలు, సీఏఏ తర్వాత జాతీయ పౌరుల రిజిస్టర్ అనివార్యం కావడంతో ముస్లింలలో భయాందోళనలు చెలరేగాయి. ఈ రెండు చర్యల కారణంగా తమ గుర్తింపు, భారత పౌరసత్వంపై తమ వాదనలు కాలగర్భంలో కలిసిపోతాయని వారు భావించారు. తీవ్ర ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్న ముస్లింలలో ఇండియా కూటమి ఆవిర్భావం కొండంత ధైర్యాన్ని కలిగించింది. 2019లో బీజేపీని ఓడించే సత్తా ఉన్న అభ్యర్థులకే వారు ఓటేశారు. అతను ఏ పార్టీ అభ్యర్థి అని వారు చూడలేదు. ఈసారి అలా జరగలేదు. మద్దతు అందించడానికి వారికి ఓ కూటమి కన్పించింది. కూటమి లేని చోట...అంటే పశ్చిమ బెంగాల్, కేరళ, పంజాబ్ రాష్ట్రాల్లో మాత్రం వారు తమ ఇష్టానుసారం ఓటేశారు. ముస్లిం ఓట్లు తమకు అవసరం లేదని బీజేపీ నేతలు ప్రకటిస్తుంటే ఆ వర్గం ఓట్లు తమకు పడతాయని పార్టీ నాయకత్వం ఎలా ఆశిస్తుంది? సాక్షాత్తూ ప్రధాని మోడీయే ముస్లింలను లక్ష్యంగా చేసుకొని విద్వేష ప్రసంగాలు చేశారు.





రాజ్యాంగంలో లేని

డిప్యూటీ సీఎంలు





(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ఈ ఐదు రాష్ట్రాల్లో ఒక్కొక్కరు డిప్యూటీ సీఎంగా కొనసాగుతున్నారు. మిగిలిన 9 రాష్ట్రాలైన.. బీహార్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, నాగాలాండ్, ఒడిశా, రాజస్థాన్ , ఉత్తరప్రదేశ్‌కు ఒక్కొక్కరు లేదా ఇద్దరు డిప్యూటీ సీఎంలు ఉన్నారు. బీజేపీ నుంచి 15 మంది, కాంగ్రెస్ నుంచి 3, ఇతర పార్టీల నుంచి ఐదుగురు డిప్యూటీ సీఎంలు ఉన్నారు.

అసలు డిప్యూటీ సీఎం పదవి ఉందా?

రాజ్యాంగంలోని 163, 164 అధికరణలు ముఖ్యమంత్రి, మంత్రివర్గానికి సంబంధించిన నిబంధనలను కలిగి ఉన్నాయి. ఆర్టికల్ 163(1) ప్రకారం గవర్నర్‌కు సలహా ఇచ్చేందుకు ముఖ్యమంత్రి నేతత్వంలో మంత్రివర్గం ఉంటుంది.

ముఖ్యమంత్రిని గవర్నర్ నియమిస్తారని, మంత్రివర్గాన్ని కూడా ముఖ్యమంత్రి సలహా మేరకే గవర్నర్ నియమిస్తారనే నిబంధన ఉంది. అయితే ఈ రెండు పేరాల్లో డిప్యూటీ సీఎం పదవి ప్రస్తావన లేదు. డిప్యూటీ సీఎం పదవిని రాష్ట్రంలో క్యాబినెట్ మంత్రితో సమానంగా పరిగణిస్తారు. క్యాబినెట్ మంత్రికి లభించే జీతం, సౌకర్యాలే డిప్యూటీ సీఎంకూ లభిస్తాయి.

డిప్యూటీ సీఎం పదవి రాజ్యాంగ విరుద్ధమా?

నిజానికి డిప్యూటీ సీఎంల నియామకాలు రాజ్యాంగ విరుద్ధమని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్‌ను ప్రజా రాజకీయ పార్టీ అనే సంస్థ దాఖలు చేసింది. డిప్యూటీ సీఎం నియామకంపై సుప్రీంకోర్టు స్టే విధించాలని డిమాండ్ చేసింది.

రాజ్యాంగంలో డిప్యూటీ సీఎం లాంటి పదవి లేదని పిటిషన్‌లో పేర్కొంది. ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)ని ఉల్లంఘిస్తుంది. ఈ పిటిషన్‌ను తోసిపుచ్చిన చీఫ్ జస్టిస్ చంద్రచూడ్.. డిప్యూటీ సీఎం అనేది ఒక పదవి అని, అది రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘించదని అన్నారు. డిప్యూటీ సీఎం కావడం వల్ల ఎలాంటి ప్రత్యేక సౌకర్యాలు లేదా అధిక జీతం లభించదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి మొదటి, అత్యంత ముఖ్యమైన మంత్రి పదవి అని కూడా సుప్రీంకోర్టు పేర్కొంది.

చాలా మంది నేతలు డిప్యూటీ పీఎం కూడా..

డిప్యూటీ సీఎం లాగే, భారతదేశంలోని చాలా మంది నాయకులు డిప్యూటీ పీఎంలుగా కూడా ఉన్నారు. స్వాతంత్ర్యానంతరం ఏర్పడిన తొలి తాత్కాలిక ప్రభుత్వంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ డిప్యూటీ పీఎంగా ఉన్నారు. ఆ ప్రభుత్వంలో జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి. ఆయన తర్వాత మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, దేవి లాల్ , లాల్ కృష్ణ అద్వానీ కూడా డిప్యూటీ పీఎంలు అయ్యారు. 1989లో వీపీ సింగ్ ప్రభుత్వంలో దేవీలాల్ డిప్యూటీ పీఎంగా బాధ్యతలు చేపట్టినప్పుడు, రాజ్యాంగం ప్రకారం ఆయన ప్రమాణ స్వీకారం చేయలేదనే కారణంతో సుప్రీంకోర్టులో సవాలు చేశారు. అయితే, దేవిలాల్ నియామకాన్ని సుప్రీంకోర్టు సమర్థించింది. అయితే..ఆయన ఇతర క్యాబినెట్ సభ్యుల మాదిరిగానే మంత్రి అని కూడా తీర్పు చెప్పింది.

డిప్యూటీ సీఎం పదవి ఎలా వచ్చింది?

చాలా సంకీర్ణ ప్రభుత్వాల్లో డిప్యూటీ సీఎం పదవి ఉండేది. అనుగ్రహ నారాయణ్ సిన్హా భారతదేశపు మొదటి డిప్యూటీ సీఎంగా పరిగణించబడతారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 1957 జులై వరకు అనుగ్రహ నారాయణ్ సిన్హా బీహార్ డిప్యూటీ సీఎంగా ఉన్నారు. అతని తర్వాత, కర్పూరి ఠాకూర్ 1967లో బీహార్‌కి రెండో డిప్యూటీ సీఎంగా ఉన్నారు. 1967 తర్వాత కాంగ్రెస్ బలహీనమవడంతో చాలా రాష్ట్రాల్లో డిప్యూటీ సీఎంలు పదవిని చేపట్టారు. 1967లో చౌదరి చరణ్ సింగ్ నేతత్వంలో ఉత్తరప్రదేశ్‌లో యునైటెడ్ లెజిస్లేటివ్ పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పుడు, జనసంఘ్‌కు చెందిన రామ్ ప్రకాష్ గుప్తా డిప్యూటీ సీఎం అయ్యారు. జనసంఘ్ నాయకుడు వీరేంద్ర కుమార్ సక్లేచా మధ్యప్రదేశ్‌లో మొదటి డిప్యూటీ సీఎం. 1967లో గోవింద్ నారాయణ్ సింగ్ ప్రభుత్వంలో ఆయన డిప్యూటీ సీఎం అయ్యారు. కాగా, హర్యానా తొలి డిప్యూటీ సీఎం చౌదరి చంద్ రామ్.

సంపాదకీయం

బడిగోస వినండి సారూ!



'నువ్వు గౌరవించే స్థాయి నుంచి.. నిన్ను గౌరవించే స్థాయికి చేర్చేదే చదువు...' బడులు ప్రారంభమైన ప్రస్తుత తరుణంలో విద్యార్థులకు స్ఫూర్తినిస్తూ వాట్సాప్ గ్రూపుల్లో చక్కర్లు కొడుతున్న మెసేజ్‌ల్లో ఇదొకటి. నిజమే మరి... ఒక వ్యక్తిని ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలతోపాటు ఇతరత్రా అనేకాంశాల్లో సమున్నతంగా నిలబెట్టగలిగే శక్తి సామర్థ్యాలున్న ఏకైక సాధనం చదువు. అందుకే విద్యావేత్తలు, ఆ రంగానికి చెందిన నిపుణులు... 'విద్యపై పెట్టే వ్యయాన్ని ఖర్చుగా కాకుండా, భావితరాలకు పెట్టుబడిగా భావించాలి...' అని చెబుతూ ఉంటారు. పాలకులు కూడా 'ఇవే పదాలను' నొక్కి వక్కాణిస్తుంటారు.

> 'దేశ భవిష్యత్తు అనేది తరగతి గదిలోనే నిర్దేశించబడుతుంది...' అన్నారు మన పెద్దలు. అంతటి కీలకమైన తరగతి గది, ముఖ్యంగా సర్కారు బడుల్లోని తరగతి గదులు.. పిల్లలతో కళకళలాడాలన్నా, వారికి అక్కడ నాణ్యమైన విద్య అందాలన్నా... ప్రభుత్వ చిత్త శుద్ధి ఎంతో అవసరం. ఆ రంగానికి అధిక నిధులను కేటాయించడమే ఆ చిత్తశుద్ధి.


గత ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు ప్రస్తుత సీఎం రేవంత్ కూడా ఆ విషయా న్ని పునరుద్ఘాటించారు. అయితే పెద్దలు చెప్పిన అతి కీలకమైన ఆ అంశాన్ని అమలు చేసి చూప టంలోనూ, అందుకనుగుణంగా కార్యాచరణ రూపొందిం చటంలోనూ తేడా కొట్టొచ్చినట్టు కనబడుతోంది. ఇందుకు సంబంధించి ప్రభుత్వాలు, పాలకులు ప్రచారంపై చూపెడుతున్న శ్రద్ధ ఆచరణలో కానరాకపోవటం శోచనీయం.

విద్యపై పెట్టే ఖర్చును పెట్టుబడిగా భావిస్తున్నామని చెప్పినప్పుడు ఆ మేరకు ఆ రంగానికి వెచ్చించే నిధులను పెంచాలి. ఇప్పుడు దేశంలో ఢిల్లీ, కేరళ రాష్ట్రాల్లోని బడుల గురించి ప్రత్యేకంగా చెప్పుకుంటున్నాం. కారణమేమంటే ఢిల్లీ ప్రభుత్వం తన మొత్తం బడ్జెట్‌లో 24.5 శాతాన్ని, కేరళ సర్కారు 23 శాతం నిధులను విద్యా రంగానికే కేటాయిస్తున్నాయి. కానీ మన దగ్గర ఆ శాతం 7.6కే పరిమితమైంది. అది కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం లోకి వచ్చాకే. అంతకుముందు బీఆర్ఎస్ హయాంలో ఇది కేవలం 6.5 శాతంగానే ఉండటం గమనార్హం. గత కేసీఆర్ సర్కారు... ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ గురుకులాల ఏర్పాటుకు కొంత కృషి చేసిన మాట వాస్తవమే. ఆ మేరకు కొన్ని మంచి ఫలితాలు కూడా వచ్చాయి. కానీ సొంత భవనాలు లేకుండా ఒకేసారి పెద్ద మొత్తంలో వందలాది రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేయటంతో... ఆ కృషి 'రాజకీయ ప్రయోజనాల కోసమే' అనే విమర్శలకు తావిచ్చింది. మూసేసిన ఇంజినీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో గురుకులాలను ఏర్పాటు చేయటం, వాటికి నెలకు రూ. లక్షల్లో అద్దెలు చెల్లించాల్సి రావటంతో ప్రభుత్వ ఖజానాపై భారం పడింది. అలా కిరాయికి తీసుకున్న చాలీచాలని ఒక్కో బిల్డింగులో వందలాది మంది పిల్లల్ని కుక్కటంతో వారు పడ్డ, పడుతున్న తిప్పలు అన్నీ ఇన్నీ కావు. ఇప్పుడు రేవంత్ సర్కార్ చొరవ తీసుకుని గురుకులాలకు సొంత భవనాలు నిర్మిస్తామనటం హర్షణీయం.

ఇది గురుకులాల గోస అయితే ఇక రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల బాధ మరింత వర్ణనాతీతం. పిల్లలకు గత కొన్నేండ్ల నుంచి స్కూళ్లలో మధ్యాహ్న భోజనం పెట్టడం ముదావహం. కానీ సంబంధిత బడ్జెట్‌ను పెంచకపో వటంతో వారికి పౌష్టికాహారం అందటం లేదు. బడులు ప్రారంభమైన బుధవారమే పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు అందించిన ప్రభుత్వ యంత్రాంగాన్ని అభినందించాల్సిందే. కాకపోతే యూనిఫారాలు ఇంకా 'కుట్టు' దశలోనే ఉండటం గమనార్హం. మరోవైపు డీఈవోలు, డిప్యూటీ డీఈవోలు, ఎంఈవోల పోస్టులు ఏండ్ల తరబడి ఖాళీగా ఉండటంతో పాఠశాలలపై పర్యవేక్షణ కొరవడింది. విద్యా బోధన, పిల్లల చదువుపై ఆ ప్రభావం కొట్టొచ్చినట్టు కనబడటం విస్మయకరం. రాష్ట్రంలో 33 జిల్లాలుంటే అందులో 26 జిల్లాల్లో పూర్తి స్థాయి డీఈవోలు లేరంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఆ 26 చోట్లా ఎఫ్ఏసీలతో బండి లాగించేస్తున్నారు. ఇక డిప్యూటీ డీఈవోల సంగతి సరేసరి. 33 జిల్లాలకు 33 జిల్లాల్లోనూ డిప్యూటీ డీఈవోలు లేకపోవటం ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట. రాష్ట్రంలో 615 మండలాలుంటే కేవలం 17 మండలాలకే రెగ్యులర్ ఎంఈవోలుండటం విద్యారంగం పట్ల పాలకుల చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. ఈ సమస్యలు చాలవన్నట్టు అనేక బడుల్లో పిల్లలు, ఉపాధ్యాయుల నిష్పత్తి కూడా అసం బద్ధంగా ఉంది. విద్యార్థులు ఎక్కువగా ఉన్న చోట టీచర్ల సంఖ్య తక్కువగానూ, టీచర్లు ఎక్కువగా ఉన్న చోట విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉండటమ నేది ఏండ్ల తరబడిగా కొనసాగుతున్న తంతు. వెరసి... సర్కారు బడుల మీద ఆధారపడే పేద పిల్లల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారుతోంది.

'దేశ భవిష్యత్తు అనేది తరగతి గదిలోనే నిర్దేశించబడుతుంది...' అన్నారు మన పెద్ద లు. అంతటి కీలకమైన తరగతి గది, ముఖ్యం గా సర్కారు బడుల్లోని తరగతి గదులు.. పిల్లలతో కళకళలాడాలన్నా, వారికి అక్కడ నాణ్యమైన విద్య అందాలన్నా... ప్రభుత్వ చిత్త శుద్ధి ఎంతో అవసరం. ఆ రంగానికి అధిక నిధులను కేటాయించడమే ఆ చిత్తశుద్ధి. దాన్ని ప్రదర్శించటంతోపాటు నూతన భవనాలు, మౌలిక వసతుల కల్పన తదితర సమస్యలను పరిష్కరించినప్పుడే ప్రయివేటు, కార్పొరేట్ మోజు నుంచి తల్లిదండ్రులను బయటపడే యగలం. ఇది జరిగితేనే ప్రభు త్వ పాఠశాలల పట్ల వారిలో విశ్వాసాన్ని ప్రోది చేయగలం.

పౌరహక్కుల రక్షణే ప్రధానం


ఎస్.వినయ కుమార్

> భారతదేశంలో నియంతృత్వం రాజ్యమేలుతున్న విషయాన్ని అంతర్జాతీయ సంస్థలు సరిగ్గానే గుర్తించాయి. ఆ సంస్థల విమర్శలకు జవాబు చెప్పలేని మోదీ 'మా దేశంలో నియంతృత్వం లేదని, ఆదిమకాలం నుండే భారతీయుల నరనరాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతోందని' ఐరాస వేదికపై సెంటిమెంటల్ డైలాగులు చెప్పారు. అదే మోదీ న్యూఢిల్లీలో గతేడాది జరిగిన జి20 దేశాల సమావేశం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను సైతం మీడియాతో మాట్లాడనివ్వలేదు. ఆయనకు వియత్నాం వెళ్లాక గానీ స్వేచ్ఛ లభించలేదు. అమెరికా అధ్యక్షుడి బలహీనత కూడా అందులో ఉన్నా మన ప్రజాస్వామ్యం ఏ పాటిదో ప్రపంచానికి చాటి చెప్పింది.

ప్రస్తుత 18వ లోక్‌సభలో పార్టీల బలాబలాలు మారాయి. గత సభలో తన పార్టీకి ఉన్న మందబలం వల్ల మోడీ ఏమి చేసినా చెల్లింది. ఎన్డీయే అన్న ఫ్రంటు ఒకటి గత సభలో ఉన్నా అది పేరుకు మాత్రమే. ఎన్డీయేలోని మిగతా పార్టీలు బీజేపీకి తందాన దాసులే. కనుక తన రాజకీయ ఎజెండాకు అనుగుణంగా బీజేపీ గత పదేళ్లలో మానవ హక్కులపై తీవ్రమైన దాడి చేసింది. మానవ హక్కుల కోసం, ప్రజాస్వామిక విధానాల కోసం నిలిచిన వారిపై దాడుల పరంపరను కొనసాగించింది. రాజద్రోహం చట్టాన్ని విచ్చలవిడిగా ఉపయోగించింది. ఆర్థిక నేరాలను దర్యాప్తు చేయాల్సిన సంస్థలను మోడీ ప్రభుత్వం వేటకుక్కల్ని చేసి తమ రాజకీయ ప్రత్యర్థులపైకి ఉసిగొల్పింది. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముస్లింల, క్రైస్తవుల ఆస్తులను పరివార్ మూకలే కాదు, ప్రభుత్వ విభాగాలు కూడా ధ్వంసం చేశాయి, తగలబెట్టాయి. ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ వంటి సంస్థలు అంకెలతో సహా భారతదేశంలోని మానవ హక్కుల దుస్థితిని వెల్లడించాయి.

కాగా లోక్‌సభలో ఇప్పుడు బలాబలాలు మారిన దృష్ట్యా "56 అంగుళాల" రొమ్ము విరుచుకొని తిరిగే మోడీ గతంలో వాజ్‌పేయి తరహాలోనే ముసుగు ధరించారు. బీజేపీ గత పదేండ్లలో మోడీ అమలు చేసిన ప్రజా వ్యతిరేక చట్టాలు కాంగ్రెస్ కాలంలో ఆమోదించినవే. వాటికి మోడీ మరింత పదును పెట్టి వాడారు. కాంగ్రెస్ అనుసరించిన ఆ విధానాల పట్ల వ్యక్తమైన వ్యతిరేకత మూలంగానే బీజేపీ దాని మిత్రపక్షాలు అధికారానికి ఎగబాకాయి. ఈ దశలో కాంగ్రెస్ ఆ విధానాలను అడుగడుగునా వ్యతిరేకించి మోడీ ప్రభుత్వాన్ని నిలేస్తుందా? ఉపేక్షిస్తుందా అన్నది ముఖ్యమైన ప్రశ్న. దేశవ్యాప్త పాదయాత్ర తర్వాత రాహుల్ గాంధీ దృక్కోణంలో ప్రజానుకూల మార్పు వచ్చిందని ఆశించిన వారికి ఆయన ఆశాభంగం కల్పిస్తారా? పర్వాలేదనిపిస్తారా? అన్నది కూడా త్వరలోనే వెల్లడవుతుంది.

ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా నియంతృత్వానికి వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్మించడంలో ప్రతిపక్ష పార్టీలు, మేధావులు ప్రజాసంఘాలతో పాటు మీడియా కూడా ప్రధాన పాత్ర వహించాలి. కాని మోడీ హయాంలో అది గోది మీడియా (మోడీ బడిలో చేరిన మీడియా)గా మారింది. ఆ బంధనాల నుండి మీడియా సంస్థలు ఇప్పుడైనా బయటపడి స్వేచ్ఛగా వ్యవహరిస్తాయా? అన్నది కూడా ఇంకా ప్రశ్నార్థకమే.

మోడీ మూడోసారి ప్రధాని కావడాన్ని హిందూ పత్రిక 'మూడో అవతారం' అంటూ తన సంపాదకీయంలో సరిగ్గానే వ్యాఖ్యానించింది. మోడీ దుస్తులు మార్చినట్లుగా మాటలు మార్చుతారు. ఇప్పటికే అవతారం మార్చారు. భారత రాజ్యాంగం పనికి రాదని, అది అతుకుల బొంత అని మొన్నటి దాకా అన్నారు. ఎన్నికల ఫలితాల్లో తల బొప్పికట్టేసరికి రాజ్యాంగాన్ని కండ్లకద్దుకున్నాడు. ఆయన అవకాశవాద మిత్రుల్లో ఒకరైన చంద్రబాబు గతంలో ఒకసారి తానే కేంద్ర ప్రభుత్వంలో చక్రం తిప్పాననే భ్రమల్లో ఉండిన ఈసారి కూడా కూడా తాను చక్రం తిప్పబోతున్నట్లు జనాన్ని నమ్మించేపనిలో ఉన్నారు. నితీష్ కుమార్, పాశ్వాన్‌లు అగ్నివీర్ పథకాన్ని సమీక్షించాలని ఓ మాటైనా అన్నారు. కాని మోడీ వాచ్‌మెన్ (దేశానికి కాపరి) కాదు వట్టి అబద్ధాలకోరు అని ఆక్రోషించిన వ్యక్తే ఇప్పుడు నమో మోడీ అంటున్నారు.

మోడీ సర్కార్ ఈసారి 'నీట్' స్కామ్‌తో పాలన మొదలెట్టింది. పోయినసారి పీఎం కేర్స్, ఎన్నికల బాండ్లు , గుత్త పెట్టుబడిదార్లకు కోటాను కోట్ల రూపాయల అప్పులు రద్దు వంటి అవినీతి స్కామ్‌లతో పాటు మానవ హక్కుల పట్ల కూడా మోడీ దుర్మార్గంగా వ్యవహరించారు. ఆ దుర్మార్గాల్లో ఒకటి బీమా కోరేగావ్ కేసు. అర్థం పర్థం లేని ఆరోపణలతో ఆ కేసు బనాయించారు. కేసులో అరెస్టయిన స్టాన్ స్వామి లాంటి వృద్ధ సంఘసేవకుడు జైల్లో అమానుష పరిస్థితుల్లో చనిపోయినా మోడీ ప్రభుత్వానికి దున్నపోతుపై ఈగ వాలినట్లు కూడా కాలేదు. ఆ కేసులోని మరో ముద్దాయి విరసం నేత వరవరరావు కండిషనల్ బెయిల్ మీదే ఇంకా ముంబాయి లోనే ఉన్నారు. ఆ కేసులోని నిందితులంతా కలిసి మోడీ హత్యకు కుట్ర పన్నారన్నది అభియోగం. ఆ కేసు విచారణ ఎప్పటికి ముగుస్తుందో చెప్పలేని స్థితి. అప్పటిదాకా నిందితులు జైల్లోనో, బెయిల్ పైనో గడపాల్సిందే. వెనుకటికి టాడా చట్టాన్ని వ్యతిరేకించిన బీజేపీ తన హయాంలో ఉపా చట్టం కింద బెయిల్‌కు కూడా అవకాశం లేకుండా సవరణ చేసింది. అనేక మంది పాత్రికేయులను అది రాచిరంపాన పెట్టిం ది. వారి ఇండ్లపై దాడి చేయడమే కాదు అరెస్టు కూడా చేసింది.

భయం సృష్టించి న్యూస్‌క్లిక్ యూట్యూబ్ ఛానెల్ వ్యవస్థాపకుడు ప్రబీర్ పుర్కాయస్తను ఉపా చట్టం కింద జైల్లో పెట్టింది. ఎమర్జెన్సీ కాలంలో విద్యార్థిగా ఉన్న ఆయన్ను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అరెస్టు చేసి అనేక జైళ్లకు తిప్పింది. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం ఆయన్ని అరెస్టు చేసి తిహార్ జైల్లో పెట్టింది. 2022 నుండి 2024 వరకు రెండేండ్ల కాలంలో ఉపా కింద దేశంలో 10,552 మందిని అరెస్టు చేసింది. అదే సమయంలో అహ్మదాబాదు హింసాకాండలో జీవిత ఖైదు పడిన వారికి మాత్రం శిక్ష ముగియక ముందే రెమిషన్ ఇచ్చి వదిలేసింది. ఢిల్లీ సరిహద్దుల్లో రైతులు చేసిన ఆందోళనకు ఆర్థిక సహాయం చేశారన్నది పుర్కాయస్తపై మరో ఆరోపణ. రైతులకు సాయం చేసినా అది తీవ్ర నేరమని బీజేపీ ప్రభుత్వం చెప్పదల్చింది. ఉగ్రవాదులను రైతులను ఒకే గాటన గట్టింది.



> విధాన పరమైన అంశాలపై పరిశోధన చేసే సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ లైసెన్సును ఆరు నెలలపాటు సస్పెండ్ చేసింది. ప్రముఖ మానవ హక్కుల నాయకుడు, మాజీ ఐఏఎస్ అధికారి హర్షమందర్ అధ్వర్యంలో నడిచే సంస్థ అది. ఆయన నడిపే అమన్ బిరాదరి(ఇరుగు పొరుగులో శాంతి) అనే సంస్థపై కూడా విచారణకు ఆదేశించింది. సెంటర్ ఫార్ పాలసి రిసెర్చి, ఆక్స్‌ఫాం ఇండియా, కేర్ ఇండియా సంస్థలకు ఇచ్చిన పన్ను మినహాయింపును రద్దు చేసింది. దేశంలోని బలమైన మీడియా మోడీకి బంటుగా మారింది. కనుక పౌర హక్కుల సంరక్షణలో అది తన బాధ్యత నిర్వహిస్తుందని ఇప్పట్లో ఆశించలేము. అభ్యుదయ మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాలు నేడు ముందుకొచ్చి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి. కాంగ్రెస్‌తో సహా 'ఇండియా' బ్లాకులోని అన్ని పక్షాలు పౌరహక్కుల కోసం నేడు ఉద్యమాలను నిర్మించడానికి ముందుకు రావాలి.

ఎన్నికలకు ముందు మోదీ ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ బ్యాంకు అకౌంట్‌ను, కేరళలో సీపీఐ(ఎం) ఒక జిల్లా కమిటీ అకౌంట్‌ను స్తంభింపచేయడంతో పాటు తనకు వ్యతిరేకులైన రాజకీయ నేతలపై ఆర్థిక నేరాలు మోపి ముప్పుతిప్పలు పెట్టింది. ఇద్దరు ముఖ్యమంత్రులను సైతం జైల్లో పెట్టింది. ఆర్థిక కుంభకోణాల్లో ఇరుక్కొన్న వ్యాపారులు, ప్రజా ప్రతినిధులు తమ పార్టీలను వదిలి బీజేపీలో చేరాయి. మోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా వారికేసులను పక్కకు పెట్టింది. ఆ ధోరణి మూడో అవతారంలోనూ కొనసాగవచ్చు. రోహిత్ వేముల కేసులో, జెఎన్‌యు విద్యార్థులపై దాడుల సందర్భంగా స్పందించిన స్థాయిలో పౌరహక్కుల ఉల్లంఘనలపై కాంగ్రెస్, రాహుల్‌గాంధీ గతంలో స్పందించలేదు. లోక్‌సభలో పార్టీల బలాబలాలు మారిన స్థితిలోనైనా మానవ హక్కుల ఉల్లంఘన కేసుల్లో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న కాంగ్రెస్ పార్లమెంట్‌లో, వెలుపలా తన కర్తవ్యాన్ని నెరవేర్చడానికి ఎంత బలంగా ముందుకొస్తుందో? చూడాల్సిందే.

భారతదేశంలో నియంతృత్వం రాజ్యమేలుతున్న విషయాన్ని అంతర్జా తీయ సంస్థలు సరిగ్గానే గుర్తించాయి. ఆ సంస్థల విమర్శలకు జవాబు చెప్పలేని మోదీ 'మా దేశంలో నియంతృత్వం లేదని, ఆదిమకాలం నుండే భారతీయుల నరనరాల్లో ప్రజాస్వామ్యం పరిఢవిల్లు తోందని' ఐరాస వేదికపై సెంటిమెంటల్ డైలాగులు చెప్పారు. అదే మోదీ న్యూఢిల్లీలో గతేడాది జరిగిన జి20 దేశాల సమావేశం సందర్భంగా అమెరికా అధ్యక్షుడు బైడెన్‌ను సైతం మీడియాతో మాట్లాడనివ్వలేదు. ఆయనకు వియత్నాం వెళ్లాక గానీ స్వేచ్ఛ లభించలేదు. అమెరికా అధ్యక్షుడి బలహీనత కూడా అందులో ఉన్నా మన ప్రజాస్వామ్యం ఏ పాటిదో ప్రపంచానికి చాటి చెప్పింది. వియత్నాంలో ప్రజాస్వామ్యం పట్ల భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానంపై బైడెన్ అసంతృప్తి వ్యక్తం చేశారు.

నిరుడు ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తన రిపోర్టులో ఇండియాలో మానవ హక్కుల పై వివిధ రూపాల్లో దాడులు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. 'ఆర్థిక నేరాలపై దర్యాప్తు జరపాల్సిన సంస్థలు అధికార బీజేపీ చేతిలో ఆయుధాలయ్యాయి' అని అది పేర్కొంది. మానవ హక్కుల సంఘాల కార్యకర్తలపై, జర్నలిస్టులపై, విమర్శ కులపై, అలాగే ముస్లింలపై దాడులు పెద్దస్థాయిలో జరుగుతున్నాయని వెల్లడిం చింది. ముస్లింల ఆస్తులపై, ఇండ్లపై, ప్రార్థనా స్థలాలపై దాడులు చేసిన వారికి శిక్షలు కూడా పడటంలేదని ఎత్తిచూపింది.

కాశ్మీర్, మణిపూర్‌లోనే కాదు పంజాబ్‌లోనూ దేశంలో ఇతర ప్రాంతాల్లోనూ మోడీ ప్రభుత్వం ఇంటర్నెట్ సేవలను నిలిపేసింది. అక్కడ కొన్ని చోట్ల చాలా కాలం పాటు నిలిపేస్తే కొన్ని చోట్ల స్వల్పకాలం నిలిపేసింది. సాగుతున్న హింసాకాండ వివరాలు బయటి ప్రపంచానికి వెల్లడి కాకుండా చూశారని ఆమ్నెస్టీ ఎత్తి చూపింది. మణిపూర్‌లో క్రైస్తవ ఆదివాసీలపై అమానుష దాడులు జరుగుతుండగా ప్రభుత్వం వాటిని నిలువరించేందుకు ప్రయత్నించలేదు. ట్విట్టర్ (నేటి ఎక్స్)పై కూడా నిషేదాలు విధించే ప్రయత్నం చేసింది. సోషల్ మీడియాలో తమను ప్రశ్నించిన వారిని సంఘ్ పరివార్ సహించలేదు. తాము అట్టడుగు వారి కోసం ఎన్నో పథకాలు చేపట్టామని మోడీ ప్రభుత్వం మాన్యువల్ స్కావెంజింగ్‌ను నిషేధించినప్పటికీ 2018 నుండి సివరేజి కాలువలను శుభ్రం చేస్తూ 300 మంది భారత దేశంలో చనిపోయారు. 2021లో దేశంలో రోజుకు సగటున మహిళల పై 86 అత్యాచార కేసులు నమోదయ్యాయి. వీటితో భార్య సమ్మతి లేకుండా బలత్కారం చేసిన కేసులు కూడా ఉన్నా ఎక్కువగా బలహీన వర్గాలపై బలవంతులు చేసిన అత్యాచారాలే ఎక్కువ.

జి20 సమావేశాల నేపథ్యంలో యుఎస్ మానవ హక్కుల కౌన్సిల్‌తో భారత్ ఒక ఒప్పందానికి వచ్చింది. దేశంలో కుల వివక్షను తొలగిస్తామని, భావ ప్రకటనా స్వేచ్ఛకు గ్యారెంటీ ఇస్తామని, మతపర మైనారిటీల హక్కుల్ని రక్షిస్తామని భారత ప్రభుత్వం ఒప్పుకొంది. విదేశీ విరాళాల చట్టం (ఎఫ్‌సిఆర్ఏ) అన్ లా ఫుల్ యాక్టివిటీస్ (ప్రివెన్షన్) యాక్టు, (ఉపా), దేశద్రోహ చట్టం, నేరపూరిత పరువు నష్టం చట్టం వంటి వాటిలో ప్రజాస్వామిక సవరణలు చేస్తామని అంగీకరించింది. కాని వాటిలో ఒక్కటీ అమలు చేయలేదు. దళితులు, ఆదివాసీలపై వేధింపులు, అత్యాచారాలు కొనసాగాయి. ముస్లింలను నేరస్తులుగా చూపడానికి మాత్రమే పౌరసత్వ చట్టంలో మార్పు చేసింది.

రాజద్రోహం కేసులన్నీ రాజకీయ దృష్టితో పెట్టినవే. అందులో సందేహం లేదు. కాగా ఆ చట్టం కింద విధించే శిక్షను ఏడేండ్ల నుండి పదేండ్లకు పెంచింది. కోర్టు తీర్పులనూ పట్టించుకోలేదు. విధాన పరమైన అంశాలపై పరిశోధన చేసే సెంటర్ ఫర్ ఈక్విటీ స్టడీస్ లైసెన్సును ఆరు నెలలపాటు సస్పెండ్ చేసింది. ప్రముఖ మానవ హక్కుల నాయకుడు, మాజీ ఐఏఎస్ అధికారి హర్షమందర్ అధ్వర్యంలో నడిచే సంస్థ అది. ఆయన నడిపే అమన్ బిరాదరి(ఇరుగు పొరుగులో శాంతి) అనే సంస్థపై కూడా విచారణకు ఆదేశించింది. సెంటర్ ఫార్ పాలసి రిసెర్చి, ఆక్స్‌ఫాం ఇండియా, కేర్ ఇండియా సంస్థలకు ఇచ్చిన పన్ను మినహాయింపును రద్దు చేసింది. దేశంలోని బలమైన మీడియా మోడీకి బంటుగా మారింది. కనుక పౌర హక్కుల సంరక్షణలో అది తన బాధ్యత నిర్వహిస్తుందని ఇప్పట్లో ఆశించలేము. అభ్యుదయ మేధావులు, సామాజిక కార్యకర్తలు, ప్రజా సంఘాలు నేడు ముందుకొచ్చి తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహించాలి. కాంగ్రెస్‌తో సహా 'ఇండియా' బ్లాకులోని అన్ని పక్షాలు పౌరహక్కుల కోసం నేడు ఉద్యమాలను నిర్మించడానికి ముందుకు రావాలి.

లోక్‌సభలో బలాబలాలు మారిన స్థితిలో ఆర్ఎస్ఎస్ కూడా సుద్దులు మొదలెట్టింది. అహం వదులుకొమ్మని మోడీకి సుద్ది చెప్పింది. మణిపూర్ సంగతి కాస్త చూడమంది. ఇంత కాలం తాను ఎందుకు నోరు నొక్కుకొని కూర్చుందో ఆర్ఎస్ఎస్ చెప్పగలదా?

సెల్ : 9989718311

ఎన్డీయే అణుకువగా మెలగాలి


జి.తిరుపతయ్య
9951300016

'నా' నుంచి 'మ' వరకు రానేలేదు..'మన' అనుకున్నప్పుడు కదా ముందడుగు" అని కాళోజీ అప్పటి రాజకీయాలను ఉద్దేశించి ఏనాడో మొట్టికాయ వేశారు. దేశంలో గత ప్రభుత్వాన్ని నడిపింది కూడా నేషనల్ డెమొక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ) సమూహమే. కానీ భవిష్యత్తుకు ఎన్డీఏ గ్యారెంటీ అని కాకుండా ఒక వ్యక్తి, 'మోడీకా గ్యారెంటీ' అనే మితిమీరిన ఆత్మవిశ్వాసపు ప్రొజెక్షన్‌కు ఈ ఎన్నికల్లో తగిన శాస్తి జరిగింది. అందుకే కాబోలు ఇప్పుడు మా, మా... అనే శబ్దాలు ఇరవైయేండ్ల అనుబంధాలను గుర్తు చేసుకుని మరీ వినిపిస్తున్నాయి. ఇక "మన..." అంటూ ప్రయాణం చేయకపోతే ప్రజలే మట్టి కప్పేస్తారని దశాబ్దకాలం తర్వాత గానీ అర్థం కాలేదు వారికి. బీజేపీకి సంపూర్ణ మెజారిటీ రావడం లేదని ఎన్నికల ఫలితాలు బయటపడుతున్న సమయం వరకు గతంలో దేశాన్ని నడిపింది ఎన్డీఏ అనబడే కూటమి అనే అంశం దాదాపు ఎవ్వరి మదిలోనూ లేదంటే ఆశ్చర్యం కాదు. అందుచేత 'నువ్వెవరో నీకే గుర్తుచేసిన తీర్పు'ను ఈ సాధారణ ఎన్నికలు ఇచ్చాయి. సరైన రీతిలో గుణపాఠాన్ని చెప్పాయి.

ముగిసిన ఈ సాధారణ ఎన్నికలు ఒక భూకంపాన్ని తలపించే ప్రభావాన్ని చూపాయి. ఇప్పుడైనా సరైన నిర్ధారణలు చేసుకోవాలి. అహంకారాగ్నిపై విరుచుకుపడిన తుఫానులాంటిదీ ప్రజల తీర్పు. కడలి గర్భంలోంచి సైతం ఎగిసిపడే శక్తి ఉన్న మత విద్వేషాగ్నిని ఎగదోయకుంటే ఎగిసిన నిప్పురవ్వలన్నీ నీలిగే రాళ్లలో నిక్షిప్తమై పోయిన మాదిరి మహామహులంతా మట్టి కరిచి ఉండేవాళ్లు. 'చావుతప్పి కన్ను లొట్టబోయింది' అని కొందరు సర్దుకుంటూ ఉండవచ్చు. కానీ ఇది చావుదెబ్బ అని గుర్తుపెట్టు కోవాలి. మతపరమైన ఏకీకరణ ద్వారా అధికారానికి నిచ్చెన వేసే ఆలోచనలకు మరణశాసనం ఈ తీర్పు. సెంగోల్ పట్టుకుని రాజదర్పంతో పార్లమెంటు భవనాన్ని ప్రారంభించిన వారినే రాజ్యాంగం ముందు మోకరిల్లేలా చేశాయి ఈ ఎన్నికల ఫలితాలు. తనకు తాను దైవాంశ సంభూతుడనని ప్రకటించు కుంటుంటే చూస్తూ ఊరుకుంటుందా సమాజం?

కొందరిని మినహాయిస్తే, సాధారణంగా ఏ ఓటరు తన ఓటుని ఈసారి ఫలానా కారణాల చేత ఫలానా వారికే వేయాలి అని ఒక నిర్ధారణకి రాడు. పరిపాలింపబడుతున్న కాలంలో గుర్తైన భావన పోలింగ్ బూతులో ప్రత్యక్షమై అప్రయత్నంగానే కొందరికి బుద్ధి చెప్పే ఒక బటన్ నొక్కుతాడు. ఒకరి ప్రస్థానం ఎదుటివారికి ఎలాంటి అనుభూతిని ఇచ్చిందన్నదే చివరాఖరికి ప్రధానం అన్న నానుడి ఈ సందర్భంగా గమనార్హం. పరిపాలన కన్నా పరిపాలిస్తున్న తీరు చాలా ప్రభావాన్ని చూపిస్తుంది. కూటమి ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తూ ఏనాడో ఆ ధ్యాస వదిలేసి కనీసం సహచర మంత్రులను కూడా



గుర్తించకుండా ఏకచత్రాధిపత్య పాలన సాగిన తీరును అందరూ గమనించారు. ముస్లింలను చొరబాటుదారులుగా, అధిక సంతానం కలిగిన వారుగా చిత్రీకరిస్తూ ఎన్నికల లబ్దికై చేసిన ప్రయత్నాలను ప్రజలు తిరస్కరించారు. ప్రతిపక్ష పార్టీలను ముస్లింల పక్షపాతులుగా, బుజ్జగింపు రాజకీయాలు చేసేవిగా ముద్రేయజూసిన ప్రయత్నాలు ఫలించలేదు. రాహుల్ గాంధీని ఎద్దేవా చేసే ప్రయత్నాలేవి చెల్లకపోగా ఆయన చేసిన భారత్ జోడోయాత్ర, భారత్ జోడో న్యాయ్ యాత్ర ప్రజలను ఎంతోకొంత ఆకర్శించాయి. 'రాజ్యాంగాన్ని మార్చేయం, రిజర్వేషన్లను రద్దు చేయం' అంటూ ఎన్నికలకు ముందే సంజాయిషీ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అయినప్పటికీ కర్నాటకకు చెందిన అనంత్ కుమార్ హెగ్డె, తెలంగాణకు చెందిన ధర్మపురి అరవింద్ రాజ్యాంగంపై చేసిన వ్యాఖ్యలు, ఉత్తర భారతదేశంలోని అనేక మంది రాజ్యాంగంలోని సెక్యులర్ సోషలిస్ట్ అనే పదాలు తొలగిస్తామనడాన్ని ప్రజలు మరచిపోలేదు.

ఎన్నికల ఫలితాలపై ఆత్మ విమర్శ చేసుకోవాల్సింది పోయి, నాటి ఆయన రాజ్య ప్రజలే శివాజీ మహారాజును ఓడించారనీ, నేటి మోడీ అధికార కూటమికి మెజారిటీ తగ్గగానే ప్రజలను దోషులుగా చేస్తూ వాట్సాప్ యూనివర్సిటీ తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకునే మరో ప్రయత్నం చేస్తున్నది. మెజార్టీ తగ్గినందుకే ఇలా ప్రవర్తిస్తుంటే ఒకవేళ ఓడిపోతే ప్రజలను మూకుమ్మడిగా హింసించే వాళ్లేమో! ప్రజాస్వామ్యాన్ని, ప్రజల తీర్పును గౌరవించే వాళ్లు చేయాల్సిన పనికాదిది.అధికారాన్ని హస్తగతం చేసుకున్న వాళ్లే ఇలా నిందారోపణలు చేస్తుంటే, అధికారానికి ఆమడ దూరంలో నిలబడి ఓటమిపాలైన వారు ఎవరిని నిందించాలి? ఇలాంటి సమయంలో హుందాతనం ఎంతో అవసరమని గుర్తించాలి. గవర్నర్ల వ్యవస్థను ఉపయోగించుకొని ఏ కూటమి ప్రభుత్వాన్నైనా, ఎప్పుడైనా కూలదోసి, మరో కొత్త కూటమిని నిర్మించి ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తుంటే ప్రజలు గమనిస్తలేరనుకోవడం కేవలం వారి భ్రమ.

ప్రమాదం మిగిలేవుంది!



మూడోసారి ప్రధానిగా పదవీ స్వీకారం చేసిన నరేంద్రమోడీ రానున్న రోజుల్లో తన ప్రాధాన్యతలు ఏమిటో వెల్లడిస్తారని ఎదురు చూసిన దేశానికి పాత చింతకాయ పచ్చడి కబుర్లు వినిపించారు. ఇటీవల జరిగిన ఎన్డీయే ఎంపీల సమావేశంలోనూ ఇది వెల్లడైంది. కాంగ్రెస్ మీద దాడికే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చారు. కాంగ్రెస్‌కు ఇప్పుడున్న సీట్లు కూడా రావంటూ ఎన్నికల ముందు ఊరూవాడా తిరుగుతూ మాట్లాడిన పెద్దమనిషి పదేండ్లలో వంద సీట్లు కూడా తెచ్చుకోలేకపోయిం దన్నారు. సొంతంగా 370, కూటమిగా 400కు పైగా సీట్లు తెచ్చుకుంటామన్న బీజేపీ తన బలాన్ని కోల్పోయి 240కి ఎందుకు పరిమిత మైందనే చర్చ దేశంలో జరుగుతుం డగా దాన్ని తక్కువ చేసి చూపేందుకు కాంగ్రెస్ మీద దాడికి దిగటాన్ని అర్థం చేసుకోలేనంత అమాయకంగా జనం లేరు. రామాలయ నిర్మాణాన్ని పెద్ద ఘనతగా చెప్పుకోవటమే కాదు, ప్రజాస్వామ్యం కోసం కాకుండా రాముడిని ఓడించేందుకే కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేస్తున్నదని, వారు గెలిస్తే రామాలయాన్ని బుల్డోజర్లతో కూల్చివేస్తారని చెప్పిన పెద్దమనిషి మోడీ. ఈ ఎన్నికల్లో ఆ అయోధ్య రాముడు తనను బీజేపీ రక్షిస్తుందన్న నమ్మకం లేక ఆ నియోజకవర్గంలో సమాజ్‌వాది పార్టీని గెలిపించిన తీరును దైవాంశ సంభూతుడనని చెప్పుకున్న మోడీ, రామభక్తులు జీర్ణించుకోలేక పోతున్నారు. ఆ రాముడే బీజేపీని ఎందుకు ఓడించాడో అర్థంగాక జుట్టుపీక్కుంటున్నారు. దేవుడు నైవేద్యం తినడని పూజారికి తెలిసినంతగా మరొకరికి తెలియదు, అలాగే బీజేపీ రామభక్తి బండారం గురించి అయోధ్య పరిసరాల్లో తెలిసినంతగా ఇతరులకూ తెలియదు, అందుకే వారు ఓడించారు.

విధిరాత గురించి కొందరికి నమ్మకం ఉండవచ్చు, ఉండకపోవచ్చు. ముస్లింలకు దొడ్డిదారిన రిజర్వేషన్లు కల్పించేందుకు ఒబిసిల వాటా లేదా కోటా తగ్గించబోమని రాతపూర్వక హామీ ఇవ్వగలరా? అని ఇండియా కూటమిని మోడీ సవాల్ చేశారు.తన ప్రాణమున్నంత వరకు ముస్లింలకు రిజర్వేషన్లు అమలు కానివ్వనని ఎన్నికల ప్రచారంలో శపథం చేశారు. అదే మోడీ ముస్లిం రిజర్వేషన్లు అమలు జరిపి తీరుతామని ప్రతిన చేసిన చంద్రబాబు నాయుడు, నితీష్ కుమార్‌లను కుడి, ఎడమల కూర్చో పెట్టుకున్నారు. పదవి ముఖ్యం గనుక ఆ రిజర్వేషన్ల గురించి మాట్లాడకుండా నోటికి తాళం వేసుకున్నారని, తన వీరశూర ప్రతిజ్ఞను పక్కన పెట్టారని జనం అనుకుంటున్నారు. ఇది మిత్రపక్షాల సంతుష్టీ కరణ రాజకీయం కాదా? అంతేకాదు, ముస్లిం అనుకూల పార్టీల దయా దాక్షిణ్యాల మీదే మోడీ ప్రభుత్వం ఏర్పడుతున్నదని, ఎంత వారలైనా అధికారకాంత దాసులే అని లోకం కోడైకూస్తున్నది. జనం తిరస్కరించిన హిందూ త్వ హిందూ రాజ్యస్థాపన భావనలను తలకెక్కించుకొని వీరంగం వేస్తున్నవారు, ఆ ప్రచార ప్రభావానికి లోనైన వారు వాటిని పక్కనపెట్టి జనజీవన స్రవంతిలోకి రావటం అవసరం.

ఎన్డీయే, సమిష్టి ప్రభుత్వం, తత్వం అంటూ పదే పదే ప్రసంగంలో మోడీ తన ఆచరణకు విరుద్ధమైన మాటలు చెప్పారు. తన పదేండ్ల ఏలుబడిలో ఎన్నడైనా ఎన్డీయే సమావేశాలను ఏర్పాటు చేసి ప్రభుత్వం అనుసరించాల్సిన విధానాల గురించి భాగస్వామ్య పక్షాలతో చర్చలు జరిపిన ఉదంతం ఉందా? ఇండియా కూటమి ఏర్పాటు తరువాత మొక్కుబడిగా ఒక సమావేశం జరిపారు. చంద్రబాబు 2018లో ఎన్డీయే కన్వీనర్‌గా తప్పుకున్న తరువాత ఇంతవరకు ఆ పదవికి ఎవరినీ ఎన్నుకోలేదు.నిజానికి సమిష్టితత్వం పట్ల మోడీకి చిత్తశుద్ధి ఉందా? ఎల్‌కె అద్వానీ, మురళీ మనోహర్ జోషి వంటి బీజేపీ పెద్దలతో ఒక మార్గదర్శక మండలి ఏర్పాటు చేసి నిరంతరం వారి సలహాలు తీసుకుంటా మంటూ హడావుడి చేశారు. అసలు ఒక్కసారైనా సదరు మండలితో కూర్చొని మోడీ సలహాలు తీసుకున్నట్లు ఒక్క వార్త కూడా లేదు.ఏపీ ఎన్నికల్లో సీట్లకోసం ముందుకు వచ్చింది తప్ప ఉమ్మడి ఎన్నికల ప్రణాళికలో భాగస్వామి కావటానికి బీజేపీ సిద్ధపడలేదు, చివరకు దాన్ని ఆవిష్కరించ టానికి కూడా తిరస్కరించిన పార్టీ అది. అవసరార్థం వసుదేవుడు గాడిద కాళ్ల పట్టుకున్నట్టుగా మెజారిటీ లేక ఇతర భాగస్వాములను కౌగిలించుకోవటం తప్ప మోడీ ప్రసంగంలో భాగస్వామ్య పక్షాల గురించిన ప్రశంసలు హృదయంలోంచి వచ్చిన అభిమానం అని ఎవరూ అనుకోవటం లేదు. మిత్రపక్షాలను మింగివేయటం కొత్తకాదని తన రాజ్యసభ పక్షాన్నే విలీనం చేసుకున్న తీరు తెలుగు దేశానికి కొత్తగా చెప్పనవసరం లేదు. బీజేపీ, నరేంద్ర మోడీ బలహీన పడివుండవచ్చు తప్ప ఇంకా ప్రమాదకరంగా ఉన్నారన్నది 'ఇండియా' కూటమే కాదు, ఎన్డీయే పక్షాలు కూడా గ్రహించాలి.

- ఫీచర్స్ అండ్ పాలిటిక్స్

తమిళిసైకు అమిత్ షా బెదిరింపులు?

- చంద్రబాబు ప్రమాణస్వీకారంలో ఘటన
- వైరల్‌గా మారిన వీడియో



విజయవాడ : తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను బెదిరిస్తున్నట్లుగా అమిత్ షా ఏదో చెబుతున్న వీడియా ఇప్పుడు దేశంలో వైరల్‌గా మారింది. బుధవారం చంద్రబాబు ప్రమాణస్వీకారంలో జరిగిన ఈ ఘటనపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ కార్యక్రమంలో తమిళిసై, అమిత్ షా పాల్గొన్నారు. తమిళిసై వేదికపై ఉన్న మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, అమిత్ షాను ఆమె పలకరించారు. ఆ తర్వాత ఆమె అక్కడినుంచి ముందుకువెళ్తుంటే.. అమిత్ షా ఆమెను వెనక్కి పిలిచారు. తర్వాత వారిద్దరి మధ్య సంభాషణ జరిగింది. ఈ క్రమంలోనే అమిత్‌షా ఆమెను హెచ్చరిస్తూ వేలి చూపించారు. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తమిళనాడు అధికార పార్టీ డీఎంకే ఈ ఘటనపై స్పందించింది. "తమిళనాడుకు చెందిన ఒక ప్రముఖ నాయకురాలిని ఇలా బహిరంగంగా మందలించడం తగునా? ఇది అందరు చూస్తారని తెలుసుకోవాలి. ఇది తప్పుడు సంకేతాన్ని పంపుతుంది" అని డీఎంకే అధికార ప్రతినిధి శరవణన్ అన్నాదురై అన్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల ఫలితాల్లో తమిళనాడులో బీజేపీ ఘోరంగా ఓటమి చెందింది. ఈ తరువాత అనంతరం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అన్నామలై, తమిళిసై మధ్య విబేధాలు తలెత్తాయని సమాచారం. ఈ నేపథ్యంలో తమిళిసై ను అమిత్‌షా హెచ్చరించినట్లు భావిస్తున్నారు.

ప్రభుత్వ ఉపాధ్యాయుడి దారుణ హత్య

- పాఠశాల పున:ప్రారంభానికి వెళ్తుండగా ఘటన

నవతెలంగాణ-నార్నూర్



(ఫైల్)

పాఠశాలల పున: ప్రారంభం రోజునే ప్రభుత్వ ఉపాధ్యాయుడు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం నాగల్ కొండ గ్రామంలో స్థానికంగా కలకలం రేపింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగల్‌కొండ గ్రామానికి చెందిన జాదవ్ గజానంద్ (40) జైనథ్ మండలం కెనాల్ మేడిగూడ ప్రభుత్వ పాఠశాలలో తెలుగు పండితుడిగా విధులు నిర్వర్తిస్తున్నాడు. జిల్లా కేంద్రంలో నివాస ముంటున్నాడు. వేసవి సెలవులు కావడంతో కుటుంబ సభ్యులతో కలిసి సొంతూరు నాగల్‌కొండకు వచ్చాడు. బుధవారం పాఠశాల పున:ప్రారంభం కావడంతో స్వగ్రామం నుండే విధులకు హాజరయ్యేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. ఈ క్రమంలో అర్జుని-లోకారి రోడ్డు మార్గమధ్యలో హత్యకు గురయ్యాడు. ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, సీఐ రహీమ్ పాషా సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. తలకు బలమైన గాయాలుండటంతో రోడ్డు ప్రమాదమా? లేక బండ రాయితో కొట్టి హత్య చేసి ఉంటారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు.

పోడు భూముల జోలికెళ్లొద్దు..

- కొత్తగా అడవిని నరకనివ్వొద్దు : మంత్రి సీతక్క
- ఆసిఫాబాద్ జిల్లాలో అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం పోడు సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లకూడదని, కొత్తగా అడవులను నరికి సాగు చేయకుండా చూడాలని పంచాయతీరాజ్, గ్రామీణాభి వృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధికారులకు సూచించారు. ఆసిఫాబాద్ జిల్లాలో బుధవారం మంత్రి పర్యటిం చారు. ఆసిఫాబాద్ మండలంలోని మోతుగూడ, అప్పపెల్లి గ్రామాల మధ్యలోగల వాగుపై రూ.కోటి 82 లక్షలతో నిర్మిస్తున్న హైలెవల్ వంతెన పనులను జెడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణారావు, ఎమ్మెల్సీ దండే విఠల్, ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి, పాల్వాయి హరీశ్‌బాబు, కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారీ, దాసరివేణుతో కలిసి పరిశీలించారు. ఆసిఫాబాద్ మండలంలోని వాడిగూడ ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల కింద రూ.6 లక్షలా 20 వేలతో నిర్మించిన గదులను ప్రారంభించారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలను అందజేశారు. జిల్లా కేంద్రంలో రూ.25 లక్షల నిధులతో నిర్మించనున్న ప్రెస్‌క్లబ్ భవనానికి భూమి పూజ చేశారు. ఇటీవల మరణించిన ఈనాడు పత్రిక వ్యవస్థాపకుడు రామోజీరావుకు మంత్రి సీతక్క ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్, జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్, ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

పర్యటనలో భాగంగా మంత్రి జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ వెంకటేష్ ధోత్రే, ఉట్నూర్ ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్సీ తదితరులతో కలిసి శాఖల పనితీరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పోడు భూముల సమస్య రోజురోజుకూ పెరుగుతోందని, ఇప్పటికే సాగు చేసుకుంటున్న భూముల జోలికి వెళ్లొద్దని అధికారులను మంత్రి ఆదేశించారు.

ప్రభుత్వాస్పత్రిలోని కాంట్రాక్టు కార్మికులకు..

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

- మంత్రులకు ఐఎఫ్టీయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతి

నవతెలంగాణ-ఖమ్మం




ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు మూడు నెలల పెండింగ్ వేతనాలు ఇవ్వాలని కోరుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఐఎఫ్టీయూ, సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు వై.విక్రమ్, ఐఎఫ్టీయూ జిల్లా ఉపాధ్యక్షులు కే.శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శానిటేషన్ గార్డెన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్‌లలో 259 మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, వీరికి దాదాపు మూడు నెలల నుంచి వేతనాలు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోవడంతో జిల్లాకు విచ్చేసిన డిప్యూటీ సీఎం భట్టికి, మంత్రి తుమ్మలకు తమ సమస్యను విన్నవించుకున్నట్టు చెప్పారు. జీతాలు రాక ఇండ్ల కిరాయిలు కట్టలేక, పిల్లల చదువులు, పుస్తకాలకు డబ్బులు లేక వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులు మూడు నెలల నుంచి పస్తులతో ఉంటూనే.. వందలాదిమంది ప్రజల ఆరోగ్యాలు కాపాడుతూ ఆస్పత్రిని శుభ్రంగా ఉంచుతున్నారని, అలాంటి వారిపై అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ సీఎం, మంత్రి వెంటనే జోక్యం చేసుకొని ప్రతి నెలా కార్మికులకు జీతాలు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘాల నాయకులు అంబేద్కర్, వెంకట రమణ, అశోక్ ప్రసాద్, వెంకన్న, రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మీరు చేస్తారా? మాకిస్తారా?

ఆర్ఆర్ఆర్‌పై కేంద్రంతో సర్కారు అమీతుమీ

- తీవ్ర జాప్యంపై అసహనం
- త్వరలో గడ్కరీకి సమగ్ర నివేదిక
- ఆర్అండ్‌బీ మంత్రిత్వ శాఖ యోచన



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్) ప్రక్రియను వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. ఐదేండ్లుగా తీవ్రం జాప్యం జరుగుతున్న నేపథ్యంలో రోడ్లు, భవనాల శాఖలో సమాలోచనలు జరుగుతున్నాయి. ఆలస్యమయ్యే కొద్దీ అంచనాలు పెరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదికను సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది. రెండూ మూడు వారాల్లోనే ఈ పని పూర్తి చేయాలని నిర్ణయించినట్టు విశ్వసనీయ అధికార వర్గాల సమాచారం. ఆర్ఆర్ఆర్ తాజా భౌతిక పరిస్థితిని తెలియజేస్తూ కేంద్ర ఉపరితల రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీకి ఈ నివేదికను పంపనున్నారు. ఈ సందర్భంగా ఆర్ఆర్ఆర్‌ను కేంద్రం నిర్మిస్తుందా? లేక రాష్ట్రానికి అప్పగిస్తారా? అనే విషయమై స్పష్టతను తీసుకోవాలని నిర్ణయించినట్టు తెలిసింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి సర్కారు విధానం ప్రకారం రాష్ట్రాన్ని మూడు విభాగాలు విభజించిన సంగతి తెలిసిందే. ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) లోపలి భాగాన్ని అర్బన్, ఓఆర్ఆర్ నుంచి ఆర్ఆర్ఆర్ భాగాన్ని సెమీ అర్బన్, ఆర్ఆర్ఆర్ అవతలి ప్రాంతాన్ని గ్రామీణ తెలంగాణగా పరిగణించనున్నట్టు ఇటీవల ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షలో నిర్ణయించారు. ఈమేరకు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని భావిస్తున్నారు. ఆ దిశగానే అన్నీ ప్రణాళికలు ఉండాలని అధికారులను ఆదేశించారు.

గేమ్ చేంజర్

ఆర్ఆర్ఆర్ నిర్మాణం రాష్ట్రానికి గేమ్ చేంజరే కానుంది. హైదరాబాద్ నగరానికి ట్రాఫిక్ తాకిడిని తగ్గించడమే ప్రధాన లక్ష్యం. అంతేగాక ఆర్ఆర్ఆర్ చుట్టూ ఉన్న గ్రామాలు పట్టణాలుగా మారిపోతాయి. ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. గ్రామీణ ప్రాంతాలకు రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో కనెక్టివిటీ పెరుగుతుంది. తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడడానికి తోడ్పాటును అందించనుంది.

రెండు భాగాలు

ఆర్ఆర్ఆర్‌ను 2018లో ప్రతిపాదించారు. ఉత్తర భాగం 164 కిలోమీటర్లు. రూ.9500 కోట్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఆ తర్వాత వ్యయం పెరిగింది. సంగారెడ్డి, నర్సాపూర్, తూప్రాన్, గజ్వేల్, యాదాద్రి, ప్రజ్ఞాపూర్, భువనగిరి, చౌటుప్పల్ గుండా ఈ రోడ్డు వెళ్లనుంది. అలైన్‌మెంటు ఖరారైంది. దక్షిణ భాగం 182 కిలోమీటర్లు. తొలుత దీనికి రూ.6480 కోట్లు అవసరమని భావించారు. దీని ఖర్చు కూడా ఆ తర్వాత పెరిగింది. చౌటుప్పల్, ఇబ్రహీంపట్నం, కందుకూరు, ఆమన్‌గల్, చేవెళ్ల, శంకర్‌పల్లి, సంగారెడ్డి గుండా నిర్మించాలని ప్రతిపాదించారు.

పెరిగిన వ్యయం

తొలుత ఆర్ఆర్ఆర్ రెండు భాగాలకు కలిపి రూ. 26 వేల కోట్లు అవసరమవుతా యని అంచనా వేశారు. తాజాగా పనులు ప్రారంభం కాకముందే ఆ అంచనాలు రూ.30 వేల కోట్లకు చేరినట్టు సమాచారం. దీనికి ప్రధాన కారణం ఆలస్యం కావడమే. ఆర్ఆర్ఆర్‌ను కేంద్ర ప్రభుత్వం జాతీయ రహదారి కింద గుర్తించడానికి అంగీకరించింది. భారత్‌మాల-2 పథకం కింద చేపడతామని ప్రకటించింది. ఆనక వెనక్కి తగ్గింది. ఉత్తరభాగం అలైన్‌మెంటు ఖరారైనా టెండర్లు పిలవలేదు. దీంతో ప్రణాళికా దశలోనే తీవ్ర జాప్యం చోటు చేసుకుంటుండటం గమనార్హం. భూసేకరణ కూడా ప్రధాన అడ్డంకిగా ఉందని సమాచారం. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవతీసుకుంటే సమస్య కొలిక్కివచ్చే అవకాశం ఉందని సమాచారం.

భూసేకరణ

భూసేకరణ కోసం అయ్యే వ్యయంలో 50 శాతం భరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చింది. ఇటీవల ఈ ప్రాజెక్టుపై సమీక్ష చేసిన సీఎం రేవంత్, రానున్న మూడు నెలల్లో భూసేకరణను పూర్తిచేసి ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగానికి టెండర్లు పిలవాలని ఆదేశించారు. దీనిపై రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కసరత్తు చేస్తున్నది. ఎన్‌హెచ్ఏఐతో సమన్వయం చేసుకోవాల్సి ఉంది. 2018లో ప్రాజెక్టును ప్రతిపాదించినా 2021లో ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగం అలైన్‌మెంటు ఖరారై దాదాపు రెండున్నరేండ్లు పూర్తయింది. అయినా ఉత్తర భాగం టెండర్లు తుది దశకు రాకపోవడంతో నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. దీనికి గత బీఆర్ఎస్ సర్కారు నాన్చివేత ధోరణి, కేంద్ర ప్రభుత్వం అలక్ష్యం కూడా కారణమేనని తెలిసింది. భూసేకరణ విషయంలో చొరవచూపకపోవడం, ఆ ఖర్చును భరించడానికి సంసిద్ధత వ్యక్తం చేయడంలో జరిగిన ఆలస్యమూ ముఖ్య కారణమని సమాచారం. ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వ ఉపరితల రవాణాతో సంప్రదింపులు చేసి ఉత్తర భాగం పనులు చేపట్టేలా ఒత్తిడి తేవడం, లేదా తమకు అప్పగించాలని నివేదిక ద్వారా విజ్ఞప్తి చేయనున్నట్టు తెలిసింది.

పెరగనున్న కనెక్టివిటీ

ఆర్ఆర్ఆర్‌తో జాతీయ రహదారులతోపాటు రాష్ట్ర రహదారులకు సైతం కనెక్టివిటీ పెరగనుంది. జాతీయ రహదారుల అథారిటీ(ఎన్‌హెచ్ఏఐ) చేపట్టిన ఈ ప్రాజెక్టు ప్రక్రియ ఆలస్యం అవుతుండటంతో తమకు అప్పగించాలంటూ త్వరలో రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరే అవకాశముంది. ఆర్ఆర్ఆర్ నిర్మాణం పూర్తయితే ఎన్‌హెచ్-44, ఎన్‌హెచ్-164, ఎన్‌హెచ్-65, ఎన్‌హెచ్-765, ఎన్‌హెచ్-63తోపాటు అలాగే ఎస్‌హెచ్-1, ఎస్‌హెచ్-19తో కనెక్ట్ కానుంది.

టెట్‌లో పెరిగిన ఉత్తీర్ణత

(మొదటిపేజీ తరువాయి)

ఏడు విడతల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడ, మరాఠీ, తమిళం, గుజరాతీ, బెంగాలీ వంటి ఎనిమిది భాషల్లో రాతపరీక్షలను నిర్వహించారు. పేపర్-2ను 13 విడతల్లో ఏడు భాషల్లో చేపట్టారు. టెట్‌కు 2,86,381 మంది దరఖాస్తు చేశారు. టెట్ పేపర్-1కు 99,958 మంది దరఖాస్తు చేయగా, 85,996 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిలో 57,725 (67.13 శాతం) మంది ఉత్తీర్ణత సాధించారు. పేపర్-2కు 2,86,381 మంది దరఖాస్తు చేస్తే, 1,50,491 మంది పరీక్ష రాశారు. వారిలో 51,443 (34.18 శాతం) మంది ఉత్తీర్ణత పొందారు. గతేడాదితో పోలిస్తే పేపర్-1లో 30.24 శాతం, పేపర్-2లో 18.88 శాతం ఉత్తీర్ణత శాతం పెరగడం గమనార్హం. ఈ ఫలితాలను https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్హత సాధించని అభ్యర్థులకు ఉపశమనం

టెట్ దరఖాస్తుల సమయంలో ఎన్నికల కోడ్ కారణంగా టెట్ దరఖాస్తు ఫీజు తగ్గింపు నిర్ణయాన్ని ఎన్నికల కమిషన్ అంగీకరించలేదని ప్రభుత్వం తెలిపింది. ఈ నేపథ్యంలో దరఖాస్తులకు ఉపశమనం కలిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. టెట్-2024లో అర్హత సాధించని దరఖాస్తుదారులకు వచ్చే టెట్‌కు ఉచితంగా దరఖాస్తు చేసుకునే వెసులుబాటును కల్పించింది. టెట్-2024లో అర్హత సాధించిన వారికి ఒకసారి ఉచితంగా డీఎస్సీ దరఖాస్తు చేసుకునే అవకాశమిచ్చింది. టెట్ ఉత్తీర్ణత ఉంటేనే డీఎస్సీకి దరఖాస్తు చేసేందుకు అర్హులవుతారు. డీఎస్సీలో టెట్ మార్కులకు 20 శాతం వెయిటేజీ ఉంటుంది. అంటే డీఎస్సీ రాతపరీక్షలకు 80 శాతం మార్కులు, టెట్‌లో సాధించిన మార్కులకు 20 శాతం వెయిటేజీ ఇచ్చి రెండింటిలో మెరిట్ ఆధారంగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. అందుకే టెట్‌కు ప్రాధాన్యత ఉంటుంది. 2011 నుంచి టెట్ అర్హత సంపాదిస్తే జీవితకాలం ఉంటుందని జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) నిర్ణయించిన విషయం తెలిసిందే.

టెట్-2024 ఫలితాలు

పేపర్	హాజరు	ఉత్తీర్ణత	శాతం
1	85,996	57,725	67.13
2 (మ్యాథ్స్, సైన్స్)	79,138	29,601	37.4
సోషల్ స్టడీస్	71,353	21,842	30.61
మొత్తం	1,50,491	51,443	34.18

గత టెట్‌ల ఉత్తీర్ణత వివరాలు

సంవత్సరం	పేపర్-1	పేపర్-2
2014, మార్చి 16	73.92	32.32
2016, మే 22	54.45	25.04
2017, జులై 23	57.37	19.51
2022, జూన్ 12	32.68	49.64
2023, సెప్టెంబర్ 15	36.89.	15.30

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

- ఆందోళన చేపట్టిన బాధిత కుటుంబీకులు



నవతెలంగాణ-మెదక్

విద్యుత్ షాక్‌తో రైతు మృతి చెందిన సంఘటన మెదక్ జిల్లా పేరూరు గ్రామంలో బుధవారం జరిగింది. ఈ ఘటనపై బాధిత కుటుంబీకులు మెదక్-బొడ్మట్ పల్లి ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించి ఆందోళన చేపట్టారు. పేరూర్‌కు చెందిన వెల్మకన్నె నగేష్(40) గ్రామ శివారులో ఉన్న వ్యవసాయ పొలంలో పిచ్చి మొక్కలు తొలగించేందుకు వెళ్ళాడు. కట్టెలు, పిచ్చి మొక్కలను తొలగిస్తుండగా పొలంలో ఉన్న విద్యుత్ స్తంభం సపోర్ట్ తీగను తాకాడు. తీగకు విద్యుత్ సరఫరా కావడంతో పట్టుకున్న వెంటనే షాక్ తగిలి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. స్థానిక రైతులు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. స్తంభం వద్ద ప్రమాదం ఉందని గతంలోనే ట్రాన్స్‌కో లైన్‌మెన్, ఏఈ దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి మరమ్మత్తులు చేయలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు మృతితో ఆగ్రహించిన రైతులు అధికారుల వైఖరికి నిరసనగా మెదక్-బొడ్మట్‌పల్లి ప్రధాన రహదారిపై బైటాయించి రాస్తారోకో చేశారు. ట్రాన్స్‌కో అధికారులను సస్పెండ్ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న మెదక్ రూరల్ సీఐ కేశవులు, ఏఎస్ఐ వెంకటయ్య, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఆందోళన కారులకు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన విరమించలేదు.

ట్రాన్స్ కో అధికారులు వచ్చే వరకు ఆందోళన ఆపేది లేదని భీష్మించుకు కూర్చున్నారు. దాంతో ట్రాన్స్‌కో ఏడీ మోహన్ బాబు, రూరల్ ఏఈ తిరుపతి రెడ్డి వచ్చి.. విద్యుత్ మరమ్మతులతో పాటు బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మెదక్ ప్రభుత్వాస్పత్రికి తరలించి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, రైతు మృతి చెందిన విషయం తెలుసుకున్న మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు బాధిత కుటుంబానికి రూ 2 లక్షల ఆర్థిక సహాయం అందిస్తానని హామీ ఇచ్చారని కాంగ్రెస్ నేత శ్రీనివాస్ చౌదరి చెప్పారు.

రైతు భరోసా ఉన్నట్టా? లేనట్టా?

ఈ వానాకాలం నుంచే అమలు చేయాలి : మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



రాష్ట్రంలో రైతుభరోసా ఉన్నట్టా? లేనట్టా? అని వ్యవసాయశాఖ మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత వానాకాలం సీజన్ నుంచే రైతుభరోసా పథకం కింద ఎకరాకు రూ.7500 అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కారుకు ఎన్నికల ప్రచారం మీద ఉన్న సోయి రైతుభరోసా విధి, విధానాల రూపకల్పనపై లేదని విమర్శించారు. ఏడు నెలల నుంచి ముఖ్యమంత్రి, మంత్రులకు తీరిక లేదా ? అని ప్రశ్నించారు. డిసెంబరు 9 నుంచే రూ.15 వేల ఆర్థిక సాయంతో రైతు భరోసాను అమలు చేస్తామన్న ముఖ్యమంత్రి హామీలు నీటి మీది రాతలే అయ్యాయని విమర్శించారు. రైతుభరోసాను ఎన్ని ఎకరాలకు పరిమితం చేయాలి? అనే అంశంపై మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఈ షరతుల గురించి ఎందుకు చెప్పలేదు ? అని ప్రశ్నించారు. రైతుభరోసాకు దిక్కు లేదు. కౌలు రైతుల ఊసు లేదు. రైతు కూలీల గురించి పట్టించుకున్న నాథుడే లేడని ఆగ్రహం వ్యక్తం చేశారు. వరికి రూ.500 బోనస్ వట్టి బోగస్ అని తేలిపోయిందని ఎద్దేవా చేశారు. ప్రభుత్వానికి దమ్ము ధైర్యం ఉంటే రైతు భరోసాను 5 ఎకరాలకో, 10 ఎకరాలకో పరిమితం చేస్తామంటూ విధాన ప్రకటన చేయాలని సవాల్ చేశారు. కేవలం కాలయాపన కోసమే శాసనసభ సమావేశాలు అంటూ ఊదరగొడుతున్నదని తప్పుపట్టారు. ప్రభుత్వానికి రైతు భరోసా ఇచ్చే చిత్తశుద్ధి ఉంటే వెంటనే క్యాబినెట్ భేటీని ఏర్పాటు చేసి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రైతుబీమా ఉంచుతారా ? ఎత్తేస్తారా ? తేల్చిచెప్పాలని కోరారు. రైతు కూలీలకు రూ.12,000, కౌలు రైతులకు రూ.15,000 ఇవ్వడంపై స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు.

సాగునీటి ప్రాజెక్టుల పనుల వేగం పెంచాలి

- విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- వ్యవసాయం బలోపేతం : ఖమ్మం జిల్లా అధికారుల సమీక్షా సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు తుమ్మల, పొంగులేటి



నవతెలంగాణ-ఖమ్మం

సాగునీటి ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. బుధవారం ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో సాగు నీటిపారుదల, విద్యా శాఖల ప్రగతిపై మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి, జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి సమీక్ష నిర్వహించారు. జిల్లాలో ఉన్న సాగునీటి ప్రాజెక్టుల ప్రగతి, వాటికి కావాల్సిన నిధులు, పూర్తయ్యే గడువును అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. ప్రపంచంతో పోటీపడేలా ఖమ్మం జిల్లాను అభివృద్ధి చేయాలనే లక్ష్యానికి అనుగుణంగా జిల్లా యంత్రాంగం పని చేయాలన్నారు. ఉద్యోగులు పారదర్శకంగా, జవాబుదారీగా వ్యవహరించాలని తెలిపారు. వ్యవసాయ ఆధారితమైన ఖమ్మం జిల్లాలో వ్యవసాయం బలోపేతం కోసం సాగు నీరందించే ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఉన్న మేజర్ ఇరిగేషన్ ప్రాజెక్టులైన ఎన్ఎస్పీ కెనాల్స్, సీతారామ ప్రాజెక్ట్, మధ్య తరహా, చిన్న తరహా పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడానికి క్యాలెండర్ తయారు చేసుకుని ముందుకు వెళ్లాలన్నారు. జిల్లాలో కొన్నిచోట్ల చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులకు అన్ని అనుమతులు ఉన్నప్పటికీ ఇప్పటికీ పనులు మొదలు కానీ (ఉదాహరణకు పండ్రేగుపల్లి) ప్రాజెక్టుల పనులను సత్వరం ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు చెప్పారు. అన్ని రెసిడెన్షియల్ పాఠశాలలకు పక్కా భవనాల నిర్మాణానికి ఓటాన్ అకౌంట్ బడ్జెట్లో నిధులు కేటాయించామన్నారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పేరుతో ఏడాది లోగా నిర్మాణాలు పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ఖమ్మం జిల్లాలో రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు వెంటనే భూములను గుర్తించాలన్నారు. విదేశాల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ శాఖల ద్వారా అందిస్తున్న ఓవర్సీస్ స్కాలర్‌షిప్స్ సంఖ్యను మరో వందకు పెంచాలని నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. సాగునీటి ప్రాజెక్టుల పూర్తికి సమస్యలు అధిగమించాలన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టు సాగుకు వచ్చే ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. పాలేరుకు సంబంధించి రూ.20 కోట్ల ఖర్చుతో 18 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చని తెలిపారు. సీజన్‌లో ప్రస్తుతమున్న సాగునీటి ప్రాజెక్టుల మరమ్మతులు, చిన్న చిన్న పనులు పూర్తి స్థాయిలో చేసి, వాటి పూర్తి సామర్థ్యంతో చిట్ట చివరి ఆయకట్టుకు నీరందించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం బోధనను అభివృద్ధి పరచాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం కలిగించి, నమోదులు పెరిగేలా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పురోగతి, విద్యా శాఖలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా పాఠశాలల అభివృద్ధి పనులు, ప్రభుత్వ పాఠశాలల్లో నమోదులు పెరిగేలా చేపడుతున్న చర్యల గురించి వివరించారు. ఈ సమావేశంలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్, ఉపముఖ్యమంత్రి ఓఎస్డీ కృష్ణ భాస్కర్, ఖమ్మం నగరపాలక సంస్థ కమీషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి. మధుసూదన్ నాయక్, ఇర్రిగేషన్ సీఈ విద్యాసాగర్, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాలల భవిష్యత్తే.. రాష్ట్ర భవిష్యత్తు

(మొదటిపేజీ తరువాయి)

పలు జిల్లాల్లోని పాఠశాలల్లో జరిగిన బడిబాట కార్యక్రమాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు యూనిఫామ్‌లు, నోటు బుక్కులు, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ కెనాల్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో కలిసి డిప్యూటీ సీఎం భట్టి హాజరయ్యారు. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర భవిష్యత్తు నిర్మాణం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదన్నారు. విద్యాభివృద్ధికి బడ్జెట్‌లో ఎన్ని నిధులైనా కేటాయిస్తామని తెలిపారు. నేటి బాలలే రేపటి పౌరులని, బాలల బంగారు భవిష్యత్తుపై రాష్ట్ర భవిష్యత్తు ఆధారపడి ఉంటుందని అన్నారు. ప్రతి విద్యార్థికి కావాల్సిన తరగతి గది, తాగునీరు, టాయిలెట్ రన్నింగ్ వాటర్‌తో సదుపాయాల కల్పన చేస్తున్నట్టు తెలిపారు. పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ సరైన సమయంలో అందిస్తే, మంచి ఫలితం ఉంటుందన్న దృష్టితో పాఠశాలలు తెరిచిన రోజునే అందేలా కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. అనంతరం మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్యంపై ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. విద్యపై ఎంత ఖర్చైన ప్రభుత్వం వెనకాడదని, అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు కృషి చేస్తున్నట్టు చెప్పారు. కొణిజర్ల హైస్కూల్‌లో విద్యార్థులకు వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. జిల్లాలోని అన్ని మండలాల్లో విద్యార్థులకు యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాలల ఆవరణం శుభ్రం చేయించారు. ఖమ్మం రూరల్ మండలం పెద్ద తండా పంచాయతీ పరిధిలోని జలగం నగర్ ప్రాథమిక పాఠశాలలో వర్షం నీరు నిలువకుండా మట్టి పోయించారు. ఉన్నత పాఠశాలలో మరుగుదొడ్లు, వంటశాల నిర్మాణం, గేట్ల ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయి.

హైదరాబాద్ అబిడ్స్‌లోని అలియా మోడల్ హైస్కూల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ.. కోడ్‌కి ముందే ప్రభుత్వం తెలంగాణలో 26,872 పాఠశాలల్లో రూ. 1100 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో మౌలిక వసతులు, తాగునీరు, టేబుల్స్, మరమ్మతులు, కలర్స్ పనులు చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ లేకుండా బట్టలు, మధాహ్న భోజనం, సౌకర్యాలు కల్పిస్తున్నామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని తెలిపారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలోని 16 ప్రభుత్వ స్కూల్స్‌లో 'అమ్మ ఆదర్శ స్కూల్' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వ స్కూళ్లను కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని తాము సంకల్పిస్తున్నామని తెలిపారు.

సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. మంత్రి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం, చదువుల తల్లి సరస్వతి దేవి, ప్రొఫెసర్ జయశంకర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు పుస్తకాలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రమాణాలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రయివేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్టు తెలిపారు. సిద్దిపేటలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, నంగునూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తమ్ రెడ్డి విద్యార్థులకు ఉచిత నోట్, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ అందజేశారు. ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. కొండపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జిల్లా కలెక్టర్ మను చౌదరి హాజరై విద్యార్థులతో కలిసి కేక్ కట్ చేసి విద్యార్థినీ, విద్యార్థులకు ఉచిత యూనిఫామ్స్, పాఠ్య, నోట్ పుస్తకాలు అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు హైస్కూల్‌లో పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు. భద్రాచలంలోని జగదీష్ కాలనీలో బడిబాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. అన్నపురెడ్డిపల్లి బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పుస్తకాలు, యూనిఫామ్ పంపిణీ చేశారు. రంగారెడ్డి జిల్లా శివరాంపల్లిలోని జిల్లా పరిషత్ హై స్కూల్ బడిబాట కార్యక్రమంలో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ పాల్గొని మాట్లాడారు. మండల విద్యాధికారి సర్దార్ నాయక్ ఆధ్వర్యంలో వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని మహాలక్ష్మీవాడ పాఠశాలలో ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ పాల్గొని పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలను అందించారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ప్రైమరీ పాఠశాల-1లో కలెక్టర్ రాజర్షి షా, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్ పాల్గొన్నారు. నేరడిగొండ మండలంలోని వడూర్ పాఠశాలలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ పాల్గొన్నారు.

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలో ప్రభుత్వవిప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ హనుమంతు కె.జెండగే, ఎమ్మెల్యే.. విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించి, పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం పాఠ్యపుస్తకాలు అందజేశారు. నల్లగొండ జిల్లాకేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో కలెక్టర్ దాసరి హరిచందన విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు పంపిణీచేశారు. కేతెపల్లి, నకిరేకల్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఎమ్మెల్యే వీరేశం యూనిఫామ్స్ పంపిణీ చేశారు. వేములపల్లి మండలంలోని జెడ్పీహెచ్ఎస్‌లో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి చేతుల మీదుగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీచేశారు. సూర్యాపేట జిల్లా మునగాలలోని జిల్లా పరిషత్ హై స్కూల్లో జిల్లా కలెక్టర్ వెంకట్రావు విద్యార్థులకు యూనిఫామ్స్ పంపిణీ చేశారు. తుంగతుర్తి మండలం అన్నారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఎమ్మెల్యే మందుల సామేల్ పాల్గొన్నారు. కరీంనగర్ జిల్లా చొప్పదండిలో జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను స్థానిక ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పంపిణీ చేశారు. పదో తరగతిలో 10జీపీఏ సాధించిన ఎలిగేటి సవితకు ఎమ్మెల్యే రూ.5000 ప్రోత్సాహాన్ని అందజేశారు. సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం విలాసాగర్‌లో ఎమ్మెల్యే సత్యం పాల్గొని యూనిఫామ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు.

సమస్యల స్వాగతం

ఖమ్మం జిల్లా ముదిగొండ మండలంలో బడిబాట కార్యక్రమం మొక్కుబడిగా సాగింది. కొందరు ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమానికి డుమ్మా కొట్టారు. బడిబాట కార్యక్రమం ప్రారంభమై వారం రోజులు అయినా పాఠశాలలు అపరిశుభ్రంగా ఉన్నాయి. ముదిగొండ హైస్కూల్‌లో అసాంఘిక కార్యకలాపాలతోపాటు, మందుబాబులకు అడ్డాగా మారి బీరు, బ్రాంది, సీసాలు పాఠశాలలో దర్శనమిస్తున్నాయి. మండల కేంద్రం నుంచి పాఠశాలలకు తరలించే పాఠ్యపుస్తకాలను ఉపాధ్యాయులు విద్యార్థుల చేత మోయిస్తున్నారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేటలోని మాలపల్లి మండల పరిషత్ పరిషత్ పాఠశాల శుభ్రం చేసే వారు కరువయ్యారు. ఎక్కడి చెత్త అక్కడే దర్శనమిచ్చింది. ఇదిలా ఉండగా పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాకపోవడం గమనర్హం. దీంతో విద్యార్థులు పాఠశాల ఆవరణంలో ఆటలాడుతూ కాలక్షేపం చేశారు. అభివృద్ధిపనులు కూడా కొనసాగుతున్నాయి.

'ఫిట్‌లెస్'లేని బస్సులపై కొరడా..

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై స్కూల్స్ ప్రారంభం రోజే రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 71 బస్సులపై కేసులు నమోదు చేశారు. ఇక హైదరాబాద్ నగర పరిధిలోని మొత్తం అయిదు జోన్‌లలో కలిపి మొత్తం 25 బస్సులను సీజ్ చేయగా.. అందులో 19 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోగా.. మరో ఆరు బస్సులకు పర్మిట్‌తో పాటు టాక్స్ చెల్లించలేదని సంబంధిత అధికారులు గుర్తించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తంగా 12 వేల బస్సులు ఉండగా, వాటిలో 8 వేల బస్సులకు మాత్రమే ఫిట్‌నెస్ ఉందని రంగారెడ్డి డిప్యూటీ కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ తెలిపారు. బుధవారం చేసిన తనిఖీల్లో ఫిట్‌నెస్ లేకుండా ఉన్న 46 బస్సులు గుర్తించినట్టు తెలిపారు. ఆ బస్సులకు సంబంధించిన విద్యసంస్థలపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

25 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలి

- సిద్దిపేటలో బడిబాట కార్యక్రమంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు



నవతెలంగాణ-సిద్దిపేట

సీఎం రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఖాళీగా ఉన్న 25 వేల ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం బడి బాటలో భాగంగా విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి ఫలితాల్లో ఐదేండ్ల నుంచి రాష్ట్రంలో సిద్దిపేట జిల్లా సెకండ్ ప్లేస్‌లో ఉందన్నారు. కార్పొరేట్ పాఠశాలను తలదన్నేలా సిద్దిపేటలో ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయని తెలిపారు. సీఎం చెప్పిన విధంగా, ప్రభుత్వ పాఠశాలకు ఉచిత కరెంట్, పారిశుద్ధ్య సిబ్బందిని నియమించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల డ్రాప్ ఔట్ తగ్గించాలన్నారు. సొంత డబ్బులతో విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేసినట్టు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పయ్యావుల పూర్ణిమ ఎల్లం, బీఆర్ఎస్ నాయకులు రాజనర్సు, మండల విద్యాధికారి యాదవ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అక్టోబర్ 21 నుంచి గ్రూప్-1 మెయిన్స్

(మొదటిపేజీ తరువాయి)

చేశారు. ఆరు పేపర్లకు సంబంధించి ఎంచుకున్న భాషలో సమాధానాలు రాయాలని సూచించారు. ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో ప్రశ్నాపత్రంలో కొంత భాగం రాసేందుకు అవకాశం లేదని తెలిపారు. పేపర్‌కు పేపర్‌కు మధ్య ఏమైనా తేడా ఉంటే ఆ అభ్యర్థులు అనర్హతకు గురవుతారని పేర్కొన్నారు. గ్రూప్-1 మెయిన్ ప్రశ్నాపత్రం నమూనాకు సంబంధించి గతేడాది జనవరి 18న ప్రకటించామని గుర్తు చేశారు. పదో తరగతి సామర్థ్యంతో జనరల్ ఇంగ్లీష్‌ను అర్హత పరీక్షగా నిర్వహిస్తామనీ, అందులో వచ్చే మార్కులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. మెయిన్స్‌కు అర్హత సాధించిన అభ్యర్థులందరూ తప్పనిసరిగా ఆరు పేపర్లకు హాజరు కావాలని సూచించారు. ఒక్క పేపర్‌కు గైర్హాజరైనా అభ్యర్థులను అనర్హులవుతారని తెలిపారు. సిలబస్‌తోపాటు పూర్తి వివరాలు గ్రూప్-1 నోటిఫికేషన్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. జనరల్ ఇంగ్లీష్‌తోపాటు ఆరు పేపర్లు 150 మార్కుల చొప్పున నిర్వహిస్తామని తెలిపారు. 563 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఫిబ్రవరి 19న గ్రూప్-1 నోటిఫికేషన్‌ను టీజీపీఎస్సీ జారీ చేసిన విషయం తెలిసిందే. గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షను ఈనెల తొమ్మిదిన నిర్వహించింది. ఈ పరీక్షకు 4.03 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేయగా, 3.02 లక్షల మంది హాజరయ్యారు.

నేడు ప్రాథమిక కీ విడుదల

గ్రూప్-1 ప్రిలిమినరీ రాతపరీక్షకు సంబంధించిన ప్రాథమిక కీకి గురువారం విడుదల చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ప్రాథమిక కీతోపాటు మాస్టర్ ప్రశ్నాపత్రం టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఈనెల 17 వరకు అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రాథమిక కీపై ఈనెల 17న సాయంత్రం ఐదు గంటల వరకు టీజీపీఎస్సీ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో అభ్యంతరాలను స్వీకరిస్తామని తెలిపారు. ఇతర వివరాలకు ఎఎఎ.ంఙూంఎ.సె్జఙ.ఱఅ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

గ్రూప్-1 మెయిన్ షెడ్యూల్

సబ్జెక్టు	తేదీ
జనరల్ ఇంగ్లీష్	అక్టోబర్ 21 (అర్హత పరీక్ష)
పేపర్-1 జనరల్ ఎస్సే	అక్టోబర్ 22
పేపర్-2 చరిత్ర, సంస్కృతి,	అక్టోబర్ 23 జాగ్రఫీ
పేపర్-3 భారతీయ సమాజం	అక్టోబర్ 24 రాజ్యాంగం, పరిపాలన
పేపర్-4 ఎకానమి, అభివృద్ధి	అక్టోబర్ 25
పేపర్- 5 సైన్స్అండ్	అక్టోబర్26 టెక్నాలజీ, డాటా ఇంటర్‌ప్రిటేషన్
పేపర్-6 తెలంగాణ ఉద్యమం	అక్టోబర్ 27 రాష్ట్ర ఆవిర్భావం

ఆశాలకు 'పరీక్ష'పై వెనక్కి తగ్గాలి

- ఇప్పటికే ఎన్నో శిక్షణలు పొందారు
- కరోనా నియంత్రణలో వారి పాత్ర కీలకం
- మళ్లీ ఎగ్జామ్ అంటే అవమానించడమే.. : తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.జయలక్ష్మి
- హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రభుత్వం అప్పగించే ప్రతి పనినీ ఆశాలు చేస్తున్నారు.. వారికి ఎన్నో ఏండ్ల అనుభవం ఉంది.. అన్ని రకాలుగా ప్రజలకు సేవలు చేస్తున్న వారికి మళ్లీ ఎగ్జామ్ పెట్టి వారి ప్రతిభను నిరూపించు కోవాలనడం వారిని అవమానించడమేనని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షులు పి.విజయలక్ష్మి అన్నారు. ఆశాలకు అసెంబ్లీ ఎన్నికలకు ముందు.. సమ్మె సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బుధవారం సికింద్రాబాద్ హరిహరకళా భవన్ వద్ద ఉన్న హైదరాబాద్ డీఎంఅండ్‌హెచ్‌ఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డీఎంఅండ్‌హెచ్‌ఓ వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. ఆశాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాననీ, పని ఒత్తిడి, వేధింపులను అరికట్టడానికి కృషి చేస్తానని డీఎంఅండ్‌హెచ్‌ఓ హామీనిచ్చారు. అంతకుముందు ధర్నా వద్ద పి.జయలక్ష్మి మాట్లాడుతూ.. ఆశాలకు నష్టం కలిగించే పరీక్షల నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. రాష్ట్రంలో గిరిజన ప్రాంతంలో 33 ఏండ్లు, మైదాన ప్రాంతంలో 19 ఏండ్ల నుంచి ఆశాలు పనిచేస్తున్నారని తెలిపారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక ట్రైనింగ్‌లు పొందారని చెప్పారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పని చేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్నిరకాల జబ్బులను గుర్తిస్తున్నారని, ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారని, తగిన జాగ్రత్తలను ఎప్పటికప్పుడూ ప్రజలకు వివరిస్తున్నారని తెలిపారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలు, ప్రజలకు ఆరోగ్య సేవలందిస్తున్నారని చెప్పారు. కరోనా నియంత్రణలో ఆశాలు కీలకపాత్ర పోషించారని, ప్రపంచ ఆరోగ్య సంస్థ వారిని 'హెల్త్ గ్లోబల్ లీడర్స్' అని అవార్డు కూడా ప్రకటించినట్టు గుర్తు చేశారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ, ఇంత సీనియారిటీ ఉన్న ఆశా వర్కర్లకు మళ్లీ కొత్తగా ఎగ్జామ్స్ నిర్వహించి వారి శక్తిని నిరూపించుకోవాలని చెప్పడం సమంజసం కాదన్నారు.

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కూడా ఇదే నిర్ణయాన్ని ముందుకు తెచ్చి అమలు చేయాలని చూస్తే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాలు చేయడంతో వెనక్కి తగ్గిందని గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాలకు మళ్లీ కొత్త సమస్యలు తేవడం అన్యాయం అన్నారు. ఈ పరీక్ష వల్ల ఎలాంటి లాభం లేదని, ఈ పనుల పట్ల ఆశాల జ్ఞాపకశక్తిని కొత్తగా నిరూపించుకుంటే ఒక సర్టిఫికెట్‌కు రూ.5వేలు ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్ ఇచ్చినట్టు తెలిపారు. ఏండ్లుగా చాకిరీ చేస్తున్న ఆశాలకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలనీ, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలనీ కోరారు. ఈ ధర్నాలో సీఐటీయూ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, సౌత్ సిటీ కమిటీ అధ్యక్షులు ఎం.మీనా, సీనియర్ నాయకులు ఆర్.మల్లేష్, ఆశా వర్కర్స్ యూనియన్ నాయకులు టి.యాదమ్మ, ఎం.అనిత భాగ్యలక్ష్మి పుష్పలత, కవిత, జహీదా తదితరులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్ రద్దు చేయాలని..

కరీంనగర్ జిల్లాలో అర్బన్ హెల్త్ సెంటర్ ఫీల్డ్ వర్కర్ ఏఎన్ఎంలకు బయోమెట్రిక్ విధానం రద్దు చేయాలని తెలంగాణ అర్బన్ హెల్త్ సెంటర్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సుజాతకు వినతిపత్రం అందజేశారు.

చంద్రబాబు అనే నేను..

(మొదటిపేజీ తరువాయి)

విమానాశ్రయం ఎదురుగా ఉన్న కేసరపల్లిలో ప్రమాణస్వీకారోత్సవం జరిగింది.

17 మంది కొత్తవారికి చోటు

మంత్రివర్గ కూర్పులో భాగంగా టీడీపీ నుంచి 20 మంది, జనసేన నుంచి ముగ్గురు, బీజేపీ నుంచి ఒకరిని మంత్రివర్గంలోకి తీసుకున్నారు. సీనియర్లు, యువత మధ్య సమతూకం పాటిస్తూ మంత్రివర్గాన్ని రూపొందించినట్టు టీడీపీ నేతలు చెప్పారు. ఇందులో 17 మంది కొత్తవారే కావడం గమనార్హం. ముగ్గురు మహిళలకు చోటు లభించింది. బీసీలు ఎనిమిది మంది, ఎస్సీలు ఇద్దరు, ఎస్టీ ఒకరు, నలుగురు కాపు, ఐదుగురు కమ్మ, ముగ్గురు రెడ్లకు మంత్రివర్గంలో అవకాశమిచ్చారు. జనసేన నుంచి పవన్ కల్యాణ్‌తోపాటు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌కు క్యాబినెట్‌లో చోటు దక్కింది. బీజేపీ నుంచి సత్యకుమార్‌యాదవ్‌కు మంత్రి పదవి వచ్చింది.

ప్రమాణం చేసింది వీరే..

1. నారా చంద్రబాబునాయుడు..టీడీపీ...ముఖ్యమంత్రి
2. పవన్ కల్యాణ్..జనసేన..మంత్రి
3. నారా లోకేష్...టీడీపీ
4. కె.అచ్చెన్నాయుడు..టీడీపీ
5. కొల్లు రవీంద్ర..టీడీపీ
6. నాదెండ్ల మనోహర్..జనసేన
7. పి.నారాయణ...టీడీపీ
8. వంగలపూడి అనిత...టీడీపీ
9. సత్యకుమార్ యాదవ్..బీజేపీ
10. నిమ్మల రామానాయుడు..టీడీపీ
11. ఎన్ఎండీ ఫరూక్..టీడీపీ
12. ఆనం రాంనారాయణ్‌రెడ్డి..టీడీపీ
13. పయ్యావుల కేశవ్..టీడీపీ
14 అనగాని సత్యప్రసాద్..టీడీపీ
15. కొలుసు పార్థసారథి...టీడీపీ
16. డోలా బాల వీరాంజనేయస్వామి..టీడీపీ
17. గొట్టిపాటి రవి..టీడీపీ
18. కందుల దుర్గేష్..జనసేన
19. గుమ్మడి సంధ్యారాణి..టీడీపీ
20. బీసీ జనార్థన్‌రెడ్డి..టీడీపీ
21. టీజీ భరత్...టీడీపీ
22. ఎస్.సవిత...టీడీపీ
23. వాసంశెట్టి సుభాష్..టీడీపీ
24. కొండపల్లి శ్రీనివాస్..టీడీపీ
25. మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి..టీడీపీ

ఏపీ కీర్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుంది: ప్రధాని మోడీ

టీడీపీ,జనసేన, బీజేపీ కూటమి ఏపీ కీర్తిని ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. ఏపీలో నూతన ప్రభుత్వ ఏర్పాటుపై ప్రధాని 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. 'ఏపీ నూతన మంత్రుల ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యా..సీఎంతోపాటు ప్రమాణం చేసిన మంత్రులందరికీ అభినందనలు.రాష్ట్ర యువత ఆకాంక్షలు నెరవేర్చేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది' అని మోడీ ట్వీట్ చేశారు. ఇదిలావుండగా కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సైతం 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. సీఎం ప్రమాణం చేసిన చంద్రబాబుకు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు శుభాకాంక్షలు అంటూ ట్వీట్ చేశారు. దీంతో ఏపీకి కాబోయే ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అని చెప్పకనేచెప్పినట్టయింది.

ఆర్టీసీ చార్జీలు పెంచలేదు

- పెరిగిన టోల్‌చార్జీలు సవరించాం
- తప్పుడు ప్రచారం చేస్తే పోలీస్‌కేసులు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) బస్సుల్లో సాధారణ ఛార్జీలు పెరిగాయని జరుగుతున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని యాజమాన్యం తెలిపింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రజాసంబంధాల అధికారి బుధవారంనాడొక పత్రికా ప్రకటన విడుదల చేశారు. సాధారణ చార్జీలు యథాతథంగానే ఉన్నాయని స్పష్టం చేశారు. హైవేలపై టోల్ చార్జీలను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకున్నదనీ, దానికి అనుగుణంగా ఆర్టీసీ టిక్కెట్లలో టోల్‌సెస్‌ను సవరించామని తెలిపారు. సవరించిన టోల్‌సెస్ ఈ నెల 3వ తేదీ నుంచే అమల్లోకి వచ్చిందనీ, టోల్ ప్లాజాలున్న రూట్లలోనే ఈ సవరణ జరిగిందని వివరించారు. వాస్తవాలు తెలుసుకోకుండా బస్ ఛార్జీలను పెంచినట్టు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేయడం మంచిది కాదని హెచ్చరించారు. సంస్థ ప్రతిష్టకు భంగం కలిగేలా తప్పుడు ప్రచారం చేసే వారిపై పోలీస్ శాఖ సహకారంతో చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విచారణ కమిషన్ల పనిపై లీకులెందుకు?

- హామీలపై ప్రజలు నిలదీస్తారనే డ్రామాలు
- నీళ్లు, విద్యుత్ విషయంలో కాంగ్రెస్ విఫలం : మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



నవతెలంగాణ-సూర్యాపేట

ఎన్నికల కోడ్ ముగిసాక హామీల అమలుపై ప్రజలు నిలదీస్తారనే భయంతో కమిషన్ల విచారణ పేరుతో మీడియాకు లీకులు ఇస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం డ్రామాలు చేస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నీళ్లు, విద్యుత్ సరఫరా విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. విద్యుత్ కొనుగోళ్లు, కాళేశ్వరం ప్రాజెక్టుల విచారణపై బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలైనా హామీలను అమలు పర్చకుండా గత ప్రభుత్వాలపై నిందలు వేస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పబ్బం గడుపుతోందని విమర్శించారు. ప్రభుత్వం చేతగానితనాన్ని కప్పిపుచ్చుకుంటూ కమిషన్ల ఏర్పాటు పేరుతో కాలయాపన చేస్తోందన్నారు. విచారణ కమిషన్లు వాటి పని అవి చేసుకుంటాయని, ప్రభుత్వం ఎందుకు లీకులు ఇస్తోందని ప్రశ్నించారు. ప్రజలు మంచినీళ్ల కోసం రోడ్లెక్కే పరిస్థితి వచ్చిందన్నారు. పదేండ్ల కిందట ఉన్న దుస్థితి మళ్లీ దాపురించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేతగానితనాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తామని చెప్పారు. ఇచ్చిన హామీలు, రైతు రుణమాఫీపై దృష్టి మరల్చేందుకు ప్రయత్నం చేస్తోందన్నారు. మీడియాకు లీకులిచ్చి చెత్త, రోత రాతలు రాపిస్తున్నారని విమర్శించారు. గత ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులపై ఎన్ని కమిషన్లు వేసినా అభ్యంతరం లేదన్నారు.

మొదటి రోజే పుస్తకాలు, యూనిఫారాలు

- ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పంపిణీ
- బడిబాటలో పాల్గొన్న పలువురు మంత్రులు


నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేటు పాఠశాలలు బుధవారం నుంచి పున:ప్రారంభమయ్యాయి. బడులు తెరిచిన మొదటిరోజే సర్కారు బడుల్లో చదివే విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫారాలను పంపిణీ చేశారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో పలువురు మంత్రులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని ఎన్ఎస్ కెనాల్ కాలనీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొన్నారు. హైదరాబాద్ అబిడ్స్‌లోని అలియా మోడల్ హైస్కూల్‌ను మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రారంభించారు. సంగారెడ్డి జిల్లా రాయికోడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి మంత్రి దామోదర్ రాజనర్సింహ హాజరయ్యారు. ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలతోపాటు ఇతర ప్రజాప్రతినిధులు బడిబాట కార్యక్రమంలో భాగస్వాములయ్యారు. జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రయివేటు బడుల మోజు నుంచి బయటపడేలా పిల్లల తల్లిదండ్రుల్లో మార్పు తెచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నది. ఒకటి నుంచి 12వ తరగతి వరకు చదువుతున్న 21,19,439 మంది విద్యార్థులకు రెండు జతల యూనిఫారాలను పంపిణీ చేయనుంది. ఇప్పటికే ఒక జతను పంపిణీ చేసేందుకు పాఠశాలలకు పంపించింది. రెండో జత కూడా ఈనెలాఖరులోగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టింది. ఆరు నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థుల కోసం 1.11 కోట్ల నోట్ పుస్తకాలను ప్రభుత్వం ముద్రించింది. వారిలో మొదటి రోజు 11,65,995 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేసేందుకు అధికారులు అందుబాటులో ఉంచారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో 25,80,291 మంది విద్యార్థులకు 1.50 కోట్ల పాఠ్యపుస్తకాలను సర్కారు పంపిణీ చేయనుంది. ఒకటి నుంచి ఐదో తరగతి విద్యార్థులకు వర్క్ బుక్స్ కూడా ప్రభుత్వం పంపిణీ చేస్తున్నది. మొదటి రోజు 10,09,464 మంది విద్యార్థులు వర్క్ బుక్స్ అందుకునేలా విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది.

వర్షాలు, వరదలతో నష్టం జరగొద్దు

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

- నివాసయోగ్యం కాని నిర్మాణాలను తొలగిస్తాం
- బీసీ సంక్షేమం, రవాణా శాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- అధికారులతో సమీక్షా సమావేశం



నవతెంగాణ-సిటీబ్యూరో

హైదరాబాద్‌లో వర్షాకాలంలో ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకోవాలని బీసీ సంక్షేమం, రవాణాశాఖ, హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఆయా శాఖల ఉన్నతాధికారులకు సూచించారు. నగరంలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో బుధవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సమావేశం మందిరంలో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. దాదాపు రెండు గంటలకుపైగా కొనసాగిన సమీక్షా సమావేశంలో మాన్‌సూన్ ప్రిపరేషన్ యాక్షన్ ప్లాన్‌ను అధికారులు మంత్రికి వివరించారు. పారిశుధ్యం, నాలాల్లో పూడికలు, నీటి నిల్వలపై చర్చ జరిగింది. జీహెచ్ఎంసీ, వాటర్‌బోర్డు, విద్యుత్ శాఖలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై పలు సూచనలు సలహాలు అందించారు. ఈ సందర్భంగా మీడియాతో మంత్రి మాట్లాడారు. నగరంలో శానిటేషన్ సమస్య ఉందని, దాన్ని అధిగమించేందుకు అన్ని చర్యలూ తీసుకుంటున్నామని తెలిపారు. చికెన్, మటన్ వేస్టేజ్ ద్వారా ఆదాయం పెరిగేలా త్వరలో సమీక్ష చేస్తామన్నారు. పురాతన భవనాలకు సంబంధించిన వాటిని గుర్తించామని, నివాసయోగ్యం కాని వాటిని తొలిగిస్తామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో మరింత అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. రాబోయే వన మహోత్సవంలో హైదరాబాద్‌ను గ్రీన్ సిటీగా ఉంచాలన్నారు. వాటర్ లాకింగ్ పాయింట్స్ గుర్తించి వర్షం పడిన వెంటనే అక్కడకు సిబ్బంది వెళ్లి నీరు నిల్వ ఉండకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. రోడ్లపై చెత్తాచెదారం పేరుకుపోతోందని, శానిటేషన్‌కు సంబంధించి జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. రోడ్లు, ఖాళీ స్థలాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. దోమల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 141 వాటర్ లాకింగ్ పాయింట్స్‌ను గుర్తించామని, నీటిని తొలగించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రభుత్వం పక్షాన జీహెచ్ఎంసీకి అన్ని సహాయసహకారాలు అందిస్తామన్నారు. ఏ సమస్య వచ్చినా అందరం కలిసికట్టుగా ముందుకెళ్దామని చెప్పారు. అందరికీ అందుబాటులో ఉండేలా ఒక నెంబర్‌ను ఉంచాలని అధికారులను ఆదేశించారు.

లేక్ ప్రొటెక్షన్ ముఖ్యమైందని, అక్కడ అభివృద్ధికి బాధ్యత తీసుకోవాలని ఐటీ కంపెనీలను ఆదేశించారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచాలని, ఏ సమస్య ఉన్న ప్రభుత్వం దృష్టికి తీసుకురావాలని అన్నారు. నాలాల్లో సిల్ట్ తీయడంపై గతంలో ఆరోపణలు వచ్చాయని, ఈసారి అందరి సహకారంతో ముందుకెళ్తామన్నారు. సిల్ట్ తీయడంపై అవినీతి జరిగిందంటే కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుక్కలతో నగర ప్రజలకు ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య నిర్వహణ సజావుగా జరగాలని, క్షేత్ర పరిధిలో పర్యవేక్షించాలని అన్నారు. రెస్టారెంట్లు, హోటళ్లలో నాణ్యమైన, హైజనిక్ ఫుడ్ అందించేలా చూడాలని చెప్పారు.

ఈ సమావేశంలో మేయర్ గద్వాల విజయలక్ష్మి, ఇన్‌చార్జి కమిషనర్ ఆమ్రపాలి, జోనల్ కమిషనర్లు, ఈఎన్‌సి జియా ఉద్దీన్, ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఎస్ఎన్‌డిపి సిఈ కోటేశ్వరరావు, సీఈ దేవానంద్, జోనల్ కమిషనర్లు, స్నేహ శబరిష్, అభిలాష అభినవ్, హేమంత్ సహదేవ్‌రావు, రవి కిరణ్, వెంకన్న, అడిషనల్ కమిషనర్లు కె.శ్రీవాత్సవ, సత్యనారాయణ, ఉపేందర్ రెడ్డి, రాచకొండ, హైదరాబాద్, సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ట్రాఫిక్ ఏసీపీలు, జలమండలి నుంచి డైరెక్టర్లు అజ్మీరాకృష్ణ, స్వామి, ఇంజినీరింగ్ విభాగం అధికారులు, విద్యుత్ విభాగం, ట్రాఫిక్ విభాగం, వాటర్ బోర్డ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే డిగ్రీ కాలేజ్‌లో కొత్త కోర్సులు

- అడ్మిషన్లు ప్రారంభం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

సికింద్రాబాద్ తార్నాకలోని రైల్వే డిగ్రీ కళాశాలలో ఈ విద్యాసంవత్సరం నుంచి కొత్త కోర్సులు ప్రవేశపెడుతున్నట్టు యాజమాన్యం తెలిపింది. 1977లో ఏర్పాటైన ఈ కళాశాల ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అనుబంధంగా కొనసాగుతుంది. 2024-25 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు జరుగుతున్నాయనీ, విద్యార్థులు 'దోస్త్' ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. బీ.కాం(జనరల్), బీ.కాం (కంప్యూటర్ అప్లికేషన్స్), బీ.ఎస్సీ(ఎం.పీ.సీ), బీ.ఎస్సీ (ఎం.పీ.సీ.ఎస్.), బీ.ఎస్సీ(ఎం.ఎస్.సీ.ఎస్) కోర్సులు ఉన్నాయి. దానితో పాటు బీబీఏ, బీకామ్ (ఫైనాన్స్) కోర్సుల్ని ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రవేశపెడుతున్నట్టు తెలిపారు.

వీఆర్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా శివకృష్ణ



నవతెలంగాణ - సంతోషనగర్

వడ్డెర రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తమ్మిశెట్టి శివకృష్ణ నియామకమైనట్టు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు గుంజి సంతోష్ కుమార్ తెలిపారు. వీఆర్పీఎస్ ప్రధాన కార్యాలయంలో ముఖ్య నాయకుల సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ్మిశెట్టి శివకృష్ణకు నియామక పత్రాన్ని అందజేశారు. అనంతరం శివకృష్ణ మాట్లాడుతూ ఈ పదవితో నాకు మరిన్ని బాధ్యతలు పెరిగాయని, వడ్డెర జాతి ఐక్యత, మనుగడ కోసం నా వంతు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఆర్పీఎస్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఒత్తిడి లేకుండా విద్యనందించాలి : ఉపేందర్ రెడ్డి



నవతెలంగాణ - చైతన్యపురి

విద్యార్థులను ఒత్తిడికి గురి చేయకుండా నాణ్యమైన విద్యనందించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన గ్లోబల్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ప్రారంభోత్సవంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మంచి భవిష్యత్‌ను పాఠశాలలోనే తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. విలువలతో కూడిన విద్యను అందించినప్పుడే సమాజానికి వారు మంచి చేయగలుగుతారని అన్నారు. ఈ ప్రారంభోత్సవంలో గ్లోబల్ మైండ్స్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ చైర్మెన్ నాగేంద్ర చౌదరి, పెద్దవూర సైదులు, వినయ్, డైరెక్టర్ పావని, ప్రిన్సిపాల్ సల్మా, అడ్మిన్ అర్చన, కౌన్సిలర్ సరిత, వసుదేవుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని వినతి

- మాజీ కౌన్సిలర్ సాయికిరణ్ రెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, ఆదిత్య నగర్ కాలనీ ప్రధాన రహదారి నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని మాజీ కౌన్సిలర్ గుర్రం సాయి కిరణ్ రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారితో పాటు వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించి.. ప్రజల ఇబ్బందులను తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులతో మాట్లాడి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. వినతి అందజేసిన వారిలో నాయకులు సంజీవ, శ్రీశైలం, తిరుపతయ్య, ప్రభాకర్ వాసులు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు

- నాగోల్ ఆర్టీవో పి.రవీందర్ కుమార్



నవతెలంగాణ- నాగోల్

ప్రైవేట్ కాలేజీలు, పాఠశాలలకు సంబంధించిన బస్సులు నిబంధనలు పాటించకుండా విద్యార్థులను తరలిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని నాగోలు ఆర్టీవో పి.రవీందర్ కుమార్ ప్రైవేట్ విద్యాసంస్థలకు సూచించారు. బుధవారం పాఠశాలలు పునః ప్రారంభమైన నేపథ్యంలో జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ సి. రమేష్ ఆదేశాల మేరకు ఆర్టీవో పి. రవికుమార్ ఆధ్వర్యంలో స్కూలు, కాలేజీల బస్సులను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా బస్సుల ఫిట్నెస్‌లు, ఇన్సూరెన్స్‌లు, టాక్సీలకు సంబంధించిన పలు ధ్రువపత్రాలను పరిశీలించారు. అనంతరం ఆర్టీవో రవీందర్ కుమార్ మాట్లాడుతూ ఈ తనిఖీలలో సరైన పత్రాలు లేకుండా రోడ్లపై స్కూల్ పిల్లలను తరలిస్తున్న 18 స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు తెలిపారు. 15 సంవత్సరాలు దాటిన ఏ బస్సును నడపవద్దు అని సూచించారు. నడిపితే చట్టపరమైన చర్యలతో పాటు బస్సులను సీజ్ చేయడమే కాకుండా విద్యాసంస్థలపై కూడా చర్యలు తీసుకోవాల్సి వస్తుందని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచించారు. ఆరోగ్యవంతులైన డ్రైవర్లను ఎంపిక చేసుకోవాలన్నారు. బస్సును నడిపే ప్రతీ డ్రైవరు విధి నిర్వహణలో మద్యం సేవించకుండా, సెల్‌ఫోన్లు వాడకూడదన్నారు. విద్యార్థులు బస్సులు ఎక్కే, దిగే సమయాలలో అప్రమత్తంగా ఉంటూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఈ తనిఖీలలో ఎంవిఐలు కే. రవీందర్ రెడ్డి, కే. అమర్నాథ్, ఎం. అనిత, పలువురు ఎంవిఐలు తదితరులు పాల్గొన్నారు.

మధురానగర్ కాలనీ అధ్యక్షుడిగా రాజేశ్వర్ రెడ్డి



నవతెలంగాణ - బడంగ్‌పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్ గూడలో ఉన్న మధురానగర్ కాలనీ నూతన కార్యవర్గాన్ని బుధవారం కాలనీలో సమావేశంలో ఎన్నుకున్నారు. మధురా నగర్ కాలనీ అధ్యక్షుడిగా ఏమిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ముచ్చర్ల తిరుపతయ్య యాదవ్, కోశాధికారిగా శిరందాసు వెంకటేష్, ఉపాధ్యక్షులు ఏ.సత్తయ్య, వి.రామరావు, జి.పురుషోత్తం రెడ్డి, సహాయ కార్యదర్శులుగా కె.వెంకట్ రెడ్డి, డి.మధుసూదన్ రెడ్డి, డి.రాజేందర్ రావు, ముఖ్య సలహాదారులుగా గార్లపాటి మల్లారెడ్డి, కమిటీ సభ్యులుగా ఎండీ.జహంగీర్, సి.హెచ్ మధుచారి, సాగి రాహుల్ శర్మ, పి.శ్రీశైలం యాదవ్, వేముల లక్ష్మీకాంత్ రావు, పాశం విజేందర్ రెడ్డి, బి.రాజశేఖర్ రెడ్డి, ఎస్.నర్సింహా రెడ్డి, జి.చంద్రశేఖర్ రెడ్డి, కంచర్ల సుధీర్ రెడ్డి, సురభి ప్రకాష్ రావు, కుంభం దినేష్ రెడ్డి, మునుకుంట్ల సైదుల్ గౌడ్, మల్ రెడ్డి వెంకట్ రెడ్డిలను ఎన్నుకున్నారు. తర్వాత కమిటీ సభ్యులను బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రామిడి రాంరెడ్డి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం నూతన అధ్యక్షులు మాట్లాడుతూ కార్పొరేటర్ రామిడి కవిత రాంరెడ్డి సహకారంతో ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

సహకార స్ఫూర్తితో ముందుకెళ్తున్నాం

- మల్టీస్పెషాలిటీ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ చలసాని రాఘవేంద్రరావు



నవతెలంగాణ- నాగోల్

ఎన్నో త్యాగాలు, ఎంతో సహకార స్ఫూర్తితో నేడు 109వ వసంతాలు పూర్తిచేసుకుని ముందుకు సాగుతున్నామని మల్టీ స్పెషాలిటీ విశాఖపట్నం కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మెన్ చలసాని రాఘవేందర్ రావు అన్నారు. బుధవారం నక్షత్ర హోటల్లో హైదరాబాద్ జోన్ బ్యాంకు శాఖల సంప్రదింపుల కమిటీ సభ్యుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ పాలక వర్గాలు ఆర్థిక వ్యత్యాసాలను సరిదిద్దడంలో వెనుకబడిపోయారని అన్నారు. కార్పొరేట్ సంస్థలకు వెసులుబాటు కల్పిస్తూ దేశంలోని పేదలను మరింత పేదలుగా మారుస్తున్నారని, సంపన్నులను మరీ సంపన్నులుగా చేసేందుకు వారికి అనుకూలంగా చట్టాలను సరళీకరిస్తూ పాలన సాగిస్తున్నారన్నారని ఆరోపించారు. దేశంలో పొలిటికల్ ఎకనామి నడుస్తోందని, రూల్స్ నిబంధనలకు విరుద్ధంగా ప్రస్తుత, నూతన విధానంతో కుంభకోణాలకు తెరలేపుతున్నారని, తద్వారా ప్రజలపై పరోక్ష భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.

అనంతరం హైదరాబాద్ జోనల్ మేనేజర్ పి.ప్రసాద్ రావు(జోనల్ మేనేజర్) జోన్‌లోని ఆయా శాఖల ఆర్థిక స్థితిగతులు, పని విధానం బ్యాంకు లావాదేవీలు, ఖాతాదారుల షేర్లు, వాటి ఒడిదుడుకులు అన్ని రంగాల ఖాతాదారులకు చేస్తున్నటువంటి సేవలను, లాభనష్టాలను వివరించారు. తర్వాత చలికాని. కృష్ణమోహన్ రావు (డైరెక్టర్) మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో, అంతర్జాతీయ స్థాయిలో సహకార భావన, సహకార సూత్రాలు, వాటి ఆవశ్యకత సమాజంలో కింది స్థాయిలో ఉన్నటువంటి, అట్టడుగు వర్గాలను భాగస్వామ్యం చేస్తూ వారి ఆర్థిక ఎదుగుబాటుకు సహకార బ్యాంకులు, సహకార రంగం చేయాల్సిన విధివిధానాల గురించి క్లుప్తంగా వివరించారు. డాక్టర్ ఆర్. వైద్యనాథన్ డైరెక్టర్(మాజీ ఆర్బీఐ అధికారి) అధ్యక్షత వహించిన సదస్సులో బ్రాంచ్ మేనేజర్లు, సిబంది, పాలక వర్గం సంప్రదింపుల కమిటీ సభ్యులు బొడ్డుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలి'



నవతెలంగాణ - సంతోష్ నగర్

నాయీ బ్రాహ్మణులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలని నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రాచమల్ల బాలకృష్ణ కోరారు. హైదరాబాద్ రాష్ట్ర కార్యాలయంలో రాచమల్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులుగా చింతల శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా గోలన్ కొండ అశోక్‌లను నియమించారు. తర్వాత వారికి నియామక పత్రాలను అందజేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణ ఫెడరేషన్ కార్పొరేషన్‌గా మార్చి పాలక మండలి నియమించి.. 500 కోట్లు విడుదల చేసి నాయీ బ్రాహ్మణులను ఆదుకోవాలని కోరారు. 50 ఏండ్లు దాటిన నాయీ బ్రాహ్మణులకు వృద్ధాప్య పెన్షన్, ఆకస్మాత్తుగా మరణించిన వారికి ఐదు లక్షల బీమా సౌకర్యం కల్పించాలన్నారు. కళ్యాణ కట్టల్లో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులను ప్రభుత్వ ఉద్యోగులకు గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వాయిద్య కళాకారుల సంఘం కన్వీనర్ మంగలి కృష్ణుడు, రాష్ట్ర నాయకులు రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు అన్నం దాస్ చంద్రశేఖర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి చందు తదితరులు పాల్గొన్నారు.

బడికి వేళాయేరా...



నవతెలంగాణ - కొత్తపేట

పాఠశాలలు బుధవారం పున: ప్రారంభమయ్యాయి. కొత్తపేట లోని ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లీష్ మీడియం ఉండడంతో ప్రజలు ఆసక్తితో తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్నారు. దీంతో పాఠశాల ముందు విద్యార్థుల సందడి నెలకొంది.



విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫాంలు అందజేత



నవతెలంగాణ - వనస్థలిపురం

ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వనస్థలిపురం డివిజన్ నందు ఉన్న ప్రభుత్వ పాఠశాలలో బడిబాట నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు ఉత్తమ బోధనను అందిస్తున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు గట్టి పోటీ ఇస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం.ఈ.ఓ. హీర్యా నాయక్, వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వరరెడ్డి, మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు చింతల రవికుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నగొని శ్రీధర్ గౌడ్, పాఠశాల హెడ్ మాస్టర్ దుర్గలత, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

సాహెబ్ నగర్ ప్రభుత్వ పాఠశాలలో..

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న వారు ఎందరో ఉన్నత శిఖరాలను అధిరోహించారని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్, టెక్స్ట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ హీర్యా నాయక్, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దినేష్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు రాధాకృష్ణ, ఏపీపీ సీ మమత, నాగలక్ష్మి, ఉపాధ్యాయ బృందం, మోర్చా కన్వీనర్ భూపాల్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ-తుర్కయంజాల్

తుర్కయంజాల్ మున్సిపాలిటీ కోహెడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు తిరుపతి భాయి, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అధ్యక్షురాలు స్వప్నలు కలిసి పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు దన్నె రాజు, జగన్ రాజు, నరసింహ, లక్ష్మన్, గోపాల్ రెడ్డి, రాధా మాధవి, కొండయ్య, మంజుల, జగదీష్ చారి, కృష్ణ కుమార్, వెంకటేశ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత

మేయర్ పారిజాత నర్సింహారెడ్డి

నవతెలంగాణ - బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇచ్చారని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ బడంగ్‌పేట్, బాలాపూర్‌లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ మేరకు విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లను మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి, డిప్యూటీ మేయర్ ఇబ్రం శేఖర్‌లు అందజేశారు. ఈ





సందర్భంగా వారు మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి పేద ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని చెప్పారు. ముఖ్యంగా విద్య, వైద్య రంగాలను బడుగు, బలహీన వర్గాలకు అందుబాటులోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. విద్యతోనే ప్రతి ఒక్కరికీ సమాజంలో మంచి గుర్తింపు వస్తుందని, అందుకోసం ప్రతి ఒక్కరూ తమ పిల్లలను విధిగా పాఠశాలలకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి, కార్పొరేటర్లు పెద్దబావి సుదర్శన్ రెడ్డి, బండారి మనోహర్, నాయకులు ఎర్ర జైహింద్, రాళ్లగూడెం శ్రీనివాస్ రెడ్డి, లిక్కి కృష్ణ రెడ్డి, గట్టు బాలకృష్ణ, ప్రధానోపాధ్యాయులు అర్జున్, రామాంజులు రెడ్డి, ఉపాధ్యాయులు రహీమ్, సునీత, సరోజ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ - మలక్‌పేట్

బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అందజేసిన పుస్తకాలను బుధవారం ఎమ్మెల్యే అహ్మద్ బలాల విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాల తరహా విద్యాబోధన అందుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్, జీహెచ్ఎంసీ అధికారులు, నీటి పారుదల శాఖ అధికారులు, విద్యా శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ - బడంగ్‌పేట్

మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పి. సబితా ఇంద్రారెడ్డిని ఆమె నివాసంలో బుధవారం మాజీ ఆర్మీమెన్, జల్‌పల్లి మున్సిపల్ సోషల్ మీడియా ఇంచార్జి కాట్రగడ్డ వాసుబాబు మర్యాద పూర్వకంగా కలిశారు. తర్వాత తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ప్రసాదాన్ని సబితమ్మకు అందజేశారు.



వెంకట రమణరావు కుటుంబానికి పరామర్శ



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద శర్మ బావ వెంకట రమణ రావు ఇటీవల అనారోగ్యంతో మరణించాడు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ఆర్కేపురం డివిజన్ అల్కాపురి రోడ్ నెంబర్- 4లో ఆయన కుటుంబ సభ్యులైన భార్య సుహాసిని, కుమారులు కార్తీక్, ప్రతీక్, మౌనిక్ రావులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మురుకుంట్ల విజయ భారతి, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు సాజీద్, గొడుగు శ్రీనివాస్, న్యాల కొండ శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ మహిళా అధ్యక్షురాలు లిక్కి ఊర్మిళా రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాం నర్సింహా గౌడ్, కంచర్ల శేఖర్, జైశ్రీమ్మనారాయణ, పెంబర్తి శ్రీనివాస్, మహేందర్ కుమార్ , తదితరులు పాల్గొన్నారు.

ఈద్గల పరిసరాలను శుభ్రంగా ఉంచాలి



ఎమ్మెల్యే అహ్మద్ బలాల

నవతెలంగాణ - మలక్ పేట్

ఈ నెల 17న ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకునే బక్రీద్ పండుగ సందర్భంగా ఈద్గల పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచాలని ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. డీఎంసీ ఆఫీసు నల్గొండ క్రాస్ రోడ్ నందు జీహెచ్ఎంసీ అధికారులతో బుధవారం సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదులు, ఈద్గల దగ్గర బ్లీచింగ్ జల్లి శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రార్థనలకు వెళ్లే ముస్లిం సోదరులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

గుండె పోటుతో రాధక్క మృతి



నవతెలంగాణ - సంతోష్ నగర్

వామపక్ష ఉద్యమ నాయకురాలు కామ్రేడ్ రాధక్క(83) గుండెపోటుతో బుధవారం మృతి చెందారు. హైదరాబాద్ యాకుత్ పురా నియోజకవర్గం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సింగరేణి కాలనీలోని స్వగృహంలో ఆమె బుధవారం ఉదయం గుండెపోటుకు గురయ్యారు. వెంటనే కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించగా...అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ వెల్లడించారు. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ అబ్బాస్, హైదరాబాద్ సౌత్ జిల్లా సీపీఐ(ఎం) నాయకులు పి. నాగేశ్వర్, ఎం. బాలు, ఎం. శ్రవణ్ కుమార్, మహేష్ తదితరులు ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కొత్తపేటను వీడని డ్రయినేజీ సమస్య



నవతెలంగాణ-కొత్తపేట

కొత్తపేటలోని ప్రసన్న మహంకాళి అమ్మవారి గుడి పక్కన ఉన్న డ్రైనేజీ పొంగిపొర్లుతుంది. దీంతో రోడ్డుపైకి చేరిన మురుగు నీటి వలన పాదాచారులు, వాహనాదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కేంద్ర మంత్రులకు సన్మానం







నవతెలంగాణ- బడంగ్‌పేట్

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో విజయం సాధించి, ఢిల్లీలో నూతన కేంద్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కేంద్ర మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణాదేవి, పర్యాటక శాఖ మంత్రి రావు ఇంద్రజిత్ సింగ్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే. అరుణలను బుధవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొలన్. శంకర్ రెడ్డి తన మిత్రులతో కలిసి పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. తర్వాత ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కోసం కేంద్ర మంత్రులుగా తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఆయన వెంట జోగిందర్, దీప్చాంద్, మురళి, లక్ష్మణ్, దీప్ చంద్, ఆర్ కే శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నవతెలంగాణ
నవతరం తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
గురువారం జూన్ 13, 2024 www.navatelangana.com

పెండింగ్ పనులు సకాలంలో పూర్తి చేయాలి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి



నవతెలంగాణ-అల్వాల్

మల్కాజిగిరి నియోజకవర్గంలో పెండింగ్ పనులను సకాలంలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, నీటి వసతులపై హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ జీఎం సునీల్‌తో చర్చించారు. ఎమ్మెల్యే రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబితా కిషోర్, జగదీష్ గౌడ్, అంజయ్య, వెంకన్న, పరమేష్, గిరి, ఉష తదితరులు పాల్గొన్నారు.

మల్కాజిగిరిలో శిథిలావస్థ భవనాల కూల్చివేత



నవతెలంగాణ-మల్కాజిగిరి

మేడ్చల్, మల్కాజిగిరి డివిజన్ల పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులు కూల్చి వేస్తున్నారు. బుధవారం మల్కాజిగిరి కింది బస్తీలో టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ తుల్జాసింగ్ ఆధ్వర్యంలో శిథిలావస్థలో ఇండ్లను నేలమట్టం చేశారు. శిథిలావస్థకు చేరిన భసవనాలతో పాటు అక్రమ నిర్మాణాలను సైతం కూల్చేసి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. ప్రజలు ఎక్కడైనా పాత ఇండ్లు ఉంటే అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు.

అధికారులతో కార్పొరేటర్ సమీక్ష



నవతెలంగాణ-కాప్రా

వర్షాకాలంలో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ మల్లాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో జీహెచ్ఎంసీ కాప్రా సర్కిల్ అధికారులు ఈఈ హరిలాల్, డీఈ రూప, ఏఈ శ్రవంతిలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వర్షాకాలం రావడంతో అధికారులు, మాన్సూన్ టీమ్ సభ్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. నాలాల్లో పూడిక తీసే పనులు ముమ్మరం చేయాలని సూచించారు. డివిజన్ పరిధిలో సుమారు రూ.3 కోట్ల పనులు మంజూరయ్యాయని, త్వరగా టెండర్లను పిలిచి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

చర్లపల్లి డివిజన్‌లో వీధి దీపాలు ఏర్పాటు



నవతెలంగాణ-కాప్రా

ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా చర్లపల్లి డివిజన్ పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీల్లో వెలగని వీధి దీపాలకు మరమ్మతులు, కొత్త వీధి దీపాలు ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టారు. బుధవారం చర్లపల్లి కార్పొరేటర్ శ్రీదేవి అధికారులతో పలు కాలనీల్లో పర్యటించారు. నలుగురు సిబ్బందిని నియమించి స్థానిక నాయకులు పనులను దగ్గరుండి చేయించారు. సాయంత్రం చర్లపల్లి, పెద్ద చర్లపల్లి, ఇతర కాలనీల్లో లైట్స్ వెలుగుతాయని అధికారులు తెలిపారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం : పరమేశ్వర్‌రెడ్డి



నవతెలంగాణ-కాప్రా

సీఎం సహాయనిధి పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. మల్లాపూర్ డివిజన్ అన్నపూర్ణ కాలనీకి చెందిన రజిత అనారోగ్యానికి గురి కావడంతో ఆమెకు నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స చేయించాలని మల్లాపూర్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు సాయిగౌడ్ విషయాన్ని పరమేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. చికిత్స కోసం సీఎం సహాయ నిధి కింద రూ.1.30 లక్షలు ఎల్‌వోసీ పత్రాన్ని బాధితురాలి కుటుంబ సభ్యులకు పరమేశ్వర్‌రెడ్డి అందజేశారు. ఆయన వెంట మనోహర్, బాలరాజ్‌గౌడ్, ఉపేందర్ రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

గౌతమ్ నగర్ సమగ్ర అభివృద్ధికి కృషి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌతమ్ నగర్ డివిజన్ సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తున్నామని గౌతమ్ నగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీత రాము యాదవ్ అన్నారు. బుధవారం ఆమె గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలోని వాణినగర్‌లో కొనసాగుతున్న నాలా నిర్మాణ పనులను, సాయినగర్‌లో కొనసాగుతున్న రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, నాలా నిర్మాణ పనులను సర్కిల్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి నిర్దేశిత సమయానికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తేవాలన్నారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో మౌలిక వసతులతో పాటు ప్రజలకు అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, సర్కిల్ ఏఈ దివ్య జ్యోతి, నాయకులు, మహిళలు, కాలనీ ప్రజలు, వాణి నగర్ సంక్షేమ సంఘం నాయకులు, పాల్గొన్నారు.

వీరారెడ్డి నగర్‌లో కార్పొరేటర్ శాంతి పర్యటన



నవతెలంగాణ-కాప్రా

వీరారెడ్డి నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పిలుపు మేరకు నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ బుధవారం అధికారులతో కలిసి వీరారెడ్డి కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు చిన్న వర్షం వస్తే రోడ్లపై నీళ్లు గంటల తరబడి నిలిచి ఉంటున్నాయని, తమ సమస్యను తక్షణమే పరిష్కరించాలని కార్పొరేటర్‌ను కోరారు. ఈ సమస్య పరిష్కరించడానికి ఇదివరకే నీటి డ్రైన్‌లైన్, సీసీ రోడ్డు నిర్మాణం చేశామని కార్పొరేటర్ తెలిపారు. అయినా సమస్యకు పూర్తి పరిష్కారం కాలేదని, మరో నీటి డ్రైన్ లైన్ వేయిస్తానని హామీ ఇచారు. కార్యక్రమంలో నాయకులు సాయి జన్ శేఖర్, మేకల ముత్యంరెడ్డి, శివకుమార్, గంగాధర్, కాలనీవాసులు, అసిస్టెంట్ ఇంజనీర్ లింగారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ విజయకుమార్ పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన క్యాతం మధుకృష్ణ

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని వినతి



నవతెలంగాణ-శామీర్‌పేట

మేడ్చల్ జిల్లా మూడుచింతలపల్లి మండలం లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన క్యాతం మధుకృష్ణ సీఎం రేవంత్‌రెడ్డిని బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. లక్ష్మాపూర్‌లో నెలకొన్న రెవెన్యూ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం మధుకృష్ణ మాట్లాడు తూ.. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల లక్ష్మాపూర్‌లో ఏడు సంవత్సరాలుగా రైతులు పడుతున్న ఇబ్బందులను, పట్టా పాస్ బుక్స్, అక్రమ రిజిస్ట్రేషన్లను వివరించానని తెలిపారు. మండల కేంద్రానికి అనుకోని లక్ష్మాపూర్ రెవెన్యూ పరిధిలో ప్రభుత్వ కార్యాలయాల పక్కా భవనాల నిర్మాణం, మండలం పేరును లక్ష్మాపూర్, ఎంసీపల్లిగా మార్చాలని సీఎంను కోరానని చెప్పారు. దీనికి సీఎం సానుకూలంగా స్పందించి జిల్లా కలెక్టర్, రెవెన్యూ అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

ప్రయివేటుకు దీటుగా ప్రభుత్వ విద్య

- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం కృషి
- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- పాఠశాలలు ప్రారంభం.. విద్యార్థులకు నోట్స్‌బుక్స్ అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రయివేటు పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు, పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం చేస్తుందని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. బుధవారం మేడ్చల్ మండలంలోని నూతన కల్ గ్రామంలో ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కలెక్టర్ విచ్చేసి ఉపాధ్యాయులు, విద్యార్థులకు పునర్ ప్రారంభ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విద్యార్థు లకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ ఆదర్శ పాఠశాలల్లో భాగంగా జిల్లాలో మౌలిక వసతుల కల్పనకు రూ.12 కోట్లు మంజూరు చేసినట్టు తెలిపారు. తమ పిల్లలను ఉన్నత విద్య వైపు మళ్లించి ప్రయివేటు పాఠశాలల కంటే దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించాలని సూచించారు. గ్రామ పెద్దల సహకారం, తల్లిదండ్రుల ప్రోత్సాహంతో పాఠశాలలను పూర్తిగా బలోపేతం చేయాలన్నారు. తాను కూడా ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకుని ఉన్నత స్థాయిలో ఉన్నానని గుర్తు చేశారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులై అనుభవం గల ఉపాధ్యాయులు ఉన్నారని, పిల్లలకు నాణ్యమైన విద్యనందించడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర వహిస్తున్నారని తెలిపారు. రాబోయే కాలంలో ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్టు తెలిపారు. మానసిక ఒత్తిడితో చదువు, సంస్కారం రాదనీ, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా మంచి విద్యను అందిస్తారని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు. ఈ పాఠశాలలో పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన లక్ష్మీ ప్రసన్నకు కలెక్టర్ సర్టిఫికెట్ అందజేశా రు.



ఆడపిల్లలు మంచి ఫలితాలు సాధిస్తున్నారనీ, మగ పిల్లలు కూడా మంచి ఫలితాలు సాధించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలు చదివేందుకు గ్రామ పెద్దలు, పిల్లల తల్లిదండ్రులు సహకారం అందించాలని కోరారు. జిల్లా విద్యాశాఖ అధికారి విజయ కుమారి మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. గతేడాది ఈ పాఠశాల నుంచి 10 పాయింట్స్ వచ్చాయనీ, అదే స్ఫూర్తితో ఇంకా చాలా మంది విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యనందిస్తున్నామని తెలిపారు. అవగాహన కలిగిన ఉపాధ్యాయులు స్వేచ్ఛా యుత వాతావరణంలో పాఠశాలలను తయారు చేస్తార నీ, తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని కోరా రు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ సాంబశివరావు, స్పెషల్ ఆఫీసర్ రేఖమేరీ, ఎంపీపీ రజితా రాజమల్లారెడ్డి, ఎంపీడీవో వసంత లక్ష్మి, తహశీల్దార్ శైలజ, హెచ్ఎం కొండయ్య, మండల సమైక్య అధ్యక్షురాలు శ్రీలత, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



- సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్. సబిత

నవతెలంగాణ-ఘట్కేసర్

గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఎన్. సబిత అన్నారు. అవుషాపూర్ గ్రామపంచాయతీ కార్మికులకు ఏడు నెలలుగా, మర్రిపల్లి గూడ పంచాయతీ కార్మికులకు తొమ్మిది నెలల వేతనాలు అందక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. తక్షణమే వారికి వేతనాలు విడుదల చేయాలన్నారు. బుధవారం పంచాయతీ కార్మికులతో కలిసి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడుతూ..పంచాయతీ కార్మికులు తక్కువ వేతనంతో ఆరుగాలం శ్రమిస్తున్నారని వాపోయారు. వచ్చే తక్కువ వేతనం కూడా ఏడు నెలలుగా రాకపోవడంతో కార్మికుల కుటుంబాల పోషణకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. వేతనాలు అందక డ్వాక్రా గ్రూపుల్లో అప్పు పెరుగుతుందన్నారు. ఏడు నెలలుగా వేతనం ఇవ్వకుంటే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వేతనాలు చెల్లించాలన్నారు. లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో దానయ్య, బుచ్చయ్య, చిన్నదానయ్య, రామచందర్, లక్ష్మీ, పద్మ, సురేష్, సత్తమ్మ, శ్రీనివాస్, పద్మ, బాలరాజు, నరసింహా, వీరమ్మ లక్ష్మణ్, బాలకృష్ణ, సత్యనారాయణ, జయమ్మ, శేఖర్, కవిత, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఫైల్స్‌ను రికార్డు రూంలో భద్రపర్చాలి

- మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్
- కలెక్టరేట్‌లో రికార్డు రూం ప్రారంభం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫైల్స్‌ను రికార్డు రూంలో భద్రపర్చాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ గౌతమ్ సూచించారు. కలెక్టరేట్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ఏర్పాటు చేసిన రికార్డు రూంను కలెక్టర్ బుధవారం రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రికార్డు రూంలో రెవెన్యూ సెక్షన్ల ఫైల్స్‌ను జాగ్రత్తగా ఉంచాలన్నారు. ఏ బీ సీ డీ ఈ ఇ ఎఫ్ జీ, లా ఆఫీస్, ఎస్‌డీసీఎల్‌ఏ, యూఎల్‌సీ అన్ని విభాగాల ఫైల్స్ ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ రామ్మోహన్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

టౌన్ ప్లానింగ్ అధికారులపై మున్సిపల్ చైర్ పర్సన్ ఫిర్యాదు



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులు రేకుల షెడ్డును కూల్చి వేసిన ఘటనపై చైర్ పర్సన్ మర్రి దీపికానర్సింహారెడ్డి కమిషనర్ నాగిరెడ్డికి బుధవారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. నిర్మాణదారుడికి ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా, ఎవరి అనుమతి తీసుకోకుండా నిర్మాణంలో ఉన్న రేకుల షెడ్డును కూల్చివేసిన టౌన్ ప్లానింగ్ అధికారిపై శాఖ పరమైన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఇక ముందు తమ ప్రమేయం లేకుండా ఎలాంటి నిర్మాణాలను కూల్చి వేయకుండా ఉండేలా టౌన్ ప్లానింగ్ అధికారులకు ఆదేశాలు ఇవ్వాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

సాయి ప్రియా కాలనీ పార్కు స్థలాన్ని కాపాడండి

- కమిషనర్‌కు వినతి పత్రం అందజేసిన సాయి ప్రియా కాలనీవాసులు



నవతెలంగాణ-బోడుప్పల్

పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని రోడ్డు నంబర్ రెండులోని రెండు వేల గజాల పార్కు స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు వినియోగించాలని పీర్జాదిగూడ కార్పొరేషన్ కమిషనర్ త్రిలేశ్వర్‌కు సాయిప్రియా కాలనీ వాసులు, తెలంగాణ రియల్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. గతంలో పార్కు స్థలంలో ఇంటి నిర్మాణానికి అనుమతులు ఇచ్చి మరలా రద్దు చేసిన విషయాన్ని కమిషనర్ ఆధారాలతో చూపించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రియల్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నారగోని ప్రవీణ్, సాయి ప్రియా కాలనీ అధ్యక్షులు కమలాకర్ మాట్లాడుతూ.. సాయి ప్రియానగర్ రోడ్డు నెంబర్2 లోని రెండు వేల గజాల పార్కు స్థలంలో కార్పొరేషన్ అధికారులు పొరపాటున ఇచ్చిన స్థలంలో కొందరు కబ్జాదారులు నిర్మాణాలు చేయడానికి ప్రయత్నించడంతో కాలనీ వాసుల ఫిర్యాదు, పత్రికలలో వచ్చిన కథనాలకు స్పందించిన అధికారులు తమ తప్పును తెలుసుకొని ఇంటి నిర్మాణాల పర్మిషన్ రద్దు చేసి పార్కు స్థలం అంటూ బోర్డు నాటారని గుర్తుచేశారు. దీనిపై కబ్జాదారులు కోర్టుకు వెళ్లారని, వారికి బదులుగా కార్పొరేషన్ నుంచి కోర్టులో కౌంటర్ దాఖలు చేయాలని కోరారు. పార్కు స్థలం పక్కన ఉన్న ప్లాట్ నెంబర్ 359 సీసీ, ఈసీలు తీయగా ఓపెన్ స్థలం అని స్పష్టంగా ఉందని పేరొన్నారు. ఈ ఆధారాలను పూర్తిగా కమిషనర్‌కు అందజేసినట్టు తెలిపారు. మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యం వల్ల పార్కును మాయం చేయడానికి ముప్పు పొంచి ఉందని, దయచేసి కబ్జాదారులకు సహకరించవద్దని కోరారు. కోట్ల రూపాయలు విలువ చేసే ఈ పార్కు స్థలాన్ని కాపాడి ప్రజా అవసరాలకు అనుగుణంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఎమ్మెల్యే వినతి



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి నియోజకవర్గం పరిధిలోని అన్ని డివిజన్లలో డ్రయినేజీ, తాగునీరు, ఇతర సమస్యలను పరిష్కరించాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి బస్తీ, కాలనీ సంక్షేమ సంఘం నాయకులు, కార్పొరేటర్లతో కలిసి జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డ్రయినేజీ, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని కోరారు. బహుళ అంతస్తులకు డ్రయినేజీ, తాగునీరు, మౌలిక సౌకర్యాలు లేకుండా అనుమతులు ఎలా ఇస్తున్నారని అధికారులను ప్రశ్నించారు. భరత్ నగర్, కౌకూర్ రాజీవ్ గృహకల్ప వాసులకు తాగునీరు సౌకర్యం కల్పించాలని, శరణ్ నగర్, గంగా ఎంక్లేవ్, ఎంఈఎస్‌కాలనీ, కావేరి ఎంక్లేవ్, తుర్కపల్లి, భరత్ నగర్ కౌకూర్, మచ్చ బొల్లారం, అల్వాల్, వెంకటాపురం, యాప్రాల్, నేరేడ్‌మెట్, వినాయక నగర్ మౌలాలి, కేసీఆర్ బస్తీ హనుమాన్ నగర్, వాణి నగర్, గౌతమ్‌నగర్ కాలనీల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జలమండలి జనరల్ మేనేజర్ సునీల్ కుమార్ డీజీఎంలు భాస్కర్, సాంబయ్య, ఆశ్రిత, మేనేజర్లు మల్లికార్జున్, శ్రీనివాస్, నవీన్, రమేష్, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్ గౌడ్ , సునీత రాము యాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, పరుశురాంరెడ్డి, అంజయ్య, జేఏసీ వెంకన్న, హనుమంతురావు, రమేష్, ఢిల్లీ పరమేష్, శోభన్, ఉస్మాన్, బస్తీ సంక్షేమ సంఘాల నాయకులు ఉన్నారు.

బైక్ మెకానిక్ యూనియన్ సభ్యుల ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ- మేడ్చల్

మేడ్చల్ పట్టణంలోని స్వామి వివేకానంద విగ్రహం పక్కన ఉన్న ఓ ద్విచక్ర వాహన మెకానిక్ షాప్ ఇటీవల షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. కాగా బుధవారం మేడ్చల్ పట్టణంలోని ద్విచక్ర వాహనదారుల అసోసియేషనుతో పాటు, ఉమ్మడి రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల మెకానిక్ యూనియన్ సభ్యులు సేకరించిన రూ.30 వేలను సదరు షాప్ యజమానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎం.మహిపాల్ రెడ్డి, కార్యదర్శి కృష్ణాగౌడ్, యూనియన్ సభ్యులు అక్బర్, అశోక్, జగన్, మైపాల్ రెడ్డి, నరేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను సన్మానించిన కాంగ్రెస్ నేతలు



నవతెలంగాణ-కీసర

పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను మేడ్చల్ జిల్లా తీన్మార్ మల్లన్న టీమ్ అధ్యక్షులు గణేష్ (కీసర), కీసర మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ రామిడి విజయ్ రెడ్డి, క్యూ న్యూస్ రిపోర్టర్ రాగుల కిషోర్ ముదిరాజ్, కాంగ్రెస్ నాయకులు చర్లపల్లి కృష్ణ రెడ్డి, పోషబోయిన రాజు యాదవ్, మచ్చాని శ్రీశైలం యాదవ్‌లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శాలువాతో సన్మానించారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-శామీర్‌పేట

శామీర్ పేట మండలం యాడారం గ్రామానికి చెందిన సత్యనారాయణ శామీర్‌పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యా సంవత్సరం పదో తరగతి చదివారు. మే 22న అనారోగ్యానికి గురై మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న సహాధ్యాయులు తన మిత్రుడి కుటుంబానికి రూ.50వేల ఆర్థిక సహాయం అందజేసి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా స్నేహితుడికి నివాళులర్పించారు.

అధ్వానంగా ఉప్పల్ అంతర్గత రోడ్లు

- పట్టింపులేని పాలకులు, అధికారులు
- ఇబ్బందుల్లో ప్రజలు, వాహనదారులు



నవతెలంగాణ-ఉప్పల్

ఉప్పల్‌లో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారినా పాలకులకు, అధికారులకు పట్టింపులేదని సీపీఐ(ఎం) ఉప్పల్ డివిజన్ కార్యదర్శి భీష్మాచారి అన్నారు. జెర్సీ నుంచి డీమార్ట్‌కు వెళ్లే రోడ్డు గుంతలమయమైందని పేర్కొన్నారు. రోడ్లు చిన్న వర్షానికి సముద్రాన్ని తలపిస్తున్నాయని తెలిపారు. దీంతో వాహనదారులు, పాదాచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించు కోవడం లేదన్నారు. సమస్యను పరిష్కరించకుంటే సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామన్నారు.

మ్యాన్ హోల్ కవర్స్ ఎవరూ ఓపెన్ చేయొద్దు

- మున్సిపల్ చైర్మెన్ కౌకుట్ల చంద్రారెడ్డి



నవతెలంగాణ-కీసర

భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా మురుగునీరు మాన్ హోల్ నుంచి బయటకు వస్తే వాటిని తొందరగా క్లీన్ చేసేలా చర్యలు తీసుకోవాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. బుధవారం నాగారం పురపాలక సంఘ కార్యాలయం లో వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ జవాన్లుతో ప్రకృతి వైపరీత్యాల విపత్తు నిర్వహణ, భారీ వర్షాలపై మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మెన్ మాట్లాడుతూ.. ప్రజలు ఎవరూ మ్యాన్ హోల్స్ కవర్స్ తెరవకూడదని చెప్పారు. శిథిలావస్థలో ఉన్న ఇండ్లను గుర్తించి ఖాళీ చేయించాలని వార్డు ఆఫీసర్లు ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది భారీ వర్షాలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రాజేందర్ కుమార్, మున్సిపల్ మేనేజర్ కే. చంద్రశేఖర్, సానిటరీ ఇన్‌స్పెక్టర్, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్
గురువారం | జూన్ 13, 2024 | www.navatelangana.com



కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయంలో మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో-ఆపరేటివ్ చైర్మెన్, 130-సుభాష్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ సీనియర్ నాయకులు మన్నె రాజు, కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ.వివేకానందని బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మన్నె రాజును శాలువాతో సత్కరించి, ప్రజల ఆశీస్సులతో రానున్న రోజుల్లో మరిన్ని పదవులు చేపట్టాలన్నారు.
నవతెలంగాణ-కుత్బుల్లాపూర్



కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద బుధవారం నియోజకవర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్‌ను కలిసి పలు ఆహ్వానాలు, వినతులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తా అన్నారు. గత పదేండ్లలో చేసిన అభివృద్ధిని మించిన అభివృద్ధితో నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దితానన్నారు.
నవతెలంగాణ-దుండిగల్

'స్థానిక' పోరుపై సందిగ్ధం

- ప్రత్యేకాధికారుల పాలనలో జీపీలు
- కొత్త రిజర్వేషన్లపై స్పష్టత ఇవ్వని ప్రభుత్వం
- ఆశావాహుల ఎదురుచూపులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

గడువు తీరిన గ్రామపంచాయతీ పాలకవర్గాల ఎన్నికలకు ఇప్పట్లో ముహూర్తం కుదిరేలా లేదు. ఈ జూన్‌లో పంచాయతీ ఎన్నికలు ఉంటాయని సీఎం రేవంత్ రెడ్డి గతంలో ప్రకటించినా.. ఆ దిశగా అడుగులు పడటం లేదు. గత ఫిబ్రవరి 1వ తేదీన పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ముగిసింది. ఆ సమయంలో ఈసీ ఆదేశాల మేరకు జిల్లా అధికారులు ఎన్నికల సామగ్రి సిద్ధం చేశారు. ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికలు రావడంతో పంచాయతీ ఎలక్షన్లు జూన్‌లో నిర్వహిస్తారని అంతా భావించారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లు కొనసాగిస్తారా..? మారుస్తారా..? అనే చర్చ అంతటా జరుగుతోంది. మరోవైపు బీసీ జనగణన చేసిన తర్వాతే పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ వస్తోంది. దీంతో పంచాయతీ ఎన్నికలకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉన్నట్టుగా తెలుస్తోంది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని గ్రామ పంచాయతీ పాలకవర్గాల గడువు ముగియడంతో ప్రస్తుతం ప్రత్యేకాధికారుల పాలన కొనసాగుతోంది.



నాలుగు నెలలుగా..

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మొత్తం 61 జీపీలు, 600కు పైగా వార్డులు ఉన్నాయి. వీటికి 2019లో ఎన్నికలు నిర్వహించారు. అదే ఏడాది ఫిబ్రవరి 2న పంచాయతీ పాలకవర్గాలు కొలువు దీరాయి. ఐదేండ్లపాటు పాలక వర్గాలు గ్రామాల్లో అభివద్ధి కార్యక్రమాలు నిర్వహించాయి. పాలకవర్గాల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరి 1వ తేదీతో ముగిసింది. దీంతో అప్పటి నుంచి ప్రత్యేకాధికారులు పాలనా బాధ్యతలు చేపట్టారు. జిల్లాలోని గ్రామ పంచాయతీలకు ప్రస్తుతం ప్రత్యేకాధికారులు కొనసాగుతున్నారు. నాలుగు నెలలుగా వీరి పర్యవేక్షణలోనే గ్రామాల్లో పాలన సాగుతోంది.

రిజర్వేషన్ల పీటముడితో..

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రధాన అడ్డంకిగా మారాయి. 2019లో జీపీ ఎన్నికల సందర్భంగా అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2018 గ్రామపంచాయతీ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారమే నాడు ఎన్నికలు నిర్వహించారు. దీని ప్రకారం రిజర్వ్‌డ్ పంచాయతీలకు పదేండ్లపాటు ఒకే రిజర్వేషన్ ఉంచి ఎన్నికలు నిర్వహించే వెసులుబాటు కలిగింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఈ చట్టం ప్రాతిపదికగా ఎన్నికలు నిర్వహిస్తుందా..? లేక కొత్త చట్టం తెస్తుందా..? అనేది స్పష్టత రాలేదు. కొత్త చట్టాన్ని తీసుకొస్తే పంచాయతీతోపాటు వార్డుల రిజర్వేషన్లు కూడా మారుతాయి. మరోవైపు బీసీ గణన తదితర కార్యక్రమాలతో ఎన్నికలు ఆలస్యం అవుతాయనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది.

ఎన్నికలకు ఏర్పాట్లు చేసినా..

గతేడాది డిసెంబర్‌లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు కూడా నిర్వహించాలని భావించింది. ప్రధానంగా గ్రామ పంచాయతీల పదవీ కాలం ఈ ఏడాది ఫిబ్రవరితో ముగుస్తున్నందున ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. పార్లమెంట్ ఎన్నికల అనంతరం స్థానిక సంస్థల ఎన్నికలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా ప్రకటించారు. అలాగే రాష్ట్ర ఎన్నికల సంఘం కలెక్టర్లకు ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు జిల్లా అధికారులు ఏర్పాట్లు కూడా చేశారు. ఎన్నికల సామగ్రిని సిద్ధం చేశారు. బ్యాలెట్ బాక్సులు తదితర సామగ్రిని అందుబాటులో ఉంచారు. సర్పంచులు, వార్డు సభ్యుల రిజర్వేషన్ల వివరాలను కార్యదర్శుల ద్వారా రాష్ట్ర ఎన్నికల సంఘం సేకరించింది. ఆ తర్వాత ఎలాంటి కార్యాచరణ ముందుకు సాగలేదు.

ఆశావహుల ఎదురుచూపు..

గ్రామస్థాయి నేతలు పంచాయతీ ఎన్నికల సమరం కోసం ఎదురుచూస్తున్నారు. ఈ జూన్‌లో ఎన్నికలు ఉంటాయనే ఉద్దేశంతో పోటీకి ఆయా పార్టీల నేతలు అన్నీ సిద్ధం చేసుకున్నారు. అయితే ఎన్నికలు మరికొంత ఆలస్యం అయ్యే అవకాశం ఉండటంతో ఎప్పుడు జరుగుతాయోనని ఆరా తీస్తున్నారు. గతంలో సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులుగా ఉన్న వారితోపాటు కొత్త వారు కూడా పోటీకి ఉవ్విళ్లూరుతున్నారు. దీంతో గ్రామాల్లో ఎక్కడ చూసినా పంచాయతీ ఎన్నికల చర్చే సాగుతోంది. బరిలో నిలబడేందుకు రాజకీయ పార్టీల మద్దతు కోసం ఆశావహులు తమ ప్రయత్నాల్లో మునిగారు.

మాజీ మంత్రి మల్లారెడ్డికి భారీ షాక్..



(ఫైల్ ఫోటో)

- సుచిత్రలోని 33 గుంటలు ఎమ్మెల్యే మల్లారెడ్డిది కాదని, రెవిన్యూ శాఖ అధికారులు కోర్టుకు రిపోర్ట్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

బీఆర్ఎస్ మాజీమంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సీహెచ్ మల్లారెడ్డికి భారీ షాక్ తగిలింది. జీడిమెట్ల 132 డివిజన్ సుచిత్ర పరిధిలోని సర్వే నంబర్ 82లో ఉన్న 33 గుంటల స్థలం మల్లారెడ్డి కాదని రెవెన్యూ అధికారులు తేల్చారు. ఈ మేరకు బుధవారం హైకోర్టుకు రెవెన్యూ అధికారులు నివేదిక అందజేశారు. సైబరాబాద్ పోలీసులకు సర్వే రిపోర్ట్ పంపించారు. కానీ మల్లారెడ్డి మాత్రం దశాబ్దాల కాలంగా అది తన భూమి అంటూ.. సర్వే నంబర్ 82లో ఉన్న ల్యాండ్‌పై 15 బాధితులు అభ్యంతరం తెలిపే సరికి తతంగం మొత్తం బయటకు వచ్చింది. పూర్తి వివరాల్లకి వెళితే... హైదరాబాద్‌లోని సుచిత్ర ఏరియాలో వందల కోట్ల విలువ చేసే 2.10 ఎకరాల భూ వివాదం నడుస్తుండడం అందరికి తెలిసందే. అది మొత్తం తనదేనంటూ మల్లారెడ్డి, అల్లుడు రాజశేఖర్ రెడ్డి తమ భూమిని కబ్జా చేస్తున్నారంటూ..మే 18న అక్కడ తన అనుచరులతో కలిసి వెళ్లి వివాదాస్పద స్థలంలో ఉన్న ఫెన్సింగ్, భారీ గేట్లను తొలగించారు. అప్పటికే అక్కడ మరో వర్గం టెంట్ వేసుకొని ఉండడంతో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులతో మల్లారెడ్డి వాగ్వా దానికి దిగారు. ఈ క్రమంలో పోలీసులు సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని ఇరు వర్గాలకు సూచించారు. కానీ మల్లారెడ్డి కేసులు పెట్టుకుంటే పెటుకోండి, తమ స్థలాన్ని కాపాడుకుంటానని పోలీసులకు హెచ్చరిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ భూమికి సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని మల్లారెడ్డి అన్నారు.

భూ వివాదంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే

ఈ భూ వివాదంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ ఉన్నారు. భూమి తమదే అంటున్న పదిహేను మందిలో ఆయన కూడా ఒకరు. గతంలోనే సర్వే కోసం ఎన్నిసార్లు రమ్మని చెప్పినా మల్లారెడ్డి రాలేదని, తమకు సర్వే అవసరంలేదని చెప్పారని ఆయన ఆరోపించారు. 82 ఈ సర్వే నెంబర్‌లో ల్యాండ్‌పై ఇంజెక్షన్ ఆర్డర్ వేసినా దానికి కౌంటర్ వేయలేదు. అధికారంలో ఉన్న సమయంలో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ కూడా ల్యాండ్ వివాదం సెటిల్ చేసుకోమని చెప్పినా, కేటీఆర్ మాటలను కూడా మల్లారెడ్డి పెడచెవిన పెట్టారని ఆరోపించారు. ఈ వివాదం తర్వాత రెవిన్యూ శాఖ రంగంలోకి దిగి విచారణ చేపట్టింది. మల్లారెడ్డి, ఆయన అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిల సమక్షంలోనే సర్వే చేశారు. రెవిన్యూ శాఖ చేసిన దర్యాప్తులో 33 గుంటల భూమి మల్లారెడ్డి కాదని తేలింది. దీంతో ల్యాండ్ పై ఉన్న మరో వర్గం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మల్లారెడ్డి పై చర్యలు తీసుకోవాలని కోరారు. భూమి మల్లారెడ్డి కాదని రెవెన్యూ శాఖ అధికారులు తేల్చడంతో ఇప్పుడు ఆయన ఏం చేశారన్నది ఆసక్తికరంగా మారింది.

విద్యార్థులను తప్పకుండా పాఠశాలకు పంపాలి

- జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లమ్మబండ ప్రధానోపాధ్యాయురాలు కే. రాదాపద్మజ



నవతెలంగాణ-కూకట్‌పల్లి

ప్రతి విద్యార్థి పాఠశాలకు తప్పకుండా వచ్చేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎల్లమ్మబండ ప్రధానోపాధ్యాయురాలు కే.రాధా పద్మజ అన్నారు. బుధవారం రోజు నూతన విద్యా సంవత్సరానికి స్వాగతం తెలియజేస్తూ.. తల్లిదండ్రులకు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పరంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, డ్రస్సులు, ఈ సంవత్సరం నుంచి నోటు పుస్తకాలు, రాగి జావా, మధ్యాహ్న భోజనం మొదలైనవి అన్ని ఉచితంగా అందివ్వడం జరుగుతుందన్నారు. కావున ప్రతీ విద్యార్థి ప్రభుత్వ పాఠశాలకు వచ్చే విధంగా చూడవలసిన బాధ్యత ప్రతీ ఒక్కరిదని తెలియజేశారు. ఈ సంవత్సరం కూడా ప్రతీ మూడవ శనివారం పేరెంట్, టీచర్స్ మీటింగ్ ఉంటుంది.. కావున ప్రతీ మీటింగ్‌కు తప్పకుండా అధిక సంఖ్యలో పేరెంట్స్ రావాల్సిందిగా తెలిపారు. పదవ తరగతికి ప్రత్యేక తరగతులు కూడా తీసుకోవడం జరుగుతుంది.. కావున తల్లిదండ్రులను సహకరించాలని కోరారు. విద్యార్థులకు ఏవైనా సమస్యలు ఉంటే ఉపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సమావేశంలో అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ దుర్గాభవాని, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎల్.గోవిందు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘతేనగర్‌లో తాగునీటి లీకేజీలను అరికట్టి.. కలుషిత నీటిని నివారిస్తాం..

- కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్



నవతెలంగాణ-బాలానగర్

తాగునీటి లీకేజీలను అరికట్టి కలుషిత నీటిని నివారిస్తాం అని కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. కూకట్‌పల్లి నియోజకవర్గం మూసాపేట సర్కిల్ ఫతేనగర్ డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్ కాలనీలో గత కొద్ది రోజులుగా తాగునీటి సరఫరాలో కలుషిత నీరు వస్తుందని స్థానికులు కార్పొరేటర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే ఆయన స్పందించి, బుధవారం కార్పొరేటర్, స్థానికులతో కలిసి డివిజన్ పరిధిలోని శివశంకర్ నగర్ కాలనీలో పర్యటించి సమస్యాత్మక ప్రాంతాలను పరిశీలించారు. డివిజన్ పరిధిలో లీకేజీలను గుర్తించి, బస్తీలలో కలుషిత నీటిని నివారించాలి. డివిజన్‌లోని ప్రజలకు కలుషిత నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ స్వామిని ఆదేశించారు. ఈ మేరకు డివిజన్ పరిధిలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అన్ని విధాల చర్యలు తీసుకుని సమస్యలు పరిష్కరిస్తామని కార్పొరేటర్ హామీ ఇచ్చారు. బస్తీలలో స్థానికులకు ఇలాంటి ఇబ్బందులు తక్షణమే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బస్వరాజు, డేవిడ్, శ్రీను, సాయినాథ్ గౌడ్ సోమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పాలన జరుగుతుంది..



- కూకట్‌పల్లి నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ కొల్లా శంకర్

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఇక నుంచి ఆంధ్రప్రదేశ్‌లో ప్రజా పాలన జరుగుతుందని కూకట్‌పల్లి నియోజకవర్గం మీడియా కోఆర్డినేటర్ కొల్లా శంకర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ లో నూతన ప్రభుత్వం ప్రమాణ స్వీకారం సందర్భంగా బుధవారం కేపీహెచ్‌బీ కాలనీ 5వ ఫేస్‌లో గల జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ అధినేత కొణిదల పవన్ కళ్యాణ్ మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారన్నారు. ఈ సందర్భముగా జనసేన నాయకులు, వీర మహిళలు కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలుపుకుంటూ.. ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగాకోఆర్డినేటర్ కొల్లా శంకర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో కూటమి గెలుపొందడం ప్రజల విజయమని అన్నారు. దశాబ్ద కాలంగా పవన్ కళ్యాణ్, జన శ్రేణులు ప్రజల కొరకై పోరాడి ప్రభుత్వాన్ని ప్రశ్నించి 2024 అసెంబ్లీ ఎన్నికలలో జనసేన, టీడీపీ, బీజేపీ కూటమి నాయకత్వంలో జనసేన పార్టీ అధినాయకుడు కొణిదల పవన్ కళ్యాణ్ నాయకత్వంలో 21 ఎమ్మెల్యేలు ఘన విజయాన్ని సాధించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ ప్రెసిడెంట్ కలిగినీడి ప్రసాద్, పులగం సుబ్బు, బోగాది శేషగిరిరావు, పూషడపు సురేష్, శ్రీనివాస్ గోవింద, ఆవుల రంగబాబు, బండారి వెంకటేష్ పాల్గొన్నారు.

26న మున్సిపల్ కార్మికుల చలో కలెక్టరేట్



- సీఐటీయూ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఈ నెల 26వ తేదీన తలపెట్టిన చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని సీఐటీయూ మేడ్చల్-మల్కాజి గిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్-(సీఐటీయూ) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ సమావేశం బుధవారం కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీస్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో గత కార్యక్రమాల సమీక్షతోపాటు భవిష్యత్ కార్యచరణను రూపొందించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు లింగస్వామి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో చంద్ర శేఖర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పదేండ్లుగా జీతాలు పెరగలేదనీ, వారి సమస్య రోజువారీగా పెరుగుతున్నాయన్నారు. వారికి ఇవ్వాల్సిన సబ్బులు, నూనె ఇవ్వడం లేదన్నారు. కార్మికులకు ఒక పూట పని ఇవ్వడం లేదనీ, రెండు పూటల పని వల్ల వారికి వచ్చి పోవడానికి ట్రాన్స్‌ఫోర్ట్ ఛార్జీ ఎక్కువ అవుతుందన్నారు. మున్సిపల్ కార్మికులకు జీతంతో పాటు ప్రమాద బీమా పథకం కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ మహిళా కార్మికులపై లైంగిక దాడులు చేస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఈనెల జీతం ఐదో తారీకు లోపల ఇవ్వాలనీ, ఆదివారం సెలవు ఇవ్వాలనీ, ఏడాదికి 15 రోజులు లీవ్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్ నరసింహ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు పనిముట్లు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బంది పెడుతుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ, వెంకటేష్‌తో పాటు మున్సిపల్ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

రాబోయే వర్షా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, డివిజన్ ప్రజలు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వర్షాకాలంలో తలెత్తె సమస్యలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి అన్నారు. కార్పొరేటర్ ఆవుల బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజా క్షేమమే ధ్యేయంగా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం దిశగా ముందు కెళ్తానని తెలిపారు. ముఖ్యంగా నాలాలను పర్యవేక్షించి, పూడుకు పోయిన చెత్తను, అదేవిధంగా విద్యుత్ తీగలకు పై ఉన్న చెట్లను వెంటనే తొలగించాలని సూచించారు. అంతేకాకుండా వర్షపు నీళ్లు ఎక్కువగా నిల్వ ఉన్నచోట క్యాచ్ పిట్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఈ.బాలకృష్ణ, ఏఈ మహమ్మద్ రషీద్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాములు, డివిజన్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఖాజ, స్థానికులు నరేష్, రవి, నాగేశ్వరరావు, యాదగిరి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

భోజనప్రియుల మెప్పు పొందాలి :ఎమ్మెల్యే



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

భోజన ప్రియుల మెప్పు పొందినప్పుడే రెస్టారెంట్లు మనగడ సాధిస్తాయని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. బుధవారం రంగారెడ్డినగర్ డివిజన్ ఐడీపీఎల్ డీ మార్ట్ సమీపంలో నిర్వాహకులు కె. లక్ష్మణ్ రావు, మహేందర్‌ల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన 'బ్లాక్ అండ్ వైట్' రెస్టారెంట్‌ను స్థానిక కార్పొరేటర్ బి.విజయ శేఖర్ గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి రోజుల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న వ్యాపారాలలో రెస్టారెంట్ వ్యాపారం ఒకటని, నిత్యం వినూత్న రుచులను కస్టమర్లకు అందించినప్పుడే వ్యాపారం దినదినాభివృద్ధి చెందుతుందన్నారు. నాణ్యత, సుచి,శుభ్రం తప్పక పాటించాలని నిర్వాహకులు సూచించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు ఏర్వ.శంకరయ్య బీఆర్ఎస్ నాయకులు జల్దా లక్ష్మీనాథ్, ఎంఏ రహీం, కార్తీక్ గౌడ్, బాలు నేత, కార్తీక్ గౌడ్, టింకు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలి



- పర్యావరణ ప్రేమికుడు కోల రవీందర్ ముదిరాజ్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

వర్షపు నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపుకు ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా.. ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని పర్యావరణ ప్రేమికులు కోల రవీందర్ ముదిరాజ్ అన్నారు. భూగర్భ జలాల పెంపుకు ఇంకుడు గుంతలు ఎంతగానో దోహదపడతాయని ఆయన సూచించారు. బుధవారం తమ సొంత ఇంట్లో 20 ఏండ్ల క్రితం ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను ప్రతీ సంవత్సరం శుద్ధి చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. 210 అడుగులకి కావలసిన నీరు వస్తుందన్నారు. ఒక క్యూబిక్ మీటర్ గుంతలో వెయ్యి లీటర్ల నీటిని ఇంకించవచ్చని, ఒక్కో ఇంకుడు గుంత నిర్మాణంతో 2,592 లీటర్ల నీరు భూమిలో ఇంకుతుందన్నారు. ప్రతీ ఇంటా నిర్మాణం చేపట్టినట్లయితే ఫలితంగా లక్షల లీటర్ల నీటిని భూమిలోనికి పంపించి, భూగర్భ జలాలు పడిపోకుండా నిలువరించుకునే వీలుందన్నారు. కొత్తగా ఇండ్లు నిర్మించుకుంటున్న, ప్రతి ఒక్కరూ ఇంకుడు గుంత ఉండేలా ప్రభుత్వం, అధికారులు కఠినంగా వ్యవహరించాలన్నారు. ఇంకుడు గుంతలు ఉంటేనే బోర్, ఇల్లు నల్లా కనెక్షన్‌కు పర్మిషన్ ఇవ్వాలని జీహెచ్‌ఎంసీ మెట్రో వాటర్ ఎంఆర్‌వో ఆలోచన చేయాలని కోరారు. ప్రతీ ఇంటి ఆవరణలో ఇంకుడు గుంతలు ఉండేలా ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. తనతోపాటు తన తండ్రి రిటైర్డ్ హెచ్‌ఎం ఈశ్వరయ్య, సదానందం పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం వినియోగించుకోవాలి

- ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పేద ప్రజల నివాసిత ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఐటీయూసీ మేడ్చల్ జిల్లా కార్యదర్శి వంగాల శ్రీనివాస్ అన్నారు. బుధవారం జగద్గిరిగుట్ట భవన నిర్మాణ కార్మికుల సంఘం (ఏఐటీయూసీ)ఆధ్వర్యంలో జగద్గిరి గుట్ట చివరి బస్ స్టాప్‌లో లేబర్ శాఖ కార్యాలయం నేతృత్వంలో నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏఐటీయుసీ నియోజకవర్గ అధ్యక్షులు వి.హరినాథ్ రావు, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు ఏ.ప్రవీణ్‌లతో కలిసి ప్రారంభించారు. కార్మిక శాఖ, కార్యాలయ వైద్య సిబ్బంది, భవన నిర్మాణ కార్మికులందరికీ ఉచిత వైద్య, రక్త పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద భవన నిర్మాణ కార్మికులకు ఇటువంటి వైద్య శిబిరాలు ఎంతగానో దోహదపడతాయన్నారు. దీంతోపాటు లేబర్ కార్డు, కార్యాలయం నుంచి గుర్తింపు కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ గుండె, కిడ్నీ, క్యాన్సర్, బీపీ వంటి సంబంధిత పరీక్షలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం జగద్గిరిగుట్ట అధ్యక్ష, కార్యదర్శులు సామ్యూల్, ముసలయ్య, నాయకులు యాదగిరి, రాంచందర్ పాల్గొన్నారు.

విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలి



- ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్

నవతెలంగాణ-మెహిదీపట్నం

విద్యార్థులందరూ కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ అన్నారు. కార్వన్ ఎమ్మెల్యే కౌసర్ మహియుద్దీన్ రాందేవ్ గుడాలోని ప్రభుత్వ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, స్కూల్ యూనిఫామ్ లు పంపిణీ చేశారు. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, స్థానిక కార్పొరేటర్లు, ఎంఐఎం కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో భాగంగా బుధవారం మోహనదాస్ మట్, లోవర్ ధూల్పేట్, సీతరం పేట్ బ్రాంచ్‌లోని గవర్నమెంట్ ప్రాథమిక పాఠశాలలో గోషామహల్ డివిజన్ కార్పొరేటర్ లాల్ సింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణ, ఉపాధ్యాయులు, రవికిరణ్, సంజీవ్ కుమార్, శ్వేతా, సందీప్ సింగ్, సుధాకర్ గౌడ్ తదితరులు, పాల్గొన్నారు. నవతెలంగాణ-సుల్తాన్ బజార్

'సమగ్ర కులగణనను తక్షణమే ప్రారంభించాలి'



- జూన్ మూడవ వారంలో రాష్ట్ర వ్యాప్తంగా బీసీల బస్సు యాత్ర
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్

నవతెలంగాణ-హిమాయత్ నగర్

రాష్ట్రంలో ఎన్నికల కోడ్ ముగిసినందున జీవో నెంబర్-26 ప్రకారం సమగ్ర కులగణన కోసం ప్రత్యేక కమిషన్‌ను వెంటనే నియమించి బీసీ కులగణన ప్రారంభించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్‌లో బీసీ కుల సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మెన్ కుందారం గణేష్ చారితో కలిసి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో వంద రోజుల్లోనే కులగణన కోసం అన్ని చర్యలు తీసుకున్నప్పటికీ పార్లమెంటు ఎన్నికలు రావడంతో కులగణన ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయిందన్నారు. ప్రస్తుతం కుల గణన నిర్వహించి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే గ్రామపంచాయతీ స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిం చాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లు పెంచుతారనే విశ్వాసం రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై బీసీలకు ఉందన్నారు. ఇతర రాష్ట్రాల రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించి నందున ఇతర రాష్ట్రాల మాదిరిగానే ఏ పద్ధతిలోనైనా బీసీ రిజర్వేషన్లను పెంచి స్థానిక సంస్థలలో బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానం మేరకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక కమిషన్ నియమించి వెంటనే కులగణన సర్వే ప్రారంభించి బీసీ రిజర్వేషన్లను 42 శాతానికి పెంచాలని, లేకపోతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాన్ని ప్రారంభిస్తామని హెచ్చరించా రు. అందులో భాగంగానే ఈనెల 14వ తేదీన హైదరాబాద్‌లోని అఖిలపక్ష బీసీ కుల సంఘాలతో విస్తత స్థాయి సమావేశాన్ని ఏర్పాటు చేసి, ఆ తర్వాత జూన్ మూడో వారంలో రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లో బీసీ బస్సు యాత్ర చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యామ్ కుర్మ, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు ఎ.శ్రీనివాస్ గౌడ్, బీసీ మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు బి.మణి మంజరి, గ్రేటర్ అధ్యక్షురాలు సిద్ధాంతం శ్యామల, బీసీ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.దుర్గయ్య గౌడ్, ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులు బలోపేతం చేసేందుకు 'మెగా డీఎస్సీ'

- రాష్ట్రవ్యాప్తంగా 26,872 బడుల్లో 1100 కోట్లతో మౌలిక వసతుల కల్పన
- ఉపాధ్యాయులు ప్రభుత్వానికి, విద్యార్థులకు వారిధిగా ఉండాలి : జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్
- అబిడ్స్ అలియా మోడల్ హైస్కూల్ పున : ప్రారంభం
- విద్యార్థులకు నోట్ బుక్స్, పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ
- టెన్త్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మంత్రి సన్మానం



నవతెలంగాణ-సిటీబ్యూరో

పేదలకు నాణ్యమైన విద్యను అందించేందుకు డీఎస్సీ చేపట్టి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమం, హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలల పున్హ ప్రారంభం సందర్భంగా బుధవారం గవర్నమెంట్ మోడల్ హైస్కూల్ ఆలియాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొని పాఠశాల పిల్లలకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ గ్రేడ్ సాధించిన విద్యార్థులను మంత్రి సత్కరించారు. ఆ తర్వాత పాఠశాల ఆవరణలో ఉన్న వాటర్ ట్యాంక్‌ను మంత్రి ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని, ఎన్నికల కోడ్ ఉన్నప్పటికీ.. కోడ్‌కి ముందే ప్రభుత్వం తెలంగాణలో 26,872 పాఠశాలలలో 1100 కోట్లతో అమ్మ ఆదర్శ పాఠశాల పేరుతో మౌలిక వసతులు, డ్రింకింగ్ వాటర్ ,టేబుల్స్, మరమ్మతులు, కలర్స్ పనులు చేపట్టమని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, తనతో సహా మంత్రులు, కేంద్ర మంత్రులు ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన వాళ్లమేనన్నారు.

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన, అనుభవమున్నా ఉపాధ్యాయులు ఉన్నారని, పాఠశాలలో అనేక వసతులు కల్పిస్తున్నామన్నారు. విద్యార్థులకు యూనిఫాం, పుస్తకాలు, కంప్యూటర్ ఇలా అన్ని ఏర్పాటు చేస్తున్నామని, నాణ్యమైన విద్యను అందిస్తున్నా మని తెలిపారు. రాష్ట్రంలోని విద్యార్థుల తల్లిదండ్రులకు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు తమ గ్రామాల్లో రాజకీయాలకు అతీతంగా ప్రభుత్వ పాఠశాల పూర్తిగా బలోపేతం చేయాలని సూచించారు. ఉపాధ్యా యులు ప్రభుత్వానికి విద్యార్థులకు వారాధిగా ఉండి విద్యార్థులకు సమాజం గురించి, విద్య గురించి ఉపాధ్యాయులు అవగాహన కల్పించాన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో డ్రాప్ ఔట్స్ లేకుండా బట్టలు, మధ్యాహ్న భోజనం, సౌకర్యాలు కల్పిస్తున్నామని, విద్యార్థులు మంచిగా చదువుకోవాలన్నారు. సర్కారు బడుల బలోపేతం దిశగా చర్యలు తీసుకుంటున్నామని, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలు భర్తీ చేస్తామని తెలిపారు. పిల్లలను ఉన్నత విద్య వైపు మళ్లించే విధంగా ప్రభుత్వ పాఠశాలలు, ప్రయివేట్ పాఠశాలతో పోటీ పడాలన్నారు. విద్య బోధన ద్వారా గురు దేవో భవ,ఆచార్య దేవోభవ అని నిరూపించాలని ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్, అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత్ కేశవ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, గన్ ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓం ప్రకాష్, డీఈవో ఆర్.రోహిణీ, ఆర్డీవో మహిపాల్, డిప్యూటీ డీఈవో వెంకటేశ్వర్లు, ప్రధానోపాధ్యాయులు డాక్టర్ విశ్వనాథం గుప్తా, పాఠశాల కమిటీ రాధిక తదితరులు పాల్గొన్నారు.



గో సంరక్షణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలి



- గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్

నవతెలంగాణ-అంబర్‌పేట

గో సంరక్షణ బిల్లును పార్లమెంట్‌లో పెట్టాలని గోశాల ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహేష్ అగర్వాల్ డిమాండ్ చేశారు. బుధవారం కాచిగూడ లోని గోశాల ఫెడరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రేమ్ చంద్ మునోద్, రిధేష్ జాగీర్దార్ లతో కలిసి ఆయన మాట్లాడుతూ గోవులను సంరక్షించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రధాని మోడీ తలచుకుంటే కేవలం 5 నిమిషాల్లోనే దేశంలోని గోవులను రక్షించే అవకాశమున్నా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో గోవుల రక్తం నేలపై పడకుండాకాపాడుతామని సీఎం రేవంత్ రెడ్డి చేసిన ప్రకటనలో ప్రసార మాధ్యమాల్లో, సోషల్ మీడియాలో విస్తతంగా ప్రచారం జరుగుతున్నా గోవుల సంరక్షణకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కండ్లెదుటే లక్షల గోవులు వధకు వెళ్తున్నాయన్నారు. 2014కు ముందు బీజేపీకి అనుబంధంగా కౌ డెవలప్మెంట్ సెల్ ఉంటేదని, దాన్ని మోడీ అధికారంలోకి వచ్చాక తీసివేశాడని ఆరోపించారు. బీజేపీ ప్రతీ మ్యానిఫెస్టోలో గోవుల సంరక్షణకు సంబంధించిన విషయం ఉండేదని, 2019, 2024 మ్యానిఫెస్టోల్లో గోసంరక్షణ అంశమే లేకుండా చేశారని విమర్శించారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యానిమల్ వెల్ఫేర్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు నిధులు కేటాయించకుండా పూర్తిస్థాయిలో డమ్మిని చేశారని మండిపడ్డారు. జీహెచ్ఎంసీ 519 యాక్ట్ ప్రకారం రాతపూర్వకంగా కమిషనర్ అనుమతి లేకుండా మూగజీవాలను నగరంలోకి తీసుకురావడానికి వీలులేదని, కాని నిత్యం లక్షల సంఖ్యలో మూగజీవాలు నగరంలోకి ప్రవేశిస్తున్నా అధికారులు, పోలీసులు ఏమాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు. గోవుల సంరక్షణను విస్మరించిన ప్రభుత్వాలకు భవిష్యత్తులో మనుగడ ఉండదని ఆయన హెచ్చరించారు. గోవుల సంరక్షణ విషయంలో ప్రజలే ఆయా ప్రభుత్వాలపై తిరగబడే రోజులు వస్తాయని అన్నారు.

పెన్షనర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

- రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డిమాండ్



నవతెలంగాణ-ముషీరాబాద్

పెన్షనర్లకు పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ సర్వసభ సమావేశం నిర్వహించారు. అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేంద్ర బాబు, ఎస్వీ నర్సింహా రావులు హాజరై మాట్లాడుతూ. పెన్షనర్లకు రావలసిన కారుణ్యబత్యాల గురించి రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలలు కావస్తున్నా పెన్షనర్ల సమస్యలు ఒక్కటీ పరిష్కరించకపోవడం కాలయాపన చేయడం పట్ల తీవ్ర అసంతప్తి వ్యక్తం చేశారు. నగదు రహిత చెల్లింపు విధానాలు అందుబాటులోకి తేవాలని, స్పెషల్ టీచర్లకు నేషనల్ ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని, కమ్యూనికేషన్ పీరియడ్స్‌ను 15 సంవత్సరాల నుంచి 12 సంవత్సరాలకు కుదించాలని, పాత పెన్షన్ పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర సలహాదారులు నరసింహారెడ్డి, సీనియర్ ఉపాధ్యక్షులు ఆర్ దేశ్ పాండేలను సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సమావేశంలో ఆర్థిక కార్యదర్శి బి.నర్సయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ జిల్లాల ప్రధాన బాధ్యులు సుమారుగా 60 మంది పాల్గొన్నారు.

వరద నీటి సమస్యను పరిష్కరించాలి



- కార్పొరేటర్ పావని వినయ్ కుమార్

నవతెలంగాణ-ముషీరాబాద్

ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీనగర్ డివిజన్‌లో వరద నీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని కార్పొరేటర్ పావని వినయ్ కుమార్ కోరారు. అశోక్ నగర్ నుండి ఆర్‌టీసీ క్రాస్ రోడ్స్ వెళ్లే దారిలో జవహర్ స్కూల్ వద్ద తరచూ వరద నీరు నిలిచిపోయి, పలు మార్లు యాక్సిడెంట్స్ కావడంతో పాటు అటు వైపు ప్రయాణించే ప్రయాణికులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని స్థానికులు కార్పొరేటర్‌కు ఫిర్యాదు చేశారు. బుధవారం స్టీల్ బ్రిడ్జ్ ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్ కుమార్, ప్రాజెక్ట్ అసిస్టెంట్ ఇంజనీర్ సాయికష్ణ వాటర్ వర్క్ మేనేజర్ కష్ణమోహన్, ఏరియా ఇన్‌చార్జి శంకర్, జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ మహేష్, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ వినయ్ కుమార్, అధికారులతో కలిసి కార్పొరేటర్ సమస్యాత్మక ప్రదేశాలలో పర్యటించారు. ముందస్తుగా వరద నీరు వెళ్ళే కచ్చా నాలలో వ్యర్థాల తొలగింపు చేపట్టినప్పటికీ రోడ్డుపై నీరు నిలిచిపోవడం పై వివరాలను కార్పొరేటర్ అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ముఖ్య కారణం స్టీల్ బ్రిడ్జి పిల్లర్ల నిర్మాణం సమయంలో సరైన ప్రణాళిక అమలు చేయక.. కచ్చానాల నుండి వెళ్ళే వరదనీరుకు అండర్ గ్రౌండ్‌లో పిల్లర్ నిర్మాణం అడ్డుపడడమే కాకుండా డ్రయినేజీ పైప్ లైన్ దెబ్బ తిని మురికినీరు కచ్చా నాలలోకి వెళ్ళడం తో నీటి ప్రవాహం పూర్తిగా స్తంభించి సమస్య తరచూ ఉత్పన్నమవుతుందని తెలిసింది. అధికారుల తీరుపై కార్పొరేటర్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రాజెక్టు నిర్మాణ సమయంలో అధికారులు ఎలాంటి ప్రణాళికను అమలు చేశారో వెంటనే తమకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. వర్షాకాలం దష్ట్యా సమస్య పునరావత్తం కాకుండా వెంటనే పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పి.నర్సింగ్ రావు,అరుణ్ కుమార్, ప్రశాంత్,ప్రవీణ్ స్థానికులు పున్న సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

చిరాక్ ఆలీలోని జీపీఎస్ కూచే ప్రభుత్వ పాఠశాల, జీహెచ్ఎస్ చందర్ ఘాట్ నెంబర్ -2 ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచిత యూనిఫాం, పుస్తకాలను గన్ ఫౌండ్రి డివిజన్ కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓం ప్రకాష్, ఇన్‌చార్జి హెచ్ఎంలు మంజులత, తదితరులు బుధవారం అందజేశారు.



సుల్తాన్ బజార్ బాలికల పాఠశాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆర్ ఎ వినోద్ కుమార్, చంద్రమౌళి, ఉపాధ్యాయులు తదితరులు బుధవారం పుస్తకాలను పంపిణీ చేశారు.
నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ప్రభుత్వ సంగీత, నత్య కళాశాలలో దరఖాస్తు ఆహ్వానం..



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రామ్ కోఠి శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నత్య కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ్ ముతాలిక్ తెలిపారు. బుధవారం రామ్ కోఠిలోని శ్రీ త్యాగరాజ ప్రభుత్వ సంగీత, నత్య కళాశాల లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కర్ణాటక గాత్రం, కర్ణాటక వయోలిన్, వీణ, మదంగం, కూచిపూడి నత్యం, భరతనాట్యం, పేరిణి నత్యం, హిందుస్థాని గాత్రం, హిందుస్థాని వయోలిన్, సితార్, తబలా, వేణువు, డోలు, కథక్ నత్యం నాలుగు సంవత్సరాల సర్టిఫికెట్ కోర్స్, రెండు సంవత్సరాల డిప్లొమా కోర్స్ లలో చేరుటకు విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. సర్టిఫికెట్ కోర్స్ కు 1400, డిప్లమా కోర్సు కు 1800, దరఖాస్తు ఫారం 30 రూపాయలు చెల్లించాలని తెలిపారు. ఆసక్తి కల విద్యార్థులు నేటి నుండి జులై 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ మధ్యాహ్నం రెండు గంటల నుండి ఏడు గంటల వరకు కళాశాల సిబ్బంది అందుబాటులో ఉంటారని చెప్పారు.

గోషామహల్‌లో టీడీపీ నాయకుల సంబరాలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా టీడీపీ గోషామహల్ నియోజకవర్గ నాయకులు సంబరాలు చేసుకున్నారు. బుధవారం రామకష్ణ థియేటర్ వద్ద టీడీపీ నాయకులు టపాకాలు పేల్చి, మిఠాయిలు ప్రజలకు పంచారు. ఈ కార్యక్రమంలో గోషామహల్ సీనియర్ నాయకులు రామ్ నారాయణ యాదవ్, ఊర్మిళా దేవి సింగ్, కే డీ దినేష్, టి. అనిల్, వాసు శ్రీనివాస్, ఘన్ శ్యామ్ భాటి, జె మహేష్ బాబు, జయరాజ్ యాదవ్, అజీజ్ ఖాన్, వినోద్ కుమార్, సోమశేఖర్ కుర్మా, ఆనంద్ ఆండెకర్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్ పరీక్ష పేపర్ లీక్‌పై సీబీఐ చేత విచారణ జరిపించాలి'



నవతెలంగాణ-హిమాయత్ నగర్

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ పై సీబీఐ చేత వెంటనే విచారణ జరిపించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి డిమాండ్ చేసింది. సమితి ఆధ్వర్యంలో బుధవారం హిమాయత్ నగర్ 'వై' జంక్షన్ వద్ద ప్లకార్డులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠ రెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మాట్లాడుతూ నీట్ పరీక్ష ఫలితాలపై అనేక అనుమానాలు వెలువడుతున్న తరుణంలో పరీక్ష నిర్వహించిన తీరుపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ చేత సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. ఫలితాల్లో అనేక అవకతవకలు జరిగాయని విద్యార్థుల తల్లిదండ్రులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. వారి అనుమానాలకు సజీవ సాక్ష్యం ఆరుగురు విద్యార్థులకు 720 మార్కులకు 720 మార్కులు రావడం మరల వారి పరీక్ష కేంద్రం ఒకటే కావడం వల్ల వారి అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు ఇటిక్యాల రామకష్ణ, గ్యార క్రాంతి, రాష్ట్ర నాయకులు చైతన్య, శివ, అన్వర్, వంశీ, వెంకటేష్, సన్నీ, జోసెఫ్, మధు, బన్నీ, సాయి, హరీష్, రాము తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు వెంటనే చెల్లించాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్.కష్ణయ్య
- ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క వినతిపత్రం అందజేత..



నవతెలంగాణ-ముషీరాబాద్

రాష్ట్రంలోని 20 లక్షల మంది ఇంజినీరింగ్, మెడిసిన్, పీజీ, డిగ్రీ విద్యార్థుల మొత్తం ఫీజుల బకాయిలు రూ. 7వేల కోట్లను వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్. కష్ణయ్య డిమాండ్ చేశారు. బుధవారం ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్కను వారు కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా రాష్ట్ర కాలేజీ కోర్సులు చదివే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల రూ. 7వేల కోట్ల ఫీజుల బకాయిలు ప్రభుత్వం చెల్లించడం లేదని తెలిపారు. దాంతో విద్యార్థులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులను ఫీజులు కట్టాలని ఒత్తిడి చేస్తున్నాయని తెలిపారు. బీఈ, బీటెక్, ఫార్మసీ, ఎంటెక్, ఎంబీఏ, ఎంసీఏ, పీజీ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. మొత్తం ఫీజులు కడితేనే సర్టిఫికెట్లు ఇస్తామంటున్నారని తెలిపారు. పేద కులాలు చదువుకుంటే సంపన్న వర్గాల దోపిడీ పాలన అంతమవుతుందని గత ప్రభుత్వం భయపడి ఇవ్వలేదని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా ఫీజుల బకాయిలు చెల్లించపోతే కాలేజీలలో లెక్చరర్స్ జీతాలు ఎలా చెల్లించాలని, కాలేజీలు ఎలా నడుపాలని కాలేజీ యాజమాన్యాలు భాద పడుతున్నాయని తెలియచేసారు. విద్యార్థులకు ఫీజు బకాయిలు వెంటనే చెల్లించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం తప్పదని హెచ్చరించారు. గుజ్జ కష్ణ, నీల వెంకటేష్, అంజి, రాజేందర్, వేముల రామకష్ణ, రఘుపతి, పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలి

- తెలంగాణ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్



నవతెలంగాణ-ముషీరాబాద్

ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి అపాయింట్మెంట్ తేదీని ప్రకటించాలని తెలంగాణ ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దాల సురేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆర్టీసీ సమస్యలు పరిష్కరించాలని ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద ఆర్టీసీ బహుజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ నాయకులు ఒక్కరోజు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరాహార దీక్షకు ఆయన హాజరై మాట్లాడుతూ. ఆర్టీసీ కార్మికులను గత ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అయినా ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. మహాలక్ష్మి ఆధార్ కార్డుల వల్ల కండక్టర్లకు సమస్యలు ఎదురవుతున్నాయి అన్నారు. ఆధార్ కార్డులాగా ఆర్టీసీ ఐడి కార్డ్ ఇంప్లిమెంట్ చేయాలని కోరారు. ఎం.వి మోటార్ యాక్ట్ 1961 ఆర్టీసీలో ఇంప్లిమెంట్ చేయాలని ఆర్టీసీలో సస్పెండ్ రిమువ్ అయిన వారిని ఆపిల్లో ఉన్న వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. రిటైర్మెంట్ అయిన కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించి మ్యానిఫెస్టోలో పెట్టిన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మికులపై పని భారాన్ని తగ్గించి కిలోమీటర్లకు సరిపోయే రన్ టైం ఇవ్వాలని, అధికారుల వేధింపులు ఆపాలని కోరారు. మహిళలపై వేధింపులు ఆపి అవసరాల బట్టి ప్రతి కార్మికునికీ లీవులు మంజూరు చేయాలని అన్నారు. ఈ నిరాహార దీక్షలో జాయింట్ సెక్రెటరీ డి యాదయ్య, శ్రీనివాస్, రవికుమార్, ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డి.యాదయ్య, సుభాష్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి

నవతెలంగాణ -సుల్తాన్ బజార్

దైనందిన జీవితంలో అన్ని వర్గాల ప్రజలందరూ ప్లాస్టిక్ వినియోగం తగ్గించి భావి తరాలకు పచ్చని పర్యా వరణం అందించాలని సామాజిక కార్యకర్త తెలంగాణ శేఖర్ చారి అన్నారు. బుధవారం అబిడ్స్‌లో ఆయన మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకంతో గాలి, నేల, నీరు కలుషితం అవు తున్నాయని, ఇంటింటికి నీడనిచ్చే, పూలు, పండ్ల మొక్కలను భారీ సంఖ్యలో నాటాలని, ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి ప్రతి మొక్కనూ సామాజిక బాధ్యతతో కాపాడాలని అన్నారు. ప్రతి కుటుంబం, ప్రతి ఉద్యోగి, ప్రతి విద్యార్థి సామాజిక బాధ్యతతో మొక్కలు నాటాలని, ప్రభుత్వ ఆఫీసులు, ఆలయాలు, ప్రయివేటు, ప్రభుత్వ విద్యా సంస్థలు, ప్రతి కుటుంబం ఖాళీ స్థలాల్లో భారీ సంఖ్యలో మొక్కలను నాటి సంరక్షించాలని, పర్యావరణ అవశ్యకతను నేటి తరం యువతకు క్షేత్ర స్థాయిలో వివరించాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి

నవతెలంగాణ - ముషీరాబాద్

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలని పీడీయస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు మామిడికాయల పరుశురాం రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. పీడీఎస్‌యూ రాష్ట్ర ముఖ్య కార్యకర్తల సమావేశం బుధవారం విద్యా నగర్ లోని పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యాలయంలో జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ఆయన హాజరై మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభం అవుతున్న సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మరుగుదొడ్లు, తాగు నీరు, సౌకర్యం కల్పన స్వీపర్, స్కావెంజర్ పోస్టుల భర్తీ పై, నోట్, బుక్స్, పాఠ్య పుస్తకాల పంపిణీ పై ప్రభుత్వం దష్టి సారించాలాని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలన్నారు. పాఠశాలల బాగుకోసం ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం సురేష్, ఎస్.రాకేష్, నాయకులు నాగరాజు, మధు, ప్రణయ్, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలు పునఃప్రారంభం

- తొలిరోజు విద్యార్థుల సందడి
- విద్యార్థులకు స్వాగతం పలికిన ఉపాధ్యాయులు
- ప్రభుత్వ స్కూళ్లలో పుస్తకాలు, యూనిఫాం పంపిణీ
- తొలిరోజు 36.73శాతం హాజరు నమోదు

నవతెలంగాణ-సిటీబ్యూరో

కొత్త విద్యాసంవత్సరం మొదలైంది. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం బుధవారం పాఠశాలలు పునఃప్రారంభమయ్యాయి. దీంతో పాఠశాలల్లో విద్యార్థులతో కళకళలాడాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులతో సందడి వాతావరణం కనిపించింది. జిల్లావ్యాప్తంగా 2,902 ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రయివేట్ పాఠశాలలు తిరిగి తెరుచుకోవడంతో విద్యార్థులు మళ్లీ పుస్తకాలు బ్యాగులు భుజన వేసుకొని హుషారుగా బడిబాట పట్టారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను సంతోషంగా పాఠశాలలకు పంపించారు. మొదటి రోజు కావడంతో చాలా మంది పేరెంట్స్ తమ పిల్లలను పాఠశాలలకు పంపించలేదు. దీంతో మొదటిరోజు ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో 1.05లక్షల మంది విద్యార్థులకుగాను



38,675 మంది రాగా.. 36.73 శాతం హాజరు నమోదైనట్టు విద్యాశాఖ అధికారులు చెప్పారు. అయితే మొదటి రోజు వెళ్లిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల వివిధ రకాల సమస్యలతో స్వాగతం పలికాయి.

హైదరాబాద్ జిల్లాలోని మొత్తం 776 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 1,05,281 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అయితే విద్యాసంవత్సరం ప్రారంభం రోజే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించాలని ప్రభుత్వం ఆదేశించడంతో.. జిల్లాలో పూర్తిస్థాయిలో అమలు కాలేదని సమాచారం. ముందుగా ఎంపిక చేసిన 15 నియోజకవర్గాల్లోని మూడు చొప్పున పాఠశాలలతో పాటు మరికొన్ని పాఠశాలల్లో మాత్రమే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు అందజేశారు. ఇదిలావుంటే మొత్తం 1953 ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో 8.40 లక్షల మంది విద్యార్థులు చదువుతుండగా.. ఆయా స్కూళ్లు అప్పుడే తమ దందాకు తెరలేపాయి. భారీగా ఫీజు వసూళ్లకుతోడు.. యూనిఫాంలు, బుక్స్, టై, బెల్ట్, సాక్సుల పేరుతో ఒక్కో విద్యార్థి నుంచి ఒకటో తరగతి నుంచి టెన్త్ వరకు రూ.4 వేల నుంచి పదివేలకుపైనే దండుకున్నాయి. ఇదిలావుంటే రెండు నెలల తర్వాత స్కూళ్లకు వచ్చిన విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వారికి స్వీట్స్ తినిపించారు. పువ్వులు, బుక్స్, పెన్నులు, పెన్సిళ్లు అందించి ఘనంగా స్వాగతం పలికారు. విద్యార్థుల రాకతో సందడి వాతావరణం నెలకొంది. ప్రభుత్వ పాఠశాలలను తొరణాలు, రంగు కాగితాలతో అలకరించారు. విద్యార్థులు తమ పాత స్నేహితులతో కబుర్లలో మునిగిపోయారు. వేసవి సెలవుల విశేషాలు పంచుకున్నారు. నగరంలో తిరిగి పాఠశాలలు తెరుచుకోవడంతో ఉదయం, సాయంత్రం వేళలో ప్రధాన రహదారులు కొంత రద్దీగా కనిపించాయి.

నిన్న సీజ్.. మరుసటి రోజే అడ్మిషన్లు



- అడ్మిషన్లు నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి
- ఏఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా సమితి డిమాండ్

నవతెలంగాణ-ఉప్పల్

విద్యాశాఖ అధికారులు సీజ్ చేసిన పాఠశాలలో మరల అడ్మిషన్లు నిర్వహిస్తున్న మాస్టర్ మైండ్స్ పాఠశాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్ర, ఏ ఐ వై ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి. సత్య ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉప్పల్ హనుమసాయి నగర్‌లో అనధికారికంగా ఏర్పాటు చేసిన ది మాస్టర్ మైండ్స్ పాఠశాలను ఉప్పల్ మండల విద్యాశాఖ అధికారులు క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్‌పీ) స్వప్న సీజ్ చేసిన సంగతి విధితమే. కానీ సీజ్ చేసిన ప్రిన్సిపాల్ గదిని సదరు పాఠశాల యాజమాన్యం సీజ్‌ను తొలగించి అడ్మిషన్లు నిర్వహించడం చట్ట విరుద్ధమన్నారు. తక్షణమే విద్యాశాకాధికారులు మాస్టర్ మైండ్స్ పాఠశాలపై చీటింగ్ కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు విద్యాశాఖ నిబంధనలకు పాతర వేస్తున్నారని, చట్టాన్ని,నిబంధనలను తమ చేతుల్లోకి తీసుకుని వికృత వ్యాపార పోకడలను అనుసరిస్తున్నారని వారు ధ్వజమెత్తారు. విద్యాశాఖ నిబంధనలనే పాటించని సదరు మాస్టర్ మైండ్స్ యాజ మాన్యం, విద్యార్థుల భవిష్యత్ ను ఏరకంగా తీర్చిదిద్దుతుం దో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యాశాఖ అధికారుల మొద్దు నిద్ర కారణంగానే పుట్ట గొడుగుల్లా పుట్టుకొస్తున్నా యని వారు ధ్వజమెత్తారు. కాసుల కక్కుర్తి తో విద్యార్థుల భవిష్యత్తు ను అంధకారంలోకి నెట్టి వేయకుండా తక్షణమే జిల్లా విద్యాశాఖ అధికారులు మాస్టర్ మైండ్స్ పాఠశాలపై కేసు నమోదు చేయాలని లేని పక్షంలో జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని ముట్టడిస్తామని వారు హెచ్చరించారు.

'కార్పొరేట్ కళాశాలలపై విచారణ జరిపించాలి'

- మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ

నవతెలంగాణ-హిమాయత్ నగర్

ఎలాంటి ప్రాథమిక సదుపాయాలు, సరైన అవగాహన లేని టీచర్లతో చదువులు చెబుతున్న శ్రీ చైతన్య, నారాయణ, గాయత్రి, ఎస్ఆర్, ఎన్ఆర్ఐ, రెజోనెన్స్ వంటి తదితర కార్పొరేట్ కళాశాలలపై వెంటనే విచారణ జరిపించాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పబ్బతి శ్రీకృష్ణ డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం ఆయన అంబేద్కర్ సచివాలయంలోని తెలంగాణ సీఎస్ ను కలిసి తన కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా పబ్బతి శ్రీకృష్ణ మాట్లాడుతూ విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక ఫీజులు వసూలు చేస్తున్న కళాశాలలపై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ అక్రమ ఫీజుల దందాను తక్షణమే అరికట్టి ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల మరణాలకు కళాశాలల యజమాన్యాలు కారణమవుతున్నాయని ఆరోపించారు.ఇలాంటి కార్పొరేట్ విద్యా సంస్థలను కట్టడి చేయవలసిన అవసరం ప్రభుత్వంపై ఉందన్నారు.లేకపోతే ఆయా కళాశాలల్లో చనిపోయిన విద్యార్థుల మరణాలకు ప్రభుత్వమే కారణమవుతుందని ఆయన హెచ్చరించారు.

ఓల్డ్ సిటీ లెజెండ్స్ శుభారంభం



నవతెలంగాణ-చాంద్రయాన్‌గుట్ట

ఉప్పల్ సర్కిల్ ఫోటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఫోటోగ్రాఫర్స్ క్రికెట్ లీగ్ 5 మ్యాచ్ ఈరోజు ప్రారంభమైందిటీ ఉప్పల్ పీర్జాజిగూడ లోని గ్రౌండ్లో ప్రారంభమైన ఈ మ్యాచ్లో ఓల్డ్ సిటీ లెజెండ్స్ వర్సెస్ మేడ్చల్ టీం కి జరిగిన. ఈ మ్యాచ్లో ఓల్డ్ సిటీ లెజెండ్స్ ఏ టికెట్లు తేడాతో విజయం సాధించింది. నిర్ణీత 12 ఓవర్లలో మేడ్చల్ టీం 46 పరుగులు చేయగా ఓల్డ్ సిటీ లెజెండ్ టీం 8.3 ఓవర్లలో లక్ష్యాన్ని చేదించి టోర్నమెంట్లో మొదటి విజయం నమోదు చేసుకుంది. బౌలింగలో వరుణ్ మూడో ఓవర్లలో మూడు వికెట్లు 6 రెండ్లు ఇచ్చి మూడు కేసులు పట్టి మాన్ ఆఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు రేపు జరగనున్న మ్యాచ్ మహేశ్వరం కింగ్స్ తో జరగనుంది.

బాలికపై లైంగికదాడి.. కటకటాల్లోకి నిందితుడు



నవతెలంగాణ-హిమాయత్‌నగర్

బాలికను లైంగికంగా వేధించి, చివరికి బెదిరింపులతో తన కామవాంఛను తీర్చుకున్న వ్యక్తిని నారాయణగూడ పోలీసులు అరెస్టు చేసి కటకటాల్లోకి పంపారు. నారాయణగూడ సీఐ యూ. చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం పోలీస్ స్టేషన్ పరిధిలో 7వ తరగతి చదువుతున్న ఓ బాలికను దూరపు బంధువువైన హిమాయత్ నగర్ ప్రాంతానికి చెందిన ప్రియదర్శికుమార్ సైగల్ గత కొంత కాలంగా లైంగికంగా వేధిస్తున్నాడు. రెండు, మూడు సార్లు తను వ్యాపారం చేసే ప్రదేశానికి ఆమెను తీసుకెళ్లి తన కామవాంఛను తీర్చుకున్నాడు. ఈ విషయంలో ఆ బాలిక డిప్రెషన్‌కు లోనై భయబ్రాం తులకు గురైంది. కాగా ఆ బాలిక ఈ నెల 3న నారాయణగూడ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు బుధవారం నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచారు.నిందితుడిని పట్టుకోవడంలో పూర్తిగా సహకరించిన ఎస్ఐ నరేష్, కానిస్టేబుల్ విష్ణు, హెూంగార్డ్ గౌస్ లను పోలీస్ ఉన్నతాధికారులు అభినందించి, రివార్డులను అందజేశారు.

ఉచితంగా పుస్తకాలు అందించడం గొప్ప విషయం



- కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు వారికి అవసరమైన యూనిఫామ్స్, నోట్‌బుక్స్ కూడా ప్రభుత్వం ఉచితంగా అందిస్తుండడం ఎంతో గొప్ప విషయమని కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తు కోసం కృషి చేస్తానని తెలిపారు. జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ రౌండ్ టేబుల్ ప్రభుత్వ పాఠశాలలో స్కూల్ యూనిఫామ్స్, నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు శ్రద్ధగా చదువుకొని ఉన్నతస్థాయికి చేరుకోవాలని సూచిం చారు.ఈ కార్యక్రమంలో స్కూల్ రమేష్,జగన్,శెట్టి,శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

పభుత్వ పాఠశాలలో చదివితే ప్రయోజనం



- నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి

నవతెలంగాణ-బంజారా హిల్స్

పభుత్వ పాఠశాలలో చదివితే అన్ని విధాలుగా ప్రయోజనం పొందుతారని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఎన్‌బీటీ నగర్ పాఠశాల ప్రారంభోత్సవంలో అతిథిగా హాజరై మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డీఈఓ, శామ్యూల్ రాజ్ తో కలిసి విద్యార్థులకు యూనిఫాం పుస్తకాల పంపిణీ చేశారు. ప్రయివేటు స్కూళ్ల కన్నా గవర్నమెంట్ స్కూళ్లలోనే అత్యున్నత ప్రమాణాలు కలిగిన ఉపాధ్యాయులు ఉన్నారని మేయర్ తెలిపారు.



పేదలకు వరంగా కల్యాణ లక్ష్మి

- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

నిరుపేదలకు తమ పిల్లల పెండ్లీలు చేసే సమయంలో ఆర్థిక ఇబ్బందిని కలిగించే పరిస్థితిని నివారించేందుకే గత ప్రభుత్వం కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను ప్రవేశపెట్టిందని, పేదలకు ఈ పథకం వరమని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. ముషీరాబాద్, మారేడుపల్లి మండలాలకు సంబంధించి సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలోని వివిధ మున్సిపల్ డివిజన్లకు చెందిన షాది ముబారక్, కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమం బుధవారం సితాఫలమండీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. 135 మందికి ఈ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ప్రతి ఇంటికీ వివిధ సంక్షేమ పథకాలను అందించాలన్నదే తమ సంకల్పం అన్నారు. ప్రభుత్వ పథకాలకు లంచాలు చెల్లించరాదని, ఎవరైనా డబ్బులు అడిగితే సితాఫలమండీలోని తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. కార్పొరేటర్లు సామల హేమ, రాసూరి సునీత రమేష్, నేతలు రామేశ్వర్ గౌడ్, రాజ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

'నీట్'లో అవకతవకలపై విచారణ జరిపించాలి

- ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ అలివేలి రాజు



నవతెలంగాణ-ఓయూ

నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయని విద్యార్థులు నిరసన చేస్తున్న నేపథ్యంలో ఎన్‌టీఏ అధికారులు, కేంద్రప్రభుత్వం వెంటనే సీబీఐతో విచారణ జరిపించాలని ఏబీవీపీ స్టేట్ వర్కింగ్ కమిటీ మెంబర్ (ఓయూ) అలివేలి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ అవకతవకల విషయంలో నైపుణ్యం గల అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి వాస్తవాలను విద్యార్థులకు తెలియజేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పరీక్షలో దాదాపు 67 మంది విద్యార్థులకు పూర్తి మార్కులు వచ్చాయని.. ఇలా రావడం అసాధ్యం అని చాలా మంది నిపుణులు, విద్యార్థులు ఆరోపిస్తున్నారన్నారు. ఈ విషయం పై కేంద్రప్రభుత్వం వెంటనే స్పందించి నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై సీబీఐతో ఎంక్వైరీ చేయించి లక్షలాది మంది విద్యార్థులకు న్యాయం చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేస్తున్నదన్నారు.

ఫిట్‌లెస్ స్కూల్ బస్సులు

- గ్రేటర్‌లో తొలిరోజే 71 బస్సులపై కేసులు
- ఫిట్‌నెస్ లేకుండానే యథేచ్ఛగా రోడ్లపైకి
- 3వేలకుపైగా స్కూల్, కాలేజీ బస్సులు ఫిట్‌నెస్‌కు దూరం..!
- రవాణా అధికారుల హెచ్చరికలను పట్టించుకోని విద్యా సంస్థలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఫిట్‌నెస్ లేని స్కూల్ బస్సులపై రవాణాశాఖ అధికారులు కొరడా ఝులిపించారు. గ్రేటర్‌లోని వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన తనిఖీల్లో 71 బస్సులపై కేసులు నమోదు చేశారు. బుధవారం నుంచి కొత్త విద్యా సంవత్స రం ప్రారంభమవ్వడంతో వందలాది బస్సులు విద్యార్థులతో రోడ్డెక్కాయి. నిర్ణీత గడువులోగా బడి బస్సుల ఫిట్‌నెస్ చెక్ చేయించుకోవాలని రవాణాశాఖ అధికారులు హెచ్చరించినా పట్టించుకోకపోవడంతో గ్రేటర్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి మేడ్చల్ జిల్లాలకు చెందిన ఆర్టీఏ అధికారులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు.

గ్రేటర్ పరిధిలో మొత్తం 13,212 స్కూల్ బస్సులున్నాయి. ఇందులో సుమారు 3,352 బస్సులు ఫిట్‌నెస్‌కు దూరంగా ఉండిపోయాయి. ఈ నేపథ్యంలో రవాణాశాఖ అధికారులు పాఠశాలల ప్రారంభమైన తొలి రోజే నుంచి ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. హైదరాబాద్ జిల్లాలో రవాణాశాఖ సంయుక్త కమిషనర్ సి.రమేష్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఉపరవాణా కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో తనఖీలు నిర్వహించారు. నగర పరిధిలోని మొత్తం అయిదు జోన్‌లలో కలిపి మొత్తం 25 బస్సులను సీజ్ చేయగా.. అందులో 19 బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకపోగా.. మరో ఆరు బస్సులకు పర్మిట్‌తో పాటు టాక్స్ చెల్లించలేదని సంబంధిత అధికారులు గుర్తించారు. ఇదిలావుంటే సెంట్రల్ జోన్, నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్ కలిపి 13 బస్సులు, ఈస్ట్‌జోన్‌లో నాలుగు బస్సులు, నార్త్‌జోన్‌లో ఒక బస్సు, వెస్ట్‌జోన్‌లో ఒక బస్సు, సౌత్ జోన్ పరిధిలో ఆరు బస్సులపై కేసులు నమోదు చేసి సీజ్ చేశారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో ఆర్టీఏ అధికారులు అయిదు బృందాలుగా ఏర్పడి మొత్తం వందకుపైగా పాఠశాల, కళాశాల బస్సులను చెక్ చేయగా..46 బస్సులపై కేసులు నమోదు చేయడంతో పాటు సీజ్ చేశారు. వీటిలో కొన్ని బస్సులకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు, మరికొన్ని బస్సులకు పర్మిట్లు, టాక్స్ చెల్లించకపోవడం, నిబంధనలు ప్రకారం లేకపోవడం వంటివి గుర్తించారు.

ఫిట్‌నెస్ లేని బస్సుల్లో విద్యార్థులను రవాణా చేయొద్దు



పాఠశాల, కాలేజీ బస్సులకు సంబంధించి వ్యాలిడీ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా విద్యార్థులను రవాణా చేయొద్దని విద్యాసంస్థల యాజమానులను హెచ్చరి స్తున్నాం. నగరవ్యాప్తంగా ఆర్టీవో, ఎంవీఐ, ఏఎంవీఐలతో కూడిన ప్రత్యేక బృందాల ద్వారా విస్తృత తనిఖీలు చేపడుతున్నాం. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తీసుకొని వాహనాలను గుర్తించి చర్యలు తీసుకుంటున్నాం. నగరంలోని ప్రధాన కూడళ్లతో పాటు ముఖ్యమైన ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి.. ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న 25 బస్సులపై కేసులు నమోదు చేశాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలకు వెనుకాడబోం.

- సి.రమేష్, జేటీసీ, హైదరాబాద్

విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు తప్పనిసరి



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు దాదాపు 8,917 విద్యా సంస్థల బస్సులకు వాహన సామర్థ్య పరీక్షలు పూర్తి చేశాం. స్కూళ్లు ప్రారంభమైన తొలిరోజే వందకుపైగా బస్సులను పరిశీలించాం. అందులో ఫిట్‌నెస్ లేనివి, పన్నులు చెల్లించని 46 బస్సులపై కేసులు నమోదు చేసి.. సీజ్ చేశాం. ఇప్పటికే అన్ని విద్యా సంస్థలకు నోటీసులు ఇచ్చాం. ఫిట్‌నెస్ లేకుండా బస్సు రోడ్డెక్కితే సీజ్ చేస్తామని హెచ్చరిస్తున్నాం.

- మామిండ్ల చంద్రశేఖర్ గౌడ్, డీటీసీ, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా

ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేస్తాం



- ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్

నవతెలంగాణ-బంజారాహిల్స్

ప్రభుత్వ పాఠశాల విద్యను బలోపేతం చేస్తామని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 7లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కార్పొరేటర్ మన్నే కవిత రెడ్డి, డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ శ్యామూల్రాజ్, మండల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ యాదగిరీలతో కలసి విద్యార్థులకు ఎమ్మెల్యే పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే నేటి రోజుల్లో వివిధ రంగాల్లో గొప్ప స్థాయిలో ఉంటూ దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. ఈ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు కూడా బంగారు భవిష్యత్తు ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కాసేపు ముచ్చటించి వారి సౌకర్యాలు అడిగి తెలుసుకున్నారు. బాలికల ప్రత్యేక మరుగుదొడ్లు, నిత్యం అందించే ఆహారం విషయంలో నాణ్యత పాటించి సౌకర్యాలు సకాలంలో అందేలా చూడాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా పాలనలో,సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ పాఠశాలలకు, నాణ్యమైన విద్యా బోధనకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ ప్రభుత్వ పాఠశాలల్లో అత్యుత్తమ ఫలితాలు రావడానికి, పేద విద్యార్థుల కుటుంబాల మీద ఆర్థిక భారం పడకుండా నాణ్యమైన బోధన ద్వారా మోడల్ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపాల్,ఉపాధ్యాయ బృందం స్థానిక నాయకులు,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కామాక్షిపురంలో పనులను పరిశీలించిన కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

హబ్సిగూడ డివిజన్‌లోని కామాక్షిపురం స్ట్రీట్ నెంబర్ 2లో సుమారు 34 లక్షలతో నిధులతో వేయనున్న రోడ్డు పనులను కార్పొరేటర్ చేతన హరీష్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, త్వరగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. గతంలో కామాక్షిరంలో డ్రయినేజీ సమస్య తీవ్రంగా ఉండేదని దానికి అనుగుణంగా డ్రయినేజీ పైపులు పెద్దది వేయడం జరిగిందన్నారు అనంతరం సీసీ రోడ్డు వేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు ఏఈ సాయికిరణ్ స్థానికులు రవి ,కల్లుకల లింగం, శ్రీనివాస్, పాల్గొన్నారు.

కార్పోరేట్‌కు దీటుగా ప్రభుత్వ విద్యాసంస్థలు



- ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

నవతెలంగాణ-ఓయూ

ప్రభుత్వ స్కూల్‌లను కార్పోరేట్ విద్యాసంస్థలకు దీటుగా తీర్చిదిద్దాలని తాము సంకల్పిస్తున్నామని, విద్య వైద్య రంగాలకు అధిక ప్రాముఖ్యతను కల్పిస్తున్నామని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అన్నారు. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని 16 ప్రభుత్వ స్కూల్‌లలో 'అమ్మ ఆదర్శ స్కూల్' కార్యక్రమాన్ని బుధవారం వారు లాంఛనంగా ప్రారంభించారు. అడ్డగుట్ట ఆజాద్ చంద్రశేఖర్ నగర్ లోని ప్రభుత్వ ప్రాథమిక స్కూల్‌లో విద్యార్థులకు పుస్తకాలు, యునిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ సికింద్రాబాద్ అడ్డగుట్ట, తార్నాక, మెట్టుగూడ, సితఫలమండీ, బౌద్ధనగర్ డివిజన్లలో కలిపి దాదాపు 30 ప్రభుత్వ స్కూల్స్ ఉన్నాయని, వాటిలో 16 స్కూళ్లలో వివిధ సదుపాయాలని కల్పిస్తున్నామని తెలిపారు. సితఫలమండి ప్రభుత్వ స్కూల్‌లో జూనియర్, డిగ్రీ కాలేజీలను ఏర్పాటు చేయించామని, కొత్త భవనాల నిర్మాణ పనులను ప్రారంభించామని చెప్పారు. గతంలో 10 స్కూల్స్ కు మన బడి-మన బస్తీ కార్యక్రమంలో భాగంగా వివిధ సదుపాయాలను కల్పించేందుకు వీలుగా ఏర్పాట్లు జరిపామని గుర్తు చేశారు. బ్రాహ్మణ బస్తీ లోని ప్రభుత్వ స్కూల్‌కు కొత్త భవనాలను నిర్మించే ప్రతిపాదనలు చేశామని, జమే ఉస్మానియా ప్రభుత్వ స్కూల్ లో వివిధ సదుపాయాలు కల్పించే ఏర్పాట్లు జరిపామని తెలిపారు. లాలాపేట మార్కెట్, అంబర్‌నగర్ , డైరీ ఫారం, దూద్ బావి, ఆజాద్ చంద్ర శేఖర్ నగర్ ప్రభుత్వ స్కూల్ వివిధ సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆజాద్ చంద్రశేఖర్ నగర్ స్కూల్‌కు వెంటనే ప్రహరీ గోడ నిర్మించాలని అధికారులను ఆదేశించారు. వాచ్‌మ్యాన్ నారాయణకు గౌరవ వేతనంగా రూ.50 వేలను తన వ్యక్తిగత విరాళంగా అందించారు. కార్పొరేటర్లు లింగాని ప్రసన్న లక్ష్మి శ్రీనివాస్, సామల హేమ, విద్యాధికారి బాలు నాయక్, యుసీ డీ ప్రాజెక్ట్ అధికారి శ్రీనాద్, విద్యాధికారి మదన్ మోహన్, నేతలు రామేశ్వర్ గౌడ్, లింగాని శ్రీనివాస్, విజయ కుమారి, ఝాన్సీ రాణి, పద్మావతి , పాల్గొన్నారు.



విభిన్న ఆహార రుచులకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్

- మాజీ మేయర్ కార్తిక రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

విభిన్న ఆహార రుచులకు కేరాఫ్ అడ్రస్ హైదరాబాద్ అనిమాజీ మేయర్ కార్తిక రెడ్డి అన్నారు. తెలుగు అరోమాస్ పేరుతో తార్నాకలో నూతనంగా ఏర్పాటు చేసిన బిర్యాని, పులావ్ కేంద్రాన్ని వారు బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగు రుచులతో బిర్యానీ, పులావ్ నాన్ వెజ్ వంటకాలను తార్నాక వాసులకు అందుబాటులోకి తీసుకురావడం ఎంతో అభినందనీయమని అన్నారు. హెూటల్ నిర్వహణలో సుచి శుభ్రత, నాణ్యత ప్రమాణాలు పాటించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం స్వయంగా ఆమె వంటకాలను రుచి చూశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు బండ చంద్రారెడ్డి , వీరన్న, సంపత్, సాయినాథ్ గౌడ్, కిరణ్ గౌడ్, శివారెడ్డి, నిర్వాహకులు పాశం అరవింద్, శ్రావణ్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, ప్రదీప్ రాజు పాల్గొన్నారు.



కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం సంజీవనగర్, వాల్మీకినగర్ సెకండ్ లక్ష్మి నగర్ లలో సీనియర్ నాయకులు, కార్యకర్తల డప్పు చప్పుళ్ళతో కోలాహలంతో విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు.ఈ సందర్భంగా శ్రీ గణేష్ ను సభ్యులు ఘనంగా సన్మానించారు కార్యక్రమంలో కంటోన్మెంట్ మంచి వికాస్ కార్యదర్శి సంఖ్య రవీందర్, గొల్ల కష్ణ తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నవతెలంగాణ -కంటోన్మెంట్



ఆర్ట్స్ కళాశాలలో మరమ్మతులకు నిధులు విడుదల చేస్తాం

- ఓయూ ఇన్‌చార్జి వీసీ దాన కిషోర్
- ఓయూ ఆర్ట్స్ కళాశాలను సందర్శించిన ఇన్‌చార్జి వీసీ

నవతెలంగాణ-ఓయూ

ఆర్ట్స్ కళాశాలలో కలర్స్, పెయింటింగ్ వేయడానికి, అలాగే మరమ్మత్తులు చేయడానికి తగిన నిధులు హెచ్‌ఎండీఏ నుంచి విడుదల చేస్తామనిరాష్ట్ర ప్రభుత్వ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్మెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ, హెచ్ఎండీఏ కమిషనర్ ఓయూ ఇన్‌చార్జి వీసీ దాన కిషోర్ తెలిపారు. ఇందుకు తగిన అంచనాలను వెంటనే రూపొందించాలని ఓయూ చీఫ్ ఇంజనీర్‌తో పాటు హెచ్‌ఎండిఏ అధికారులను ఆదేశించారు. బుధవారం ఓయూ ఆర్ట్స్ కళాశాలను వారు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాలలోని లైబ్రరీతో పాటు తరగతి గదులను, సెమినార్ హాల్స్ గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు మొదటి అంతస్తులోని పలు గదులను పరిశీలించారు. అలాగే తరగతి గదుల్లో ఉన్న విద్యార్థులు, అధ్యాపకులతో సంభాషిం చారు.

అనంతరం వీసీ దాన కిషోర్ మాట్లాడుతూ ఆర్ట్స్ కళాశాల చుట్టూ ఫెన్సింగ్ వేయడంతో పాటు ఎస్‌బీఐ ముందు భాగంలో నూతనంగా లాన్ డెవలప్మెంట్ చేయాలని అధికారులకు చెప్పారు. మెయిన్ లైబ్రరీ సమీపంలోనే 500 మంది విద్యార్థుల కెపాసిటీతో ఒక రీడింగ్ భవనాన్ని నిర్మించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. వీటన్నింటికీ అవసరమైన నిధులను హెచ్‌ఎండీఏ నుంచే విడుదల చేస్తామని తెలిపారు. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ. పి .లక్ష్మీనారాయణ, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కుతాడి అర్జున్ రావు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ భీనవేని రామ్ షెపర్డ్, ఓయూ చీఫ్ ఇంజనీర్ ప్రొ. రాధిక, హెచ్‌ఎండీఏ అధికారులు ఉన్నారు.

థాయిలాండ్ యూనివర్సిటీలకు ఓయూ నుంచి అరుగురు పీహెచ్‌డీ విద్యార్థుల ఎంపిక

స్టూడెంట్ ఎక్స్‌చేంజ్ ప్రోగ్రాంలో భాగంగా థాయిలాండ్ విశ్వవిద్యాలయాలకు ఓయూ పరిశోధక విద్యార్థులు వెళ్లడానికి హెచ్‌ఎండీఏ నుంచి ఫెలోషిప్ సహకారాన్ని అందిస్తున్నట్టు దాన కిషోర్ తెలిపారు. ఓయూకు సంబంధించిన వివిధ ఫ్యాకల్టీల నుంచి పీహెచ్‌డీ విద్యార్థులను ఎంపిక చేయాలని కోరారు.

విద్యార్థులకు బుక్స్, యూనిఫామ్ పంపిణీ



తిరుమలగిరిలో

- కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు

నవతెలంగాణ-కంటోన్మెంట్

పాఠశాలలు ప్రారంభం కావడంతో కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ బుధవారం తిరుమలగిరి లాల్‌బజార్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు యూనిఫాంలను పంపిణీ చేశారు. అంతకుముందు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు ఆహ్వాన మేరకు ఉపాధ్యాయుల నిర్వహించిన నిర్వహించిన బడి బాట కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజర య్యారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలో వారి పిల్లలను చేర్పించాలని కోరారు. ప్రయివేటు, కార్పొరేట్ పాఠశాలలకు మిన్నగా ప్రభుత్వ వసతులు ఉన్నాయని తెలిపారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా భవనాలు కూడా ఉన్నాయని తల్లిదండ్రులు గుర్తించాలన్నారు.

జూబ్లీహిల్స్ : ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు యూసుఫ్ గూడా ప్రభుత్వ పాఠశాలలో యూసుఫ్ గూడా కార్పొరేటర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రైమరీ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను, యూనిఫాంలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు రోజూ క్రమం తప్ప కుండా హాజరై, ఉపాధ్యాయులు బోధించే పాఠాలను బాగా చదవడంతో పాటు, క్లాస్ రూములను, వాష్ రూములను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పరమేశ్వరమ్మ, బీఆర్ఎస్ డివిజన్ ప్రధాన కార్యదర్శి అయిలపాక నర్సింగ్ దాస్, పాఠశాల ఉపాధ్యాయులు, పార్టీ డివిజన్ స్థాయి నాయకులు గీతా గౌడ్, అమ్మాజీ ,నాగరాజు, నాగ, శరత్ గోపాల్, స్వామి, పాఠశాల విద్యార్థులు భారీగా పాల్గొన్నారు.



యూసుఫ్‌గూడలో



బోరబండలో

బడి-బాట కార్యక్రమంలో భాగంగా బోరబండలోని స్వరజ్ నగర్‌లోగల, గవర్నమెంట్ హై స్కూలులో బోరబండ కార్పొరేటర్, మాజీ డిప్యూటీ మేయర్ మహమ్మద్ బాబా పసియుద్దీన్ విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్స్ బుక్స్, స్కూలు డ్రెస్ లు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మంలో స్కూల్ ప్రిన్సిపాల్ మొహమ్మద్ అంజాద్, టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే బోరబండలోని వీకెర్ సెక్షన్‌లోగల నాట్కో



బంజారాహిల్స్‌లో

ప్రభుత్వ ప్రైమరీ స్కూలు, ప్రభుత్వ ఉర్దూ స్కూలులలో విద్యార్థులకు నోట్ బుక్స్, టెక్స్ బుక్స్ ను బోరబండ కార్పొరేటర్ మహమ్మద్ బాబా ఫసివుద్దీన్ బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాట్కో స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, ఉర్దూ స్కూలు ప్రిన్సిపల్ ప్రమీల రాణి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బంజారాహిల్స్ : ఎర్ర మంజిల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో స్థానిక కార్పొరేటర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి విజయ రెడ్డి విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్‌తో పాటు టెక్స్ బుక్స్, నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మెన్ ఎస్. రుక్మిణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ వెంకట్ రెడ్డితో పాటు ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు పాల్గొన్నారు.



బోరబండలో

జుట్టు సమస్యకు చెక్



ఇంట్లో అందుబాటులో ఉండే వాటితో చర్మాన్ని, జుట్టుని కాపాడుకోవచ్చు. ఆరోగ్యకరమైన చిట్కాలను అనుసరిస్తే కొన్నిరకాల అనారోగ్య సమస్యల నుంచి బయట పడొచ్చు.

ఎలాంటి హానిలేని ఉత్తమ చిట్కాలు అందించే ఆరోగ్య నిపుణుల సలహాలను పాటిస్తే ఆయా సమస్యలకు సరైన పరిష్కారాలు పొందవచ్చు. హెయిర్ ఫాల్‌కు ఆరోగ్య నిపుణులు అందించిన కొన్ని చిట్కాలను పరిశీలిద్దాం...

- ఇరవై తమలపాకులని తీసుకుని శుభ్రంగా కడిగి పేస్టుచేయాలి.
- ఈ పేస్టులో ఒక టీస్పూను నెయ్యి వేసి కలపాలి.
- ఆ మిశ్రమాన్ని మాడు నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. గంట తరువాత నీటితో కడిగేయాలి.
- ఇలా వారానికి ఒకసారి ఈ మాస్క్ వేసుకోవడం వల్ల తమలపాకులోని పోషకాలు జుట్టుకు అంది.. అది మరింత బలంగా దట్టంగా పెరుగుతుంది.
- జుట్టురాలే సమస్య కూడా తగ్గుముఖం పడుతుంది.
- అలాగే తమలపాకు పేస్ట్‌లో కొద్దిగా కొబ్బరి నూనె, ఆముదం కలిపి జుట్టు కుదుళ్లకు పట్టిస్తే. జుట్టు ఒత్తుగా, బలంగా పెరుగుతుంది.
- ఈ విధంగా వారానికి ఒకసారి లేదా నెలకు రెండు మూడు సార్లు చొప్పున చేస్తే చక్కటి ఫలితం ఉంటుంది.

రోటి పచ్చడి అదిరే రుచి..



ఒకప్పుడు రోటి పచ్చళ్లే ఫేమస్. పూర్వం అమ్మమ్మలు, నానమ్మలు రోట్లో రుబ్బి పచ్చళ్ళు చేసేవారు. వాటి రుచి ఇప్పటి మిక్సీ పచ్చళ్లకు రాదు. మిక్సీలో అన్నింటినీ వేసి రుబ్బేసే కన్నా... రోట్లో వేసి దంచుకొని పచ్చళ్లు చేసుకుంటే ఎంతో రుచిగా ఉంటాయి. బెండకాయలు, దొండకాయలు, దోసకాయలతో ఎప్పుడూ ఫ్రైలు కూరలు చేసి విసిగిపోయి ఉంటారు. ఒకసారి పచ్చళ్లను ట్రై చేయండి.. తింటున్న కొద్దీ తినాలనిపిస్తుంది. అస్సలు వదిలిపెట్టరు. తక్కువ సమయంలోనే రెడీ అయిపోతాయి. ఆరోగ్యానికి కూడా ఇవి ఎంతో మంచిది. వాటిని ఎలా చేయాలో ఒకసారి చూద్దాం...

దోసకాయతో

కావలసిన పదార్థాలు : దోసకాయ - ఒకటి, దోశ గింజలు - రెండు స్పూన్లు, చింతపండు - నిమ్మకాయ సైజులో, ఎండుమిర్చి - ఎనిమిది, ఉప్పు - రుచికి సరిపడా, ఉల్లిపాయ - ఒకటి, నూనె - రెండు స్పూన్లు, వెల్లుల్లి రెబ్బలు - నాలుగు, కరివేపాకులు - గుప్పెడు, జీలకర్ర - ఒక స్పూను, శనగపప్పు - అర స్పూను, మినపప్పు - అర స్పూను.



తయారీ విధానం : దోసకాయను కోసి అందులోని గింజలను వేరు చేసుకోవాలి. దోసకాయ ముక్కలు చేసి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. ఆ నూనెలో దోసకాయ గింజలను వేసి వేయించాలి. వాటిని తీసి పక్కన పెట్టుకోవాలి. అదే కళాయిలో ఎండుమిర్చిని వేసి వేయించాలి. వాటిని కూడా తీసి పక్కన పెట్టుకోవాలి. ఎండుమిర్చి, దోసకాయ గింజలు, కాస్త ఉప్పు వేసి రోట్లో దంచుకోవాలి. అందులోనే చింతపండును కూడా వేసి దంచాలి. అలాగే దోసకాయ ముక్కలను వేసి కచ్చాపచ్చాగా దంచుకోవాలి. ఆ తర్వాత ఉల్లిపాయ ముక్కలను కూడా గిన్నెలోకి తీసుకోవాలి. ఆ తర్వాత పచ్చడిని తాలింపు వేసుకోవాలి. వేడి వేడి అన్నంలో ఎంతో తింటే ఆహా అనాల్సిందే.

బెండకాయ తో

కావాల్సిన పదార్థాలు: బెండకాయలు - పావుకిలో, టమాటాలు - రెండు, మెంతులు, ఆవాలు, ధనియాలు, జీలకర్ర - కొద్దిగా, వెల్లుల్లి రెబ్బలు - ఆరు, ఎండు మిర్చి - పది, చింతపండు - నిమ్మకాయ సైజులో. ఉప్పు - తగినంత, కొత్తి మీర, కరివేపాకు.



తయారీ విధానం: ఒక కళాయి తీసుకుని.. నూనె వేసుకోవాలి. నూనె వేడెక్కాక ఆవాలు, మెంతులు, జీలకర్ర, ధనియాలు వేసి వేయించుకోవాలి. ఇవి వేగాక వెల్లుల్లి రెబ్బలు, ఎండు మిర్చి, కొత్తి మీర, కరివేపాకు వేసి మరికాసేపు వేయించుకోవాలి. వాటిని ప్లేట్‌లోకి తీసుకుని పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు ఇదే కళాయిలో మరి కొద్దిగా నూనె వేసి.. ముందుగానే శుభ్రంగా కడిగి కట్ చేసి పెట్టుకున్న బెండకాయ ముక్కలను వేసుకోవాలి. వీటిని కలర్ మారేంత వరకూ వేయించుకోవాలి. తర్వాత టమాటాలు, ఉప్పు వేసి.. మీడియం మంటపై మూత పెట్టి, మధ్య మధ్యలో కలుపుకుంటూ ఫ్రై చేసుకోవాలి. బెండకాయ, టమాటా ముక్కలు పూర్తిగా మగ్గిన తర్వాత స్టవ్ ఆఫ్ చేసుకుని చల్లార నివ్వాలి. ముందు వేయించుకున్న దినుసులను రోట్లో వేసుకుని మెత్తగా దంచుకోవాలి. ఆ తర్వాత టమాటా, బెండకాయలను కూడా వేసి కచ్చా పచ్చాగా దంచాలి. ఆ తర్వాత దీనికి తాళింపు వేసుకోవడమే. దీని రుచి అద్భుతంగా ఉంటుంది.

పొట్లకాయ పెరుగు పచ్చడి

కావలసిన పదార్థాలు: పొట్లకాయ - ఒకటి, పెరుగు - ఒక కప్పు (చిక్కటిది), పచ్చిమిర్చి - 8, ఎండుమిర్చి- రెండు, అల్లం, చిన్నముక్క, ఆవాలు - ఒక స్పూను, జీలకర్ర - ఒక స్పూను, ఇంగువ - అర స్పూను, కరివేపాకు - కొద్దిగా, ఉప్పు - రుచికి సరిపడ, కొత్తిమీర - కొద్దిగా. నెయ్యి - తాలింపుకు.



తయారీ విధానం : పొట్లకాయను శుభ్రంగా కడిగి, దాని తొక్క తీసి, దానిలోని గింజలు, నారను తీసివేసి, చిన్నగా అర అంగుళం పరిమాణంలో కట్ చేసుకోవాలి. ఒక గిన్నెలో పొట్లకాయ ముక్కలను వేసి.. చిన్న మంట మీద 8 నుండి 12 నిమిషాలు ఉడకబెట్టుకోవాలి. అవి చల్లారేలోపు అల్లం, కొన్ని ఆవాలు, పచ్చిమిర్చి కలిపి రుబ్బుకొని పేస్ట్ లాగా చేయాలి. అవసరమైతే దానికి కొంచెం నీరు కలుపుకోవాలి. ఉడికించుకున్న పొట్లకాయలో పెరుగు, సిద్ధం చేసుకున్న పేస్ట్ వేసి బాగా కలపాలి. ఆ తర్వాత రుచికి అనుగుణంగా చిటికెడు పసుపు, ఉప్పు వేసి బాగా కలపాలి. ఇప్పుడు ఒక చిన్న బాండీలో నెయ్యి వేసి, వేడయ్యాక ఆవాలు వేయించాలి, ఆ తర్వాత, జీలకర్ర, ఇంగువ, ఎండుమిర్చి, కరివేపాకులను వేసి పోపు పెట్టుకోవాలి. ఆపై కొత్తిమీర తరుగుతో గార్నిష్ చేసుకోవాలి.

వాము ఆకుతో

కావలసిన పదార్థాలు: వాము ఆకులు - సుమారు 20 నుంచి 30 వరకు. చింతపండు - నిమ్మకాయ సైజంత. నూనె - సరిపడినంత, ఎండు మిర్చి -10, మెంతులు -అర స్పూను, ఆవాలు - అర స్పూను, పసుపు- కొద్దిగా, ఇంగువ- కొద్దిగా, నువ్వులు - నాలుగు స్పూన్లు, ఉప్పు - తగినంత.

తయారీ విధానం : ముందుగా వాము ఆకులను కడిగి శుభ్రం చేసుకోవాలి. తర్వాత స్టౌ వెలిగించి బాండీలో నువ్వులు వేసుకుని కమ్మని వాసన వచ్చే వరకు వేయించుకోవాలి. ఇవి చల్లారిన తర్వాత రోటిలో పొడి చేసుకొని వేరే ప్లేటులో పెట్టుకోవాలి. బాండీలో కొద్దిగా నూనె వేసి మెంతులు, ఎండు మిరపకాయలు, ఆవాలు, ఇంగువ వేసి వేయించుకొని ఓ ప్లేటులోకి తీసుకోవాలి. తర్వాత నూనె వేసుకుని వాము ఆకులు, కొంచెం పసుపు వేసి ఆకును నిముషాలు మగ్గనివ్వాలి. తర్వాత వేయించి ఉన్న పోపు, చింతపండు, తగినంత ఉప్పువేసి రోటిలో మెత్తగా దంచుకోవాలి. తర్వాత మగ్గించిన వాము ఆకును వేసి మెత్తగా నూరుకోవాలి. తర్వాత వేయించి ఉన్న నువ్వుల పొడి వేసి దంచుకుని ఓ గిన్నెలోకి తీసుకోవాలి. అంతే ఎంతో రుచికరమైన వాము ఆకు పచ్చడి సిద్ధం. ఈ వామాకు పచ్చడి వేడి వేడి అన్నంలో నెయ్యి వేసుకుని తింటే టేస్టు అదిరిపోతుంది.



దొండకాయతో

కావలసిన పదార్థాలు : దొండకాయలు - పావు కిలో, చింతపండు - నిమ్మకాయ సైజులో, కొత్తిమీర - పావు కప్పు, పచ్చిమిర్చి - పది, నూనె - రెండు స్పూన్లు, మెంతులు - ఒక స్పూను, ఆవాలు - ఒక స్పూను, శనగపప్పు - ఒక స్పూన్, జీలకర్ర - ఒక స్పూన్, మినపప్పు - ఒక స్పూన్, కరివేపాకు - గుప్పెడు, ఉప్పు - రుచికి సరిపడా, ఎండు మిర్చి - రెండు, ఇంగువ - చిటికెడు,

తయారీ విధానం : దొండకాయలను శుభ్రంగా కడిగి పక్కన పెట్టుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి నూనె వేయాలి. అందులోనే మెంతులు, జీలకర్ర, శనగపప్పు, మినపప్పు, ఆవాలు, కరివేపాకులు వేసి వేయించుకోవాలి. వాటిని చల్లారాక మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోవాలి. ఇప్పుడు స్టవ్ మీద కళాయి పెట్టి మళ్లీ నూనె వేయాలి. అందులో పచ్చిమిర్చిని, దొండకాయలను వేసి బాగా మగ్గించుకోవాలి. అలాగే చింతపండును కూడా వేసి బాగా మగ్గించుకున్నాక పక్కన పెట్టుకోవాలి. ఈ మొత్తం చల్లారాక రోట్లో వేసి రుబ్బుకోవాలి. ముందుగా పొడి చేసుకున్న దినుసులను కూడా వేసి దంచుకోవాలి. ఉప్పు, సరిపడా నీళ్లు వేసి రుబ్బుకోవాలి. ఈ మొత్తం మిశ్రమాన్ని ఒక గిన్నెలోకి తీసుకోవాలి.



ముక్కు దిబ్బడా...

వర్షాకాలం, చలికాలంలో ఎక్కువగా ముక్కు దిబ్బడ సమస్య ఏర్పడుతుంది. మారిన వాతావరణం, చల్లటి గాలి వల్ల పట్టేస్తాయి. దీంతో శ్వాస తీసుకోవడానికి చాలా ఇబ్బంది అవుతుంది. పుప్పొడి, దుమ్ము, పెంపుడు జంతువుల చర్మం లేదా కొన్ని ఆహారాల పదార్థాలు కూడా ముక్కు దిబ్బడకు కారణమవుతాయి. అలాగే.. పొగ, రసాయనాలు, నాసికా లైనింగ్ వాపు వల్ల ముక్కు దిబ్బడ పట్టడం ఏర్పడుతుంది. ముక్కు దిబ్బడ నయం చేయడంలో సహాయపడే నివారణలు తెలుసుకుందాం.

ఆవిరి పీల్చడం : యూకలిప్టస్ లేదా



పుదీనా వంటి మూలికా నూనెలతో కలిపి ఆవిరి పీల్చితే.. ఈ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.

అల్లం టీ : అల్లం టీ తీసుకోవడం వల్ల ఇన్ఫ్లమేషన్ తగ్గిస్తుంది. దీంతో నాసికా రద్దీని తగ్గించి రోగనిరోధక శక్తిని పెంచడానికి సహాయపడుతుంది. అల్లంలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీవైరల్ లక్షణాలు ఉంటాయి. ఇవి సైనస్‌లను క్లియర్ చేయడంలో సహాయపడతాయి.

పసుపు పాలు : గోరువెచ్చని పాలలో చిటికెడు పసుపు కలిపి తాగడం వల్ల ముక్కు దిబ్బడ తగ్గుతుంది. పసుపులో కర్క్యుమిన్ ఉంటుంది. ఇది శోథ నిరోధక లక్షణాలతో కూడిన సమ్మేళనం, ఇది ఎర్రబడిన నాసికా భాగాలను ఉపశమనం చేస్తుంది.

తులసి టీ : తులసి టీ రోగనిరోధక శక్తికి శ్వాసకోశ ఆరోగ్య ప్రయోజనాలకు ప్రసిద్ధి చెందింది. ఇది నాసికా రద్దీని తగ్గించడానికి, వాపును తగ్గించడానికి సహాయపడుతుంది.

రుణమాఫీపై కసరత్తు

(మొదటిపేజి తరువాయి)

రుణమాఫీ పథకాలు, వాటి అమలుకు అనుసరించిన పద్ధతిని సంబంధిత శాఖల అధికారులు అధ్యయనం చేస్తున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న రైతు సంక్షేమ పథకాలు, వాటి ప్రయోజనాలు, అనుసరిస్తున్న విధివిధానాలు, నిర్దేశించిన అర్హతలను కూడా పరిశీలిస్తున్నారు. ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకంలో భాగంగా దేశంలో అర్హులైన రైతులందరికీ కేంద్ర ప్రభుత్వం ప్రతి ఏడాది రూ.6 వేలు ఆర్థిక సాయం అందిస్తోంది. రూ.2 వేల చొప్పున మూడు విడతల్లో అర్హులైన రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మేయర్లు, జడ్పీ ఛైర్మెన్లు, రాజ్యాంగబద్ధమైన పదవుల్లో ఉన్నవారు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, రూ.10 వేలకు మించి పెన్షన్ అందుకునే రిటైర్డ్ ఉద్యోగులు, ఐటీ పన్ను చెల్లించేవారు, డాక్టర్లు, ఇంజనీర్లు, సీఏ, ఆర్కిటెక్ట్ లాంటి ప్రొఫెషనల్స్ ను ఈ పథకం నుంచి కేంద్రం మినహాయించింది. పీఎం కిసాన్ పథకానికి కేంద్రం అనుసరించిన మార్గదర్శకాలతో అసలైన రైతులకు లబ్ధి చేకూరిందనే చర్చ కొనసాగుతోంది.. వాటన్నింటిని పరిగణంలోకి తీసుకుని మార్గదర్శకాలు రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది.

ఏక కాలంలో రుణమాఫీ

గతంలో లాగా విడతల వారీగా కాకుండా ఏక కాలంలో రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోంది.

గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష రుణ మాఫీని ఏక కాలంలో చేస్తామని చెప్పి ఏకంగా ఐదేండ్ల పాటు సాగదీసింది. తొలి ఏడాది రూ.25 వేల వరకు, రెండో ఏడాది రూ.50 వేల వరకు, నాలుగో ఏడాది రూ.75 వేల వరకు, ఎన్నికల ముందు రూ.99,999 వరకు నాలుగు విడతలుగా రుణమాఫీని పూర్తి చేసింది. రాష్ట్రంలో మొత్తం 40.66 లక్షల మంది రైతులకు రూ. 25,916 కోట్లు మాఫీ చేయాల్సి ఉండగా.. కుటుంబ సభ్యుల్లో ఒకరికి మాత్రమే వర్తిస్తుందని కొర్రీ పెట్టి లబ్ధిదారుల సంఖ్యను కుదించింది. దీంతో 36.68 లక్షల మంది రైతులకు రూ.20,141 కోట్లు మాఫీ చేయాలని బ్యాంకర్లు లెక్కలు తేల్చారు. అయిదేండ్ల పాటు వంతుల వారీగా రుణమాఫీ నిధులు విడుదల చేసిన అప్పటి ప్రభుత్వం చివరివరకు 23 లక్షల మంది రైతులకే రుణ మాఫీ చేసింది. రూ. లక్ష కంటె అధికంగా ఉన్న 14 లక్షల మంది రైతులకు ఈ మాఫీ వర్తించలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్ల రైతులు ఐదేండ్ల పాటు అవస్థలు పడ్డారు. సర్కార్ మాఫీ చేస్తుందనే భరోసాతో చాలా మంది రైతులు రుణాలను రీ షెడ్యూల్ చేసుకోలేదు. ఫలితంగా వడ్డీకి వడ్డీ తోడై రుణ మొత్తాలు భారీగా పెరిగాయి. ప్రభుత్వం విడతల వారీగా చేసిన రుణ మాఫీ వడ్డీలకే సరిపోయింది. దాంతో చాలా మంది రైతులను బ్యాంకులు డిఫాల్టర్లుగా ప్రకటించాయి. అటు బ్యాంకుల్లో, ఇటు ప్రయివేటులో అప్పు పుట్టక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ నేపథ్యంలో గతంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా కాంగ్రెస్ ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. గతంలో జరిగిన తప్పులకు ఆస్కారం లేకుండా ఏక కాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలనే ఉద్దేశంతో సర్కార్ మెందుకెళుతున్నట్టు ఉన్నతాధికారులు చెబుతున్నారు.

నేడు ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం

- హాజరుకానున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

నూతనంగా ఎమ్మెల్సీగా ఎన్నికైన నవీన్‌రెడ్డి గురువారం హైదరాబాద్‌లోని శాసనమండలిలో ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో మండలి చైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయించనున్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కల్వకుంట్ల తారకరామారావు హాజరుకానున్నారు. ఇటీవల మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల కోటాలో నవీన్‌రెడ్డి ఎమ్మెల్సీగా విజయం సాధించిన విషయం విదితమే.

లింగ సమానత్వంలో పూర్

(మొదటిపేజి తరువాయి)

భూటాన్ తర్వాత భారత్ ఐదో స్థానంలో నిలిచింది. పాకిస్తాన్‌కు చిట్టచివరి స్థానం దక్కింది.

మొత్తం 146 దేశాలకు సంబంధించి ప్రపంచ ఆర్థిక ఫోరం లింగ వ్యత్యాస సూచికలు విడుదల చేసింది. అంతర్జాతీయంగా చూస్తే సూడాన్ చిట్టచివరి స్థానంతో సరిపెట్టుకోగా పాకిస్తాన్ 145వ ర్యాంక్ సాధించింది. బంగ్లాదేశ్, సూడాన్, ఇరాన్, పాకిస్తాన్, మొరాకో దేశాలతో పాటు భారత్‌లో మహిళలు, పురుషుల మధ్య ఆర్థికపరమైన సమానత్వం అతి తక్కువ స్థాయిలో ఉంది. ఈ దేశాలన్నీ ఆదాయానికి సంబంధించి 30% కంటే తక్కువగానే లింగ సమానత్వాన్ని నమోదు చేసుకున్నాయి. అయితే సెకండరీ విద్యలో నమోదుకు సంబంధించి మాత్రం మన దేశం మెరుగైన సమానత్వాన్ని కనబరిచింది. రాజకీయాల్లో మహిళా సాధికారత విషయంలో కూడా మంచి ర్యాంకునే పొందింది. ఈ అంశంలో అంతర్జాతీయంగా భారత్‌కు 65వ స్థానం లభించింది.

గత యాభై సంవత్సరాల కాలంలో రాజ్యాధికారాన్ని అనుభవించిన అంశంలో పురుషులు, మహిళల మధ్య సమానత్వానికి సంబంధించి భారత్ 10వ ర్యాంకులో నిలిచింది. 140 కోట్లకు పైగా జనాభా కలిగిన మన దేశం తన లింగ వ్యత్యాసంలో ఈ సంవత్సరం 64.1 శాతానికి చేరింది. తద్వారా గత సంవత్సరపు 127వ స్థానం నుంచి రెండు ర్యాంకులు దిగజారింది. విద్య, రాజకీయ సాధికారత అంశాల్లో ర్యాంకులు స్వల్పంగా తగ్గడమే దీనికి కారణం. ఆర్థిక భాగస్వామ్యం, అవకాశం అనే అంశాల్లో మాత్రం ర్యాంకులు కొంచెం మెరుగుపడ్డాయి.

గత నాలుగు సంవత్సరాల్లో ఆర్థిక సమానత్వానికి సంబంధించిన ర్యాంకు మెరుగుపడిందని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. రాజ్యాధికార సూచికకు సంబంధించి రాజకీయ సాధికారత ఉప సూచికలో భారత్ మొదటి పది ర్యాంకుల్లోనే స్థానం పొందింది. అయితే మహిళల ప్రాతినిధ్యం మాత్రం మంత్రుల స్థాయిలో (6.9 శాతం), పార్లమెంటులో (17.2 శాతం) తక్కువగా ఉంది.

ప్రపంచ దేశాలు లింగ వ్యత్యాసంలో 68.5 శాతానికి చేరువగా ఉన్నాయని, అయితే ప్రస్తుత వేగాన్ని బట్టి పూర్తి లింగ సమానత్వాన్ని సాధించాలంటే మరో 134 సంవత్సరాలు....ఐదు తరాలకు సమానం...పడుతుందని ప్రపంచ ఆర్థిక ఫోరం తెలిపింది. గత ఏడాది నుంచి ఇప్పటి వరకూ లింగ వ్యత్యాసం 0.1 శాతానికి చేరువైందని చెప్పింది. ఆర్థిక, రాజకీయ రంగాల్లో లింగ సమానత్వాన్ని సాధించడానికి ప్రపంచదేశాలన్నీ కృతనిశ్చయంతో కృషి చేయాలని ఫోరం మేనేజింగ్ డైరెక్టర్ సాదియా జహిదీ చెప్పారు. సమానత్వం కోసం 2158 వరకూ వేచి ఉండలేమని, నిర్ణయాత్మక చర్యకు ఇదే అనువైన సమయమని తెలిపారు. కాగా లింగ సమానత్వం విషయంలో ఐస్‌లాండ్ తర్వాత ఫిన్లాండ్, నార్వే, న్యూజిలాండ్, స్వీడన్ దేశాలు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి.

జూరాలను తాకిన కృష్ణమ్మ

నవతెలంగాణ - మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

జూరాలకు వరద ప్రవాహం మొదలైంది. ఎగువ కృష్ణ ప్రాంతం కర్నాటక, మహారాష్ట్ర నుంచి క్రమ క్రమంగా వరద ఉధృతి పెరుగుతోంది. ప్రతి రోజూ 7735 క్యూసెక్కుల నీరు రిజర్వాయర్‌లోకి చేరుతోంది. వరద ఉధృతి మరింత పెరిగి సగం వరకు నీటి మట్టం చేరితే ఆయకట్టుకు నీరు వదిలే అవకాశాలు ఉన్నాయి. వారం రోజులుగా వాతావరణం చల్లబడటం.. జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురువడంతో ఖరీఫ్ సాగులో మెట్ట పంటలపై రైతులు దృష్టి సారించారు. అయితే, రిజర్వాయరులోకి నీరు వస్తే వరి సాగుపై దృష్టి పెట్టే అవకాశాలు ఉన్నాయి. కృష్ణానది ఎగువ ప్రాంతాన కురుస్తున్న వర్షాలకు జూరాలకు వరద నీరు వచ్చి చేరుతోంది. వరదల వల్ల 1.5టీఎంసీల నుంచి నీటిమట్టం 2.495 టీఎంసీలకు నీటి మట్టం చేరుకుంది. రిజర్వాయరు మొత్తం నీటిమట్టం 9.647 టీఎంసీలు. ప్రతి రోజూ లక్ష క్యూసెక్కుల నీరు వచ్చి చేరితే.. వారం రోజుల్లో రిజర్వాయరు నిండుతుందని సాగునీటి అధికారులు చెబుతున్నారు. నీరు తక్కువగా వస్తుండటంతో స్పిల్‌వే, విద్యుత్, కాల్వలకు నీటిని వదలడం లేదు. ముఖ్యంగా బీమా, కోయిల్‌సాగర్, నెట్టెంపాడు రిజర్వాయర్లకు నీరు వదలడం లేదు. కొంత మంది రైతులు ఇప్పటికే నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు. బోరుబావులు, బావులు ఉన్న వారు నీటిని తోడి వరి సాగుకు సిద్ధమయ్యారు. పుష్కలంగా వరదలు వస్తే.. కెఎల్ఐ, జూరాలతోపాటు ఇతర ప్రాజెక్టుల కింద మొత్తం 8 లక్షల ఎకరాలు సాగవుతుంది. గత రబీలోనూ ఆశించిన స్థాయిలో సాగు నీరు అందలేదు. ఈసారి ముందస్తుగా వర్షాలు వస్తే.. వరితో పాటు ఆరుతడి పంటల సాగు కూడా పెరిగే అవకాశం ఉంది.

తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?

(మొదటిపేజి తరువాయి)

రేవంత్‌రెడ్డి ప్రమాణస్వీకారం చేశారు. విద్యాశాఖను ఆయనే పర్యవేక్షణ చేస్తున్నారు. విద్యాశాఖ ముఖ్యకార్యదర్శిగా గతంలో వాకాటి కరుణ, ప్రస్తుతం బుర్రా వెంకటేశం పనిచేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులుగా శ్రీదేవసేన నాలుగేండ్లకుపైగా కొనసాగుతున్నారు. కానీ ఎస్సీఈఆర్టీ ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించిన ఆరవ తరగతి నుంచి పదో తరగతి వరకు సింగిడి-2 తెలుగు వాచకం (ప్రథమ భాష) పాఠ్యపుసకాల్లో ముందుమాటను సవరించకుండా పాత సమాచారాన్ని ఇవ్వడం విమర్శలకు తావిస్తున్నది. ఒకటి నుంచి పదో తరగతి వరకు ఈ పాఠ్యపుస్తకాలను ముద్రించారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడం, ముఖ్యమంత్రి మారడం వంటి రాజకీయ పరిణామాలను ఎస్సీఈఆర్టీ పరిగణనలోకి తీసుకోకుండానే ముద్రించిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పాఠ్యపుస్తకంలో ప్రచురించిన సమాచారాన్నే పరిగణనలోకి తీసుకుంటే ఇబ్బందులు ఎదురవుతాయి. జనరల్ నాలెడ్జ్ ప్రశ్న కింద తెలంగాణ ముఖ్యమంత్రి ఎవరు?అన్న ప్రశ్న వస్తే సమాధానం ఏం రాయాలో అర్థం కాని పరిస్థితి తలెత్తుతుంది. ఎస్సీఈఆర్టీ ముద్రించిన పాఠ్యపుస్తకం ప్రకారం రాస్తే తప్పుడు సమాధానం అవుతుంది. తాజా సమాచారాన్ని ముందుమాటలో ఇవ్వకపోవడం పట్ల విమర్శలు వస్తున్నాయి. గతేడాది కూడా రాజ్యాంగ పీఠికను పాఠ్యపుస్తకాల్లో ముద్రించినపుడు వివాదం తలెత్తింది. సామ్యవాదం, సోషలిస్టు పదాలను తొలగించి ఇవ్వడం చర్చనీయాంశమైంది. ఈ ఏడాది ప్రభుత్వం మారినా, ముఖ్యమంత్రి మారినా తాజా సమాచారాన్ని ఇవ్వకపోవడం వివాదానికి దారితీసింది. విద్యాశాఖ, ఎస్సీఈఆర్టీ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ ఆరోపణలు వస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం దీనిపై ఎలా స్పందిస్తుందో వేచిచూడాలి.

అక్టోబర్‌లోనే ముద్రణకు ఇచ్చాం : ఎం రాధారెడ్డి, ఎస్సీఈఆర్టీ డైరెక్టర్

పాఠ్యపుస్తకాల రూపకల్పనకు సంబంధించి ఎడిటోరియల్ బోర్డు ఉంటుందని ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎం రాధారెడ్డి బుధవారం హైదరాబాద్‌లో తనను కలిసిన విలేకర్లతో చెప్పారు. ఆ బోర్డు సమావేశమై అక్టోబర్‌లోనే పాఠ్యపుస్తకాలను రూపొందించి ముద్రణకు ఇచ్చామని అన్నారు. ఆ బోర్డు చెప్పిందే పాఠ్యపుస్తకాల్లో ముద్రించాల్సి ఉంటుందన్నారు. అందులో మార్పు చేసి ముద్రించే అవకాశముండబోదని వివరించారు. వచ్చే విద్యాసంవత్సరంలో పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు సకాలంలో ఇవ్వాలంటే ఈ ఏడాది నుంచే కసరత్తును ప్రారంభించాల్సి ఉంటుందని చెప్పారు. గతేడాది అక్టోబర్‌లో సమాచారం ఇచ్చినందునే పాత సమాచారం పాఠ్యపుస్తకాల్లో వచ్చిందని అన్నారు.

ఎవరినీ వదలం

(మొదటిపేజి తరువాయి)

తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని బూర్గుల రామకృష్ణారావు భవన్‌లో మీడియాతో ఆయన చిట్‌చాట్ చేశారు. వర్కింగ్ ఏజెన్సీల ప్రతినిధులను విచారణకు పిలిచినట్టు తెలిపారు. వాళ్లు చెప్పిన అంశాలన్నింటినీ అఫిడవిట్ రూపంలో ఇవ్వాలని ఆదేశించామని చెప్పారు. గ్రౌండ్ రిపోర్టు తెలుసుకునేందుకే అఫిడవిట్ ఫైల్ చేయాలని ఆదేశించామని చెప్పారు. గడువులోగా పనులు పూర్తిచేయాలని గత సర్కారు తమపై ఒత్తిడి తెచ్చిందనీ, డెడ్‌లైన్ విధించిందనీ, అందుకే వేగంగా పనులు పూర్తిచేశామని ఏజెన్సీల ప్రతినిధులు విచారణలో చెప్పారని వివరించారు. ఎవరు ఏది చెప్పినా పక్కాగా రికార్డులను నిర్వహిస్తున్నామనీ, అన్నింటినీ రికార్డుల రూపంలో ఉంచుతున్నామని చెప్పారు.

ఈ నెలాఖరు నాటికి అఫిడవిట్ ఇవ్వాలని నిర్మాణ సంస్థలను ఆదేశించామన్నారు. ఎవరి ఆదేశాల మేరకు పనులు ఆదరాబాదరాగా జరిగాయన్నది రికార్డుల రూపంలో సమాధానం వచ్చాకే, సంబంధిత ఆదేశాలు ఇచ్చిన బాధ్యులను కూడా విచారణకు పిలుస్తామని చెప్పారు. ఆధారాల కోసమే అఫిడవిట్ అడుగుతున్నామని తెలిపారు. కాళేశ్వరం నిర్మాణంలో భాగస్వాములైన కొందరు అధికారులు ప్రస్తుతం రాష్ట్రంలో లేరనీ, వాళ్లు వచ్చాక విచారించాల్సి ఉందని తెలిపారు. కాగ్, విజిలెన్స్ రిపోర్టులు అందాయనీ, వాటిని కూడా పరిశీలిస్తు న్నామని చెప్పారు. వాళ్లనూ విచారణ చేయనున్నట్టు తెలిపారు. ఎవరైనా తప్పుడు అఫిడవిట్ ఫైల్‌చేస్తే తమకు తెలిసిపోతుందనీ, వాళ్లపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

కువైట్‌లో ఘోర అగ్నిప్రమాదం

(మొదటిపేజి తరువాయి)

కిచెన్‌లో ప్రారంభమైన మంటలు క్షణాల్లోనే భవనమంతా వ్యాపించినట్టు అధికారులు వెల్లడించారు. ఈ ప్రమాదంలో 44 మంది మంటల్లో సజీవదహనమవ్వగా.. మరో ఆరుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందారు. మరో 50 మందికి పైగా గాయపడ్డారు. వీరిలోనూ 30 మంది భారతీయులే ఉన్నారు. మతుల్లో 40 మంది భారతీయులేనని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ప్రమాదం జరిగిన సమయంలో భవనంలో 160 మంది ఉండగా, అందులో చాలా మంది ఇంకా నిద్రలోనే ఉన్నారు. వీరంతా ఒకే కంపెనీలో పని చేస్తున్నట్లు తెలిసింది. ఈ ఘటన జరిగిన భవనం కువైట్‌లోని అతిపెద్ద నిర్మాణ సంస్థకు చెందినదిగా సమాచారం.

విదేశాంగ మంత్రి దిగ్భ్రాంతి

అగ్ని ప్రమాద ఘటనపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. విషయం తెలిసిన వెంటనే కువైట్‌లోని భారతీయ రాయబారి ఘటనా స్థలాన్ని సందర్శించారని.. బాధితులకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

డిప్లొమా విద్యార్థులకు ఒక్క అవకాశమివ్వండి

- యువ భారత్ చైర్మెన్ వైద్య ప్రవీణ్ కుమార్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

డిప్లొమా ఫైనల్ ఇయర్ డీటెయిన్డ్ విద్యార్థులకి సప్లిమెంటరీ పరీక్షలకు అనుమతివ్వాలనీ, విద్యా సంవత్సరం నష్టపోకుండా చూడాలని యువ భారత్ చైర్మెన్ వైద్య ప్రవీణ్ కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో విద్యాశాఖ ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశంకు వినతిపత్రం అందజేశారు. డిటెయిన్డ్ అయిన విద్యార్థుల్లో కొంత మందికి ఈ సెట్‌లో మంచి ర్యాంకులు పొందారనీ, ఆరోగ్య, కుటుంబ, ఇతరత్రా సమస్యల వల్లవిద్యార్థులు అటెండెన్స్ పొందలేకపోయారని తెలిపారు. ఫైనల్ ఇయర్ విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకొని 2 వేల మంది విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి బుర్రా వెంకటేశం తక్షణమే స్పందించి టెక్నికల్ విద్యా సెక్రెటరీ పుల్లయ్యతో మాట్లాడి న్యాయం చేయాలని ఆదేశించారని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్ కోసం వెంటనే స్పందించిన విద్యా శాఖ ప్రధాన కార్యదర్శికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సూర్య భరత్, రవి కుమార్ కందుకూర్, నందు కుమార్ తదితరులు పాల్గొన్నారు.



నాదల్‌తో అల్కరాజ్ జట్టు

2024 పారిస్ ఒలింపిక్స్

మాడ్రిడ్ (స్పెయిన్) : మట్టికోర్టు గ్రాండ్‌స్లామ్ రారాజు రఫెల్ నాదల్‌తో మట్టికోర్టు యువరాజు కార్లోస్ అల్కరాజ్ జతకట్టనున్నాడు. ఫ్రెంచ్ ఓపెన్‌లో రికార్డు గ్రాండ్‌స్లామ్ టైటిళ్లు సాధించిన స్పెయిన్ బుల్ నాదల్‌తో కలిసి 2024 పారిస్ ఒలింపిక్స్‌లో మెన్స్ డబుల్స్ టెన్నిస్ పసిడి వేట సాగించేందుకు కార్లోస్ అల్కరాజ్ సిద్ధమవుతున్నాడు. ఈ మేరకు స్పెయిన్ టెన్నిస్ ఫెడరేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. ఒలింపిక్స్‌లో నాదల్ 2008లో సింగిల్స్‌లో, 2016లో డబుల్స్‌లో పసిడి పతకాలు సాధించిన సంగతి తెలిసిందే. సమ్మర్ ఒలింపిక్స్‌తో ప్రొఫెషనల్ కెరీర్‌కు ముగింపు పలికే ఆలోచనలో ఉన్న స్పెయిన్ బుల్ పారిస్‌లో పసిడి పతకమే లక్ష్యంగా బరిలోకి దిగుతున్నాడు.



ప్రణయ్ శుభారంభం

సమీర్, కిరణ్, సిక్కి జోడీ ముందంజ
ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500

సిడ్నీ (ఆస్ట్రేలియా)

భారత సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో శుభారంభం చేశాడు. పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో వరుస గేముల్లో అలవోక విజయం సాధించాడు. బ్రెజిల్ ఆటగాడిపై 21-10, 23-21తో ప్రణయ్ పైచేయి సాధించాడు. ఐదో సీడ్ ప్రణయ్ నేడు ప్రీ క్వార్టర్స్‌లో మిశా (ఇజ్రాయెల్)తో తలపడనున్నాడు. పురుషుల సింగిల్స్ విభాగంలో సమీర్ వర్మ 21-10, 21-10తో, కిరణ్ జార్జ్ 21-17, 21-12తో తొలి రౌండ్లో విజయాలు సాధించారు. రఘు మారిసామి, శంకర్ ముతుసామి, మిథున్ మంజునాథ్, రవి, అభిషేక్‌లు తొలి రౌండ్లో ఓటమితో టోర్నీ నుంచి నిష్క్రమించారు. మహిళల సింగిల్స్‌లో మాళవిక బాన్సోద్ సహచర షట్లర్ కెయూర మోపాటిపై 21-10, 21-8తో సాధికార విజయం సాధించింది. ఆకర్షి కశ్యప్ 21-14, 21-11తో ఉక్రెయిన్ అమ్మాయిపై గెలుపొందింది. ఇమద్ ఫరూకీ 23-21, 13-21, 22-24తో చైనీస్ తైపీ షట్లర్‌తో పోరాడి ఓడింది. అనుపమ 21-14, 23-21తో వాంగ్ లింగ్ చింగ్‌పై వరుస గేముల్లో గెలుపొంది ప్రీ క్వార్టర్స్‌కు చేరుకుంది.

మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలుగు తేజాలు సిక్కిరెడ్డి, సుమిత్ రెడ్డి జోడీ 21-17, 21-19తో వరుస గేముల్లో మలేషియా షట్లర్లు వాంగ్, లిమ్‌లపై విజయం సాధించారు. కోన తరుణ్, కృష్ణప్రియ జోడీ 6-21, 11-21తో తొలి రౌండ్లో పరాజయం పాలయ్యారు. ఆయుశ్, శృతి జంట సైతం 16-21, 10-21తో ఓటమిపాలైంది. మహిళల డబుల్స్‌లో రుతుపర్ణ, శ్వేతపర్ణ జంటకు తొలి రౌండ్లో బై లభించింది. హర్షిత, శృతిలు 19-21, 19-21తో పోరాడి ఓడారు.

టీమ్ ఇండియా హ్యాట్రిక్ విజయం. ఐసీసీ టీ20 ప్రపంచకప్ గ్రూప్-ఏలో రోహిత్‌సేన వరుసగా మూడో విజయం ఖాతాలో వేసుకుంది. ఆరు పాయింట్లతో సూపర్8 బెర్త్ ఖాయం చేసుకుంది. 111 పరుగుల ఛేదనలో సూర్యకుమార్ యాదవ్ (50 నాటౌట్), శివం దూబె (31 నాటౌట్) సహా రిషబ్ పంత్ (18) రాణించారు. తొలుత అర్షదీప్ సింగ్ (4/9) నిప్పులు చెరగటంతో యుఎస్‌ఏ 20 ఓవర్లలో 110/8 పరుగులే చేసింది.

భారత్ హ్యాట్రిక్

- గ్రూప్ దశలో వరుసగా మూడో విజయం
- అమెరికాపై 7 వికెట్ల తేడాతో గెలుపు
- 4 వికెట్లతో విజృంభించిన సింగ్
- అమెరికా 110/8, భారత్ 111/3

నవతెలంగాణ-న్యూయార్క్

భారత పేసర్లు అర్షదీప్ సింగ్ (4/9), హార్దిక్ పాండ్య (2/14) వికెట్ల వేటలో విజృంభించారు. అర్షదీప్ సింగ్ 9 పరుగులకే నాలుగు వికెట్లు పడగొట్టగా.. హార్దిక్ పాండ్య సైతం 14 పరుగులకే రెండు వికెట్లు కూల్చాడు. దీంతో తొలుత బ్యాటింగ్ చేసిన అమెరికా (యుఎస్‌ఏ) 20 ఓవర్లలో 8 వికెట్లకు 110 పరుగులు చేసింది. నితీశ్ కుమార్ (27, 23 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్), స్టీవెన్ టేలర్ (24, 30 బంతుల్లో 2 సిక్స్‌లు) అమెరికాను ఆదుకున్నారు. ఇక ఛేదనలో భారత స్టార్ క్రికెటర్లు, ఓపెనర్లు విరాట్ కోహ్లి (0), రోహిత్ శర్మ (3) మరోసారి విఫలమయ్యారు. కోహ్లి వరుసగా మూడో ఇన్నింగ్స్‌లో తేలిపోగా.. రోహిత్ శర్మ సైతం అతడి బాటలోనే నడిచాడు. ఓపెనర్ల వైఫల్యంతో పవర్‌ప్లేలో భారత్ రెండు వికెట్లకు 33 పరుగులు మాత్రమే చేసింది. ఫామ్‌లో ఉన్న రిషబ్ పంత్ (18, 20 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) నిరాశపరిచాడు. 44/3తో కష్టాల్లో ఉన్న భారత్‌ను సూర్యకుమార్ యాదవ్ (50 నాటౌట్, 49 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు), శివం దూబె (31 నాటౌట్, 35 బంతుల్లో 1 ఫోర్, 1 సిక్స్) ఆదుకున్నారు. నాల్గో వికెట్‌కు అజేయంగా 67 పరుగులు జోడించి భారత్‌ను గెలుపు తీరాలకు చేర్చారు. 18.2 ఓవర్లలోనే 111 పరుగులు చేసిన భారత్ 7 వికెట్ల తేడాతో విజయం సాధించింది.



అర్షదీప్ అదరహో.. :

టాస్ నెగ్గిన టీమ్ ఇండియా తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. అర్షదీప్ సింగ్ ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే అమెరికాకు కోలుకోలేని షాక్ ఇచ్చాడు. ఇన్నింగ్స్ తొలి బంతికి జహంగీర్ (0), ఓవర్ ఆఖరు బంతికి స్టీవెన్ ఆండ్రీస్ గౌస్ (2)ను డగౌట్‌కు సాగనంపాడు. తొలి ఓవర్లో 3 పరుగులకే ఇద్దరు కీలక బ్యాటర్లను కోల్పోయిన అమెరికా ఒత్తిడిలో పడింది. పవర్‌ప్లేలో సిరాజ్, బుమ్రాలను ఎదుర్కొని అమెరికా వికెట్ల పతనానికి బ్రేక్ వేసినా.. తొలి ఆరు ఓవర్లలో ఆ జట్టు 18 పరుగులే చేసింది. దీంతో మ్యాచ్ పూర్తిగా భారత్ నియంత్రణలోకి వచ్చినట్టు అయ్యింది!. స్టీవెన్ టేలర్ (24, 30 బంతుల్లో 2 సిక్స్‌లు), ఆరోన్ జోన్స్ (11, 22 బంతుల్లో 1 సిక్స్) మూడో వికెట్‌కు 22 పరుగులు జోడించారు. కానీ రన్‌రేట్ అప్పటికే చేజారిపోయింది. క్రీజులో కుదురుకునే ప్రయత్నం చేస్తున్న ఈ జోడీని హార్దిక్ పాండ్య విడదీశాడు. ఆరోన్ జోన్స్‌ను పాండ్య అవుట్ చేయగా.. అప్పటికే రెండు భారీ సిక్సర్లతో ఊపందుకున్న స్టీవెన్ టేలర్‌ను అక్షర్ పటేల్ ఖతం చేశాడు. టాప్ ఆర్డర్‌లో స్టీవెన్ టేలర్ పరుగుల వేటలో మెప్పించగా.. మిడిల్ ఆర్డర్‌లో నితీశ్ కుమార్ (27) ఆకట్టుకున్నాడు. రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో కదం తొక్కాడు. కోరే అండర్సన్ (15), హర్మీత్ సింగ్ (10), శాడ్లీ (11 నాటౌట్) ఆఖర్లో విలువైన పరుగులు జోడించారు. అమెరికా 20 ఓవర్లలో 8 వికెట్లకు 110 పరుగులు చేసింది. అర్షదీప్ ప్రదర్శనతో ఓ దశలో పది ఓవర్ల పాటు నిలుస్తారా? అనిపించినా అమెరికా ఆఖరు వరకు పోరాట పటిమి చూపించింది. హార్దిక్ పాండ్య రెండు వికెట్లు పడగొట్టగా.. అక్షర్ పటేల్ ఓ వికెట్ తీసుకున్నాడు. మహ్మద్ సిరాజ్, జస్‌ప్రీత్ బుమ్రా, శివం దూబెలకు వికెట్లు దక్కలేదు.



ఆసీస్ అలవోకగా..

నమీబియాపై 9 వికెట్లతో గెలుపు



నార్త్‌సౌండ్ : పొట్టి ప్రపంచకప్‌లో ఆస్ట్రేలియా జోరు కొనసాగుతుంది. గ్రూప్ దశలో తొలి మూడు మ్యాచుల్లోనూ కంగారూలు ఏకపక్ష విజయాలు నమోదు చేశారు. గ్రూప్-బిలో బుధవారం నమీబియాను ఆసీస్ చిత్తుగా ఓడించింది. 73 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని 5.4 ఓవర్లలోనే ఊదేసింది. మరో 86 బంతులు ఉండగానే 9 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నమీబియా 17 ఓవర్లలో 72 పరుగులకు కుప్పకూలింది. ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపా (4/12) నాలుగు వికెట్ల మాయజాలానికి జోశ్ హాజిల్‌వుడ్ (2/18), మార్కస్ స్టోయినిస్ (2/9) జత కలిశారు. దీంతో నమీబియా 72 పరుగులకే చేతులెత్తేసింది. కెప్టెన్ ఎరాస్మస్ (36, 43 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) ఒంటరి పోరాటంతో జట్టుకు కాస్త గౌరవప్రద స్కోరు అందించాడు. ఛేదనలో డెవిడ్ వార్నర్ (20, 8 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్), ట్రావిశ్ హెడ్ (34 నాటౌట్, 17 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లు), మిచెల్ మార్ష్ (18 నాటౌట్, 9 బంతుల్లో 3 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

వరుణుడి ఖాతాలో..

లంక, నేపాల్ పోరు వర్షార్పణం

లాడర్‌హిల్ (అమెరికా) : ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో వరుణుడు తనదైన ఆటతీరు ప్రదర్శిస్తున్నాడు. స్కాట్లాండ్, ఇంగ్లాండ్ మ్యాచ్‌కు ఆటంకం కలిగించి డిఫెండింగ్ చాంపియన్ టోర్నీ నుంచి నిష్క్రమించే ప్రమాదంలో నెట్టిన వరుణుడు తాజాగా మరో మ్యాచ్‌ను తుడిచిపెట్టేశాడు. బుధవారం ఉదయం జరగాల్సిన శ్రీలంక, నేపాల్ మ్యాచ్ వర్షార్పణమైంది. ఎడతెరిపిలేని వర్షంతో మైదానం పూర్తిగా తడిసిపోయింది. అవుట్‌ఫీల్డ్ ఆటకు అనుకూలంగా లేకపోవటంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో కనీసం ఒక్క బంతి పడకుండానే మ్యాచ్ ముగిసింది. గ్రూపు-డిలో కీలకమైన ఈ పోరులో మ్యాచ్ రద్దు కావడంతో శ్రీలంక, నేపాల్ చెరో పాయింట్ పంచుకున్నాయి. మూడు మ్యాచుల్లో విజయాలతో దక్షిణాఫ్రికా గ్రూప్-డి నుంచి సూపర్8 బెర్త్ సొంతం చేసుకోగా.. రెండో బెర్త్ రేసులో బంగ్లాదేశ్, నెదర్లాండ్స్ పోటీపడుతున్నాయి. మూడు మ్యాచుల్లో రెండు పరాజయాలు చవిచూసిన శ్రీలంక గ్రూప్ దశ దాటడం అద్భుతానికి సైతం సాధ్యపడని సమీకరణం అని చెప్పవచ్చు!.

ఇది అన్యాయం!

వివాదాస్పద గోల్‌పై ఫిఫాకు ఫిర్యాదు

న్యూఢిల్లీ : క్రీడాస్ఫూర్తితో పాటు ఆట నిబంధనలను తుంగలో తొక్కుతూ ఫిఫా ప్రపంచకప్ క్వాలిఫయర్‌లో భారత్‌పై ఖతార్ విజయం సాధించటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సోషల్ మీడియా వేదికగా ప్రపంచ సాకర్ అభిమానులు సంబంధిత గోల్ వీడియోను పోస్ట్ చేస్తూ ఫిఫాకు ట్యాగ్ చేస్తున్నారు. ఫిఫా ప్రపంచకప్ 2026 అర్హత ప్రక్రియ ఆసియా జోన్‌లో మూడో రౌండ్‌కు చేరేందుకు తప్పక నెగ్గాల్సిన మ్యాచ్‌లో భారత్ ఓటమి చెందింది. కానీ ఆ మ్యాచ్‌లో గోల్‌లైన్‌కు ఆవల వెళ్లిన బంతిని మళ్లీ అందుకుని గోల్ చేయటం అందరినీ విస్మయానికి గురి చేసింది. దీంతో ఆలిండియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) ఫిఫా, ఆసియా ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఎఫ్‌సీ)కు లేఖ రాసింది. 'ఖతార్‌తో మ్యాచ్ ఓడిన తీరు భారత ఫుట్‌బాల్ అభిమానులను తీవ్రంగా నిరాశపరిచింది. ఆటలో గెలుపోటములు సహజం. క్రీడా స్ఫూర్తి చాలా ముఖ్యం. భారత్‌కు జరిగిన అన్యాయంపై విచారణ జరిపించాలని కోరుతున్నాం' అని ఫిఫాకు రాసిన లేఖలో ఏఐఎఫ్‌ఎఫ్ పేర్కొంది.





స్క్వాష్ ఓపెన్ టోర్నీ షురూ : తెలంగాణ ఓపెన్ స్క్వాష్ రాకెట్ టోర్నమెంట్ 2024.. బుధవారం గోల్కొండ గోల్ఫ్ క్లబ్‌లో ఘనంగా మొదలైంది. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్, తెలంగాణ ఒలింపిక్ సంఘం మాజీ కోశాధికారి సహా స్క్వాష్ రాకెట్ ప్రతినిధులతో కలిసి టోర్నమెంట్‌ను ఆరంభించారు. టోర్నీలో అన్ని విభాగాల్లో కలిపి 359 మంది క్రీడాకారులు పోటీపడుతున్నారు.

రొటీన్‌కి భిన్నంగా ఉండే కథ



శివ పాలడుగు

అజయ్ ఘోష్, చాందినీ చౌదరి ముఖ్య పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'మ్యూజిక్ షాప్ మూర్తి'. ఫ్లై హై సినిమాస్ బ్యానర్ పై హర్ష గారపాటి, రంగారావు గారపాటి ఈ మూవీని నిర్మించారు. శివ పాలడుగు ఈ సినిమాకి కథ, కథనాన్ని అందించి దర్శకత్వం వహించారు. ఈనెల 14న ఈ సినిమా విడుదల కానున్న నేపథ్యంలో దర్శకుడు శివ పాలడుగు మీడియాతో పలు విశేషాలను షేర్ చేసుకున్నారు.

'మాది విజయవాడ. అమెరికాలో ఉద్యోగం చేశాను. అక్కడే నాకు ఫ్రెండ్‌గా హర్ష పరిచయమయ్యాడు. అమెరికాలోనే డైరెక్షన్ కోర్సులో డిప్లోమా చేశాను. నాకు మొదటి సినిమా అవకాశం చాలా సులభంగానే వచ్చింది. నా ఫ్రెండ్స్ నిర్మాతలు కావడంతో అంతా చాలా ఈజీగా జరిగిపోయింది. పాతికేళ్ల కుర్రాడి కథ చెబితే మళ్లీ రొటీన్ అవుతుందని, కాస్త కొత్తగా ఉండాలనే ఈ మ్యూజిక్ షాప్ మూర్తి కథను రాసుకున్నాను.

పాతికేళ్ల వయసులో సాధించలేనిది.. యాభై ఏళ్ల వయసు వచ్చాక సాధించాలనుకుంటే.. ఆ సాధన కోసం చేసే ప్రయత్నం ఎలా ఉంటుంది? ఎంత ఎమోషనల్‌గా ఉంటుందని ఆడియెన్స్‌కు చెప్పాలనే ఈ కథను రాసుకున్నాను. అజయ్ ఘోష్ అయితే బాగుంటుందని ఆయనతో ఈ క్యారెక్టర్ వేయించాను. చాందినీ చౌదరి పాత్రతోనే సినిమా ప్రారంభం అవుతుంది. ఆమె పాత్ర చాలా ఇంపాక్ట్ క్రియేట్ చేస్తుంది. మూర్తి జీవితంలో అంజన వల్ల వచ్చిన మార్పులు సినిమాని ముందుకు తీసుకెళ్తాయి. అంజన క్యారెక్టర్‌లో చాందినీ చౌదరి అద్భుతంగా నటించారు. పవన్ మంచి సంగీతాన్ని ఇచ్చారు. ప్రతీ పాట సందర్భానుసారంగానే వస్తుంది. ఎక్కడా ఇరికించినట్టుగా అనిపించదు. మా సినిమా కంటెంట్, మా చిత్రంలోని ఎమోషన్స్ మీద మాకు చాలా నమ్మకం ఉంది. ఈ చిత్రం అందరికీ నచ్చుతుంది' అని దర్శకుడు శివ పాలడుగు చెప్పారు.




ప్రణయ గోదారి..

హాస్య నటుడు అలీ సోదరుడి కుమారుడు సదన్ హీరోగా, ప్రియాంక ప్రసాద్ హీరోయిన్‌గా పిఎల్‌వి క్రియేషన్స్‌పై పారమళ్ళ లింగయ్య నిర్మిస్తున్న చిత్రం 'ప్రణయ గోదారి'. ఈ చిత్రానికి పి.ఎల్.విఘ్నేష్ దర్శకుడు. తాజాగా ఈ చిత్ర టైటిల్ ఫస్ట్‌లుక్‌ను సంఘ సేవకులు అంబర్ పేట్ శంకరన్న ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'చిన్న చిత్రాలకు సినీ పరిశ్రమలోని అందరూ అండగా నిలవాలి. చిన్న సినిమా అయినప్పటికీ మంచి కంటెంట్‌తో వస్తున్న ఈ సినిమా పెద్ద హిట్ అవుతుందని ఆశిస్తున్నాను. నిర్మాతగా పారమళ్ల లింగయ్యకు ఈ సినిమా ద్వారా మంచి సక్సెస్‌తో పాటు, డబ్బులు కూడా రావాలని ఆకాంక్షిస్తున్నాను' అని అన్నారు..

'నాకెంతో ఇష్టమైన అంబర్ పేట్ శంకరన్న పోస్టర్‌ను రిలీజ్ చేయడం ఆనందంగా ఉంది. త్వరలోనే ఈ సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తాం' అని నిర్మాత పారమళ్ళ లింగయ్య చెప్పారు.

నవచిత్రం

పక్కా యాక్షన్ ఎంటర్‌టైనర్



హీరో గోపీచంద్‌కి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఆయన నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'విశ్వం' చిత్రానికి సంబంధించి స్పెషల్ పోస్టర్‌ను బుధవారం మేకర్స్ రిలీజ్ చేశారు. షేడ్స్, క్యాప్‌తో, ట్రెండీ అవుట్ ఫిట్స్ ధరించి స్పోర్ట్స్ బైక్‌ను నడుపుతున్న గోపీచంద్ పోస్టర్‌లో స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. దర్శకుడు శ్రీను వైట్ల తన హీరోలను స్టైలిష్ బెస్ట్ అవతార్‌లలో ప్రజెంట్ చేయడంలో స్పెషలిస్ట్.

మేకర్స్ ఫస్ట్ స్ట్రైక్ వీడియోతో ఈద్ సందర్భంగా మాస్ ఫీస్ట్‌ని అందించారు. దీనికి అద్భుతమైన స్పందన వచ్చింది. హై-వోల్టేజ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, వేణు దోనేపూడి చిత్రాలయం స్టూడియోస్‌పై టిజి విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. దోనేపూడి చక్రపాణి సమర్పిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది.

తెలుగులో ఇప్పటివరకు రాని సినిమా



హీరో సుధీర్ బాబు తాజాగా నటిస్తున్న చిత్రం 'హరోం హర'. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ జి నాయుడు నిర్మించిన ఈ చిత్రానికి 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకత్వం వహించారు. ఈనెల 14న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ నేపథ్యంలో మేకర్స్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌ని నిర్వహించారు. యువ హీరోలు అడివి శేష్, విశ్వక్ సేన్ ముఖ్య అతిథులుగా హాజరైన ఈ వేడుక చాలా గ్రాండ్‌గా జరిగింది.

ప్రీరిలీజ్ ఈవెంట్‌లో మహేష్ బాబుతో సుధీర్ బాబు ఆడియో ఇంట్రాక్షన్‌ని రిలీజ్ చేశారు. ఆడియో ఇంట్రాక్షన్‌లో మహేష్ బాబు మాట్లాడుతూ, 'సినిమా ట్రైలర్ చూశాను. చాలా ఎగ్జైటింగ్‌గా అనిపించింది. సుధీర్ బాబు చాలా కొత్తగా కనిపించారు. బ్యాగ్ డ్రాప్, ప్రిమైజ్ కొత్తగా ఉంది. ఈ రోజుల్లో ఆడియన్స్ ఇలాంటి బ్యాక్‌డ్రాప్‌ని ఇష్టపడుతున్నారు. టైటిల్ ట్రాక్ చాలా నచ్చింది. సినిమా కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఈ సినిమా పెద్ద హిట్ కావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను' అని అన్నారు.

'మహేష్ బాబు బిజినెస్ మ్యాన్ సినిమాలో 'నీ టార్గెట్ టెన్ మైల్స్ అయితే ఏమ్ ఫర్ ది లెవంత్ మైల్' అని ఉంటుంది. నేను ట్వెల్త్ మైల్‌కి గురి పెట్టాను. కొట్టాను. ఒక సాలిడ్ సినిమా తీసి, ఎంతో మందికి చూపించి, వారు ఇచ్చిన ఫీడ్ బ్యాక్‌తో ఇంత నమ్మకంగా మాట్లాడుతున్నాను. ఈ సీన్ ఎలా తీస్తే పగిలిపోతుంది, ఈ ఫ్రేం ఎలా చూస్తే అదిరిపోతుందనే అప్రోచ్‌తో ఈ సినిమా చేశాం. ట్రైలర్‌లో చూస్తున్న ప్రతి డిటైల్‌కి టీం అందరి ఎఫర్ట్ ఉంది. ఇప్పటివరకూ తెలుగు ఇండస్ట్రీలో ఇలాంటి బ్యాక్ డ్రాప్‌తో ఎలాంటి సినిమా రాలేదు. సినిమా చూసినప్పుడు ఆడియన్స్ ఇదే ఫీల్ అవుతారు. మా మావయ్య సూపర్‌స్టార్ కృష్ణ కోరుకున్న సినిమా ఇది. ఆయన నన్ను ఎలాంటి క్యారెక్టర్‌లో చూడాలని అనుకున్నారో అలాంటి సినిమా అని చాలా కాన్ఫిడెంట్‌గా చెబుతున్నాను' అని హీరో సుధీర్ బాబు చెప్పారు.

డైరెక్టర్ జ్ఞానసాగర్ ద్వారక మాట్లాడుతూ,'ఇంత పెద్ద కాన్వాస్‌లో సినిమా చేయడం నిర్మాత ప్యాషన్ వలనే సాధ్యమైంది. సుధీర్ బాబు చాలా సపోర్ట్ చేశారు. 'హరోం హర' పక్కా గుర్తుండిపోయే సినిమా అవుతుంది' అని తెలిపారు.

'ఈ సినిమా కోసం రెండేళ్ళు హార్డ్ వర్క్ చేసాం. ఈ రెండేళ్ళ హార్డ్ వర్క్ ఈనెల14న పే చేస్తుందని గట్టి నమ్మకంలుంది. ట్రైలర్‌కి వచ్చిన రెస్పాన్స్ థియేటర్‌లో సినిమాకి వస్తుంది' అని ప్రొడ్యూసర్ సుమంత్ చెప్పారు. మరో ప్రొడ్యూసర్ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ,'ఇందులో తండ్రీ కొడుకుల ఎమోషన్ నాకు పర్సనల్‌గా చాలా కనెక్ట్ అయ్యింది. ఇది కమర్షియల్ మాస్ మూవీ. సాగర్ అద్భుతంగా తీశారు. విజువల్స్, మ్యూజిక్ సినిమాకి హైలెట్‌గా ఉంటాయి. సుధీర్ బాబు అద్భుతంగా చేశారు. చాలా కొత్తగా కనిపిస్తారు' అని అన్నారు.

యూనిక్ థ్రిల్లర్‌గా అలరిస్తుంది

చాందిని చౌదరి, వశిష్ట సింహా, భరత్‌రాజ్, ఆషు రెడ్డి ముఖ్యతారలుగా రూపొందిన చిత్రం 'యేవమ్'. ప్రకాష్ దంతులూరి దర్శకత్వంలో నవదీప్, పవన్ గోపరాజు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రకాష్ దంతులూరి మీడియాతో ముచ్చటించారు.

- వైజయంతీ మూవీస్‌లో చేసిన 'ఓంశాంతి' నా తొలి సినిమా. ఈ తర్వాత ఈ కథ, కాన్సెప్ట్ నచ్చి నవదీప్ ఈ సినిమాకు నిర్మాతగా మారారు. 'యేవమ్' అనేది సంస్కృత పదం, ఇతిహాసాలు, పురాణాలు చెప్పినప్పుడు ఇది ఇలా జరిగింది అని చెప్పడాన్ని 'యేవమ్' అంటారు. ఈ సినిమాలోని పాత్రలు రియల్ లైఫ్ పాత్రల్లా ఉంటాయి. నలుగురు విభిన్నమైన వ్యక్తుల కథ ఇది. వంశీ 'అన్వేషణ' లాంటి థ్రిల్లర్‌ను మనకు తెలిసిన పాత్రలతో చెబితే ఎలా ఉంటుంది అనేది ఈ సినిమా.



ప్రకాష్ దంతులూరి

- అయితే ఇది పోలీసాఫీసర్ కథ అయినా చాలా ఎంటర్‌టైనింగ్ థ్రిల్లర్. ప్రతి పాత్ర కూడా ఎంతో యూనిక్‌గా ఉంటుంది. సినిమా మొత్తం సీరియస్ మూడ్‌లో ఉండదు. ప్రతి సన్నివేశాన్ని ఆడియన్స్ ఎంజాయ్ చేస్తారు. నేటి సమాజంలోని వ్యక్తులను చూసి రాసుకున్న పాత్రలే ఇవి. ప్రతి ఒక్కరికి జీవితంలో కొన్ని లక్ష్యాలుంటాయి. ఆ లక్ష్యాలను ఛేధించడానికి వాళ్ల పడే స్ట్రగుల్ ఈ కథ.
- ఈ చిత్రంలో ఓ అమ్మాయి తను అనుకున్న గోల్‌ను ఎలా చేరుకుంది? అనేది ఎంతో ఆస్తకికరంగా, ఎంటర్‌టైనింగ్‌గా వుంటుంది. సౌమ్య పాత్రలో చాందిని చౌదరి లీనమైపోయింది. ప్రతి సన్నివేశం బాగా చేసింది. ఆమెకు నటిగా మంచి పేరు తీసుకొచ్చే సినిమా ఇది.
- ఈ సినిమాకు ఫీమేల్ సంగీత దర్శకురాలు నేపథ్య సంగీతం అందించింది. చాలా బాగా చెసింది. నేపథ్య సంగీతం కథలోని ఎమోషన్స్ చెబుతుంది. ఇది థియేటర్‌లో చూడదగ్గ సినిమా. ఇది కచ్చితంగా ప్రేక్షకుల్ని అలరిస్తుంది.



ఫస్ట్‌లవ్‌లో ఫెయిల్ అయితే?

వీసీ క్రియేషన్స్ బ్యానర్ పై కే.ఓ.రామరాజు నిర్మాతగా, సంజయ్‌రెడ్డి బంగారపు దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'పద్మవ్యూహంలో చక్రధారి'. ప్రవీణ్‌రాజ్‌కుమార్ హీరోగా తెరకెక్కుతున్న ఈ చిత్ర ట్రైలర్‌ను హీరో విశ్వక్ సేన్ రిలీజ్ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,'యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్‌గా సినిమా బాగా అలరిస్తుంది. ట్రైలర్ చాలా బాగుంది. ప్రేక్షకులకు సినిమాపై మంచి అంచనాలు ఏర్పడే విధంగా ఉంది. సినిమా నిర్మించి విడుదల చేయడం అనేది ఓ సాహసం. ఆ విషయంలో చిత్ర నిర్మాత కే.ఓ.రామరాజు విజయం సాధించారు. ఈనెల 21న ప్రేక్షకుల ముందుకు వస్తున్న ఈ సినిమాను ప్రేక్షకులు ఆదరించి, విజయవంతం చేస్తారని ఆశిస్తున్నాను. ట్రైలర్‌లో చూపించినట్లు ఫస్ట్‌లవ్‌లో ఫెయిల్ అయిన వ్యక్తి అదే ధ్యాసలో ఉంటూ వేదన పడుతుంటాడు. దాని నుంచి ఎలా బయటపడ్డాడు అనేదాన్ని.. ఎంతో ఆసక్తితో అన్ని హంగులు ఉండేలా తీర్చిదిద్దినట్లు ట్రైలర్ చూస్తే అర్థం అవుతుంది. రాయలసీమ బ్యాక్‌డ్రాప్‌లో వస్తున్న ఈ లవ్ ఎంటర్‌టైనర్ మంచి విజయం సాధిస్తుందని మేకర్స్ నమ్మకంగా ఉన్నారు.

ప్రవీణ్‌రాజ్‌కుమార్, శశికా టిక్కో, అషురెడ్డి, మధునందన్, భూపాల్ రాజ్, ధనరాజ్, రూప లక్ష్మి, మాస్టర్ రోహన్, మురళీధర్ గౌడ్, మహేష్ విట్టా, వాసు వన్స్ మోర్ తదితరులు నటిస్తున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

బాధలో 86 శాతం మంది ఉద్యోగులు

- భారత్‌లో 14 శాతం మంది మాత్రమే వృత్తిపై ఆసక్తి
- నేపాల్ కంటే తక్కువ : గల్లప్ వర్క్‌ప్లేస్ రిపోర్ట్



న్యూఢిల్లీ : భారత్‌లో 86 శాతం మంది ఉద్యోగులు కష్టపడుతూ, బాధపడుతూనే పని చేస్తున్నారని ఓ రిపోర్ట్‌లో వెల్లడయ్యింది. మిగతా 14 శాతం మంది మాత్రమే వృత్తిపై ఆసక్తితో.. నిత్యం అభివృద్ధి చెందుతున్నట్లు భావిస్తున్నారు. కాగా.. ప్రపంచంలో 34 శాతం మంది ఉద్యోగులు తమ వృత్తి పట్ల సంతోషం, ఆసక్తిని కనబర్చుతున్నారని 'గల్లప్ 2024 స్టేట్ ఆఫ్ ది గ్లోబల్ వర్క్‌ప్లేస్' నివేదిక వెల్లడించింది. ప్రపంచ సగటుతో పోల్చితే భారత్‌లో ఎక్కువ మంది ఉద్యోగులు అసంతృప్తిగానే తమ పనిని నెట్టుకొస్తున్నారు. ఉద్యోగులను అభివృద్ధి చెందుతున్న, కష్టపడుతున్న, బాధపడుతున్న ఉద్యోగులుగా మూడు కేటగిరీలుగా విభజించి గల్లప్ ఈ రిపోర్ట్‌ను తయారు చేసింది. ప్రస్తుత వృత్తి జీవితంతోపాటు భవిష్యత్తు పట్ల సానుకూల దృక్పథాన్ని కలిగి ఉన్నవారిని అభివృద్ధి చెందుతున్న వారిగా పరిగణించారు. దీనికి విరుద్ధంగా వృత్తిలో ప్రతికూల వాతావరణాన్ని అనుభవిస్తున్న వారు, రోజువారీ ఒత్తిడి, ఆర్థిక ఆందోళనలను ఎదుర్కొంటున్నవారిని కష్టపడుతున్న, బాధపడుతున్న కేటగిరీలోకి చేర్చారు. దక్షిణాసియాలో పనిపై ఆసక్తి, అభివృద్ధి చెందుతున్న కేటగిరీలో 15 శాతం ఉద్యోగులున్నారు. నేపాల్‌లో ఇది 22 శాతంగా ఉంది. భారత్‌లో14 శాతంగా ఉండటం విశేషం. శ్రీలంకలో అత్యధికంగా 62 శాతం, ఆఫ్ఘనిస్తాన్‌లో 58 శాతం ఉద్యోగులు రోజువారీ ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. భారత్‌లో ఇది 35 శాతంగా ఉంది. కష్టపడే వారిలో ఎక్కువ మంది తమకు ఆహారం, ఆశ్రయం, ప్రాథమిక అవసరాలు తీర్చుకునే పరిస్థితి లేదని ఆందోళన వ్యక్తం చేశారు.

నిరుద్యోగం సమస్యనే కాదు

- అరవింద్ పనగారియా వ్యాఖ్యలు



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వానికి స్వామి భక్తిని ప్రకటించుకోవడంలో ఆర్థిక సంఘం చైర్మెన్ అరవింద్ పనగారియా పోటీ పడుతున్నారు. దేశంలో నిరుద్యోగం తాండవిస్తోంటే.. పిజి, పిహెచ్‌డిలు చేసిన వారు అటెండర్ పోస్టులకు పోటీపడుతుంటుంటే.. అరవింద్ పనగారియా మాత్రం నిరుద్యోగం పెద్ద సమస్యనే కాదని చెప్పడం గమనార్హం. ఎన్‌డిటివికి ఇచ్చిన ఇంటర్యూలో పనగారియా మాట్లాడుతూ.. భారతదేశ ప్రధాన సవాలు ఉద్యోగాలను సృష్టించడం కాదన్నారు. ఎక్కువ శ్రమతో కూడిన రంగాలకు మూలధనాన్ని కేటాయించడం ద్వారా ఉపాధిని పెంచవచ్చన్నారు. భారతదేశంలో నిరుద్యోగం పెరుగుతోందని ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు బిజెపి ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేసిన విషయం తెలిసిందే. పలు రంగాలకు భారీగా మూలధనం అవసరం ఉంటుందని.. కానీ వాటిలో తగినంత కార్మికులకు అవకాశాలు ఉండవని పనగారియా అన్నారు. ఎక్కువ ఉద్యోగాలు కల్పించే రంగాలకు మూలధనాన్ని మళ్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రాబోయే బడ్జెట్‌కు సిద్ధమవుతున్న తరుణంలో తనకు ఇది ఒక ముఖ్యమైన పరీక్ష అని పనగారియా పేర్కొన్నారు. దేశం పరిస్థితిని అంచనా వేయడానికి ఎకనామిక్స్ టైమ్స్ ఇటీవల ఒక సర్వే చేసింది. ఎన్‌డిఎ ప్రభుత్వానికి నిరుద్యోగం ప్రధాన సవాలు అని గుర్తించింది. దీనికి తోడు ద్రవ్యోల్బణం, అసమానత, రైతుల సమస్యలు, నిరంకుశత్వం పెరగడం, జైలులో ఉన్న ప్రతిపక్ష నాయకుల సంఖ్య పెరుగుతోండటంపై ఆందోళన వ్యక్తం అయ్యింది. దేశంలో నిరుద్యోగం ప్రమాదకరస్థాయికి చేరిందని ప్రభుత్వ మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు కౌశిక్ బసు కూడా గత నెలలో ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే ప్రభుత్వం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. ఆర్థిక నిపుణులు నిరుద్యోగంపై ఆందోళన వ్యక్తం చేస్తోంటే.. మరోవైపు పనగారియా మాత్రం అది సమస్యనే కాదని పేర్కొనడం గమనార్హం.

షావోమి 14 సీవీ స్మార్ట్‌ఫోన్ విడుదల

న్యూఢిల్లీ : ప్రముఖ స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తుల కంపెనీ షావోమి బుధవారం భారత మార్కెట్లోకి తన 14 సీవీ మోడల్‌ను విడుదల చేసింది. సినిమాటిక్ విజన్ కలిగిన లీక కెమెరాతో దీన్ని అందుబాటులోకి తెచ్చినట్లు ఆ సంస్థ తెలిపింది. 8 జీబీ, 256 జీబీ వేరియంట్ ధరను రూ.39,999గా ప్రకటించింది. లైకా త్రిపుల్ రేర్ కెమెరాలో 50 ఎంపీ కెమెరా సహా సెల్ఫీ కోసం రెండు 32 ఎంపీ కెమెరాలను అమర్చింది. ఈ ఫోన్‌ను మార్చిలో చైనాలో ఆవిష్కరించింది.

స్టాండర్డ్ క్యాపిటల్‌కు రూ.10.7 కోట్ల లాభాలు


హైదరాబాద్ : బ్యాంకింగేతర విత్త సంస్థ (ఎన్‌బీఎఫ్‌సీ) స్టాండర్డ్ కాపిటల్ 2024 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో రూ.10.7 కోట్ల నికర లాభాలు సాధించినట్టు తెలిపింది. 2022-23లో రూ.2.22 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన మార్చి త్రైమాసికంలో సంస్థ లాభాలు రూ.2.51 కోట్లుగా నమోదయ్యాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.1.59 కోట్ల లాభాలు ఆర్జించింది. 2024 మార్చి 31 నాటికి సంస్థ మొత్తం ఆస్తులు రూ.428.12 కోట్లకు చేరింది.

నందన్ డెనిమ్ అమ్మకాల్లో 27 శాతం వృద్ధి

హైదరాబాద్ : గడిచిన ఆర్థిక సంవత్సరం మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికం (క్యూ4)లో నందన్ డెనిమ్ అమ్మకాలు 26.68 శాతం పెరిగి రూ.579.12 కోట్లుగా నమోదయ్యాయని ఆ సంస్థ తెలిపింది. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.457.16 కోట్ల అమ్మకాలు చేసినట్లు పేర్కొంది. ఇదే సమయంలో రూ.0.53 కోట్లుగా ఉన్న నికర లాభాలు.. గడిచిన క్యూ4లో రూ.44.97 కోట్లకు చేరాయని తెలిపింది. 2024 మార్చి 31తో ముగిసిన ఏడాదిలో కంపెనీ ఆదాయం 0.82 శాతం తగ్గి రూ.2010 కోట్లకు పరిమితమయ్యింది.

రొమ్ము శస్త్ర చికిత్సల్లో రోగి భద్రతనే కీలకం

- డాక్టర్ వాకటి గీతిక రెడ్డి



నవతెలంగాణ- హైదరాబాద్

అన్ని వైద్య చికిత్సలతో పోల్చితే ముఖ్యంగా రొమ్ము శస్త్ర చికిత్సలో రోగి భద్రత కీలకమని అపోలో స్పెక్ట్ర హాస్పిటల్స్ డాక్టర్ వాకటి గీతిక రెడ్డి పేర్కొన్నారు. ఈ చికిత్సల్లో కచ్చితమైన ప్రణాళిక, అత్యాధునిక శస్త్రచికిత్సా పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం అవసరమని ఆమె ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అంటువ్యాధులు, రక్తస్రావం, ప్రతికూల మత్తు ప్రతిస్పందనలు వంటి కొన్ని ఆందోళన ప్రమాదాలను పరిమితం చేయడానికి, శస్త్రవైద్యులు అత్యంత జాగ్రత్త వహించాల్సి ఉంటుందన్నారు. రొమ్ము సంబంధిత శస్త్ర చికిత్సలు రోగుల శారీరక రూపం, భావోద్వేగ శ్రేయస్సుపై తీవ్ర ప్రభావాన్ని చూపుతాయన్నారు. సరైన ఫలితాలను సాధించడానికి రోగి భద్రత, సమాచార సమ్మతి, భాగస్వామ్య నిర్ణయం తీసుకోవడం వంటి అంశాలు రోగుల సంపూర్ణ అనుభవాన్ని, ఫలితాలను గణనీయంగా మెరుగుపరుస్తాయన్నారు. రోగి ఆందోళనలను పరిష్కరించడం, వారి ప్రశ్నలకు పూర్తిగా సమాధానం ఇవ్వడం సమాచార సమ్మతి ముఖ్య ఉద్దేశమన్నారు.

జులై 14న ఏఈ టెస్ట్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అసిస్టెంట్ ఇంజినీర్లు (ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్), కెమిస్ట్ పోస్టులకు సంబంధించిన ఆన్‌లైన్ కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ)ని జులై 14వ తేదీ నిర్వహిస్తున్నట్టు టీఎస్ జెన్‌కో సీఎమ్‌డీ రిజ్వీ తెలిపారు. ఈ మేరకు బుధవారంనాడాయన నోటీసు విడుదల చేశారు. హైదరాబాద్, సికింద్రాబాద్‌లో పరీక్షా కేంద్రాలు ఉంటాయనీ, మొదటి షిఫ్టులో ఉదయం 9 నుంచి 10.40 వరకు మెకానికల్, కెమిస్ట్ పోస్టులకు పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అదేరోజు రెండో షిఫ్ట్‌లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2.40 వరకు ఎలక్ట్రికల్ సీబీటీ, మూడో షిఫ్ట్‌లో సాయంత్రం 5 నుంచి 6.40 వరకు సివిల్, ఎలక్ట్రానిక్స్ సీబీటీ ఉంటాయని వివరించారు. హాల్‌టిక్కెట్లు జులై 3 నుంచి సంస్థ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయని చెప్పారు.

కేంద్రం విభజన హామీలను పరిష్కరించాలి : డీవైఎఫ్ఐ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విభజన హామీలను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కేంద్రంలో బీజేపీ రెండు దఫాలుగా అధికారంలో ఉన్నా తెలంగాణను పూర్తిగా విస్మరించిందని తెలిపారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, ఖాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, మెడికల్ కాలేజీలు, ఐఐటీ, ఐఐఎం, త్రిపుల్‌ఐటీ, మైనింగ్ వర్సిటీలనూ ఇప్పటి వరకు ఇవ్వకుండా మోసం చేసిందని విమర్శించారు. మూడో సారి అధికారం చేపట్టిన మోడీ ప్రభుత్వం వందరోజుల కార్యాచరణలో భాగంగా విభజన హామీలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మంత్రులు, ఎంపీలు ఆ బాధ్యత తీసుకోవాలని కోరారు. దేశాభివృద్ధికి కృషి చేయాలనీ, నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలనీ, ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని తెలిపారు. నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్టీఏ నిర్వహించిన తీరుపై దేశవ్యాప్తంగా అనుమానాలున్నాయని పేర్కొన్నారు. ఎన్టీఏ పారదర్శకత, పరీక్ష నిర్వహణపై ప్రత్యేక దర్యాప్తు సంస్థలో సమగ్ర న్యాయ విచారణ జరపాలనీ, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

- సీఎమ్‌డీకి 327 యూనియన్ విజ్ఞప్తి

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

విద్యుత్ కార్మికులు, ఉద్యోగుల సమస్యల్ని తక్షణం పరిష్కరించాలని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (327) యాజమాన్యాన్ని కోరింది. ఈ మేరకు టీజీఎస్ ట్రాన్స్‌కో సీఎమ్‌డీ రిజ్వీకి బుధవారం వినతిపత్రం సమర్పించారు. 327 యూనియన్ సెక్రటరీ జనరల్ శ్రీ ఈ శ్రీధర్ ఆధ్వర్యంలో టీజీఎస్ఎస్పీడీసీఎల్ కంపెనీ సెక్రటరీలు కే భూపాల్‌రెడ్డి, టీజీఎస్‌ట్రాన్స్‌కో యూనిట్ సెక్రటరీ జీ రమేష్, నాయకులు నిరంజన్ అలీ, ఈశ్వరప్ప, వీరయ్య తదితరులు సీఎమ్‌డీని కలిసి వినతిపత్రం సమర్పించారు. డిఏ బకాయిలు చెల్లించాలనీ, పదోన్నతులు ఇవ్వాలని కోరారు. దీనిపై సీఎమ్‌డీ రిజ్వీ స్పందిస్తూ బదిలీల ఉత్తర్వులకంటే ముందే ప్రమోషన్ల ఉత్తర్వులు ఇస్తామని హామీ ఇచ్చారు. జనవరి డిఏ బకాయిని కూడా వెంటనే ఇస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా సమస్యలతో కూడిన రెండు వినతిపత్రాలు సమర్పించారు.

పశుసంవర్థకశాఖ ముఖ్యకార్యదర్శిగా సభ్యసాచి ఘోష్

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్ర పశు, డైరీ, మత్స్య శాఖల ముఖ్య కార్యదర్శిగా సభ్యసాచి ఘోష్‌ను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఆయన పూర్తిస్థాయి అధికారిగా కొనసాగుతారని పేర్కొన్నారు.

స్నేక్ గ్యాంగ్‌కు జీవిత ఖైదు

- కింది కోర్టు తీర్పును ధ్రువీకరించిన హైకోర్టు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

స్నేక్ గ్యాంగ్‌గా పేరొందిన ఏడుగురు సభ్యుల ముఠాకు కింది కోర్ట్ విధించిన జీవిత ఖైదును రాష్ట్ర హైకోర్టు డివిజన్ బెంచ్ ధ్రువీకరించింది. ఒంటరి జంటలను దోచుకోవడం, పాములతో భయపెట్టడం ద్వారా మహిళలపై లైంగిక దాడికి పాల్పడటం, తదితర నేరాలకు గాను రెండో ప్రత్యేక సెషన్స్ జడ్జి గతంలో జీవిత ఖైదు ఖరారు చేశారు. వారికి విధించిన శిక్షను రద్దు చేయాలని కోరుతూ ఏడుగురు నిందితులు దాఖలు చేసిన అప్పీళ్లను జస్టిస్ కె. లక్ష్మణ్, జస్టిస్ పి.శ్రీసుధలతో కూడిన ధర్మాసనం బుధవారం కొట్టేసింది.ప్రాసిక్యూషన్ ప్రకారం షాహిన్ నగర్‌కు చెందిన బాధితురాలి కుటుంబం జూలై 2014లో ఓ ఫామ్‌హౌస్‌కు వెళ్లింది. మధ్యాహ్నం సమయంలో ప్రాంగణాన్ని విడిచిపెట్టింది.ఆ తర్వాత నిందితులు ఆమెను లైంగికంగా వేధించడంతో పాటు, అర్థ నగ్న చిత్రాలను సోషల్ మీడియాలో పెడతానని బెదిరించి వారి వద్ద ఉన్న బంగారం, నగదు దోచుకున్నారు. దీనిపై పోలీసులు నమోదు చేసిన కేసులోని సాక్షా ధారాలన్నీ పరిశీలించి మే 2016లో సెషన్స్ న్యాయమూర్తి ఏడుగురు నిందితులను దోషులుగా నిర్ధారించారు.వారికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధించారు. ఈ తీర్పును సవాల్ చేస్తూ ఏడుగురు దాఖలు చేసిన క్రిమినల్ అప్పీల్‌ను హైకోర్టు కొట్టేసింది.

కార్మిక న్యాయస్థానం ఆర్డర్ సరైనదే

- టాటా బోయింగ్ ఏరోస్పేస్‌కు ఎదురుదెబ్బ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

టాటా బోయింగ్ ఏరోస్పేస్ లిమిటెడ్ మేనేజిమెంట్, స్టాఫ్ మధ్య వివాదంలో స్థానిక లేబర్ కోర్ట్ ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్ట్ సమర్ధించింది ఆసంస్థలోని కార్మికుల తొలగింపు వివాదంలో లేబర్ కోర్ట్ ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యానికి ఆస్కారం లేదని తేల్చి చెప్పింది. కార్మికులు సమర్పించిన అదనపు సాక్ష్యాలు, డాక్యుమెంట్లను కింది కోర్టు అనుమతివ్వడం చట్టబద్ధమేనని పేర్కొంది. ఆ కోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేసింది. అదనపు ఆధారాలపై వివరణ ఇవ్వడానికి టాటా బోయింగ్ సంస్థకు అవకాశం ఉన్నందున కార్మిక న్యాయస్థానం ఉత్తర్వులు సమర్థనీయంగానే ఉన్నాయని జస్టిస్ మాధవీదేవి ఉత్తర్వులు జారీ చేశారు.

మిషన్ భగీరథ సర్వే నుంచి..అంగన్వాడీ టీచర్స్‌ని మినహాయించాలి



- సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి

నవతెలంగాణ-సిద్దిపేట కలెక్టరేట్

మిషన్ భగీరథ సర్వే నుంచి అంగన్వాడీ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. బుధవారం సిద్దిపేట జిల్లా సమీకృత కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్లు ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో మిషన్ భగీరథ సర్వేను అంగన్వాడీ టీచర్లు చేయాలని అధికారులు సూచించినప్పటికీ ట్రైనింగ్ సమయంలోనే అధికారుల దృష్టికి యూనియన్ తరపున ఇది చేయలేమని తేల్చి చెప్పారన్నారు. అయినా తప్పనిసరిగా చేయాలంటూ ఒత్తిడి చేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని, దీన్ని విరమించుకోవాలని సూచించారు. ఇప్పటికే అంగన్వాడీ టీచర్లకు అనేక యాప్‌ల ద్వారా వివిధ సర్వేలు చేయాలని ప్రభుత్వం నుంచి ఒత్తిళ్లు వస్తున్నప్పటికీ తట్టుకొని వారి అదనపు పనులను నిర్వర్తిస్తున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న సమయంలో శిశువుల నుంచి ఐదేండ్ల పిల్లల వరకు వారి సంరక్షణతో పాటు పోషక పదార్థాలు అందించడం, గర్భవతులకు పోషక పదార్థాలు అందించడం లాంటి విధులు అంగన్వాడీ టీచర్లు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి సమయంలో అంగన్వాడీ టీచర్లను మరోమారు మిషన్ భగీరథ సర్వేలు చేయాలని ఒత్తిడి చేయడంతో వాళ్ల విధులకు ఆటంకం కలుగుతుందన్నారు. అధికారులు ఒత్తిడి చేస్తే సహించబోమని, ఉద్యమించాల్సి వస్తుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి జి. భాస్కర్, జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. పద్మ, జిల్లా అధ్యక్షులు లక్ష్మీ కోశాధికారి పద్మ, నాయకులు ఎడ్ల లక్ష్మీ, వసంత, అనిత, శ్యామల, శబరి, సురేఖ, భూలక్ష్మి, ప్రేమలత, కళావతి, టీచర్లు పాల్గొన్నారు.

వైసీపీ శ్రేణులపై టీడీపీ దాడులు

- యూనివర్సిటీ వైస్ చాన్సలర్స్‌పైనా...
- ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలి : రాష్ట్రపతికి, ఎన్సీహెచ్‌ఆర్సీ, ప్రధాని, కేంద్ర హోం మంత్రికి వైసీపీ ఫిర్యాదు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

రాష్ట్రంలో వైసీపీ శ్రేణులే లక్ష్యంగా టీడీపీ దాడులు చేస్తోందని ఆ పార్టీ ఎంపీలు విమర్శించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్సీహెచ్‌ఆర్సీ), ప్రధానమంత్రి, కేంద్ర హోం మంత్రికి ఫిర్యాదు చేస్తూ వైసీపీ లేఖలు రాసింది. ఎన్నికల ఫలితాల తరువాత రాష్ట్రంలో పరిస్థితులు దిగజారాయని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా టీడీపీ, జనసేనలు వైసీపీ కార్యకర్తలు, మద్దతుదారులపై దాడులు చేస్తున్నాయని ఫిర్యాదులో పేర్కొంది. ఈ సందర్భంగా వైసీపీ ఎంపీలు విజయసాయి రెడ్డి, మిథున్ రెడ్డి, వైవి సుబ్బారెడ్డి, బీదా మస్తాన్ రావు, మోపిదేవి వెంకటరమణ మీడియాతో మాట్లాడారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, కానీ గత కొన్ని రోజులుగా జరుగుతున్న హింసాత్మక ఘటనలు బాధాకరమని అన్నారు. వైసీపీ కార్యకర్తలపై దాడులు, ఇండ్లు కూలగొట్టడం లాంటి పరిస్థితులు రాష్ట్రంలో ఇంతకు ముందెప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి, రాష్ట్రపతి, కేంద్ర హెూం మంత్రి, జాతీయ మానవ హక్కుల కమిషన్‌కు లేఖలు రాశామని తెలిపారు.

రాష్ట్రంలో శాంతి భద్రతలు రోజు రోజుకూ క్షీణిస్తున్నాయని, వాటిని పరిరక్షించాలని రాష్ట్రపతిని కోరినట్లు తెలిపారు. ఏపీలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. రాష్ట్రంలో అన్యాయం రాజ్యమేలుతోందని ఆరోపించారు. బాధితులు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పాలన చీకటి అధ్యాయంగా చరిత్రలో మిగిలిపోతుందని దుయ్యబట్టారు. టీడీపీకి వ్యతిరేకంగా మాట్లాడిన వారిపై దాడి చేసి, ఇతరులను భయాందోళనకు గురిచేసేందుకు ఆ వీడియోలను సోషల్ మీడియాలో పెడుతున్నారన్నారు. మంగళగిరిలో ఈ తరహా దాడులను చూశామన్నారు. లోకేష్ అనుచరులు సోషల్ మీడియా కార్యకర్తలపై అమానుషంగా ప్రవర్తిస్తున్నారని తెలిపారు.

రాష్ట్రమంతటా విస్తరించిన నైరుతి రుతుపవనాలు

- వచ్చే మూడ్రోజులు తేలికపాటి నుంచి మోస్తరు వానలు!

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలోని అన్ని ప్రాంతాలకు నైరుతి రుతుపవనాలు విస్తరించాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రధాన అధికారి డాక్టర్ కె.నాగరత్న తెలిపారు. రాష్ట్రంలో వచ్చే మూడ్రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆకాశం మేఘావృతమై సాయంత్రం, రాత్రి సమయాల్లో చిరుజల్లులు లేదా తేలికపాటి వర్షం పడే అవకాశముందని తెలిపారు. మహారాష్ట్రలోని మరికొన్ని ప్రాంతాలకు కూడా రుతుపవనాలు విస్తరించాయని పేర్కొన్నారు.

24 నుంచి లోక్‌సభ



- 27 నుంచి రాజ్యసభ సమావేశాలు : కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజుజు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్రంలో కొత్త ప్రభుత్వం కొలువుదీరింది. 71 మంది ఎంపీలకు మంత్రి మండలి ఏర్పడింది. వీరంతా తమ బాధ్యతలను కూడా స్వీకరించారు. ఈ క్రమంలో లోక్‌సభ కార్యకలాపాలు నిర్వహించేందుకు స్పీకర్‌ను ఎన్నుకోవాల్సి ఉంది. అయితే అంతకంటే ముందే ఎంపీలంతా ప్రమాణ స్వీకారం చేయాలి. దీంతో ఇప్పుడు స్పీకర్ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలో కేంద్రం పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు పిలుపునిచ్చింది.

18వ లోక్‌సభ మొదటి సెషన్‌ను జూన్ 24 నుంచి జులై 3 వరకూ నిర్వహించనున్నట్లు కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజు బుధవారం వెల్లడించారు. ఈ సమావేశాల్లో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణం, స్పీకర్ ఎన్నిక ఉంటుందని తెలిపారు. ఇక రాజ్యసభ జూన్ 27 నుంచి మొదలై జులై 3 వరకూ కొనసాగనున్నట్లు ప్రకటించారు. జూన్ 27 ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగించనున్నారు. అనంతరం ప్రధాని మోడీ తన మంత్రి మండలిని పార్లమెంట్‌కు పరిచయం చేయనున్నట్లు కిరణ్ రిజుజు తెలిపారు. ఆ తర్వాత రాష్ట్రపతి ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ ఉంటుంది. దీనిపై ప్రధాని మోడీ సమాధానం ఇవ్వనున్నారు.

స్పీకర్ ఎన్నికపై ఆసక్తి

మోడీ ప్రభుత్వ ఏర్పాటులో కీలకంగా ఉన్న టీడీపీ, జేడీయూ లోక్‌సభ స్పీకర్ పదవి ఆశిస్తున్నట్లు సమాచారం. సభాపతి పదవి తమకంటే తమకు ఇవ్వాలని అధికార బీజేపీ మిత్ర పక్షాలైన టీడీపీ, జేడీయూ పట్టుబడుతున్నాయి. బీజేపీ ఎంపీ పురందేశ్వరి, టీడీపీ ఎంపీ హరీశ్ మాథుర్ స్పీకర్ రేసులో ఉన్నట్టు వార్తలొస్తున్నాయి. అయితే, ఇదే సమయంలో రాజస్థాన్ కోటా నుంచి లోక్‌సభకు ఎన్నికైన ప్రస్తుత స్పీకర్ ఓం బిర్లాకు మరోసారి అవకాశం ఇవ్వొచ్చన్న అంచనాలూ ఉన్నాయి. దీంతో స్పీకర్ పదవి ఎవరికి దక్కొచ్చనే అంశం ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

ప్రజాసేవకుడికి అహంకారం ఉండకూడదు

- మోడీ నిరంకుశత్వానికి మోహన్ భగవత్ వ్యాఖ్యలే నిదర్శనం :టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజాసేవకుడికి అహంకారం ఉండకూడదంటూ ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు మోడీ నిరంకుశత్వానికి నిదర్శమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు నిరంజన్ అన్నారు. ఆయన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా దుమారం లేపుతున్నాయని తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో విద్వేషాలు పెంచారని మోడీపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మణిపూర్ అల్లర్లపై భగవత్ మాటలు మోడీ వైఫల్యాలకు సంకేతామన్నారు. భవిష్యత్తులో బీజేపీ అంతర్గత పరిణామాలు ఎటు వైపు దారి తీస్తాయో తెలియదన్నారు. హోం శాఖ నుంచి అమిత్ షాను తప్పించాలని డిమాండ్ చేశారు. చంద్రబాబు, నితీశ్‌కుమార్ చాలా కాలం మోడీతో ప్రయాణం సాగించలేరని నొక్కి చెప్పారు.

గురుకులాల్లోని కార్మికుల తొలగింపు దారుణం

- తీవ్రంగా ఖండిస్తున్నాం : ఏఐటీయూసీ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించడం దారుణమనీ, దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలరాజ్ చెప్పారు. మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ సెక్రెటరీ అయోషా మస్రత్ ఖానమ్ ఇచ్చిన ఉత్తర్వు నెం.ఎ/5211/టిఎంఆర్ఇఐఎస్/2023ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి టేకుమల్ల సమ్మయ్య, గురుకుల విద్యా సంస్థల నాయకుల సయ్యద్ జహంగీర్, కె.శ్రీకాంత్ తదితరులు ఆమెకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తొలగించిన వారిని యధావిధిగా కొనసాగించాలని కోరగా..కార్యదర్శి స్పందిస్తూ తగిన న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఒక్కో గురుకుల విద్యా సంస్థలో సెక్యూరిటీ గార్డులు, ప్లంబర్లు, ఎలక్ట్రిషియన్లు, వంట కార్మికులు, అటెండర్, డెటా ఎంట్రీ ఆపరేటర్లు, వార్డెన్‌లు ప్రత్యేక అరబిక్ టీచర్లుగా పనిచేస్తూ గురుకులాల్లో నాణ్యమైన విద్యను అందిస్తూ విద్యార్థుల మానసికాభివృద్ధికి పాటుపడుతున్నారని చెప్పారు. అలాంటి వారిని ఒక్క కలం పోటుతో తొలగించడం దారుణమన్నారు. తక్షణమే వారిని ఉద్యోగాల్లోకి తీసుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

'స్థానిక' పనితీరుపై కర్నాటక ఆర్థిక సంఘం రాష్ట్ర పర్యటన

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలో స్థానిక సంస్థల పనితీరును అధ్యయనం చేసేందుకు కర్ణాటక ఆర్థిక సంఘం బృందం రాష్ట్రంలో పర్యటించింది. ఈ సందర్భంగా తెలంగాణ ఆర్థిక సంఘం అధ్యక్షులు సిరిసిల్ల రాజయ్యతో ఎర్రమంజిల్‌లోని కార్యాలయంలో బుధవారం బేటీ అయ్యారు. కర్ణాటక రాష్ట్ర ఆర్థిక సంఘం చైర్మెన్ నారాయణ స్వామి, సభ్యులు ఎమ్‌డీ సమెల్ల, ఆర్ఎస్ పాండే తదితరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల బలోపేతంపై పరస్పర అవగాహన పెంచుకొనేందుకు ఈ పర్యటనలు దోహదం చేస్తాయని ఇరురాష్ట్రాల ఆర్థిక సంఘాల చైర్మెన్లు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ఆర్థిక సంఘం సభ్యులు సంకేపల్లి సుదీర్‌రెడ్డి, మాలోతు నెహ్రూ నాయక్, ఎమ్ రమేష్‌లతో పాటు సభ్య కార్యదర్శి స్మితా సబర్వాల్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇరు రాష్ట్రాల్లోని స్థానిక సంస్థల పనితీరును సమీక్షించారు.

నేడు లాసెట్ ఫలితాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో లా కోర్సుల్లో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల మూడో తేదీన నిర్వహించిన లాసెట్ రాతపరీక్షల ఫలితాలు గురువారం విడుదల కానున్నాయి. ఈ ఫలితాలను గురువారం మధ్యాహ్నం 3.30 గంటలకు హైదరాబాద్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో ఓయూ ఇన్‌చార్జి వీసీ ఎం దానకిశోర్, టీజీసీహెచ్ఈ చైర్మెన్ ఆర్ లింబాద్రి, వైస్ చైర్మెన్లు వి వెంకటరమణ, ఎస్‌కే మహమూద్, కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ విడుదల చేస్తారని లాసెట్ కన్వీనర్ బి విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లాసెట్‌కు 50,684 మంది దరఖాస్తు చేయగా, 40,268 (79.45 శాతం) మంది అభ్యర్థులు హాజరయ్యారు. 10,416 (20.55 శాతం) మంది గైర్హాజరయ్యారు.

ముందస్తు బెయిల్ కోసం అమీర్ పిటిషన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో రెండేండ్ల క్రితం నాటి రోడ్డు ప్రమాదం కేసులో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు ఆమీర్ ముందస్తు బెయిల్ కోసం హైకోర్ట్‌లో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. 2022 నాటి కేసును వెలికి తీసి కక్షసాధింపుతో తనను అరెస్ట్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నందున బెయిల్ ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కోన్నారు.

జర్మనీలో నర్సుల నియామకానికి దరఖాస్తులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

జర్మనీలో నర్సుల నియామకం కోసం ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ నెల 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు తెలంగాణ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెట్ (టామ్‌కాం) సీఈవో ఒక ప్రకటనలో తెలిపారు. జర్మనీలోని ఎంప్లాయిస్ ఏజెన్సీకి రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య కుదిరిన ట్రిపుల్ విన్ పార్టనర్‌షిప్‌లో బాగంగా ఆ దేశంలో నర్సుల నియామకానికి జర్మన్ బాషా శిక్షణ కోసం ఎన్‌రోల్ మెంట్ జరుగుతున్నదని పేర్కొన్నారు. ఎంపికైన అభ్యర్థులకు శిక్షణ అనంతరం ఆ దేశంలో నర్సింగ్ అసిస్టెంట్‌గా పని చేసే అవకాశముంటుందని వివరించారు. రాష్ట్రంలోని గుర్తింపు పొందిన కళాశాలల నుంచి నర్సింగ్, ఐసీయూ, జెరియాట్రిక్స్, ఆర్థోపెడిక్స్, సైకియాట్రి, కార్డియాలజీ మొదలగు విబాగాల్లో ఒకటి నుంచి మూడేండ్ల అనుభం ఉన్న వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 6302292450, 9908830438 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని కోరారు

ఏడాదికి రెండుసార్లు వర్శిటీల్లో ప్రవేశాలు

- యూజీసీ కీలక నిర్ణయం

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

విదేశాల్లోని విశ్వవిద్యాలయాల తరహాలోనే ఇక నుంచి దేశంలోని యూనివర్శిటీల్లో, ఉన్నత విద్యా సంస్థల్లో కూడా ఏటా రెండుసార్లు అడ్మిషన్లు జరపాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) నిర్ణయించింది. ఈ విద్యా సంవత్సరం (2024-25) నుంచే ఈ విధానం అమల్లోకి వస్తుందని యూజీసీ చైర్మెన్ జగదీష్ కుమార్ తెలిపారు. తొలి విడతలో జులై-ఆగస్టు, మలి విడతలో జనవరి-ఫిబ్రవరిలో అడ్మిషన్లు జరుగుతాయని వెల్లడించారు. అయితే ఈ విధానం తప్పనిసరి కాదని, ఐచ్ఛికమేనని స్పష్టం చేశారు. 'ఏడాదికి రెండుసార్లు అడ్మిషన్ల విధానం అమల్లోకి తేవడంతో.. వివిధ బోర్డుల ఫలితాల ప్రకటనలో జాప్యం, ఆరోగ్య సమస్యలు, వ్యక్తిగత కారణాలవల్ల జులై-ఆగస్టులలో ప్రవేశాలు పొందలేని విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుంది. విద్యార్థులు మరుసటి ఏడాది వరకూ వేచి ఉండాల్సిన అవసరం ఉండదు. ద్వైవార్షిక ప్రవేశాల వల్ల కంపెనీలు ప్రాంగణ నియామకాలను ఏడాదికి రెండుసార్లు చేస్తాయి. దాంతో గ్రాడ్యుయేట్లకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయి' అని జగదీష్ కుమార్ వివరించారు. 'రెండుసార్లు ప్రవేశాలు జరపడంవల్ల విద్యాసంస్థలు తమ వనరులను సమర్థంగా పంపిణీ చేసుకోవడానికి అవకాశం లభిస్తుంది. ఫ్యాకల్టీ, ల్యాబ్‌లు, తరగతి గదులు, ఇతర అవకాశాలనూ సమర్థంగా వినియోగించుకోవచ్చు. ఫలితంగా వర్శిటీల వ్యవస్థలు అత్యుత్తమంగా పని చేయగలుగుతాయి' అని యూజీసీ చైర్మెన్ తెలిపారు.

బీసీలకు మంత్రి పదవులివ్వడాన్ని స్వాగతిస్తున్నా...: వీహెచ్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు ఎనిమిది మంది బీసీలకు మంత్రి పదవులు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నట్టు మాజీ ఎంపీ వి హనుమంతరావు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. కులగణన చేయడానికి ఎన్డీయేలో భాగస్వాములుగా ఉన్న నితీష్ కుమార్, చంద్రబాబు నాయుడు చొరవ తీసుకోవాలని కోరారు.